# క్రాంతి


**లోపలి పేజీల్లో...**

ఈస్టర్న్ బ్యూరో అమరులు ......... 16
సెంట్రల్ బ్యూరో అమరులు ......... 18
సిసాన్ ఇంటర్వ్యూ ......... 25
బైడెన్ ఒక సంవత్సర పాలన ......... 28
నివురు కప్పిన కశ్మీర్ ......... 34
బూటకపు అజాది ఉత్సవాలు ......... 36
రైతుల విజయానికి జేజేలు ......... 44
ప్రపంచ దేశాల మద్దతు ......... 46



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ, ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 46 సంచిక: 4 అక్టోబరు-డిసెంబర్ 2021 వెల: పది రూపాయలు


## భారత విప్లవోద్యమ నేతలు, పీడిత ప్రజల ప్రియతమ నాయకులు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటి సభ్యులు కామ్రేడ్స్ అక్కిరాజు హరగోపాల్, నరేంద్ర సిన్హా, మిలింద్ బాబూరావ్ టేల్‌తుమ్డే లకు అరుణారుణ జోహార్లు







# భారత విప్లవ నాయకుడు, కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్ (శ్రీనివాస్, రామకృష్ణ, సాకేత్)కు అరుణారుణ జోహార్లు

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్, (శ్రీనివాస్, రామకృష్ణ, సాకేత్) అక్టోబర్ 14, 2021న మూత్ర పిండాల వైఫల్యంతో అమరుడయ్యాడు. రామకృష్ణ అమరత్వం భారత విప్లవోద్యమానికి వెంటనే తీర్చుకోలేని నష్టం. ఇది ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ-ఆంధ్ర) ప్రజలకు తీవ్ర దు:ఖాన్ని కలిగించింది.

శ్రీయుతులు రాజ్యలక్ష్మి, సదానందేశ్వర్‌రావు దంపతులకు గల నలుగురు సంతానంలో రెండవవాడుగా కామ్రేడ్ హరగోపాల్ 1957లో జన్మించాడు. శ్రీ సదానందేశ్వర్ రావు కుటుంబం ఉద్యోగ రీత్యా పల్నాడులోని తుమ్మకోట గ్రామంలో స్థిరపడింది. సదా నందేశ్వర్‌రావుకి ప్రజాస్వామిక, ప్రగతిశీల భావాలుండేవి. కామ్రేడ్ హరగోపాల్‌కు బాల్యంలోనే తండ్రి నుండి ఆ భావాలు అలవడ్డాయి. ఆయన తుమ్మకోటలో హైస్కూల్‌లో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసిన తర్వాత మాచర్ల పట్నంలో ఎస్.కే.బీ.ఆర్. కళాశాలలో డిగ్రీ వరకు చదివాడు.

70వ దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్‌లో నక్సల్బరీ విప్లవ రాజకీయాల ప్రభంజనం కొనసాగుతుండింది. 1977లో రాడికల్ విద్యార్థి సంఘం కార్యకలాపాలు వుధృతమయ్యాయి. ప్రజాస్వామిక, ప్రగతిశీల భావాలు కలిగిన విద్యార్థిగా హరగోపాల్ సదా సామాజిక సమస్యల పరిష్కారాల కోసం ఆలోచించి రాడికల్ విద్యార్థి సంఘం రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యాడు. తరువాత హరగోపాల్ పూర్తికాలం విప్లవ కార్యకర్తగా ఉద్యమంతో చేరాడు. సామాజిక సమస్యలకు విప్లవమే పరిష్కార మార్గమని నమ్మిన హరగోపాల్ తుదిశ్వాస విడిచే వరకు ఆ మార్గంలో కొనసాగుతూ పార్టీలో అత్యున్నత వేదిక కేంద్రకమిటీలో పోలిట్ బ్యూరో సభ్యుడి స్థాయికి ఎదిగాడు.

1980లలో తన కుటుంబం హైదరాబాదుకు తరలిపోయింది. ఆ సమయంలో తనకు ఎదురైన కిడ్నీ సమస్యకు ఆపరేషన్ జరగటంతో ఒక సంవత్సరం తరువాత 1981 నుండి పూర్తికాలం విప్లవకారుడుగా ఉద్యమంలో చేరి బాధ్యతలు స్వీకరించాడు. గుంటూరు జిల్లాలో నిర్వహించిన రాజకీయ తరగతులలో భాగమయ్యాడు. వ్యక్తిగత అధ్యయనం, రాజకీయ బోధన ద్వారా క్రమంగా హరగోపాల్ పూర్తి నిబద్ధతతో కూడిన విప్లవకారుడిగా ఎదిగాడు.

కామ్రేడ్ హరగోపాల్ 1982 నుండి 1986 వరకు సీటీగా దాచేపల్లి ప్రాంతంలోని గామాలపాడును కేంద్రంగా చేసుకుని 'గోపాల్' పేరుతో టీచర్‌గా పనిచేసాడు. గామాలపాడు గోపాల్ పంతులుగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. గ్రామంలోని దళితవాడ ఆయన విప్లవ కార్యకలాపాలకు కేంద్రంగా వుండేది. పగలు పిల్లలకు పాఠాలు చెప్పేవాడు. రాత్రిపూట పెద్దలకు వయోజన విద్య బోధించేవాడు. విప్లవ పాఠాలు చెపుతూ వారిలో విప్లవ భావాలను రేకెత్తించాడు. గ్రామాలలో దళితుల బతుకులు చూసి బాగా చలించిపోయేవాడు. పార్టీ కార్యకర్తగా ఆయన విప్లవ జీవితంలో తొలి నుండి చివరి దాకా దళిత సమస్య అంటే కులవిముక్తికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చాడు.

దాచేపల్లి ప్రాంతంలో దళితులపై కొనసాగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా పోరాడడంతో పాటు కామ్రేడ్ హరగోపాల్ నాయకత్వంలో పీడిత ప్రజలు భూమి సమస్య, కూలిరేట్ల పెంపుదల తదితర సమస్యలపై పలు పోరాటాలు చేశారు. గామాలపాడు గ్రామానికి పక్కనే వున్న దుర్గా సిమెంట్ ఫ్యాక్టరీలోని కార్మికుల్ని సంఘటితంచేసి హరగోపాల్ పలు మిలిటెంట్ పోరాటాలు నడిపాడు. 1983లో మాచర్లలో ధనలక్ష్మి అనే మహిళపై జరిగిన అత్యాచారానికి, ఫిలిప్ అనే కార్మికుని లాకప్ హత్యకు, సరసరావుపేటలో అంజమ్మపై జరిగిన అత్యాచారానికి వ్యతిరేకంగా ఆర్ఎస్‌యు, ఆర్‌వైఎల్‌ల నాయకత్వంలో గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రజా పోరాటాలు పెల్లుబికాయి. ఈ పోరాటాలను గైడ్ చేయటంలో కామ్రేడ్ హరగోపాల్ పాత్ర కీలకమైనది. 1985లో కారంచేడులో భూస్వామ్య వర్గాలు కొనసాగించిన దళితుల హత్యాకాండకు నిరసనగా ప్రజలను, ప్రత్యేకించి దళితులను సమీకరించి ప్రదర్శనలు నిర్వహించాడు.

1986 డిసెంబర్‌లో జరిగిన గుంటూరు జిల్లా పార్టీ ప్లీనం కామ్రేడ్ హరగోపాల్‌ను జిల్లా కమిటీలోకి ఎన్నుకుంది. జిల్లా కమిటీ సభ్యునిగా హరగోపాల్ దాచేపల్లి, బెల్లంకొండ సెంటర్లను గైడ్ చేస్తూ, ప్రత్యేకంగా పట్టణ విద్యార్థి ఉద్యమ బాధ్యతలను కూడా చూశాడు. 1986-87 సంవత్సరాలలో నల్లమల అటవీ ప్రాంతానికి ఉద్యమాన్ని విస్తరింపజేసే లక్ష్యంతో పథకం రూపొందించటంలో ఆయన ముఖ్య పాత్ర పోషించాడు.

1988-89 ప్రాంతంలో జిల్లా ఉద్యమంలో కొన్ని ముఖ్యమైన పోరాటాలు ముందుకు వచ్చాయి. గొల్లపేటలో ఫారెస్టు గార్డు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గెరిల్లా దళం వాడిని శిక్షించే విధంగా కామ్రేడ్ హరగోపాల్ నాయకత్వం వహించాడు. ఆ తర్వాత ఫారెస్టు వారి దోపిడీకి వ్యతిరేకంగా ప్రజాపోరాటం వల్నాడు

ప్రాంతమంతటా విస్తరించింది. తునికాకు కూలీ రేట్ల పెంపుదల పోరాటం, సారా వ్యతిరేక పోరాటం, మత్స్యకార్మికుల సమస్యలపై పోరాటం, ఫారెస్టు భూముల, బంజరు భూముల ఆక్రమణ పోరాటం, నాపరాయి క్వారీల ఆక్రమణ పోరాటం, సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై పోరాటం మున్నగు అనేక పోరాటాలు ముందుకు వచ్చాయి. ఈ ప్రజా పోరాటాలు అన్ని జిల్లాలలోని విశాల గ్రామీణ ప్రాంతంలో పార్టీ సంఘటితం కావడానికి దోహదం చేశాయి.



1989 నాటికి జిల్లాలో ఆరు కేంద్రాలు దాచేపల్లి, బెల్లంకొండ, వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, పుల్లల చెరువు ప్రాంతాల్లో 1+1, 1+2, 1+3గా గెరిల్లా దళాలు ఏర్పడ్డాయి. సుమారు 300 గ్రామాలకు పార్టీ కార్యకలాపాలు విస్తరించాయి. ఇందులో కామ్రేడ్ హరగోపాల్ కృషి ఒక ముఖ్య భూమికను పోషించింది. కామ్రేడ్ హరగోపాల్ 1989 ఫిబ్రవరిలో 'శ్రీనివాస్' జిల్లాకమిటీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టాడు. జిల్లా కార్యదర్శిగా ప్రత్యేకంగా గుంటూరు, తెనాలి, చుండూరు ప్రాంతాల ఉద్యమాలకు నాయకత్వాన్ని అందించాడు. 1993 ఫిబ్రవరిలో జిల్లా కమిటీ కార్యదర్శి బాధ్యతల నుండి రిలీవ్ అయి దక్షిణ కోస్తా జిల్లాల రీజినల్ కమిటీ (జెఆర్‌సి) కార్యదర్శి బాధ్యతలు చేపట్టాడు. ఆ తరువాత జరిగిన రాష్ట్ర ప్లీనంలో ప్రత్యామ్నాయ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

నిరంతరం కరువుతో తల్లడిల్లే పల్నాడు ప్రజలను కరువు వ్యతిరేక పోరాటాలలో సంఘటితం చేశాడు. 1990-91లలో ఎగువ పల్నాడు సాగు నీటి సమస్యకు పరిష్కారంగా దొమ్మర్లగొంది ఎత్తిపోతల పథకం కోసం జరిగిన ఐక్యసంఘటనా పోరాటానికి మార్గదర్శకత్వాన్ని అందించాడు.

దాచేపల్లి ప్రాంతంలోని రామాపురంలో పార్టీ నాయకత్వంలో వర్గ పోరాటం కొనసాగటం అక్కడి దోపిడీ కులాల భూస్వాములకు మింగుడు పడలేదు. వీరంతా రివిజనిస్టు సీ.పీ.ఐ.లో వుండేవారు. దళితులపై దాడి చేయాలని రివిజనిస్టు భూస్వాములు పథకం వేశారు. ఈ పథకాన్ని ముందుగా పసిగట్టిన విప్లవ పార్టీ తిప్పికొట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 1993లో గ్రామ భూస్వాములు అచ్చిరెడ్డి, అంకిరెడ్డిలను గెరిల్లాలు మట్టుబెట్టారు. ఫలితంగా 'మీరు కారంచేడులు సృష్టిస్తే, ప్రజలు రామాపురాలు సృష్టించక తప్పదు' అనే నినాదం ముందుకు వచ్చింది. ఈ చర్యలు జిల్లాలోనూ, దక్షిణ కోస్తా ప్రాంతంలోనూ దళితుల ఆత్మగౌరవ పోరాటాలకు పూపునిచ్చింది.

జిల్లాలో పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయటంలో భాగంగా జిల్లాలో ఎస్.పీ మీనా ఆధ్వర్యంలో పోలీసు బలగాలు దాచేపల్లి దళ సభ్యుడు కామ్రేడ్ కోటేశ్వరరావును, సంఘ సభ్యుడు జయపాల్‌ను హత్య చేశాయి. 1992 ఏప్రిల్ 1న చంద్రవంక ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ ఏసన్న (రాజన్న), రామకృష్ణ, మాధవీలతలను, నలుగురు జాలర్లను క్రూరంగా హత్య చేశాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ హరగోపాల్ తృటిలో తప్పుకున్నాడు. ఈ హత్యలకు నిరసనగా ప్రజా ప్రతిఘటనను పెంపొందించేందుకు కామ్రేడ్ హరగోపాల్ కృషి చేశాడు.

1990లో దక్షిణ తెలంగాణలో జరిగిన రాష్ట్రస్థాయి మిలటరీ క్యాంపులో పాల్గొన్న హరగోపాల్, 1992లో గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల దళ కమాండర్లకు, సీఓలకు పార్టీ నిర్వహించిన దక్షిణ కోస్తా మిలిటరీ క్యాంపులో ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. జిల్లాలోని దళాలను మిలిటరీపరంగా, నిర్మాణపరంగా సంఘటితం చేయడానికి కృషి చేశాడు. మిలటరీ జ్ఞానాన్ని పెంచేందుకు, గెరిల్లా పద్ధతులను అమలు పరచడం కోసం, దళం పని పద్ధతుల్లో మెరుగుదల తెచ్చేందుకు చాలా కృషి చేశాడు. జిల్లాలో గ్రామీణ ప్రాంత ఉద్యమం ఒక వైపు నడుస్తుండగా పట్టణాలలో విద్యార్థి, యువజన, మేధావి, మహిళా, కార్మికులలో విప్లవ కృషికి ఆయన దోహదం చేశాడు. పట్టణోద్యమాన్ని, గ్రామీణోద్యమాన్ని సమన్వయంతో నడిపించటంలో కామ్రేడ్ హరగోపాల్ పట్టుదలతో కృషి చేశాడు.

ఇమ్మాన్యుయేల్ రాజు అనే ఇంటలిజెన్స్ సీఐ సాయి అనే పార్టీ కోరియర్‌ను కోవర్టుగా మార్చుకుని రాష్ట్ర నాయకత్వాన్ని అరెస్టు చేయించాడు. ఇమ్మాన్యుయేల్ రాజును విజయవాడ హోటల్‌లో యాక్షన్ టీం ద్వారా ఖతం చేయడానికి వేసిన పథకంలో కామ్రేడ్

హరగోపాల్ పాత్ర వుంది.

1993-94లో పల్నాడులోని అన్ని ప్రాంతాల్లో దేవుడు మాన్యం భూముల ఆక్రమణ పోరాటాలు వెల్లువగా ప్రారంభమై, ఇవి ఉన్నత స్థాయికి చేరుకుని పట్టాభూముల ఆక్రమణ పోరాటాలుగా అభివృద్ధి చెందాయి. ఈ భూపోరాటాల వెల్లువ 1998 వరకు కొనసాగింది. భూపోరాట వెల్లువను కొనసాగించటంలో కామ్రేడ్ హరగోపాల్ మార్గదర్శకత్వం ఉంది.

1997లో రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ మేకల దామోదర్ (సంజీవ్) అమరుడైన తర్వాత దక్షిణ తెలంగాణ బాధ్యతలను పార్టీ కామ్రేడ్ హరగోపాల్‌కి అప్పగించింది. నిప్పులు చెరిగే నిర్బంధంలో ఎంతో మంది కామ్రేడ్స్ అమరులవుతున్న సమయంలో దక్షిణ తెలంగాణ తనకి కొత్త ప్రాంతమయినప్పటికీ ప్రజల మీద పూర్తి విశ్వాసంతో పార్టీ ఇచ్చిన బాధ్యతలను విప్లవ స్ఫూర్తితో స్వీకరించి కొద్ది కాలంలోనే అక్కడి క్యాడర్ల, ప్రజల అభిమానాన్ని పొందాడు. ఉద్యమ క్రమంలో ఎదురయ్యే అనేక సవాళ్ళను స్వీకరించి పరిష్కరించాడు.

దక్షిణ తెలంగాణలో 1997 నుండి 2000 వరకు ఆ రీజనల్ కమిటీ కార్యదర్శిగా కొనసాగాడు. 1995 పార్టీ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో ఉత్తర తెలంగాణ ప్రాంతం వేరయ్యాక మిగితా ప్రాంతానికి నిర్దేశించుకున్న గెరిల్లాజోన్ కర్తవ్యాన్ని పరిపూర్తి చేసేందుకు అలుపెరగని కృషి చేశాడు. దోపిడీ వర్గాల అధికారాన్ని కూలదోసేందుకు వర్గపోరాటాన్ని తీవ్రతరం చేస్తూ గెరిల్లా జోన్‌లో గెరిల్లా బేస్‌ల నిర్మాణానికి సడలని దీక్షతో పని చేశాడు.

రాష్ట్ర వ్యాపితంగ మహిళా ఉద్యమాన్ని పటిష్టం చేసి పెంపొందించాలనే పార్టీ అవగాహనలో భాగంగా 1990లలో ఆ దిశలో విశేష కృషి ప్రారంభమైంది. 1990లలో గుంటూరు జిల్లాలో మహిళా ఉద్యమాన్ని పెంపొందించడానికి కామ్రేడ్ హరగోపాల్ ఎంతో కృషి చేశాడు. 1995 నుండి రాష్ట్ర కమిటీ నుండి అందుకు తగిన గైడెన్స్ అందించాడు. మహిళా సమస్యల్ని అర్థం చేసుకోవటంలో వాటిని పరిష్కరించటంలో చాలావరకు పితృస్వామ్య భావాలకు తావివ్వకుండా వ్యవహరించేవాడు. మహిళా కామ్రేడ్స్‌ని అర్థం చేసుకోవటంలో జెండర్ సమానత్వ కోణంలో ఆలోచించేవాడు. మహిళా కామ్రేడ్స్‌తో ఆత్మీయంగా వుంటూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేవాడు.

ఉద్యమంలో పొడసూపిన కార్మిక వర్గేతర ధోరణులు, తప్పుడు పద్ధతుల మీద 1999 జనవరిలో జరిగిన రాష్ట్ర ప్లీనంలో చర్చించి యావత్తు పార్టీని సరిదిద్దుకునేందుకు రాష్ట్ర కమిటీ ఒక సమగ్రమైన 'ఎడ్యుకేషన్, రెక్టిఫికేషన్' కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిని సఫలం చేయడంలో కామ్రేడ్ హరగోపాల్ చురుకైన పాత్రని పోషించాడు.

1999 డిసెంబర్ 2న మన ప్రియతమ నాయకులు, కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీలను టీడీపీ (చంద్రబాబు)పాలనలోని ప్రభుత్వ పోలీసులు కోవర్టు కుట్రతో హత్య చేశారు. అది యావత్తు పార్టీని షాక్‌కు గురి చేసింది. యావత్తు ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి తీవ్ర నష్టాన్ని కలిగించింది. అటువంటి క్లిష్ట పరిస్థితిలో ఆంధ్రరాష్ట్ర విప్లవోద్యమాన్ని పురోగమింప చేయడానికి కామ్రేడ్ హరగోపాల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బాధ్యతలు స్వీకరించాడు. ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా రాజకీయ అధికార పత్రిక 'క్రాంతి' పత్రికను నిర్బంధంలో కూడా తీసుకుని రావడానికి తీవ్రంగా ప్రయత్నించాడు. 2001లో జరిగిన మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ 9వ కాంగ్రెస్‌లో కామ్రేడ్ హరగోపాల్ కేంద్రకమిటీ సభ్యునిగా ఎన్నికయ్యాడు.

ప్రపంచ బ్యాంకు విధానాలకు ఒక ప్రయోగశాలగా మారిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు మిలిటెంట్‌గా జరిగాయి. పీడిత ప్రజల్ని అంటిపెట్టుకుని పార్టీ వుండడంతో విప్లవ రాజకీయాల పట్ల ప్రజల్లో విశ్వాసం ఇనుమడించి పార్టీని కాపాడుకోడానికి, పోరాట నాయకత్వాన్ని రక్షించుకోవడానికి గొప్ప అంకిత భావంతో ప్రజలు పోరాటాలను కొనసాగించారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాల కనుగుణంగా ఎల్‌ఐసి పాలసీని అమలు చేస్తూ, రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదులకు తాకట్టు పెట్టిన సందర్భంలో కామ్రేడ్ హరగోపాల్ నాయకత్వంలో విప్లవోద్యమం వాటిని రాజకీయంగా, మిలటరీపరంగా ప్రతిఘటించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న తీవ్ర నిర్బంధాన్ని ప్రతిఘటించడంలో భాగంగా పరమ నిరంకుశ పోలీస్ అధికారి ఉమేష్ చంద్రని హైదరాబాద్ నడిబొడ్డున గెరిల్లా యాక్షన్ టీం ఖతం చేసింది. 2000 మార్చ్ నెలలో ఆంధ్రరాష్ట్ర హోంమంత్రి మాధవరెడ్డిని రాజకీయ లక్ష్యంగా ఎంచుకుని యాక్షన్ టీం మట్టుబెట్టింది. 2003లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై గెరిల్లాలు చేసిన దాడిలో ఆయన చావుతప్పి గాయాలతో బయట పడ్డాడు. ఆ తరువాత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డిపై జరిపిన గెరిల్లా సైనిక చర్య తృటిలో తప్పింది. మిలిటరీపరమైన, రాజకీయ పరమైన టార్గెట్స్‌ని ఎంచుకుని దాడులకి పథక రచన చేయటంలో కీలకమైన పాత్ర పోషించాడు. 2004 విధానసభ ఎన్నికలను నక్సలైట్ల మీద రెఫరెండంగా హోరెత్తించి ఎన్నికలబరిలోకి దిగిన తెలుగుదేశం పార్టీ ఘోరంగా ఓడిపోయింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మీద రాష్ట్రంలోని ప్రజాహిత మేధావులు, హక్కుల కార్యకర్తలు 'నక్సలైట్ల సమస్య సామాజిక, రాజకీయ సమస్య' అనీ విప్లవ పార్టీతో 'శాంతి' చర్చలు జరపాలనీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలుపుకోవాలనీ ప్రభుత్వాన్ని నిలదీశారు. విప్లవ పార్టీతో చర్చలకు ప్రభుత్వం

సిద్ధపడగా కామ్రేడ్ హరగోపాల్ (ఆర్.కే) పార్టీ ప్రతినిధిగా, శాంతి చర్చల బృందానికి నాయకుడిగా ఉండి ప్రజల సమస్యలను ప్రభుత్వం ముందుంచాడు. శాంతి చర్చల పేరుతో ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాలను రాష్ట్ర ప్రజలు గ్రహించారు. పార్టీ ఉద్యమ చరిత్రలో చర్చల ప్రక్రియ ఒక నూతనమైన ఎత్తుగడగా నిలిచి ఒక కొత్త అనుభవాన్ని ఇచ్చింది. రెండు విప్లవ స్రవంతుల విలీనంతో ఆవిర్భవించిన సీ.పీ.ఐ (మావోయిస్టు) ఏర్పాటును ఆ సందర్భంగానే హైదరాబాద్‌లో కామ్రేడ్ ఆర్.కే ప్రెస్‌మీట్ ఏర్పాటుచేసి బహిరంగంగా ప్రకటించాడు.

ప్రభుత్వం విప్లవ పార్టీతో ప్రారంభించిన 'శాంతి' చర్చలతో దాని విధానాలు బహిర్గతమవుతూ రాష్ట్ర ప్రజలలో పెరుగుతున్న విప్లవ పార్టీ ప్రతిష్ట, అభిమానం, సానుభూతులను అంచనా కట్టిన ఉన్నత నిరంకుశ పోలీసు అధికారులు (రాజ్యం) చర్చలు కొనసాగించడానికి ససేమిరా అనడంతో ప్రభుత్వం ఏకపక్షంగా చర్చలకు స్వస్తి చెప్పి, 2005 జనవరి నుండి గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యమ అణచివేతకి, పార్టీ నిర్మూలనకు పూనుకుంది. కామ్రేడ్ ఆర్.కే.ని టార్గెట్ చేస్తూ జరిపిన అనేక దాడుల్లో ఆయన తృటిలో తప్పుకున్నాడు. ఈ అణచివేత దాడుల్లో 150 మందికి పైగా పార్టీ నాయకులు, కేడర్లు, విప్లవ ప్రజలు అసువులు బాసారు. ఆ సమయంలో పార్టీ చేపట్టిన ఎత్తుగడలు పరిస్థితులతో పొసగక పోవడంతో 2007 నాటికి ఉద్యమం తాత్కాలిక సెట్‌బ్యాక్‌కు గురైంది. పార్టీ నాయకత్వాన్ని, కేడర్లను రక్షించుకోవటంలో భాగంగా ఏ.పీ. రాష్ట్ర కమిటీ కార్యదర్శి సహ మిగిలిన అనేక మంది కేడర్లను వ్యూహాత్మక ప్రాంతాలకు పార్టీ పంపించింది. అందులో భాగంగా కామ్రేడ్ రామకృష్ణ 2006లో ఏఓబీ చేరుకున్నాడు. ఇక అక్కడ తన పేరును సాకేత్‌గా నిర్ణయించుకున్నాడు.

అభివృద్ధి చెందిన పట్టణ, మైదాన ప్రాంతాలలో భిన్న సాంఘిక సముదాయాల ప్రజల పోరాటాలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించి గైడ్ చేసి అనుభవం గడించిన కామ్రేడ్ సాకేత్, దానికి కొంత భిన్నమైన, ప్రధానంగా ఆదివాసీ ప్రాంతమైన ఏ.ఓ.బీ ఉద్యమ బాధ్యతలను స్వీకరించాడు. తూర్పు కనుమల ప్రాంతం ప్రధానంగా వ్యూహాత్మక ప్రాంతం. ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా వెనకబడిన వివిధ తెగలు, విభిన్న భాషలు కలిగిన ఆదివాసీ ప్రజలు నివసించే ప్రాంతం. ఏ.ఓ.బీ.లోని నిర్దిష్టతలనూ, ప్రత్యేకతలను కామ్రేడ్ సాకేత్ ఆకళింపు చేసుకుంటూనే ఉద్యమ వర్తమాన పరిస్థితులను విశ్లేషిస్తూ, భవిష్యత్తు గమనాన్ని కర్తవ్యాల వెలుగులో, అంచనా వేస్తూ ఉద్యమ పురోగమనానికి కృషి చేశాడు. 2006 లో జరిగిన జోన్ 3వ పార్టీ కాన్ఫరెన్స్ ఏ.ఓ.బీ. ఉద్యమం కూడా తాత్కాలిక వెనుకంజలో వుందని అంచనాకు రావటంతో పాటు, పునరాభివృద్ధికి చేపట్టాల్సిన కర్తవ్యాలను రూపొందించింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ పనివిధానాన్ని చక్కదిద్దడానికి పార్టీలో కొనసాగుతున్న అన్యవర్గ ధోరణులు ఒక పెద్ద ఆటంకంగా ఉన్నయనీ గుర్తించి వాటిని సరిదిద్దడానికి జరిపిన దిద్దుబాటు ఉద్యమానికి కామ్రేడ్ సాకేత్ నాయకత్వం వహించాడు. యావత్ విప్లవోద్యమంలో భాగంగా ఏ.ఓ.బీ. ఉద్యమంపై కొనసాగుతున్న ఎల్.ఐ.సీ దాడిని ఎదుర్కోవడానికి ఎన్.టీ, ఏ.పీ. ఉద్యమాల తాత్కాలిక వెనుకంజకు దారితీసిన పరిస్థితులు, అనుసరించిన ఎత్తుగడలు, లభించిన అనుభవాలు, గుణపాఠాల నుండి నేర్చుకుంటూ ఏఓబీ ఉద్యమాన్ని పురోగమింప చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేశాడు.

ఏ.ఓ.బీ. ఎస్.జెడ్.సీ. కార్యదర్శిగా పని చేస్తున్న కామ్రేడ్‌ను ఇతర ప్రాంత ఉద్యమ అవసరాల కోసం సీ.సీ. బదిలీ చేయటంతో 2008 చివరిలో కామ్రేడ్ సాకేత్ సీ.సీ. నుండి ఏ.ఓ.బీ.కి ఇన్‌చార్జ్‌గా వుంటూనే ఎస్.జడ్.సీ. కార్యదర్శి బాధ్యతలను కూడా చేపట్టాడు. 2009లో ఏ.ఓ.బీ. ఉద్యమాన్ని లోతుగా సమీక్షించి, రాజకీయ, నిర్మాణ సమీక్షలను తయారు చేసి, జోన్ 3వ కాన్ఫరెన్స్ 1వ ప్లీనాన్ని జరిపి, ఏ.ఓ.బీ. జోన్ పార్టీలో, ఉద్యమంలో ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన కర్తవ్యాలపై అన్ని స్థాయిల పార్టీ కమిటీలలో భావసారూప్యతను సాధించడంలో కామ్రేడ్ సాకేత్ అందచేసిన గైడెన్స్ కీలకమైనది.

2006లో కొరాపుట్ జిల్లాలోని నారాయణపట్నా, బందుగాం బ్లాకుల్లో బొరిగి, నాగులబెడా ప్రాంతాలలో సుదీర్ఘకాల రివిజనిస్టు ఆచరణను కాదని విప్లవపార్టీ రాజకీయాలతో ప్రభావితమైన స్థానిక శక్తులు విప్లవ ప్రజాసంఘాల్లో సంఘటితమై భూ పోరాటాలు చేపట్టాయి. కరుడుగట్టిన నుండి భూస్వామి మార్కండేయ చౌదరి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక వైఖరిని ఎండగడుతూ ఆ దుష్ట భూస్వామిని ఖతం చేసి, కరుడుగట్టిన ప్రజా వ్యతిరేక భూస్వాముల భూములను పార్టీ నాయకత్వంలో ప్రజలు స్వాధీనం చేసుకుని పీ.ఎల్.జీ.ఏ. అండతో సాగులోకి తెచ్చారు. 2009లో నారాయణపట్నా ప్రాంతంలో పీ.ఎల్.జీ.ఏ. కొనసాగించిన ప్రతిఘటన చర్యలలో నాల్కో రెయిడ్, ఆ తర్వాత పాలూరు దగ్గర ఆంబుష్ చేసి శత్రువుని దెబ్బతీసి ఆయుధాలను స్వాధీనం చేసుకోవటం స్థానిక ప్రజలపై సానూకూల ప్రభావాన్ని వేసింది. ఆ చర్యలు ప్రజా ఉద్యమాలను కూడా ప్రభావితం చేసి, పార్టీని ఆ ప్రాంత ప్రజలకు మరింత చేరువ చేశాయి. ఈ రకంగా నూతనంగా ముందుకు వచ్చిన నారాణయపట్నా సాయుధ రైతాంగ పోరాటానికి కామ్రేడ్ సాకేత్ సరైన దిశానిర్దేశం చేస్తూ బీజ ప్రాయంలో ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించి నూతన అనుభవాన్ని పార్టీకి అందించాడు.

కామ్రేడ్ సాకేత్ నారాయణపట్నా రైతాంగ ఉద్యమంపై కేంద్రీకరిస్తూనే, జోన్‌లోని విశాఖ-తూర్పు గోదావరి డివిజన్‌లో బాక్సైట్ గనుల వ్యతిరేక పోరాటానికి, ప్రభుత్వ, దుష్ట పెత్తందార్ల కాఫీ తోటల స్వాధీన పోరాటానికి, కొరాపుట్‌లోని దేవమాలి బాక్సైట్

విస్తాపన వ్యతిరేక ప్రజా పోరాటానికి గైడెన్స్ అందించాడు.

పార్టీలో వివిధ సందర్భాలలో ఎదురైన మితవాద, అతివాద, అవకాశవాద పంథా రాజకీయాలను తిప్పికొడుతూ పార్టీ పంథాను ఎత్తిపట్టిన అనుభవం ఉన్న కామ్రేడ్ సాకేత్ నారాయణపట్నా ఉద్యమ నాయకుడు నాచికలింగా శత్రు దాడిని ప్రతిఘటిస్తూ ప్రజా యుద్ధాన్ని ముందుకు తీసుకునిపోవడానికి సిద్ధపడక రివిజనిస్టు పంథాలో తిరిగి ఎన్నికల పంథాని ముందుకు తెస్తే, దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథాని ఎత్తిపడుతూ కామ్రేడ్ సాకేత్ నారాయణ పట్నా నాచిక లింగా విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్ని సరైన పంథావైపు నిలబెట్టాడు.

ఏ.ఓ.బీ. ఎస్.జడ్.సీ.ఎమ్.గా వున్న శ్రీరాములు శ్రీనివాస్ (లక్మా) రాజకీయంగా బలహీనపడి పార్టీ నుండి వెళ్లిపోవడానికి నిర్ణయించుకొని పార్టీపై బురద చల్లే ఆచరణకు దిగాడు. అతని అతివాద, అవకాశవాద తప్పుడు చర్చలని నిర్ద్వంద్వంగా ఖండిస్తూ కామ్రేడ్ సాకేత్ దిశానిర్దేశంలో జోన్ పార్టీ ప్లీనం ఆయన అడ్డగోలు చర్చలను తిప్పికొట్టింది.

మరో ఏ.ఓ.బీ. ఎస్.జడ్.సీ.ఎమ్. విజయ్ అరెస్టయి జైల్లో రాజకీయంగా బలహీనపడి స్థానిక సంస్థల ఎన్నికలలో పాల్గొనాలనే చర్చను ముందుకుతేగా, కామ్రేడ్ సాకేత్ రాజకీయంగా నిశితంగా విమర్శించగా ఎస్‌జడ్‌సీ దీటుగా జవాబు చెప్పింది. ఒడిశాలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి సవ్యసాచిపండా ముందుకు తెచ్చిన మితవాద, అవకాశవాద రాజకీయాలను ఎమ్.ఎల్.ఎమ్. వెలుగులో తిప్పికొడుతూ, పార్టీ పంథాను ఎత్తిపడుతూ పండాకు జవాబు ఇస్తూ ఒక పుస్తకాన్ని సీ.సీ. విడుదల చేసింది. పండా అవకాశవాద రాజకీయాలను ఓడించడంలో కామ్రేడ్ సాకేత్ తన వంతు పాత్ర నిర్వహించాడు.

సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయిస్తూ, సాధారణత్వాన్ని నిర్దిష్టత్వానికి జోడించి ఎత్తుగడలను అభివృద్ధి చేయడానికి తీవ్రంగా కృషి చేశాడు. 'ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సంబంధాలపై, సామాజిక పరిశోధన-మన కార్యక్రమం' పత్రాన్ని ఫైనల్ చేసి, ఎత్తుగడలను అభివృద్ధి చేసిన కృషిలో కామ్రేడ్ సాకేత్ చురుకైన భూమిక పోషించాడు. సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయిస్తూ రూపొందించు కున్న ఎత్తుగడల ఆధారంగా వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేస్తూ, గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని స్థాయిల పార్టీ కమిటీలకు ఫీల్డ్ ట్రైనింగ్ అందించటంలో ఆచరణయుక్తంగా గైడ్ చేశాడు.

ఏ.ఓ.బీ. ఎస్.జడ్.సీ. అధికార రాజకీయ పత్రికగా 'బోల్షివిక్' పత్రికను 2013 నుండి క్రమం తప్పకుండా ప్రతి 6 మాసాలకు ఒకటి చొప్పున ప్రచురించి పార్టీ క్యాడర్ల, ప్రజా సంఘ నిర్మాణాల, ప్రజల రాజకీయ చైతన్యం పెంచడంలో కామ్రేడ్ సాకేత్ మంచి రాజకీయ కృషి చేశాడు. కేంద్ర కర్తవ్యం అమలులో భాగంగా విముక్తి ప్రాంత లక్ష్యంతో నడుస్తున్న డీ.కే. ఉద్యమానికి ఏ.ఓ.బీ. గెరిల్లా జోన్ నుండి వీలైన అన్ని రకాలుగా మద్దతుని అందివ్వటంలో ఎస్‌జడ్‌సీని కేంద్ర కర్తవ్యం వెలుగులో గైడ్ చేశాడు. జననాట్య మండలి 50 సంవత్సరాల చరిత్ర సమగ్రంగా వచ్చే విధంగా తన వంతుపాత్ర నిర్వహించాడు.

శతృవు తలపెట్టిన నాయకత్వ నిర్మూలనా దాడుల నుండి కామ్రేడ్ సాకేత్‌ను సీసీ 2006లో రక్షణ రీత్యా ఏ.పీ. నుండి ఏ.ఓ.బీ.కి బదిలీ చేసినప్పటికీ అక్కడ కూడా శతృవు ఆయనను ప్రధాన లక్ష్యంగా ఎంచుకొని దాడులు కొనసాగించాడు. 2016 అక్టోబర్ 24న రాంగూడ వద్ద పోలీసులు పకడ్బందీ పథకంతో అన్నివైపుల నుండి గెరిల్లా మకాంను చుట్టి ముట్టి దాడి చేసి 31 మంది కామ్రేడ్స్‌ను హత్య చేశారు. ఆనాటికి పార్టీ చరిత్రలో అది అతి పెద్ద విషాదకర సంఘటనగా నిలిచిపోయింది. కామ్రేడ్ సాకేత్‌ను లక్ష్యంగా చేసుకొని పదుల సంఖ్యలో భారీ సైనిక ఆపరేషన్స్ చేపట్టినప్పటికీ, ప్రజల, పీ.ఎల్.జీ.ఏ. మద్దతుతో, ప్రతిఘటనతో ఆయన సురక్షితంగా పోలీసుల వలయం నుండి బయటపడ్డాడు. ఏ.ఓ.బీ.లో కఠినతరమైన టెర్రైన్, తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురైనప్పటికీ, ప్రత్యక్షంగా కేడర్లతో వుంటూ క్షేత్రస్థాయి సమస్యలను అధ్యయనం చేస్తూ, వాటి పరిష్కారంలో అవసరమైన గైడెన్స్‌ను అందస్తూ చివరి వరకూ ఉద్యమమే ఊపిరిగా జీవించాడు.

విప్లవోద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న సందర్భాలలో విప్లవ దీక్షతో కామ్రేడ్ సాకేత్ దక్షిణ తెలంగాణా రీజనల్ కమిటీ కార్యదర్శిగా (1997-2000), ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ కార్యదర్శిగా (2000-2006), తాత్కాలిక సెట్‌బ్యాక్ కాలంలో ఏఓబీ ఎస్‌జెడ్‌సీ కార్యదర్శిగా (2008-2017) బాధ్యతలు నిర్వహించాడు. తీవ్ర నిర్బంధ పరిస్థితులలో ఆ ఉద్యమాలకు మార్గదర్శకత్వాన్ని అందించి, కమిటీలలో రాజకీయ ఐక్యతను పెంపొందిస్తూ ప్రతిఘటనా ఎత్తుగడలతో ఉద్యమాన్ని కాపాడటంలో, రాజకీయంగా విప్లవ ప్రజల్లో విశ్వాసాన్ని నిలపడంలో, అనేక ప్రజా పోరాటాలలో ప్రజలను విస్తృతంగా కదిలించడంలో తన అపార రాజకీయ అనుభవాన్ని మేళవిస్తూ గైడ్ చేశాడు.

కుల వివక్షని వ్యతిరేకించటంలో ముందుండేవాడు. ఎక్కడ కులాల పట్టింపు, వివక్ష కనిపించినా తీవ్రంగా వ్యతిరేకించేవాడు. తోటి కామ్రేడ్స్ ఆరోగ్యాల విషయంలో ఎంతో శ్రద్ధ కనబరిచేవాడు. కానీ, తన అనారోగ్య సమస్యల్ని సాధారణంగా ఎవరికీ చెప్పేవాడు కాదు. నిత్య నిర్బంధంలో, శత్రుదాడుల మధ్య పార్టీ తనకు అప్పగించిన కర్తవ్యాన్ని నెరవేర్చాలనే పట్టుదలతో తీవ్ర అనారోగ్య సమస్యల మధ్యనే పట్టుదలగా పనిచేసాడు. ఒకసారి సీసీ మీటింగ్ కోసం డీకేకి వెళ్లిన సందర్భంలో, 'అక్కడికి వెళితే ఆరోగ్యము,

జ్ఞానం, పోరాట అనుభవాలు దొరుకుతాయి' అని, కాబట్టి ఎంత నిర్బంధం వున్నా, ఎంత దూరమైనా సంతోషంగా నడిచి వెళ్తాననీ నవ్వుతూ అందరితో పంచుకునేవాడు.

భారత విప్లవోద్యమంలో అత్యున్నత స్థాయి నాయకుడిగా ఎదిగినప్పటికీ, తనను తాను గొప్పవాడిగా చెప్పుకునే గొప్పలకు ఏనాడు పోలేదు. అత్యంత నిరాడంబరంగా ఉంటూ, సాదాసీదా జీవితం గడిపాడు. తాను నమ్మిన సిద్ధాంతానికీ, అంతిమ ఆశయానికి కట్టుబడి పని చేసాడు. స్వార్థాన్ని దరిచేరనీయలేదు. ప్రజల, విప్లవ ప్రయోజనాలకన్నా మిన్నగా దేనినీ భావించలేదు. 40 సంవత్సరాల సుదీర్ఘ విప్లవ జీవితంలో, విప్లవోద్యమంలోని అనేక మలుపులు-మెలికలు, ఆటు-పోట్లు, గెలు-పోటములు, కష్ట-నష్టాలలో స్వయంగా భాగస్వామిగా ఉన్నాడు. విజయాలకు పొంగిపోవడం, ఓటములకు కృంగిపోవడం చేయలేదు. విజయాల్లో తనను ముందుంచుకోవడం ఆయనెరుగడు. ప్రతి ఓటమిలో తన బాధ్యతను గుర్తించడంలో నిజాయితీగా ముందుండేవాడు. పార్టీ అంతరంగిక చర్చలలో చురుకుగా పాల్గొని సూటిగా మాట్లాడేవాడు.

వ్యక్తిగత జీవితంలో కూడా కుటుంబాన్ని విప్లవకరంగా తీర్చిదిద్దడంలో సఫలమయ్యాడు. తన ఏకైక కుమారుడు కామ్రేడ్ పృథ్వీని తల్లి శిరీష ప్రేమతో పెంచుకున్నది. పృథ్వీకి యుక్త వయస్సుతో పెరిగిన సామాజిక స్పృహకు తోడు, తండ్రి విప్లవ జీవితం ఆయనను సహజంగానే విప్లవమార్గం పట్టించింది. కామ్రేడ్ సాకేత్ పార్టీ నాయకుడిగానే తన కుమారుడు కామ్రేడ్ పృథ్వీకి దిశానిర్దేశం చేసాడు. పృథ్వీ అభివృద్ధి ఎలా ఉంది? మార్క్సిస్టు తత్వశాస్త్ర భావనలను అర్థం చేసుకుంటున్నాడా? అతని రాతల్లో ఆ దృష్టి ఉందా? అని ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టేవాడు. పీడిత ప్రజలు, వర్గపోరాటం, పార్టీ కామ్రేడ్ పృథ్వీని విప్లవకారుడిగా తీర్చిదిద్దగా, ఆయన తన జీవితాన్ని సమాజ మార్పు కోసం అర్పించి, 2016 అక్టోబర్ 24, రాంగూడ ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు.

కొడుకు మరణవార్త తల్లి శిరీషకు తీవ్రమైన దుఃఖాన్ని కలిగించినా, పీడిత ప్రజల కోసం తన కొడుకు ప్రాణాలర్పించడం ఎంతో గర్వంగా ఉందని సగర్వంగా ప్రకటించింది. ఈ సందర్భంగా సుదూరంగా ఉన్న తన సహచరి కామ్రేడ్ శిరీష దుఃఖంలో తాను పాలుపంచుకుంటూనే, 'మున్నాకు తల్లిగా ఆలోచించినంతకాలం బాధను భరించాల్సి వస్తుంది. అనేక మంది పిల్లలకు తల్లిని అనుకుంటే బాధను అధిగమించవచ్చు' అని కామ్రేడ్ సాకేత్ పంపిన సందేశం ఎంతోస్ఫూర్తిదాయకమైనది. కామ్రేడ్ సాకేత్ అమరత్వం సందర్భంగా తన సహచరి అంతులేని విషాదాన్నీ, వేదనను, కన్నీళ్ళను దిగమింగుకుంటూ చేసిన చైతన్యవంతమైన ప్రకటనల్లో ఆమె ప్రదర్శించిన మనోనిబ్బరం వెనక సహచర జీవితంలో కామ్రేడ్ సాకేత్ అందించిన రాజకీయాలను, నెలకొల్పిన విప్లవ ఆదర్శాలనూ, ప్రేరణను మనం చూడవచ్చు.

కామ్రేడ్ సాకేత్ తన విప్లవ జీవితంలో అనుక్షణం కమ్యూనిస్టు మానవ సంబంధాలనూ, విలువలను బోధించి, కమ్యూనిజం లక్ష్యంగా పోరాడుతూ ఆ ఉన్నత విలువలతోనే జీవించి నూతన మానవుడికి ఒక నమూనాగా నిలిచాడు. అందుకే అందరి ప్రేమాభిమానాలు చూరగొనగలిగాడు. కార్మికవర్గ ఉత్తమ పుత్రుడుగా కామ్రేడ్ సాకేత్ సదా మనల్ని తన విప్లవ జీవిత ఆచరణ ద్వారా మేల్కొల్పుతూనే ఉంటాడు.

ఉద్యమంలో ఎన్ని ఆటు-పోట్లు, కష్ట-నష్టాలెదురైనా దృఢ సంకల్పంతో, గొప్ప త్యాగనిరతి, నిస్వార్థంగా, సాదాసీదాగా జీవించడం, ప్రజల ప్రయోజనం కోసం, విప్లవ లక్ష్యం కోసం అవిశ్రాంతంగా పని చేయటం, క్యాడర్లతో ప్రజాస్వామికంగా వ్యవహరించడం, ఎటువంటి కష్ట కాలంలోనైనా క్యాడర్లను, ప్రజలను అంటిపెట్టుకొని వుండటం వంటి అనేక ఉత్తమ కమ్యూనిస్టు ఆదర్శాలను నెలకొల్పిన కామ్రేడ్ రామకృష్ణ ఇక భౌతికంగా మన మధ్య లేడు. అయితే ఆయన నెలకొల్పిన ఉత్తమ విప్లవ ఆదర్శాలు, ఆయన చూపిన మహత్తరమైన విప్లవ బాట మనందరి ముందు ఉన్నాయి. విప్లవకారులందరికి సుపరిచితుడైన ఆయన భారతదేశంలోని పీడిత తాడిత ప్రజలలో, ప్రత్యేకించి నేటి యువతలో, విద్యార్థి, మేధావులలో ఒక చెరగని ముద్రవేసాడు. వారి మనస్సులలో నిరంతరం మెదులుతూ వారికి ప్రేరణనిస్తూనే వుంటాడు. ★

---

నేను
నేను ఎవరినంటే
పుట్టుకతో ప్రమేయం లేనివాడిని
మరణంతోనూ ప్రమేయం ఉండీ లేనివాడిని
మధ్యకాలంలోనేను,
నేనే!
గతనా మానవసారాన్ని ఆకళింపు చేసుకుంటున్నవాడిని
గతం వర్తమానంలోకి ఎగబాకిన వైనాన్ని అధ్యయనం చేస్తున్నవాడిని
వర్తమానం భవిష్యత్‌లోకి పురోగమించే గతిశీలతను
విశ్వసించినవాడిని
అందుకే నేను
చరిత్ర పురోగమిస్తుందని నమ్మినవాడిని
ఆ చరిత్ర పురోగమనంలో భాగమైనవాడిని
చరిత్రను నడిపించే భౌతికశక్తిని
ఇక ఇప్పుడు
నేను ఎవరినంటే,
నేను కమ్యూనిస్టును – విప్లవ కమ్యూనిస్టును.

– కామ్రేడ్ ఆర్.కే అమరుడైన తర్వాత తన డైరీలో దొరికిన కవిత

# భారత విప్లవ నేత, సృజన శీలి

# కామ్రేడ్ మిలింద్ బాబూరావ్ తేల్తుంబ్డే (దీపక్‌దా) కు విప్లవజోహార్లు

13 నవంబర్ 2021 మహారాష్ట్రలోని గడ్‌చిరోలీ జిల్లా విప్లవోద్యమ చరిత్రలో అత్యంత విషాదకరమైన రోజుగా మిగిలిపోతుంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు జిల్లా గడ్‌చిరోలీలోని ధనోరా తాలూకా గ్యారపత్తి పోలీసు స్టేషన్ పరిధిలోకల పారేవవా అడవిలో 10 గంటలకు పైగా జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ దీపక్ (మిలింద్ బాబూరావ్ తేల్తుంబ్డే) సహా 27 మంది కామ్రేడ్స్ అమరులైనారు. శతృవుతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీరయోధులకు వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లు చెపుదాం.

కామ్రేడ్ దీపక్‌దా 5 ఫిబ్రవరి 1964లో యవత్‌మాల్ జిల్లా వణీ తాలుకా రాజూరాలో పేద కార్మిక కుటుంబంలో శ్రీయుతులు బాబూరావు, అనసూయలకు ఏడవ సంతానంగా జన్మించాడు. ఆయన హైస్కూల్ విద్య పూర్తి చేసి ఐటిఐలో ఫిట్టర్ కోర్సులో శిక్షణ పొందాడు. ఆ తరువాత మొదట బల్లార్‌పూర్ పేపర్ మిల్లులో అప్రెంటీస్‌గా ఆ తదుపరి వెస్టన్ కోల్ ఫీల్డ్స్‌లో కార్మికుడిగా పని చేశాడు. ఆ క్రమంలో మొదట గని శ్రామిక ట్రేడ్ యూనియన్ నాయకుడిగా ఆ తదుపరి భారత గని కార్మికుల ఫెడరేషన్ నాయకులలో ఒకరిగా ఎదిగివచ్చి కార్మికుల సమస్యల పరిష్కారానికి అనేక మిలిటెంట్ పోరాటాల ద్వార కృషి చేశాడు. ఆయనకు 1982నాటికి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్)తో పరిచయాలు ఏర్పడినాయి. కార్మికవర్గంలో పనిచేస్తూ విప్లవ రాజకీయాలతో రాటుతేలుతున్న కామ్రేడ్ మిలింద్ 1992లో పూర్తికాలం విప్లవకారుడిగా బాధ్యతలు చేపట్టాడు. కొంత కాలం ఆయన మహారాష్ట్రలోని 'నౌజవాన్ భారత్ సభ'కు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించాడు. ఈ క్రమంలోనే ఆయన తను ప్రేమించిన కామ్రేడ్ ఏంజిలాను వివాహమాడాడు.

కామ్రేడ్ మిలింద్ కార్మికరంగంలో పనిచేస్తున్న క్రమంలో 2000లో జరిగిన మహారాష్ట్ర రాష్ట్ర పార్టీ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. విదర్భలోని అనేక పట్టణాలలోని కార్మికులను, విద్యార్థి-యువకులను ఎంతో చాకచక్యంగా అనేక సంఘాలలో ఆయన సంఘటితం చేశాడు. ముంబాయిలో విద్యుత్ కార్మికుల, సూరత్ బట్టల మిల్లుల కార్మికులతో ఆయనకు విస్తృతంగా సంబంధాలు ఉండే. అక్కడ నౌజవాన్ భారత్ సభ కార్యకర్తలతో కలిసి అనేక సమ్మెలలో పాల్గొని నాయకత్వం వహించాడు. 2005 నాటికి విదర్భలోని కార్మిక, విద్యార్థి, యువజన సంఘటిత శక్తికి కేంద్రబిందువుగా చంద్రపుర్‌ను నిలపడంలో ఆయన పాత్ర విశిష్టమైనది. ఆ సమయంలో విదర్భ విద్యార్థులలో విప్లవ బీజాలు బలపడకూడదనీ చంద్రపుర్ పోలీసులు చేపట్టిన కేంపెయిన్ 'మిషన్ మృత్యుంజయ' పేరుతో విద్యార్థులపై నిఘా పెంచారు. అయినప్పటికీ విద్యార్థులను సంఘటితం చేయడంలో ఆయన దక్షత అనుపమానమైనది. ఫలితంగా, చంద్రపుర్, బల్లార్‌పుర్, రాజూరా మున్నగు పట్టణాల నుండి వందలాది మంది విద్యార్థులు, యువకులు, కార్మికులు విప్లవోద్యమంలో సంఘటితమయ్యారు. ఒకవైపు పట్టణరంగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు 'విదర్భ పరిస్పెక్టివ్'లో భాగంగా అడవి ఉద్యమాన్ని అర్థం చేసుకుంటూ పార్టీ అప్పగించిన బాధ్యతల రీత్యా 20008లో కామ్రేడ్ మిలింద్ అటవీ ఉద్యమానికి బదిలీ అయ్యాడు. అప్పటినుండి ఆయన దీపక్‌గా విప్లవప్రజలలో తన విప్లవ కృషిని కొనసాగించాడు.

2009లో మొట్ట మొదట సౌత్, వెస్ట్ రీజనల్ బ్యూరో నిర్వహించిన ఎల్‌టిపి (లీడర్‌షిప్ ట్రేనింగ్ ప్రోగ్రాం)క్లాసుల్లో కా॥దీపక్ పాల్గొని మహారాష్ట్ర ఉద్యమ సమస్యలను లోతుగా చర్చించాడు. అక్కడ జరిగిన చర్చల నేపథ్యంలో తిరిగి మహారాష్ట్ర కేడర్‌కు రాజకీయ తరగతులు నిర్వహించాడు. ఆ వరుసనే పార్టీ రాష్ట్ర ప్లీనం జరగగా, అందులో కార్యదర్శి బాధ్యతలు చేపట్టి 2006 కాన్ఫరెన్స్ చేపట్టిన విదర్భ పరిస్పెక్టివ్‌కు ఆచరణ రూపం ఇవ్వడానికి నిర్దిష్ట రోడ్‌మేప్ రూపొందించాడు. కానీ, వరుసగా జరిగిన నష్టాలతో ఆ పథకం అమలు కాలేదు.

సిద్ధాంత, రాజకీయాల అధ్యయనంలో ఎంత పట్టుదలతో కృషి చేసేవాడో, అదే విధంగా కేడర్‌ను ఎడ్యుకేట్ చేయడంలో కూడా అంతే పట్టుదలతో కృషి చేసేవాడు. ఎమ్ఎమ్‌సీలో తనతో వున్న కేడర్‌కు, డికె కేడర్‌కు క్లాసులు చెప్పి, రాజకీయంగా వారి ఎదుగుదలకు చాలా కృషి చేశాడు. గఢ్‌చిరోలి కేడర్‌కు జరిగిన ఎల్‌టీపీ క్లాసుల్లో ప్రారంభం నుండి (2014) భాగమై అక్కడి కేడర్‌ను ఎడ్యుకేట్ చేయడంలో తుదివరకు పాల్గొన్నాడు. స్థానిక సమస్యల పట్ల అవగాహన పెంచడంలోను, గడ్డు పరిస్థితులలో 5వ షెడ్యూల్, 6వ షెడ్యూల్, పెసా చట్టం, గ్రామసభల వినియోగ ప్రాధాన్యతను వారిచే గుర్తింప చేయడంలో గొప్ప రాజకీయ కృషి సలిపాడు. దీపక్ దాదా వుంటే ఎక్కడైనా మంచి ఉత్సాహకరమైన రాజకీయ చర్చలు వుంటాయని, అనేక విషయాలు అర్థం చేయించి ఎంతటి విపత్కర పరిస్థితులలోనైనా కేడర్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాడనీ కేడర్ ఆయన్ని సదా గుర్తు చేసుకుంటారు. స్నేహశీలి దీపక్ దాదా అందరితో ఆత్మీయంగా వుంటూ వారిలోని టాలెంట్స్‌ను ఎంతగానో ప్రోత్సహించేవాడు.

1992-2021 మధ్య ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) లో వివిధ స్థాయిలలో పని చేస్తూ భారత విప్లవోద్యమానికి నాయకత్వం వహించాడు. 2008 తర్వాతి నుండి మహారాష్ట్ర విప్లవోద్యమంలో ఒకదాని వెంట మరోటి భారీ నష్టాలు చోటుచేసుకొని 2012 నాటికి ఆ ఉద్యమం తీవ్రంగా దెబ్బతింది. రాష్ట్ర కమిటీలో ఏకైక వ్యక్తిగా కామ్రేడ్ దీపక్ మిగిలాడు. ఆయన

జీవిత సహచరి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ రాహీ కూడ 2011లో అరెస్టై దాదాపు దశాబ్దకాలం అనేక తప్పుడు కేసులను ఎదుర్కొంటూ కటకటాల వెనుకే గడపక తప్పలేదు. ఆమె విడుదల య్యేనాటికి ఆయనను రాజ్యం వదలని లక్ష్యంగా చేసుకొని ఎడతెరిపి లేని దాడులు కొనసాగిస్తున్న ఫలితంగా ఆయన ఆమెను చివరివరకూ ప్రత్యక్షంగా కలువలేకపోయాడు. తన మల్లియను కలవడానికి ఆయన తుదివరకూ చేసిన ప్రతి ప్రయత్నం విఫలమైంది. ఆమె ఆయన పార్థివ శరీరాన్నే చూడగలిగింది.

మహారాష్ట్ర దళిత ప్రజా జీవితాలలో ఖైర్లాంజీ అత్యంత విషాదకర ఘట్టాలలో ఒకటి. ఖైర్లాంజీలోని దళిత కుటుంబంపై దోపిడీ వర్గాలు, కులాల దుష్ట శక్తులు జరిపిన ఘోరమైన అత్యాచారం, హత్యాకాండకు నిరసనగా యావత్ రాష్ట్రం భగ్గుమంది. ఖైర్లాంజీ దళితులకు న్యాయం జరుగాలనీ దళితప్రజలు, ప్రజాస్వామికవాదులు వీధుల్లోకి వచ్చారు. ఆ ప్రజా నిరసనలలో కామ్రేడ్ దీపక్ పాల్గొని వాటికి మిలిటంట్ రూపం ఇవ్వడంలో కెటాలిస్టిక్ పాత్ర పోషించాడు. చంద్రపుర్‌లో ఒక బస్సుకు నిప్పంటించగా అది దోపిడీ ప్రభుత్వ, పాలకుల గుండెల్లో మంటలు రేపింది. తుదకు ఆ కుటుంబానికి చట్టపరంగా రక్షణ కల్పించి,నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం ఆమోదించక తప్పలేదు. ఆయనలోని పోరాట పటిమకు, మిలిటెన్సీకి అది కేవలం ఒక నమూనా మాత్రమే.



మహారాష్ట్ర విప్లవోద్యమాన్ని పునర్వికసింపచేయడానికి తుది వరకూ ఆయన ఎంతగానో శ్రమించాడు. మహారాష్ట్ర విప్లవోద్యమాన్ని తిరిగి అభివృద్ధి చేయడం ఆయన జీవిత లక్ష్యాలలో అత్యంత ప్రాముఖ్యత కలిగినదిగా ఉండింది. కానీ, అది అసంపూర్తి గానే మిగిలిపోయింది. ఆ ఆశయాన్ని ఆయన రాజకీయాలతో, ఆదర్శాలతో చైతన్యవంతులై వందలాది కార్మికులు, విద్యార్థులు, అభిమానులు, మిత్రులు తప్పక నెరవేరుస్తారనీ ఆశిద్దాం.

2013లో గడ్‌చిరోలీ జిల్లాలో జరిగిన అనేక నష్టాలతో అక్కడి ఉద్యమాన్ని త్వరలోనే ఇక సమూలంగా నిర్మూలిస్తామని పోలీసులు సవాళ్లు విసురుతున్నప్పుడు ఆ ఉద్యమాన్ని కాపాడు కోవడానికి ఆయన అనేక నూతన రూపాలలో పార్టీని సంసిద్ధం చేశాడు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడుతున్న ఆదివాసీ ప్రజలను విప్లవ రాజకీయాల తో సుసంఘటితపరుస్తూ కోర్చీ తహశీల్ జెండేపార్, ఆగ్రీ, మసేలీ లలో ప్రతిపాదిత గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమానికి కొత్త రూపం ఇచ్చాడు. యువతను సంఘటితం చేశాడు. వారిని ప్రజా మిలీషియాలో తీర్చిదిద్దాడు. మరోవైపు, గ్రామ పంచాయతీల సర్పంచులను సమీకరించి ప్రజా ప్రతినిధులుగా ప్రజల అడవులను రక్షించడానికి ముందుకు రావాలనీ కోరాడు. వారిని సంఘటితపరిచి వారితో నిరహారదీక్షలు జరిపించాడు. వారి దీక్షా పోరాటాలు రాష్ట్ర విధానసభలో పెద్ద చర్చలకు దారితీశాయి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ప్రతిపాదిత గనుల తవ్వకాన్ని నిలిపివేసింది. గడ్‌చిరోలీ జిల్లాలోని 25కు పైగా స్థలాలలో 40వేల ఎకరాలకు పైగా భూభాగంలో గనుల తవ్వకాలను చేపట్టడానికి ప్రభుత్వం రూపొందించిన పథకానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితపర్చడంలో ఆయన ఎనలేని కృషి సలిపాడు. ఆ కృషి ఫలితంగా గడ్‌చిరోలీ జిల్లాలోని ఆదివాసీ గ్రామాలన్నిటా పెసా చట్టం ప్రకారం గ్రామ సభలు ఏర్పడి అడవులపై ఆదివాసులకు హక్కులు దక్కాయి. గడ్‌చిరోలీ ఆదివాసీ ప్రజల పోరాట ఫలితంగా మహారాష్ట్రలోని నందుర్‌బార్ సహ అన్ని జిల్లాల ఆదివాసుల కు అనేక ప్రయోజనాలు చేకూరాయి. మరోవైపు దేశవ్యాపితంగా ఆదివాసులను పెసా-గ్రామసభల విషయంలో జాగరూ కులను చేయడంలో ఆ జిల్లా ఉద్యమం చుక్కానిలా పనిచేసింది. 2018 నాటికి దేశంలోని ప్రబల ఆదివాసీ ప్రాంతాలలో ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్‌లలో పత్థల్‌గఢీ ఉద్యమం ఒక ప్రజా వెల్లువ రూపాన్ని సంతరించుకుంది.

కామ్రేడ్ దీపక్ 2013లో కేంద్రకమిటీ సభ్యుడయ్యాడు. 2016లో నూతనంగా ఏర్పడిన యంయంసీ జోన్‌కు ఆయన ప్రత్యక్ష నాయకత్వం వహిస్తూనే దెబ్బతిన్న మహారాష్ట్ర ఉద్యమాన్ని తిరిగి బలోపేతం చేయడానికి అకుంఠిత దీక్షతో పూనుకున్నాడు. కామ్రేడ్ దీపక్ మార్క్సిస్టు మూల గ్రంథాలను అధ్యయనం చేయడంతో పాటు బాబా సాహెబ్ అంబేడ్కర్ రచనలను ఔపోసన పట్టాడు. భారతదేశానికి ప్రధానంగా కుల నిర్మూలనకు డాక్టర్ అంబేడ్కర్ చేసిన కృషిని సోదర కామ్రేడ్స్‌కు విశదీకరించడంలో ఆయన ఎంతగానో శ్రద్ధాసక్తులు కనపరిచేవాడు. ఆయనకు కార్మికుల సమస్యలపై మంచి పట్టు ఉండింది. దేశంలో కుల నిర్మూలన, దళిత ప్రజల విముక్తి విషయంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతికరంగాలలో జరగాల్సిన కృషిపై స్పష్టత ఉండింది. భారతదేశ ఆదివాసులకు ప్రభుత్వాలు చట్టాల రూపంలో ఇస్తున్న అమలుకాని హామీల అమలుకు వారిని కదలించడంలో మంచి అనుభవాన్ని సంపాదించాడు. వ్యవసాయ ప్రధాన దేశమైన మన భారతదేశంలో, వ్యవసాయ విప్లవమే ఇరుసుగా సాగే భారత నూతన ప్రజాతంత్ర విప్లవంలో రైతుల పట్ల, వ్యవసాయ సమస్యల పట్ల లోతైన అవగాహన ఉండింది. ఢిల్లీలో రైతులు కొనసాగిస్తున్న

వినాశకర సాగు చట్టాల వ్యతిరేక పోరాటంపై రాసిన అనేక వ్యాసాలే అందుకు ప్రబల నిదర్శనం. ఆయన మన దేశంలో, ప్రపంచంలో జరుగుతున్న పర్యావరణ వినాశనం గురించి ఎంతగానో ఆందోళన చెందేవాడు. పర్యావరణంపై ప్రత్యేక అధ్యయనాన్ని చేపట్టాడు. కానీ, ఆయన ప్రాజెక్ట్ పూర్తి కాకముందే ఆయన్ని రాజ్యం పొట్టన పెట్టుకుంది.

కామ్రేడ్ దీపక్ 2016లో కేంద్రకమిటీ పనిపై ఒడిశా వెళ్లాడు. కానీ, అక్కడ పార్టీ తలపెట్టిన కార్యక్రమం బహిర్గతం కావడంతో పోలీసులు గాలింపు చర్యలను తీవ్రతరం చేశారు. ఆయన ఆ ప్రత్యేక పని రీత్యా అక్కడ గడిపిన నాలుగు మాసాలలో మూడు సార్లు పోలీసుల కాల్పులకు గురయ్యాడు. ఆ సందర్భంగా పీఎల్‌జీఏ గెరిల్లాలు తమ ప్రాణాలను ధారపోసి నాయకత్వ కామ్రేడ్స్‌ను కాపాడారు. కామ్రేడ్ దీపక్ ప్రతి దాడి నుండి సురక్షితంగా తప్పు కున్నాడు.

కామ్రేడ్ దీపక్ ఉక్కు క్రమశిక్షణ కలిగిన కామ్రేడ్. హెల్త్‌కేర్ విషయంలో కడు జాగ్రత్తగా ఉండేవాడు. ఆయన 57 ఏండ్ల వయసులో రోజూ ఉదయాన్నే తప్పనిసరిగా వ్యాయామం చేసేవాడు. ఆయన ఏమాత్రం అవకాశం ఉన్నప్పటికీ రోజూ ఉదయాన్నే రెండు గంటలు తప్పనిసరి మార్క్సిస్టు మూల గ్రంథాలను (క్లాసిక్స్) అధ్యయనం చేసేవాడు. ఆ టైం అతను చాలా ప్రైం టైంగా భావించేవాడు. ఆ సమయంలో సాధారణంగా ఆయన ఎవరితోనూ వెచ్చించడానికి సిద్ధపడకపోయేవాడు. చదవడం, నోట్సులు తయారు చేసుకోవడం, ఆ తదుపరి సహచరులతో సదరు విషయాలపై చర్చించడం ఆయన దినచర్యలో ఎంతో ఆసక్తితో చేసే పనులు. ఆయన మాంసాహారాన్ని అమితంగా ఇష్టపడేవాడు. బ్రాహ్మణీయ హిందుత్వ ప్రభుత్వాలు గోమాంసంపై నిషేధాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రకటించినపుడు కొంతలో కొంతైనా పేద దళితులకు, ఆదివాసులకు, ముస్లిం సహోదరులకు దొరికే పౌష్టికాహారాన్ని బ్రాహ్మణీయ శక్తులు అందకుండా చేస్తున్నాయనీ మండిపడేవాడు.

కామ్రేడ్ మిలింద్ సాహితీ రచనలో మంచి ఆసక్తి కల్గినవాడు. విప్లవోద్యమంలో చేరిన తరువాతే ఆయన అనేక ప్రజా సమస్యలపై, ఉద్యమంలో అసువులు బాసిన సహచర కామ్రేడ్స్‌పై జలపాతంలా రచనలు చేశాడు. భావస్ఫోరకమైన కవిత్వాలతో పాటు పాటలూ రాసేవాడు. రాయడమే కాదు పాడేవాడు కూడా. ఆయన జ్వాలాముఖి పేరుతో రచనలు చేసేవాడు. ఇటీవలి సంవత్సరాలలో తన తల్లి మరణించిన వార్త విన్న తరువాతి నుండి ఆయన, అమితంగా ప్రేమించే ఆ మాతృమూర్తి స్మృతిలో తన కలం పేరు అనసూయగా మార్చుకున్నాడు. ఆయన తన కుటుంబంలో తనకన్నా ముందరి సోదరిని, ఆనంద్‌ను ఎంతో ప్రేమించేవాడు. ఆయన తన విప్లవ సహచరులతో వాళ్లను తరచుగా గుర్తుచేసుకునేవాడు. తనకన్నా చిన్నవాడు, ఆదివాసులపై పరిశోధనా పత్రం (పీహెచ్‌డీ)తయారు చేసే క్రమంలో గడ్‌చిరోలీ చేరి మలేరియా వాతపడగా తక్షణమే బయటికి చేర్చినప్పటికీ దక్కకుండా పోయిన కనిష్ట సోదరుని జ్ఞాపకాలను తన గుండెల్లో భద్రంగా దాచుకున్నాడు. వాల్లందరి గురించి ఆయన అంతరంగంలో చెదిరిపోని అమర జ్ఞాపకాలెన్నో......! అన్నీ ఆయనతోనే, ఆయనలోనే ఉండిపోయాయి.

కామ్రేడ్ దీపక్ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హత్యకు పథకం రూపొందించి తన సోదరుడు ప్రముఖ మేధావీ ప్రొ. ఆనంద్ తేల్తుంబ్డే సహ అనేక మంది మేధావులను గైడ్ చేశాడంటూ భారత దోపిడీ పాలకవర్గాలు ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం, వర్తమాన హిందుత్వ శక్తులు చేసిన కల్పిత ఆరోపణలు జగద్విదితమే. మన దేశంలో బ్రాహ్మణీయ కుట్రలకు నగ్నమైన నమూనాగా నిలిచిన నయీ పేశ్వాయిల భీమా కోరేగాం విధ్వంసానికి ఆయనే సూత్రధారి అంటూ అనేక కట్టుకథలతో, తప్పుడు ఆరోపణలతో కొనసాగిస్తున్న దుష్ప్రచారం, ప్రజాస్వామికవాదులపై, రచయితలపై, కళాకారులపై, వకీళ్లపై, ఆదివాసీ శ్రేయోభిలాషులపై చేసిన/చేస్తున్న దాడులు, వారి ఇండ్లపై జరుగుతున్న సోదాలు, వారి అక్రమ అరెస్టులు దేశ ప్రజలకు తెలిసినవే. వారందరినీ అర్బన్ మావోయిస్టులంటూ తలోజా జైలులో నిర్బంధించడం, వారి వయస్సులు, అనారోగ్యాలనైనా పరిగణనలోకి తీసుకోకుండా బెయిల్‌లు నిరాకరిస్తూ వారిని మృత్యువు ఒడిలోకి నెట్టడం చూస్తున్నాం. వారి పట్ల బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు 84 యేళ్ల వయోవృద్ధుడు కామ్రేడ్ స్టాన్ స్వామి మరణంపై సహ్యాద్రి పేరుతో మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి స్పందన కామ్రేడ్ దీపక్‌లోని మానవీయ సంవేదనకు అద్దంపడుతోంది.

ఒక పక్క అర్బన్ మావోయిస్టులపై దాడులు కొనసాగిస్తూ మరోపక్క అడవులలో గత మూడేళ్లకు పైగా రాజ్యం ఆయన్ని ఒక ముఖ్య లక్ష్యంగా చేసుకొని దాడులను ముమ్మరం చేసింది. ఆయన అనేక పోలీసు దాడులలో గెరిల్లాలకు నాయకత్వం వహిస్తూ శత్రువును ప్రతిఘటిస్తూ సురక్షితంగా బయటపడగలిగాడు. కానీ తన బాధ్యతల రీత్యా గడ్‌చిరోలీ నుండి దాదాపు 60 మంది సహచరులతో యంయంసీ వెళ్తున్న క్రమంలో దారిలో 13 నవంబర్ రోజు ఆయన శత్రువు వలలో చిక్కాడు. పోలీసులు రాకెట్ లాంచర్లు, మోర్టార్లు సహ ఆధునిక ఆయుధాలతో వారిని చుట్టుముట్టి తూటాల వర్షం కురిపిస్తున్న సమయంలో ఎంతో ధైర్యంగా నిలిచి దాదాపు 10గంటలు రణరంగంలో నిబ్బరంగా బలగాలను గైడ్ చేస్తూ, పోరాడుతూ కామ్రేడ్ దీపక్ వీరమరణం పొందాడు. భారత కార్మికవర్గ అగ్రగామి దళ శీర్ష నాయకులలో ఒకరైన కామ్రేడ్ మిలింద్ బాబూరావు తేల్తుంబ్డే తను నమ్మిన ఆశయాల సాధన కోసం దృఢంగా పోరాడుతూ అమరుడయ్యాడు. గడచిన ఎనిమిదేళ్లకు పైగా కామ్రేడ్ దీపక్ రక్షణ సిబ్బందిలో ఉంటూ ఆయనను కంటికి రెప్పలా చూసుకుంటూ నిల్చిన కామ్రేడ్ భగత్‌తో పాటు ఆయనకు వైద్యం, కంప్యూటర్ పనులలో సహాయకురాలుగా ఉంటున్న కామ్రేడ్ యోగితా ఆయనతో పాటే ఆ దాడిలో నేలకొరిగారు. వారిద్దరూ ఆ ప్రాంత ఆదివాసీ భూమి బిడ్డలే. ఈ దేశ నూతన చరిత్ర నిర్మాణంలో దళితులు, ఆదివాసులే ముందుంటారనీ వీరి త్యాగాలతో మరోసారి నిరూపితమవుతోంది.

కామ్రేడ్ దీపక్ శ్రోతలు మెచ్చిన వక్త. జాతీయ, అంతర్జాతీయ పరిణామాల మీద విశ్లేషణతో కూడిన సమగ్ర సమాచారాన్ని అందిస్తూ మంచి వరవడితో ఆసక్తికరంగా మాట్లాడేవాడు. కార్మికవర్గ అంతర్జాతీయతను, వర్గకసిని, విప్లవ చైతన్యాన్ని కల్పించడంతో పాటు వాస్తవిక దృష్టితో కార్యాచరణకు పూనుకునేలా కేడర్‌కు వెన్నుతట్టేవాడు.

మహారాష్ట్ర పార్టీ కమిటీ అధికార ప్రతినిధిగా రైతుల క్రాంతి యాత్రలు, మరాఠీల రిజర్వేషన్‌లు, గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా, రైతాంగ పోరాటం, మిత్రులు ఏకనాథ్‌రావ్ సాద్వే, న్యాయమూర్తి సావంత్‌ల మరణంపై సంతాపంతో పాటు అనేక రాజకీయ పరిణామాలపై ప్రకటనలను విడుదల చేసాడు. మరాఠీ ప్రజల సమస్యలను విశ్లేషించడంతో పాటు వాటి మూలాలను అర్థం చేయించి పాలక వర్గాల చీలిక రాజకీయాలను ఎండగట్టాడు. మరాఠీ ప్రజల సమస్యల పరిష్కారం భూమి సమస్యతో ముడిపడి వుందనీ యువత గడ్‌చిరోలీ వైపు చూడాలనే దిశా నిర్ధేశనం చేశాడు.

ఒకప్పుడు మహారాష్ట్ర కమిటీకి నేతృత్వం వహించి, కేంద్ర కమిటీలో పొలిట్ బ్యూరో సభ్యుడిగా కొనసాగిన కోబాడ్ గాంధీ అరెస్టయిన తర్వాత ఆయనలో రాజకీయ దిగజారుడు మొదలై 'ఫ్రాక్చర్డ్ ఫ్రీడం' పేరుతో బహిర్గతమైన ఆయన మితవాద, ఆధ్యాత్మిక ధోరణులతో పాటు వ్యక్తమయిన విప్లవ వ్యతిరేక భావాలు, నర్మ గర్భంగా దళితులను అవమానించడాన్ని గుర్తించిన దీపక్ కోబాడ్ గాంధీ మారిన ఆలోచనలను, ఆచరణను నిశితంగా విమర్శిస్తూ క్రిటిక్ డాకుమెంట్ తయారు చేసి పార్టీ నాయకత్వానికి అందించాడు.

కామ్రేడ్ దీపక్ అధ్యయనం, అనుభవాల నుండి కలిగిన చైతన్యంతో ఉద్యమ పథంలో అనేక కష్టనష్టాలకు ఓర్చి, విప్లవోద్యమంలో అనేక రంగాలకు నాయకత్వం అందించ గల స్థాయికి ఎదిగాడు. అలాగే అనేక సమస్యల పట్ల స్పష్టమైన వైఖరితో విప్లవోద్యమ పురోగమనానికి సహకరించాడు. కా॥దీపక్ దళితుల సమస్య గురించి, డా॥అంబేద్కర్‌ను అర్థం చేసుకోవడం గురించి విస్తృతంగా, లోతైన చర్చ చేసి కులం డాక్యుమెంటును సంపద్వంతం చేయడంలో ఆయన ఒక డైనమిక్ పాత్ర నిర్వహించాడు.

కామ్రేడ్ మిలింద్ పార్థివ శరీరం స్వగ్రామం రాజూరాకు చేరాక అక్కడికి ఆయన బంధు మిత్రులంతా చేరుకున్నారు. నిర్జీవంగా, ఆపాదమస్తకం నెత్తుటి గాయాలతో చితిపై పడున్న అతన్ని చూస్తుంటే వెస్టర్న్ కోల్ ఫీల్డ్స్‌లో మళ్లీ నిప్పు రాజుకుంటుందన్న విశ్వాసం పెంపొందుతోంది. ఆయన త్యాగాలు వృధాపోవనే భరోసా కలుగుతోంది. ఆయన పార్థివ శరీరాన్ని మోస్తూ రాజూరా గ్రామ వీధుల వెంట నడిచి శ్మశాన వాటిక చేరి ఆయన భౌతికకాయానికి నిప్పంటించాక చితిమంటలలోనుండి ఎగిసిపడుతున్న అగ్నికీలల ప్రకాశవంతమైన వెలుతుర్లలో అమరుడు మిలింద్‌కు జోహార్లు అంటూ బొగ్గుగని కార్మికులు వినువీధులలో విన్పించిన విప్లవ నినాదాలే హోరెత్తుతున్నాయి. అక్కడ కన్నీళ్లతో నిల్చిన ఆయన మిత్ర బృందంలోని ప్రతి ఒక్కరి గుండెల్లో మిలింద్ రూపమే, ఆయన చెప్పిన మాటలే, ఆయన విన్పించిన విప్లవ సందేశాలే పదే పదే పొటమరించాయి.

భవిష్యత్తు భారత విప్లవోద్యమంలో ఎన్నో ప్రాంతాలు, ఎన్నో రంగాలు వికసిస్తున్న క్రమంలో దీపక్ వంటి ఒక డైనమిక్ కామ్రేడ్ లేకపోవడం భారత విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టం. ఈ నష్టాల నుండి బయటపడేందుకు కా॥దీపక్ నెలకొల్పిన విప్లవ ఆదర్శాలతో యువతను విప్లవ మార్గం పట్టిద్దాం.

కామ్రేడ్ దీపక్ అమరత్వంతో నిస్సందేహంగా పార్టీ, విప్లవోద్యమం వివిధ రంగాలలో అనుభవమున్న ఒక సీనియర్ నాయకత్వ కామ్రేడ్‌ను కోల్పోయింది. నేడు దేశంలో సామ్రాజ్యవాదానికి నమ్మినబంటుగా నిల్చిన బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పెంపొందుతున్న కార్మిక, కర్షక, విద్యార్థి, దళిత, ఆదివాసీ ప్రజా ఉద్యమాల నేపథ్యంలో అన్ని రంగాలలో రాజకీయంగా, నిర్మాణపరంగా, సాంస్కృతికంగా, సైనికంగా మంచి పట్టు ఉన్న కామ్రేడ్ దీపక్ అమరుడు కావడం ఈనాటి పరిస్థితులలో భారత విప్లవోద్యమానికి పెద్ద లోటు. ఆ కామ్రేడ్ పీడిత వర్గాల, ప్రత్యేకంగా సాంఘిక ప్రజా సముదాయాల – దళితుల, ఆదివాసీల, మహిళల, మత మైనార్టీల – అభిమాన నాయకుడు. ఆయన పీడిత ప్రజల, పార్టీ కేడర్ల అపార విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడు. అలాంటి నాయకుల అవసరం ఈనాడెంతో ఉంది. కానీ, అలాంటి వారినే భారత దోపిడీ పాలక వర్గాలు లక్ష్యంగా చేసుకొని అంతమొందిస్తున్నాయి. వారు భౌతికంగా మన మధ్య లేనప్పటికీ, వారు అందించిన రాజకీయాలు, నెలకొల్పిన ఆదర్శాలు సదా విప్లవాభిమానులను ప్రేరేపిస్తుంటాయి. వారు అనుసరించిన మార్గంలో ఆయన విప్లవ వారసులుగా మనం వారి ఆశయాల సాధనకై తుదివరకూ పోరాడుతామని శపథం చేద్దాం. అదే ఆ కామ్రేడ్‌కు అందించే నిజమైన నివాళి కాగలదు.

కామ్రేడ్ మిలింద్ అమర్ రహే!

పారేవా అమరుల ఆశయాలను కొనసాగిద్దాం.

**పారేవా అమరుల స్మృతిలో నవంబర్ 27 నాడు భారత్ బంద్‌లో పాల్గొని వారి విప్లవ త్యాగాలను ఎత్తిపట్టిన వారందరికి లాల్ లాల్ సలాం. అమరుల ఆశయాలను తుదకంటా కొనసాగిద్దాం.**

# ఉన్నత విద్యను వదిలి విప్లవం కోసం తుదివరకూ నిలిచిన కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ చింతన్‌దాకు రెడ్‌సెల్యూట్స్

సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్ నరేంద్ర సింగ్ (ఆశోదా, చింతన్‌దా) ఒక పట్టణంలోని ఆసుపత్రిలో 2020 జనవరి 6న 74వ యేటా అంతిమశ్వాస విడిచాడు. ఆయన చాలాకాలంగా పోలీసుల చిత్రహింసలతో ఎదురైన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 2018 నుంచి కోమాలో ఉన్నాడు. ఆయన బిహార్ రాష్ట్రంలో తూర్పు చంపారన్ జిల్లా, కేసరియా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించాడు. ఆయనకు ఒక సోదరి ఉంది. స్వగ్రామంలోనే ఆయన ప్రాథమిక విద్య పూర్తి చేసి ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఉన్నత విద్య అభ్యసించాడు. హిమాలయ ప్రాంతంలో బిహార్-నేపాల్ సరిహద్దున తెరై ప్రాంతంలో నివసించే థారూ ఆదివాసీ ప్రజలపై ఆయన పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందాడు. ఆయన అవివాహితుడు.

పీహెచ్‌డీ చేసిన తర్వాత ఆయన ఉద్యోగం చేయాలని భావించలేదు. దోపిడీకి తావులేని సమాజ స్థాపనకై పీడిత ప్రజలలో కృషి చేయనారంభించాడు. చదువుకునేటప్పుడే ఆయన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వైపు ఆకర్షితుడయ్యాడు. దానిని విస్తారంగా అధ్యయనం చేసాడు. పీహెచ్‌డీ పట్టా పొందాక ఢిల్లీలో కార్మికుల మధ్య విప్లవోద్యమ కృషి ఆరంభించాడు. ఢిల్లీలో జనరల్ వర్కర్స్ యూనియన్ స్థాపకులలో ఆయన ఒకరు. ఈ యూనియన్‌లో కార్మికులను సంఘటితం చేసాడు. ఈ కాలంలోనే, 1998-99 మధ్య ఆయనకు మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ)తో పరిచయం అయింది. 2001లో ఆయన బిహార్ పార్టీలో భాగమయ్యాడు. ఎంసీసీ కార్యకర్తగా ఆయన గ్రామాలలో రైతాంగాన్ని సంఘటితం చేయసాగాడు. ఆయన పరిశోధన చేసే కాలంలో పశ్చిమ చంపారన్ జిల్లాలో థారూ, ఉరాంవ్ ఆదివాసుల, దళితుల, భూమిలేని రైతుల దుర్భర పరిస్థితులను చూసి చలించిపోయాడు. అక్కడి రైతాంగం భూస్వామ్యం నుంచే కాకుండా బందిపోటు దొంగల నుంచి కూడా పీడనను ఎదుర్కొంటున్నారని అర్థం చేసుకున్నాడు. దాంతో ఆ ప్రాంత ప్రజలు నిత్యం భయం నీడల్లో జీవించేవారు.

ఆ ప్రాంతానికి ఆయన వెళ్లగానే 'జన్ శిక్షా కేంద్ర్' (ప్రజా విద్యా కేంద్రం) పేరుతో నాలుగు స్కూళ్లను ప్రారంభించాడు. వాటి ద్వార దళిత, ఆదివాసీ పిల్లలకు విద్యనందించాడు. ఆ స్కూళ్లలో స్కూల్ విద్యతో పాటు సామాజిక మార్పు గురించిన రాజకీయాలను కూడా చెప్పేవాడు. ఆ స్కూళ్లలో చదివిన కొంతమంది విద్యార్థులు తర్వాతి కాలంలో వర్గ పోరాటంలో సైతం భాగమయ్యారు.

ఆ కాలంలో బిహార్‌లో విముక్తి ప్రాంతాల పర్‌స్పెక్టివ్‌తో పని కొనసాగుతున్నది. ఆయన ఆ ప్రాంతం అంతటా పర్యటించాడు. బేస్ ఏరియాలకు కావలసిన ప్రజాపునాదిని అభివృద్ధి చేయసాగాడు. క్రాంతికారీ కిసాన్ కమిటీలను, గెరిల్లా దళాలను ఏర్పరచాడు. బందిపోట్లకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలను సంఘటితం చేయడానికి, వారిని పోరాటాలలో కదిలించడానికి చాలా ధైర్యంగా పని చేశాడు. పశ్చిమ చంపారన్‌లోని అటవీ ప్రాంతం గెరిల్లాజోన్‌గా ఉనికిలోకి వచ్చింది. భూస్వాముల స్వాధీనంలో ఉన్న అక్రమ భూములు, ప్రైవేట్ సైన్యాల కోసం వినియోగించే ఆయుధాలు గెరిల్లాలు స్వాధీనం చేసుకున్నారు. కల్ర స్మగ్లర్ల నుండి అడవులను సంరక్షించారు. బందిపోట్లను తరిమికొట్టారు. పోలీసులపై, పోలీసు క్యాంపులపై దాడులు చేసారు. వారి నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

పార్టీ ఉత్తర బిహార్ కమిటీ ఏర్పర్చిన వెంటనే, కామ్రేడ్ చింతన్‌దా అందులో సభ్యుడయ్యాడు. 3యు (ఉత్తర బిహార్-ఉత్తరప్రదేశ్-ఉత్తరాఖండ్) స్పెషల్ ఏరియా కమిటీ ఏర్పడగానే దానిలో సభ్యునిగా ఎన్నికయ్యాడు. 2004లో ఎంసీసీఐ, సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్) విలీనమైనప్పుడు ఐక్యపార్టీ కేంద్రకమిటీ సభ్యుడయ్యాడు. కేంద్ర కమిటీ సభ్యులతో ఏర్పడిన ఉత్తర రీజినల్ బ్యూరో (ఎన్ఆర్‌బీ)లో భాగమయ్యాడు. అంతిమ శ్వాస వరకు సీసీఎంగా కొనసాగాడు.

కామ్రేడ్ చింతన్‌దా స్కూల్ విద్యను మాత్రమే కాకుండా, మార్క్సిజాన్ని కూడా బోధించే ఒక టీచర్. ఆయన పార్టీ కేడర్లకు విద్య గరిపే బాధ్యతలు తీసుకున్నాడు. ఉద్యమ ప్రాంతాలలో కేడర్లకు మార్క్సిస్టు తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, విప్లవ రాజకీయాలు బోధించాడు. ఆయన బోధనా పద్ధతి సరళంగా, సహజంగా ఉండేది. జటిల విషయాలను సులువుగా, అర్థమయ్యేలా వివరించేవాడు. ఆయన మార్క్సిజాన్ని ఆచరణకు అన్వయించాడు, ఉద్యమ అనుభవాలను ఉదాహరణలుగా వివరించేవాడు. ఆయనకు ఇంగ్లిష్, హిందీ భాషలలో మంచి పట్టు ఉండేది.

కామ్రేడ్ చింతన్‌దా ఉత్తర బిహార్‌లో మూడు సార్లు అరెస్టయ్యాడు. మొదట 2005లో ఉత్తర బిహార్‌లో, చివరగా 2010లో ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో అరెస్టయ్యాడు. ప్రతిసారీ ఆయన్ని జైలు నుంచి విడుదలైన వెంటనే తిరిగి అరెస్టు చేసారు. కాన్పూర్‌లో ఆయన అరెస్టు మరింత భయానకమైంది. అక్కడ విపరీతమైన చిత్రహింసలకు గురయ్యాడు. పోలీసుల చిత్రహింసల కారణంగా ఆయన మూడుసార్లు మెంటల్ షాక్‌కు గురయ్యాడు. పోలీసుల చిత్రహింసల ఫలితంగా, 2010 నాటికి ఒక చెవి వినికిడి శక్తి కోల్పోయాడు. జైలులో ఉన్నప్పుడు బోన్ టీబీ వచ్చింది. అంతేకాకుండా ఆయనకు బీపీ, హెర్నియా, పైల్స్ జబ్బులు కూడా ఉండేవి. 2014లో విడుదల అయిన తరువాత ఇక కఠినమైన బాధ్యతలేవీ చేపట్టలేకపోయాడు. క్రమంగా తన శరీరంపైనా, మెదడుపైనా అదుపు కోల్పోయాడు. పోలీసుల, జైలు అధికారుల వేదింపులు, యాతనలు ఆయన శరీరాన్ని మరింతగా

క్షీణింపజేసింది. ఒక దశలో మానసిక సంతులనం కోల్పోయాడు. చికిత్స జరిగినప్పటికీ ఎప్పటిలా కోలుకోలేకపోయాడు. తుదకు 2020 జనవరి 6వ తేదీన ఈ ప్రపంచానికి వీడ్కోలు పలికాడు. భౌతికంగా మనందరికి దూరం అయ్యాడు.

ఇవాళ కామ్రేడ్ చింతన్‌దా మన మధ్య లేరు. కానీ ఆయన జ్ఞాపకాలు మనకు సదా నిలిచి ఉంటాయి. ఆయన రాజకీయ కృషి, త్యాగం, అంకితత్వం, సాహసం మనకు ఎల్లప్పుడూ ప్రేరణను, మార్గదర్శకత్వాన్నీ అందిస్తూ ఉంటాయి. ఆయన స్మృతులు మనకు బలాన్నిస్తాయి. ఆయన అద్భుతమైన, శక్తిమంతమైన జ్ఞాపకాలను పంచుకుందాం.

కాన్పూర్ జైలు నుంచి విడుదల అయిన తరువాత కామ్రేడ్ చింతన్‌దా బిహార్-ఝార్ఖండ్ సరిహద్దు ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ అర్ధ సైనిక బలగాలతో ఎదురుకాల్పులు జరిగాయి. ఫైరింగ్, షెల్లింగ్ విపరీతంగా జరిగాయి. కానీ ఆయన భయపడలేదు, నిరాశా పడలేదు. శారీరకంగా బలహీనంగా ఉన్నాడే కానీ ఆయన గొంతు మహా శక్తిమంతంగా ఉన్నది. మెల్లగా, వీరోచితంగా సమరంలో పురోగమించాడు. పీఎల్‌జీఏ యోధులను ఉత్సాహ పరుస్తూ శత్రువుపై దాడిలో పాల్గొన్నాడు. 'కామ్రేడ్స్! అర్ధసైనిక బలగాలు సింహాలు కాదు. పీఎల్‌జీఏ యోధులు బతికి ఉన్న పులులు. చిరకాలం వర్ధిల్లుతారు. స్నేహితులారా, ముందుకు ఉరకండి, వారిని తుడిచిపెట్టివేయండి'. ఈ ప్రేరణను అందుకున్న పీఎల్‌జీఏ యువ గెరిల్లాలు శత్రువుపై పడి దునుమాడారు. అర్ధసైనిక బలగాలు వెనకడుగు వేయక తప్పలేదు.

కామ్రేడ్ చింతన్‌దా సరైన పద్ధతిలో స్వయం విమర్శ చేసుకునేవాడు. తన వైపు నుంచి తప్పు జరిగిందని అర్థమయిన తరువాత దాన్ని అంగీకరించడానికి, సరిదిద్దుకోవడానికీ ఏ మాత్రం వెనుకాడేవాడు కాదు. రోజువారీ జీవితంలో కచ్చితమైన క్రమశిక్షణ పాటించేవాడు. జైలులోనూ, చివరికి స్పృహ లేని పరిస్థితి ఏర్పడే వరకు కూడా ఇది కొనసాగింది. మానసిక షాక్ వల్ల చదివే, రాసే, మాట్లాడే శక్తిని కోల్పోయారు. అయితే ఆహారంలో, నిద్రలో క్రమశిక్షణ పాటించేవాడు. తన తోటి కామ్రేడ్స్‌తో మంచిగా వ్యవహరించేవాడు.

**ఆయన జీవితం నుంచి కొన్ని ఉల్లేఖనలు, గుణపాఠాలు**

1. కామ్రేడ్ చింతన్ ఆదివాసీ, దళిత, వెనుకబడిన కులాల పక్షాన నిలబడ్డాడు. విప్లవం కోసం తన విలువైన జీవితాన్ని అర్పించాడు.

2. దేశంలో ప్రతిష్టాకరమైన విద్యా సంస్థలో ఉన్నత విద్యను అభ్యసించాడు. ఏ విశ్వవిద్యాలయంలోనైనా ఆచార్యులు కాగలిగేవారు. కానీ సౌకర్యవంతమైన జీవితాన్ని వదిలిపెట్టి విప్లవ కమ్యూనిస్టుగా మారాడు. కార్మికునిగా కార్మికవర్గానికి సేవ చేసాడు. ఆయన త్యాగం, అంకితభావం ఆదర్శవంతమైనవి, అభినందనీయమైనవి.

3. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయడానికి ఏదీ అడ్డం రాకూడదని ఆయన భావించాడు. చివరి నిముషం వరకు సాయుధ పోరాట మైదానంలో దృఢంగా నిలబడ్డాడు.

4. పదవీ వ్యామోహం, డబ్బు ఆశ విప్లవానికి శత్రువులు. ఈ సత్యం పట్ల ఆయన జాగరూకత కలిగి ఉండేవాడు. తన వారసత్వ ఆస్తిని వదిలివేసి పార్టీలో, ప్రజలలో కార్మికునిగా జీవించాడు. కష్టకాలంలో తన కామ్రేడ్స్ వద్దకు వెళ్లాడే తప్ప కుటుంబం వద్దకు వెళ్లలేదు. తన పరిస్థితులు, లక్ష్యాలకు అనుగుణంగా జీవించాడు. పార్టీ బయట ఎవ్వరితో రాజీ పడలేదు.

5. మనం జీవించి ఉండకపోయినా ఈ ప్రపంచం మారుతుంది. మన జీవిత కాలంలోనే విప్లవం పరిపూర్తి కావాలని లేదు. అయితే దాన్ని పరిపూర్తి చేయవలసిన బాధ్యత మనపై ఉన్నది. మిగిలిన పనిని భవిష్యత్తు తరం నెరవేరుస్తుంది. ఆయన ఈ విషయాన్ని ఆకళింపు చేసుకుని తన యావత్తు జీవితం అంకితం చేసాడు.

6. నైజీరియా కవి, నాటక రంగ ప్రముఖుడు బోల్ షోయెంకా చెప్పిన మాటలను ఆయన నిజం చేసాడు. 'జైలుకు వెళ్లే ముందు దేన్నైతే నమ్ముతామో విడుదల అయిన తరువాత కూడా అదే నమ్ముతాం. అయితే ఈ నమ్మకం ఇంకా బలపడుతుంది'. మూడు సార్లు అరెస్టై, చిత్రహింసలకు గురి అయ్యి కూడా కామ్రేడ్ చింతన్‌దా నిరాశపడిపోలేదు, లొంగిపోలేదు, భయపడలేదు. పార్టీ రహస్యాన్ని కచ్చితంగా కాపాడాడు. విడుదల అయిన ప్రతిసారీ ఆయన మరింత రాటుదేలి నిశ్చయంగా వర్గ పోరాటంలో, ప్రజా యుద్ధంలో భాగం అవుతూ వచ్చాడు.

7. ఆయన జీవితంలో ఒక ప్రత్యేక లక్షణం ఉన్నది. అత్యంత కష్టతరమైన పరిస్థితులలో విప్లవంలో, ప్రజలలో నమ్మకం నిలబెట్టు కున్నాడు. పార్టీ అధికారిక పంథాను అంటిపెట్టుకుని ఉన్నాడు. వర్గపంథా-ప్రజాపంథాపై, మార్క్సిజం-లెనినిజం- మావోయిజంపై బలంగా నిలబడ్డాడు.

కామ్రేడ్ చింతన్‌దా ఒక మంచి ఉపాధ్యాయుడు, శక్తిమంతమైన ఉపన్యాసకుడు, విద్యావంతుడు, అలుపెరుగని కార్యకర్త. ఆయనలో ఉన్న కార్మికవర్గ లక్షణాలు ఆయనను బలమైన కమ్యూనిస్టుగా, నిశ్చయమైన మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టుగా నిలబెట్టాయి. మన ప్రియతమ కామ్రేడ్, సహచర యోధుడు, ఉపాధ్యాయునికి కన్నీటి నివాళి అర్పిస్తున్నాం. ఆయన ఆశయాన్ని పరిపూర్తి చేస్తామని శపథం చేస్తున్నాం. కామ్రేడ్ చింతన్‌దా జీవితం నుంచి, విప్లవ కృషి నుంచి నేర్చుకోవాలనీ, ఆయన చూపిన చొరవను అలవర్చుకోవాలనీ కేడర్‌లకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఆయన అమరత్వం కలిగించిన ఆవేదనను బలంగాను, కన్నీటిని క్రోధంగాను మార్చుకోండి. మళ్లీ మళ్లీ శపథం చేద్దాం,

(బిహార్-జార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ అధికారిక పత్రిక 'లాల్ చింగారీ' 2021 ఏప్రిల్-జూన్ 46వ సంచిక తూర్పు రీజనల్ బ్యూరో కామ్రేడ్ చింతన్‌దా జీవిత చరిత్రను ప్రచురించింది. ఇది దాని అనువాదం - సంపాదక మండలి)

# సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు

# కామ్రేడ్ పతిత్ పావన్ హల్‌దార్ (తాపస్ దా)కు వేనవేల ఎర్రవందనాలు!

'జీవితం మనిషికి ఎంతో ప్రియమైనది. దానిని సంపాదించుకోగలుగుతాం. జీవితాన్ని ఉత్తమ లక్ష్యం కోసం, శ్రమజీవుల విముక్తి కోసం పోరాడుతూ నేను జీవించాను, శ్రమజీవుల రక్తంతో తడిసిన ఎర్రజెండాలో నా రక్తం కూడా ఒక బొట్టు ఉంది, అని మృతి చెందేనాటికి చెప్పగలిగేలా జీవించాలి."

ఈ చైతన్యంతో జీవించి 57 ఏళ్ల వయసులో మన కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ పతిత్ పావన్ హల్‌దార్ (తాపస్ దా) మనల్ని అందరినీ వదిలి గత 2019 సెప్టెంబర్ 4న చివరి శ్వాస విడిచాడు. ఈ అతి దుఃఖదాయకమైన వార్త మాకు చాలా ఆలస్యంగా తెలిసినందువల్ల, చాలా ఆలస్యంగానే అయినా ఈ ప్రకటనను విడుదల చేయాల్సి వస్తోంది. భారత విప్లవ నాయకుడు కామ్రేడ్ పతిత్ పావన్ హల్‌దార్‌కు మా కేంద్రకమిటీ వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తోంది. ఆయన ఆశయాల పరిపూర్తి చేసేందుకు ప్రతిజ్ఞ చేస్తోంది అని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఒక ప్రకటన విడుదల చేసింది.

కామ్రేడ్ తాపస్ దా పశ్చిమ బంగా రాష్ట్రంలోని హుగ్లీ జిల్లా, పీయాసాడా ప్రాంతంలోని రాంచంద్రపుర్ గ్రామంలో 1962 ఫిబ్రవరి 8న ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. అతను అవివాహితుడు. నక్సల్‌బరీ ఎర్రమంటలు పశ్చిమ బంగాతో సహా భారతదేశ నలుమూలల్లోని విద్యార్థి, యువజనుల హృదయాలను జ్వలింపజేసాయి. మీరు బానిస బతుకులు బతుకుతారా లేదా సంకెళ్లను బద్దలుకొట్టి ప్రపంచాన్ని జయించేందుకు ముందుకు దూకుతారా అని నిలదీసాయి. ఇది యువ తాపస్ హృదయాన్నీ జ్వలింపజేసింది. ఆయన కేవలం 13, 14 ఏళ్ల వయసులోనే బానిస సంకెళ్లను తెంచుకోవాలని కలలు గంటూ ముందడుగు వేసాడు. యుక్త వయసులోనే విద్యార్థి, యువజనులు ప్రశ్నించడం నేర్చుకోకపోతే మనకు బానిస బతుకే శరణ్యమని గుర్తుచేశాడు. అతిచిన్న వయసులోనే కామ్రేడ్ కన్హాయ్ ఛటర్జీ సంబంధాల్లోకి వచ్చాడు. గతితార్కిక భౌతికవాదంతో పాటు మార్క్సిస్టు మౌలిక సిద్ధాంతాన్ని అధ్యయనం చేయనారంభించాడు. మావోయిస్టు రాజకీయాలతో మమేకమైనాడు. ఆ రాజకీయాల కోసం తన జీవితాన్ని అర్పించాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆయనకు స్కూల్ విద్య అవసరం లేకుండా పోయింది. యుక్త వయస్సులోనే ఆయన హుగ్లీ జిల్లాలోని జనాయి, బేగంపుర్, ఆటీపుర్, బారుయిపాడా, శిఆఖాలా, భీంపూర్, పెరో తదితర హుగ్లీ సుదూర ప్రాంతాల్లో వ్యవసాయ విప్లవ ప్రచార ఆందోళన కార్యక్రమాలను ప్రారంభించాడు. ఆ సమయంలో మునుపటి ఎమ్‌సీసీ నాయకత్వంలో హుగ్లీ, హౌరా జిల్లాలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో 8 గంటల పని, వేతన పెంపుదల, పితృస్వామిక హింస, ఆసుపత్రుల్లో సరియైన చికిత్స, నీటిపారుదల, పంటలకు గిట్టుబాటు ధరలు, రోడ్డు మరమత్తు తదితర డిమాండ్లతో ఆందోళనలు జరిగాయి. ఆయన ఈ ఆందోళనలలో భాగమయ్యాడు. హుగ్లీ జిల్లాలో బేగమ్‌పూర్ ప్రాంతంలో చేనేత కార్మికులకు వ్యతిరేకంగా కొందరు ధనికులు ప్రారంభించిన పవర్‌లూమ్‌లకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాన్ని నిర్మించాడు. ఈ ఆందోళనల ప్రభావంతో ముందుకు వచ్చిన కొంతమంది కార్యకర్తలతో దళం ఏర్పడింది. దీంతో పాటు ఈ ప్రాంతాలంతటా ఎన్నికల బహిష్కరణ కార్యక్రమం కూడా ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది. ఈ కార్యక్రమాలపై ఆధారపడి హౌరా-హుగ్లీ-మేదినీపూర్ జోనల్ కమిటీ నిర్మాణమైంది. 1980-90 దశకాల్లో వ్యవసాయ విప్లవాన్ని నిర్మించడంలో కామ్రేడ్ తాపస్ పాత్ర చెప్పుకోదగినది. ఆయన ఆనాటి బిహార్-బెంగాల్ స్పెషల్ ఏరియా కమిటీ నాయకత్వంలో ప్రజాసైన్యం, విముక్తి ప్రాంతాల నిర్మాణం చేసే ప్రక్రియ ద్వారా సంపాదించుకున్న యావత్తు అనుభవాలను, వివిధ పోరాటాలలోని ప్రత్యేకతలను అధ్యయనం చేయడానికి ఆయన తీవ్రంగా కృషి చేసాడు. సమస్యలను పరిష్కరించేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. 20వ శతాబ్దం చివరి దశాబ్దం చివరిలో ఎమ్‌సీసీ కేంద్రకమిటీ ఒక తీవ్రమైన సంక్షోభాన్ని చవిచూసింది. పార్టీలో ఒక చిన్న అవకాశవాద ముఠా పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటం పేరుతో ఎంసీసీ మౌలిక పంథాకు వ్యతిరేకంగా కుట్రపూరిత కార్యక్రమాన్ని ప్రారంభించింది. పార్టీ ఈ ముఠాకు 'బా-భ' (బాదల్-భరత్) ముఠాగా పిలిచింది. ఈ అవకాశవాద ముఠా పశ్చిమ బెంగాల్‌తో పాటు బిహార్, ఝార్ఖండ్‌లలోని కొన్ని ప్రాంతాలలో కామ్రేడ్ కేసీ నాయకత్వంలో ఎంసీసీ నెలకొల్పిన మావోయిస్టు పంథాకు వ్యతిరేకంగా అవకాశవాద, వర్గసంకర పంథాను ముందుకు వచ్చింది. ఎంసీసీ నాయకత్వం, విప్లవ ప్రజలు సమైక్యంగా విప్లవ సంకల్పంతో పోరాటాన్ని సాగించి, కొద్ది కాలంలోనే ఈ ముఠాను పక్కకు నెట్టివేసారు. పార్టీలో జరిగిన ఈ అంతర్గత పోరాటం ఫలితంగా బా-భ ముఠాలో కొందరు పోలీసు ఏజెంట్లుగా మారారు. మరికొందరు రాజకీయంగా దిగజారిపోయారు. ప్రస్తుతం వాళ్లు అప్పుడప్పుడు సీపీఐ (మావోయిస్టు) నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని సమర్థించే పాత్రలో కనపడతుంటారు. ఎంసీసీ అంతర్గత పోరాట సమయంలో కామ్రేడ్ తాపస్ దా నిర్వహించిన పాత్ర ఎంతో సకారాత్మకమైనది, చెప్పుకోదగినది. ఆయన పశ్చిమ బెంగాల్‌లో పార్టీని పునర్నిర్మించే బాధ్యతను స్వయంగా తన భుజస్కందాలపైన వేసుకున్నాడు. ఆయన మహత్తర నాయకత్వంలో

హౌరా – హుగ్లీ – మేదినీపూర్ జోన్ తిరిగి వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని ముందుకు తీసుకపోయే పథకాన్ని రూపొందించుకుని ముందడుగు వేసింది. కోల్‌కతా టౌన్ కమిటీ పునర్నిరించారు. ఉత్తర బెంగాల్ జోనల్ కమిటీ జోనల్ కమిటీ కూడా నిర్మాణమైంది. బీబీఎమ్ జోన్‌లో తిరిగి పోరాటాలు బద్దలయ్యాయి. సంక్షోభం, వర్గ పోరాట అభివృద్ధి క్రమంలోనే నాయకత్వం పరీక్షకు గురవుతుంది. ఈ దశంలో కామ్రేడ్ తాపస్ ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఆయన నాయకత్వంలోనే హౌరా–హుగ్లీ–కోల్‌కతా–ఉత్తర బెంగాల్–బీర్భూం తదితర పోరాట ప్రాంతాల్లో పునర్నిర్మాణం జరిగింది. నాయకత్వ కమిటీల సమీక్షలు, మహాసభల ద్వారా తిరిగి పోరాట పథంలో ఆ ప్రాంతాలు పురోగమించాయి. బా–భ ముఠా కుట్రలను బహిర్గతం చేసాయి. దాన్ని పోరాటానికి అవరోధంగా గుర్తించాయి. ఆ సమయంలో అంటే మునుపటి ఎమ్‌సీసీఐ నుండి బా–భ ముఠాను బహిష్కరించిన తర్వాత పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభలో ఏర్పడిన రాష్ట్ర కమిటీలో ఆయనను సభ్యునిగా ఎన్నుకున్నారు. ఆ సమయంలో కామ్రేడ్ తాపస్ నాయకత్వంలో పశ్చిమ బంగ్ రాష్ట్ర కమిటీ పోరాట కార్యక్రమాన్ని చేపట్టింది. గెరిల్లా దళాలను నిర్మించే కర్తవ్యాన్ని తీసుకుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అనేక సాయుధ ప్రతిఘటనా చర్యలు నిర్వహించింది. ఆయన నాయకత్వంలోకి వచ్చిన నూతన కామ్రేడ్స్‌తో కలిసిపోయేవాడు. ఎన్నడూ కోపాన్ని ప్రదర్శించేవాడు కాదు. సమస్య మూలంలోకి వెళ్లేందుకు ప్రయత్నించేవాడు. మార్క్సిస్టు పద్ధతిలో సమస్యలను పరిష్కరించడం గురించి వక్కాణించేవాడు. కామ్రేడ్ తాపస్ దా నేను నాయకున్ని అని ఏనాడు తన కింది కామ్రేడ్స్‌తో అహంభావంతో వ్యవహరించేవాడు కాదు. కామ్రేడ్ తాపస్ దా ఎల్లప్పుడు కామ్రేడ్ మావో వ్యాసమైన సరియైన భావాలు ఎక్కడి నుండి వస్తాయి? అంటే ఉత్పత్తి కోసం పోరాటం, వర్గపోరాటం, శాస్త్రీయ ప్రయోగాల నుండి వస్తాయనే బోధనను ఎల్లప్పుడూ అమలు చేసేవాడు. దీని ద్వారా ఒక సమస్య ఏ దిశలో సాగుతున్నదనే విషయాన్ని చెప్పగలిగేవాడు. ఆయన చాలా సాదా–సీదా జీవనశైలిని ఆచరించేవాడు. శ్రమజీవులను ఎంతో గౌరవించేవాడు. సాధారణంగా ఆయన భూమిలేని రైతుల ఇళ్లలోనే షెల్టర్ తీసుకునేవాడు. ఆయన వేషభాషలు సాధారణంగా ఉండేవి.

1970వ దశకంలో సీపీఐ (ఎమ్ఎల్) వేరు వేరు గ్రూపులుగా చీలిపోయిన తర్వాత స్థితిని దృష్టిలో ఉంచుకుని, ఎంసీసీ, సీపీఐ (ఎంఎల్)లలోని ఉన్నతస్థాయి విప్లవకారులు సమైక్యమై తప్పకుండా ఐక్య కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేస్తారని కామ్రేడ్ కన్హాయ్ ఛటర్జీ అనేవాడు. కామ్రేడ్ కేసీ చెప్పే ఈ విషయాన్ని కామ్రేడ్ తాపస్ దా సదా తన దృష్టిలో ఉంచుకునేవాడు, కమ్యూనిస్టు విప్లవకారుల మధ్య ఐక్యత సాధించేందుకు ప్రాముఖ్యత ఇచ్చేవాడు. 1980 దశకం నుండి వివిధ ఎమ్ఎల్ గ్రూపులతో ఐక్యతా చర్చల సమయంలో ఆ సమావేశాలు విజయవంతంగా కావడానికి ఆయన సమర్థవంతమైన పాత్రను నిర్వహించేవాడు. బా–భ ముఠాను బహిష్కరించిన తర్వాత కామ్రేడ్ తాపస్ నాయకుడిగా వివిధ విప్లవ గ్రూపులతో సమాన హోదాతో చర్చలు నిర్వహించేవాడు. కేంద్రకమిటీ నాయకత్వంలో ఐక్యతా పార్టీ స్థాపనా కృషిలో విశేషమైన పాత్ర నిర్వహించాడు. ఈ విషయంలో ఆయన విశాల వైఖరితో వ్యవహరించేవాడు. ఒంటెత్తుపోకడ, అహంభావాన్ని ఎపుడూ దరిచేరనీయలేదు. ఆయన జీవితమంతా నిజమైన కమ్యూనిస్టు విప్లవకారుడిగా జీవించాడు.

2004 సెప్టెంబర్ 21న సీపీఐ (ఎమ్ఎల్) (పీపుల్స్‌వార్), ఎమ్‌సీసీఐల మధ్య చారిత్రాత్మక ఐక్యతా ప్రక్రియ ద్వారా ఒక నూతన, ఐక్య పార్టీ – సీపీఐ (మావోయిస్టు)ను ఏర్పరచినప్పుడు కూడా ఆయన విశేషమైన పాత్ర నిర్వహించాడు. ఆయనను ఆ సమయంలో నూతనంగా ఏర్పరచిన కేంద్రకమిటీ సభ్యుడుగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత రాష్ట్రాలలో ఐక్యతలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో కొనసాగిన ఐక్యతా ప్రక్రియలో భాగంగా అక్కడి యూనిట్‌కు పశ్చిమ బెంగాల్ రాష్ట్రకమిటీ కార్యదర్శిగా ఎన్నికైనాడు. ఆయన విజయవంతంగా వివిధ జోన్లను ఐక్యం చేసాడు. ఐక్య మావోయిస్టు పార్టీ ఏర్పడిన కేవలం 8 నెలలకే 2005 మే నెలలో హుగ్లీ జిల్లాలో కొన్నగర్ ప్రాంతంలో అమరుడు కామ్రేడ్ బరుణ్ దా (సుశీల్ రాయ్)తో పాటు అరెస్టయ్యాడు. 14 ఏళ్ల సుదీర్ఘ కఠిన జైలు జీవితం అనుభవించాడు. జైలులో కూడా ఖైదీల పోరాటాల్లో ముందుండేవాడు. కేవలం ఏడు నెలల్లోనే విచారణ ప్రహసనాన్ని నడిపి ముగ్గురు కామ్రేడ్స్‌కు కోర్టు శిక్ష విధించింది. వారిలో కామ్రేడ్స్ తాపస్ దా, కామ్రేడ్ సంతోష్, దేవనాథ్‌లకు జీవిత ఖైదు విధించింది. సుదీర్ఘ జైలు జీవితంలో కూడా ఆయన పార్టీ పట్ల, విప్లవం పట్ల అచంచల విశ్వాసంతో ఉన్నాడు. ఎలాంటి అవకాశవాదాన్ని దరిచేరనీయలేదు. తేనెపూసిన విషపు లొంగుబాటు గుళికల ముందు ఎన్నడూ తల వంచలేదు. జైలులోని కామ్రేడ్స్ అందరికి ఆప్తుడిగా ఉంటూ వారి సంక్షేమాన్ని పట్టించుకునేవాడు. తన దగ్గర ఉన్న వాటిలో నుండే రోజువారీగా అవసరమయ్యే వస్తువులను సోదర ఖైదీలకు ఇచ్చి వారికి తోడ్పడేవాడు.

కామ్రేడ్ తాపస్ కార్మికవర్గ సిద్ధాంతాన్ని, ఆదర్శాలను, పార్టీ బోధనలను ఎపుడూ నొక్కి వక్కాణించేవాడు. జైలులో కామ్రేడ్ తాపస్ మన పార్టీ కామ్రేడ్స్‌కే కాక, యావత్తు పీడిత వర్గాలకు చెందిన ఖైదీలకు, ఇతర సంఘాలకు చెందిన రాజకీయ ఖైదీలకు కూడా వివిధ రకాలుగా సహాయాన్ని అందించేవాడు. బెయిల్‌పై బయటకు వెళ్లే పేద ఖైదీలకు తాను ఒక ఖైదీగా జైలులో శ్రమచేసి సంపాదించుకున్న డబ్బులు దారి ఖర్చుల కోసం ఇచ్చేవాడు.

14 యేళ్ల జైలు జీవితంలో ఆయనను పలు రకాలుగా వేదించి హత్య చేసేందుకు ఫాసిస్టు రాజ్యం తీవ్రంగా ప్రయత్నించింది. జైలు జీవితం అనుభవించే క్రమంలో ఆయనకు తీవ్రమైన వ్యాధులు సోకినా, గుండెపోటు వంటి ప్రాణాంతక వ్యాధితో బాధపడినా జైలు అధికారులు సరైన వైద్య సదుపాయాలు కల్పించలేదు. ఆయనకు వైద్యం చేయాలనే డిమాండ్‌తో జైలులోని ఖైదీలు నిర్వహించిన సమ్మె అస్త్రం ఫలితంగానే కనీస వైద్య సదుపాయాలు కల్పించారు. ఎట్లకేలకు సుదీర్ఘ జైలు జీవితం గడిపిన తర్వాత కోల్‌కతా హైకోర్టు

ఈస్టర్న్ రీజియన్ అమరులు

# కామ్రేడ్ సునీల్ కుమార్ (రవి, జయలాల్) కు ఎర్ర దండాలు

మన పార్టీ కేంద్రకమిటీ స్టాఫ్ సభ్యుడు కామ్రేడ్ రవి. కమ్యూనికేషన్ రంగంలో నిపుణుడైన కామ్రేడ్ రవి ఒక పేలుడు పదార్థాన్ని తయారు చేసి, పరీక్షిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు దుర్ఘటన జరిగి 2020, జూన్ 25న అమరుడయ్యాడు.

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా, తిమ్మాయపాలెంలో విప్లవ కుటుంబంలో జన్మించిన రవికి బాల్యం నుండే విప్లవ భావాలు అబ్బాయి. ఆయన విప్లవ కుటుంబంలో పుట్టి పెరగడంతో చిన్న వయసులోనే విప్లవకారుడయ్యాడు. పార్టీ అప్పగించిన బాధ్యతలు నెరవేర్చడంలో భాగంగా ఆయన దండకారణ్యానికి వెళ్లడంతో తొలుత అక్కడ చాలా శ్రద్ధ పెట్టి గోండీ (కోయ) భాష నేర్చుకున్నాడు. అక్కడి నుండి పార్టీ అవసరాల రీత్యా నడుచుకుంటూ వెళ్లిన రెండవ బ్యాచులో ఝార్ఖండ్ వెళ్లి, ఈఆర్‌బీ స్టాఫ్‌లో చేరి పని చేశాడు. ఝార్ఖండ్‌కు వెళ్లాక కొద్ది రోజుల్లోనే ఉద్యమ అవసరాల రీత్యా హిందీ కూడా చక్కగా నేర్చుకున్నాడు. కామ్రేడ్ రవి ముఖ్యమైన పని కమ్యూనికేషన్ రంగానికి సంబంధించింది. అయినప్పటికీ ఆయన రోజువారి గెరిల్లా జీవితంలో సాధారణ గెరిల్లా నిర్వర్తించే అన్ని విధులు - సెంట్రీ డ్యూటీ, కిచెన్ డ్యూటీ, కర్రలు తేవడం, పీటీ-డ్రిల్ చేయడం, సరుకులు తేవడానికి గ్రామాల్లోకి వెళ్లడం - చేసేవాడు. ఆయన పార్టీ బోధించే రాజకీయ తరగతులలో చాలా శ్రద్ధగా పాల్గొనేవాడు. గెరిల్లా యుద్ధ చర్యలలో ఎప్పటికప్పుడు మరింత మెరుగైన విస్ఫోటక డివైస్‌లను, పదార్థాలను తయారు చేయడంలో కూడా రవికి చాలా ఆసక్తి వుండేది.



కామ్రేడ్ రవి ఒక గెరిల్లా యోధుడికి ఆదర్శ నమూనా. అతను కంప్యూటర్ నడపడం నుండి మొదలుకొని అత్యాధునిక ఆయుధం ఉపయోగించే వరకూ ఏదైనా చాలా సరళంగా చేసేవాడు. కామ్రేడ్ రవి తెలుగు భాషలోని వ్యాసాలను 'లాల్ చింగారి' కోసం హిందీలోకి అనువాదం చేసేవాడు. అలాగే లాల్ చింగారి తయారీలో, ప్రచురణలో, ఒక ముఖ్య పాత్ర వహించాడు. ప్రెస్ పనిని కూడా చాలా ఆధునీకరించాడు.

యువకుడైన కామ్రేడ్ రవి వాస్తవంగా కోపం ఎరుగడు. సోదర కామ్రేడ్స్ అందరితో కలువుగోలుగా, సహాయాన్ని అందించే స్వభావం కలిగి అందరి విశ్వాసాన్ని చూరగొన్నాడు. ఆయన ప్రతి క్షణం విరామం ఎరుగకుండా పని చేసేవాడు. కమ్యూనికేషన్ పనులతో పాటు లాప్‌టాప్‌పై పని చేస్తూనో లేదంటే అనువాద పనో చదువుకుంటూనో కనపడేవాడు. అతనిలో నేర్చుకునే జిజ్ఞాస మెండుగా వుండేది. కామ్రేడ్ రవి నడిచిన దారిలో జీవితాంతం నడుస్తూనే వుంటామనీ, ఆయన విప్లవ కలలనూ సాకారం చేయడానికి ఆయన నిర్వహించిన బాధ్యతలను ఆయన సహచరులుగా భుజాలకెత్తుకుంటామని వాగ్దానం చేద్దాం. ప్రియమైన కామ్రేడ్ రవి వేలాది గెరిల్లా యోధుల గుండెల్లో నిరంతరం సజీవంగా వుంటాడు.

---

ఆయనను విడుదల చేయక తప్పలేదు. విడుదలైన రెండు నెలలకే ఆయన కన్ను మూశాడు. గత పదేళ్లలో అనేక మంది కమ్యూనిస్టు విప్లవకారులు జైలు నుంచి విడుదలైన 6-10 నెలల్లోనే మరణించారంటే మన దేశంలోని నికృష్ట జైలు వ్యవస్థను అర్థం చేసుకోవచ్చు. కమ్యూనిస్టు విప్లవకారులకు వ్యతిరేకంగా ఈ రకమైన అణచివేత కొనసాగడం వెనుక అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ సీఐఏ, ఇజ్రాయిల్‌కు చెందిన మొసాద్, భారత్‌కు చెందిన 'రా' వంటి పలు ఇంటెలిజెన్స్ సంస్థల కుట్ర ఉంది. నిజానికి ఇలాంటి మరణాలు సామ్రాజ్యవాదుల, దళారీ పాలకవర్గాల కుట్ర తప్ప మరేమీ కాదు. ఇలాంటి కుట్రలను ఖైదీల, విశాల ప్రజా రాశుల ప్రతిఘటనా పోరాటాల ద్వారానే ఓడించాలి. ఈ వ్యవస్థను కూకటివేళ్లతో పెళ్లగించకుండా ఇలాంటి కారావాసాలను శాశ్వతంగా రద్దు చేయలేం.

కామ్రేడ్ తాపస్ చూపిన మార్గంలో, సాదా జీవితాన్ని, ఉన్నత భావాలను అలవరుచుకోవడం ద్వారానే విప్లవకారులు పీడిత ప్రజలకు చేరువవుతారు. వారు సంఘటితం కావడం ద్వారా మహత్తర భారత నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతమవుతుంది. కామ్రేడ్ తాపస్ మన యావత్తు కమ్యూనిస్టు విప్లవకారులకు, సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక శక్తులకు ప్రేరణగా నిలుస్తాడు. ఆయన అందించిన ప్రేరణతో విప్లవకారులు సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని, రివిజనిజాన్ని అన్ని రకాల అభివృద్ధినిరోధకులను కూకటివేళ్లతో పెకలిస్తారు. ★

**దోపిడీవర్గాల చావు కోడి ఈక కన్న హీనం**
**పీడిత ప్రజల కోసం ప్రాణాలివ్వడం హిమాలయాల కన్నా ఉన్నతమైనది- మావో**

# కామ్రేడ్ లాల్‌దేవ్ (నకుల్)కు ఎర్రెర్రదండాలు

కామ్రేడ్ నకుల్ 1972లో ఉత్తర బిహార్ రాష్ట్రం, దర్భాంగా జిల్లా, బెహడీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాల్‌పూర్ శివారాం గ్రామంలో నిరుపేద కుటుంబంలో తండ్రి సుఖ్‌దేవ్, తల్లి సంజోగి దేవిలకు జన్మించాడు. కామ్రేడ్ నకుల్ తండ్రి విద్యావంతుడే కాక వైద్య ఉద్యోగిగా పనిచేశాడు. తల్లి తన చిన్నతనంలోనే మరణించింది. కామ్రేడ్ నకుల్‌కు ఐదుగురు అన్నలు, ఇద్దరు చెల్లెళ్లలో తాను 5వ సంతానం. ఇంటర్ వరకు చదువుకున్నాడు.

కామ్రేడ్ నకుల్ చిన్నప్పుడే బిహార్‌లోని భూస్వామ్య అణచివేతకగురికావడంతో, 1994లో జరిగిన భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు ప్రభావితుడైనాడు. అతని కార్యకలాపాలను గమనిస్తున్న భూమాఫియాలు, భూస్వాములు, విప్లవ ప్రతీఘాతకులు పోలీస్ ఇన్‌ఫార్మర్ల ద్వారా కామ్రేడ్ నకుల్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించినా ఫుల్‌టైం కార్యకర్తల రక్షణలో గెరిల్లా దళాల నిర్మాణం చేయడానికి నిర్ణయించుకొని దళాలను నిర్మించి విస్తరించడమే కాక, వేరు-వేరు ప్రాంతాల్లో గెరిల్లా దళాల నిర్మాణం కూడా జరిగింది.

కామ్రేడ్ నకుల్ వివిధ ప్రాంతాలకు వెళ్లి పార్టీ కార్యక్రమాన్ని, ఆందోళనను ముందుకు తీసుకపోయే బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకొని కొన్ని గ్రామాల్లో క్రాంతికారి కిసాన్ కమిటీలు, గ్రామరక్షక దళాలు, మహిళా సంఘాలు, బాలల స్వయం సేవక దళాలను నిర్మించి, వాటిలో నుండే పార్టీ సెల్స్‌ను నిర్మించడంలో, సెల్స్ నుండి ఏరియా కమిటీలు, సబ్‌జోనల్ కమిటీల నిర్మాణం చేయడంలో కామ్రేడ్ నకుల్ ప్రధాన పాత్ర పోషించాడు. దర్భాంగ నుండి పూర్వి చంపారణ్ వరకు విప్లవ కారిడార్ నిర్మించి దళాలు నడిపించడానికి తాను ఎంతగానో కృషి చేశాడు. ఈ క్రమంలో పార్టీ ద్వారా ఎన్నో మిలటరీ శిక్షణల్లో భాగమైనాడు. కామ్రేడ్ నకుల్ ఉత్తరప్రదేశ్‌లోని బలియా వెళ్లి పనిచేయడమే కాక సాయుధ పోరాటాన్ని విస్తరించడానికి ముఖ్యపాత్ర వహించాడు. ఈ క్రమంలోనే ఉత్తర బిహార్ జోనల్ కమిటీ నిర్మాణమైంది. ఇందులో అతను సభ్యుడైనాడు. 2002 తర్వాత ఉత్తర బిహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఒక విశాల ప్రాంతంలో త్రీ-యు స్పెషల్ ఏరియా కమిటీని నిర్మించడానికి ప్లాన్ జరిగింది.

2002లో కామ్రేడ్ నకుల్ కులాంతర వివాహం చేసుకున్నాడు.

2004 సెప్టెంబర్ 21న సీపీఐ (ఎమ్ఎల్) పీపుల్స్‌వార్, ఎమ్‌సీసీఐ విలీనమై సీపీఐ (మావోయిస్టు) ఏర్పడింది. సీపీఐ (మావోయిస్టు) నాయకత్వంలో పార్టీ, పీఎల్‌జీఏ నిర్మాణమైనాయి. దీంతోపాటే వివిధ ప్రజాసంఘాల నిర్మాణం, పున:నిర్మాణం జరిగింది. అలాగే త్రీ-యు స్పెషల్ ఏరియా కమిటీ నిర్మాణమైంది. ఆ కమిటీలో కామ్రేడ్ నకుల్ ముఖ్యమైన సభ్యుడుగా ఉన్నాడు.

ఉత్తర బిహార్ భూమిపై సీపీఐ (మావోయిస్టు) నాయకత్వంలో కామ్రేడ్ నకుల్ ఎన్నో మిలటరీ చర్యల్లో ఉత్సాహంగా 2005 జూన్ 25న 'మధుబన్ ధమాకా' దాని తర్వాత జరిగిన మిలటరీ చర్యల్లో పాల్గొన్నాడు. కామ్రేడ్ నకుల్ త్రీయూ సాక్ (స్పెషల్ ఏరియా కమిటీ) నాయకత్వంలో ఉత్తర బిహార్‌లో వివిధ జిల్లాల్లో, పూర్వి ఉత్తరప్రదేశ్‌లోని బలియా-మాఊ-గాజీపూర్ ప్రాంతాల్లో విప్లవోద్యమాన్ని, సాయుధ వ్యవసాయ విప్లవోద్యమాన్ని ప్రతిఘటన పోరాటంగా మలిచాడు కామ్రేడ్ నకుల్.

2009లో కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ వలన ఈఆర్‌బీలో ఎంతోమంది విలువైన కామ్రేడ్స్ అరెస్టు కాగా, మిగిలిన స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుల్లో తలెత్తిన అంతర్గత వైరుధ్యాలను పరిష్కరించడానికి విశ్వాస పాత్రంగా కృషి చేశాడు కామ్రేడ్ నకుల్. అలాగే తమ దాంపత్య జీవితంలో ఎదురైన సమస్యలను పక్కనపెట్టి విప్లవోద్యమాన్నే అంటిపెట్టుకొన్నాడు. కమిటీ పనివిధానానికి ఆటంకంగా ఉన్న కామ్రేడ్స్‌ను పక్కనపెట్టి విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకపోవడానికి కృషి చేశాడు. విప్లవం పేరుతో ఆయుధాలను దొంగచాటుగా సరఫరా చేయడం, దళంలో ముఖ్యపాత్ర పోషించే కమాండర్లు శత్రువు చేతి ఎంగిలిమెతుకులు తినే చర్యలను చూసి అతని బాధ రెట్టింపై కేంద్ర కమిటీ మార్గదర్శకత్వంలో ధైర్యంగా కమిటీ పనివిధానాన్ని చక్కదిద్దడం కోసం, అమరత్వ ఫలాలను రక్షించడం కోసం ప్రతీ సందర్భాన్ని ఉపయోగించుకోవడానికి కామ్రేడ్ నకుల్ తీవ్రమైన ప్రయత్నాలు చేసాడు. 2011లో కామ్రేడ్ నకుల్ అరెస్టై జైలులో కూడా అతను జైలు పోరాటాలకు నాయకత్వం వహించి పార్టీకి గౌరవాన్ని తీసుకొచ్చాడు. 2014లో జైలు నుండి విడుదలైన వెంటనే సాయుధపోరాటంలో భాగమైనాడు. కామ్రేడ్ నకుల్ అరెస్టుతో దెబ్బతిన్న స్పెషల్ ఏరియా కమిటీని ఈఆర్‌బీ 2018లో నలుగురితో బిహార్ రీజినల్ అడ్‌హాక్ కమిటీగా పున:నిర్మించడం జరిగింది. అడ్‌హాక్ కమిటీ నుండి ఇద్దరు సభ్యులతో కూడిన ఒక దళం పశ్చిమ చంపారన్ అడవి ప్రాంతంలో పని ప్రారంభించింది. కానీ ఆ దళానికి అనుకోని ఒక దెబ్బ తగిలింది.

బిహార్ రాష్ట్రం, పశ్చిమ చంపారన్ జిల్లా, లౌకిరియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాల్మీకీనగర్ (చౌంతిపానీ) అడవిలో 2020 జూలై 10న దళం నిద్రలో ఉండగా ఒక నమ్మకద్రోహి కోవర్టు ద్వారా కుండపోత వర్షంలో శత్రువు మకాంను చుట్టుముట్టి ఎలాంటి హెచ్చరికలు లేకుండా గుండ్లవర్షం కురిపించాడు. ఆ కాల్పుల్లో శత్రువుతో హోరాహోరీగా పోరాడుతూ కామ్రేడ్స్ నకుల్, కిరణ్, విపుల్, సోనులు వీరమరణం పొందారు. మిగతా 6గురు కామ్రేడ్స్ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ రిట్రీటైనారు. ఈ ఘటనలో ఎస్ఎస్‌బీ కమాండర్‌తో సహా ఇంకా ఇద్దరు పోలీసులు గాయపడ్డారు.

కామ్రేడ్ నకుల్ సాహసికుడు, కష్టజీవి, నిజాయితీపరుడు, కలుపుగోలు మనిషి, విశ్వాసపాత్రుడు, ప్రతిభాశాలి, ఉన్నత చైతన్యవంతుడు, ఉన్నతాదర్శాలు గల కమ్యూనిస్టు.

## మధ్య రీజినల్ అమరులు

# పారెవా (మర్దిన్‌టోల)లో అసువుల బాసిన అమర వీరులు

2021 నవంబర్ 13న గడ్‌చిరోలీ జిల్లా గ్యారపత్తి-కొడుగుల్ పోలీస్ స్టేషన్‌ల మధ్య మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులలో గల పారెవా గ్రామ అడవిలో సీ-60 కమాండోలకు, పీఎల్‌జీఏ బలగాలకు మధ్య 10 గంటల పాటు జరిగిన ఎదురుకాల్పుల్లో వీరోచితంగా పోరాడుతూ 27 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వారందరికి వినమ్రంగా విప్లవజోహార్లర్పిద్దాం.

1. కామ్రేడ్ మిలింద్ బాబురావ్ తేల్‌తుంబ్డే (దీపక్, ప్రవీణ్) 57 ఏళ్లు. సీసీఎమ్, ఎమ్ఎమ్‌సీ జోన్ కార్యదర్శి. మహారాష్ట్ర రాష్ట్రం, యవత్‌మాల్ జిల్లా, వణీ పోలీస్టేషన్ పరిధి, రాజూరా గ్రామంలో ఒక పేద కుటుంబంలో జన్మించాడు.

2. కామ్రేడ్ సుఖ్‌లాల్ (రాంసాయి పర్సా) 35 ఏళ్లు. ఉత్తర గడ్‌చిరోలీ డివిజన్ కార్యదర్శి. గడ్‌చిరోలీ జిల్లా, ధనోరా తాలుకా, కోస్మీ గ్రామంలో 1986లో జన్మించాడు. తల్లి మెహరీబాయి. పార్టీ సభ్యురాలుగా కె.ఎ.ఎమ్.ఎస్.లో పనిచేసింది. తండ్రి బిస్రామ్. కామ్రేడ్ సుఖ్‌లాల్‌కు ఒక అన్న, అక్క, తమ్ముడు వున్నారు. వాళ్లది పేద రైతు కుటుంబం. ఆయన 8వ తరగతి వరకు చదువుకున్నాడు. గడ్‌చిరోలీ ఉద్యమంలో కోస్మీ గ్రామం నుండి రిక్రూట్ అయిన వారిలో యిప్పటికి 8 మంది అమరులు అయ్యారు.

సుఖ్‌లాల్ 2001 నుండి 2006 వరకు మిలీషియాలో పని చేసి 2003లో పార్టీ సభ్యుడయ్యాడు. 2006లో పార్టీలోకి భర్తీ అయి 2007 నుండి 2009 వరకు తిప్పాగఢ్ ప్రాంతంలోని 15వ పీ.ఎల్‌లో పని చేసాడు. దండకారణ్య కమ్యూనికేషన్ టీంలో కొంతకాలం ఉండి పని నేర్చుకున్నాడు. ఆ తరువాత 2010-12 మధ్య మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ చేపట్టిన విదర్భ పర్‌స్పెక్టివ్‌లో భాగంగా కామ్రేడ్ సుఖ్‌లాల్ ఆ కమిటీ నేతృత్వంలో ఉద్యమ విస్తరణ బాధ్యతలు చేపట్టాడు. 2012 జూలైలో 4వ కంపెనీకి బదిలీ అయ్యాడు. 2015 నుండి 2019 వరకు సాత్‌గావ్ ఏసీ సెక్రటరీగా వున్నాడు. 2016 ప్లీనంలో ఉత్తర గడ్‌చిరోలీ డివిజన్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2019 నుండి కోర్చి ఏసి ఇన్‌ఛార్జి డివిసిఎమ్‌గా వున్నాడు. 2020 సెప్టెంబర్‌లో జరిగిన దండకారణ్య ప్లీనానికి ప్రతినిధిగా హాజరై అక్కడ ప్లీనం నిర్వహణకై ఎంపికైన అధ్యక్షవర్గంలో ఒక సభ్యుడిగా ఎన్నికైనాడు. 2021 మార్చ్‌లో జరిగిన ఖోబ్రామెండ పోలీసు కాల్పులలో అసువులు బాసిన ఎస్‌జడ్‌సీ మెంబర్, డివిజన్ సెక్రటరీ కామ్రేడ్ పవన్ స్థానంలో 2021 ఆగస్టులో డివిజనల్ కమిటీ సెక్రటరీగా ఎన్నికయ్యాడు.

కామ్రేడ్ సుఖ్‌లాల్ తన సుదీర్ఘ విప్లవ జీవితంలో ప్రజలతో అత్యంత సన్నిహితంగా కలిసిపోయి వారి విశ్వాసాన్ని పొందాడు. కేడర్‌తోనూ కలిసిపోయి వారికి విశ్వసనీయమైన నాయకుడిగా కొనసాగాడు. జిల్లాలో ముందుకు వచ్చిన గ్రామసభల నిర్మాణం, విస్థాపన వ్యతిరేక ప్రజా ఆందోళన తదితర ప్రజా ఉద్యమాలలో భాగంగా అన్ని సెక్షన్ల ప్రజల్ని సంఘటితం చేసే కృషి కొనసాగించాడు. నిర్మాణ మిలటరీ కర్తవ్యాలనూ సమన్వయంతో నడిపిస్తూ మంచి అనుభవాన్ని గడిస్తున్న యువకుడు మన కామ్రేడ్ సుఖ్‌లాల్. పశ్చిం సబ్ జోనల్ బ్యూరో నిర్వహించిన నాయకత్వ శిక్షణా తరగతుల ప్రారంభం 2014 నుండి పాల్గొన్న విద్యార్థిగా ఆయన వరుసగా 2021 వరకు 8 సార్లు పాల్గొన్నాడు.

కామ్రేడ్ సుఖ్‌లాల్ సైనిక రంగంలోనూ మంచి అనుభవాన్ని సంపాదించాడు. ఆయన సబ్‌జోన్‌లో పీఎల్‌జీఏ నిర్వహించిన దాదాపు 19 ఆంబుష్‌లలో పాల్గొన్నాడు. కామ్రేడ్ సుఖ్‌లాల్ వాళ్ల మకాంపై సుమారు 22 పర్యాయాలు పోలీసుల ఫైరింగ్స్ జరిగాయి. ప్రతి ఎదురుకాల్పుల ఘటనలో కామ్రేడ్ సుఖ్‌లాల్ చొరవాగా ప్రతిఘటించాడు. డివిజన్‌లో 2019 జూన్ నుండి 2020 జనవరి వరకు ముగ్గురు ఏసీ కార్యదర్శులు, పలువురు ఏసీ మెంబర్లు డీవీసీ సభ్యులు బలహీనపడి ఉద్యమం నుండి దిగజారిపోయినప్పటికీ కామ్రేడ్ సుఖ్‌లాల్ వారి అనుభవాల నుండి రాటుదేలి దృఢంగా విప్లవోద్యమంలో నిలిచాడు.

2021 నుండి కొత్తగా సీ 60 కమాండోలు అనుసరిస్తున్న చుట్టివేసి మట్టుబెట్టే నాలుగు దాడులను కామ్రేడ్ సుఖ్‌లాల్ ఎదుర్కొన్నాడు. ప్రతి సందర్భంలో శత్రువు పై వీరోచితంగా పోరాడుతూ, తోటి కామ్రేడ్స్‌ను రక్షిస్తూ శత్రు చుట్టివేతను గండి కొట్టుకొని బయటపడే ఎత్తుగడను అవలంబించడంలో కొత్త అనుభవాన్ని సంపాదించి గెరిల్లాల విశ్వాసాన్ని చూరగొన్నాడు. చివరిసారిగా, పారెవా ఘటనలో అమరుడయ్యే సందర్భంగా కూడా తాను గాయపడేవరకు వీరోచితంగా ప్రతిఘటిస్తూ నాయకత్వాన్ని రక్షించడానికి శతవిధాలా ప్రయత్నించాడు. తుదకు, ఇక తను బ్రతుకననే అంచనాకు వచ్చాక తన తుపాకీ, తూటాలు సోదర గెరిల్లాలకు యిచ్చి సీసీ కామ్రేడ్ దీపక్ దాదని పోలీసు వలయం నుండి బయటపడేయాలనీ, ఆయన్ని రక్షించాలని కోరాడు. కానీ, ఆయన చివరి కోరిక నేరవేరలేదు. ఆ కాల్పులలో గాయపడిన కామ్రేడ్ సుఖ్‌లాల్ వీరమరణం పొందాడు. ఆయన పార్థివ శరీరం రెండు రోజుల తరువాత పోలీసులకు దొరికింది.

ప్రజలతో సజీవ, ఆత్మీయ సంబంధాలు కలిగి, ఆర్గనైజేషన్ పరంగా, మిలటరీ పరంగా అపార అనుభవం గడించిన కామ్రేడ్ సుఖ్‌లాల్ అమరత్వం గడ్‌చిరోలీ విప్లవోద్యమానికి ప్రస్తుత తరుణంలో పెద్ద నష్టం. కామ్రేడ్ సుఖ్‌లాల్ అమర్ రహే.

3. కామ్రేడ్ మహేష్ (శివాజీ రావ్‌జీ గోటా)కు 36ఏళ్లు. ఉత్తర్ గడ్‌చిరోలీ డివిజన్ కమాండర్ ఇన్-ఛీఫ్‌గా ఉద్యమ బాధ్యతలు నిర్వహించిన కామ్రేడ్ మహేశ్ గఢ్‌చిరోలి జిల్లా, ఏటపల్లి తాలూకా, కొటిమి పంచాయితీ, లిగిడిగుట్ట గ్రామంలో 1985లో జన్మించాడు. కామ్రేడ్ మహేశ్ తల్లి సీదో, తండ్రి రావ్‌జీ కాగా ఆయనకు ఒక అన్న, ముగ్గురు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్లు వున్నారు. కామ్రేడ్ మహేశ్ కసన్‌సూర్‌లో 8వ తరగతి వరకు చదువుకున్నాడు. 2008లో ఆయన పీఎల్‌జీఏలో భర్తీ అయ్యాడు. 2009లో పార్టీ సభ్యుడయ్యాడు. ఆయన చదువుకున్న యువకుడు

కావడంతో తొలుత గెరిల్లా డాక్టర్‌గా శిక్షణ పొందాడు. 2010లో జన మిలీషియా దళం కమాండర్‌గా వుండి యువతను పెద్ద సంఖ్యలో తర్ఫీదు చేశాడు. 2011లో ఏసీ సభ్యుడయ్యాడు. 2013లో కసంసూర్ ఎల్‌జీఎస్ కమాండర్ అయ్యాడు. 2015లో డివిజన్ యాక్షన్ టీంలోనూ, 2018లో సబ్‌జోన్ యాక్షన్ టీంలోనూ పని చేసాడు. 2018 అక్టోబర్‌లో డివిజన్ కమిటీలోకి కో–ఆప్ట్ అయ్యాడు. 2020లో సీనియర్ మహిళా కామ్రేడ్ సృజన అమరత్వంతో కసంసూర్ –సాత్‌గాం సంయుక్త ఏసీకి మహేశ్ ఏసీ సెక్రటరీగా వున్నాడు. ఎస్‌జడ్‌సీ నిర్వహించిన కమ్యూనికేషన్, స్నైపర్ ట్రైనింగ్‌లలో పాల్గొన్నాడు. ఆయన విద్యాబుద్ధులు తెలిసినవాడు కావడంతో రెగులర్‌గా పై కమిటీకి ఏరియా రిపోర్టులు పంపడం ఆయన ప్రత్యేకత. అలాగే కామ్రేడ్ సృజనకు అన్ని పనులలో చేదోడుగా ఉండేవాడు. బ్యూరో నిర్వహించిన నాయకత్వ శిక్షణా తరగతులకు 4 విడుతలు హాజరైనాడు. స్థానిక యువ కామ్రేడ్, విద్యార్థి రంగం నుండి ఉద్యమంలోకి రావడంతో ప్రజలతో, యువజన విద్యార్థులలో విస్తృతమైన సంబంధాలు ఉండేది. కామ్రేడ్ మహేశ్ ఏసీ సభ్యుడిగా ఇంటలిజెన్స్ బాధ్యతలు కూడ నిర్వహించాడు. ఆయన ఎవరితోనైనా చాలా చొరవగా కలిసి పోవటంలో ముందుండేవాడు. ప్రతి కామ్రేడ్‌తో ఓపికగా వ్యవహరించడం ఆయన విశిష్టత.

డివిజన్‌లో 2019 జూన్ నుండి 2020 జనవరి వరకు ముగ్గురు ఏసీ కార్యదర్శులు, పలువురు ఏసీ మెంబర్లు, డీవీసీ సభ్యులు బలహీనపడి ఉద్యమం నుండి దిగజారిపోయినప్పటికీ, అన్ని ఏరియాలలో పోలీసులు ఎడతెరిపి లేకుండా గాలింపు చర్యలు చేపడుతున్నప్పటికీ కామ్రేడ్ మహేశ్ ఆ అన్ని అనుభవాల నుండి రాటుదేలి దృఢంగా విప్లవోద్యమంలో నిలిచాడు.

మహేష్‌ని పట్టుకోడానికి శత్రువు చాలా ప్రయత్నించాడు. సుమారు 23 చిన్నా, మధ్యరకం సైనిక చర్యలలో మహేష్ పాల్గొన్నాడు. కామ్రేడ్ మహేశ్ ప్రత్యేక యాక్షన్ టీం నిర్వహించిన నాలుగు చర్యల్ని సఫలం చేసాడు. ఏటపల్లి తాలూకా కాంగ్రెస్ అధ్యక్షుడ్ని, ఏటపల్లి పంచాయితీ సమితి మాజీ అధ్యక్షుడిని మట్టుబెట్టిన చర్యలకు నాయకత్వం వహించాడు. డేరా పై ఫైరింగ్ జరిగిన 16 ఘటనల్లో శత్రు దాడిని తిప్పికొట్టడంలో ముందున్నాడు. 2021 మార్చ్ 29నాడు ఖోబ్రామెండలో కామ్రేడ్ మహేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. 2021 మేలో జరిగిన పైడి ఫైరింగ్‌లో ఆయన సహచరి కామ్రేడ్ సునీత అమరురాలయింది. ప్రజలతో, కేడర్‌లతో చొరవగా కలిసి పోతూ, శత్రువు పై దాడులు చేయడంలో ముందుండే కామ్రేడ్ మహేష్ అమరుడు కావటం గడ్చిరోలి ఉద్యమానికి పెద్ద నష్టం.

4. కామ్రేడ్ లోకేష్ (పొడియం జోగాల్)కు 35 ఏళ్లు. సీవైపీసీఎమ్, కంపెనీ–4 కమాండర్. బీజాపూర్ జిల్లా, ఊసూర్ తాలూకా, మండేల్ గ్రామంలో జన్మించాడు. తల్లి బొర్రి, తండ్రి పాండు. చిన్నప్పుడు జోగాల్ బాల సీఎన్ఎమ్ కమాండర్‌గా వున్నాడు. 2006లో పీఎల్‌జీఏలో భర్తీ అయ్యాడు. 2007లో గడ్‌చిరోలీకి బదిలీ అయ్యాడు. 2007 నుండి 4వ కంపెనీలో వుంటూ 2010 వరకు జరిగిన గొడ్డల్‌వాహి, మర్కనార్, మదన్‌వేడ, లాహెరీ వంటి అన్ని పెద్ద సైనిక చర్యల్లో పాల్గొన్నాడు. కంపెనీ నుండి చాకచక్యంగా స్కౌట్ బాధ్యతలు నిర్వహించటంలో మంచి అనుభవం సంపాదించాడు. 2015 వరకు 4వ కంపెనీలో వుండి ఉద్యమ అవసరాల రీత్యా15వ ప్లాటూన్‌కి కమాండర్‌గా, సెక్రటరీగా బదిలీ అయ్యాడు. తరువాత 2019లో గణనీయమైన సంఖ్యలో ఏసీ, పీపీసీ, డీవీసీ, సీవైపీసీఎంలు బలహీనపడి దిగజారిపోయిన నేపథ్యంలో కామ్రేడ్ లోకేష్ మళ్లీ బదిలీ అయ్యి 4వ కంపెనీకి కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. ప్రజలతో నమ్రతగా వ్యవహరించేవాడు. తొలి నుండి మిలటరీ రంగంలోనే పని చేయడంతో మంచి సైనికి అనుభవాన్ని గడించాడు. ఎక్కువ కాలం తిప్పాగఢ్ ప్రాంతంలోనే ఉండడంతో ఆయనకు అక్కడి టెర్రయిన్ పై మంచి పట్టు వుండేది. తొందరగా స్థానిక భాష నేర్చుకున్నాడు. 2013లో జరిగిన ఖోబ్రామెండ ఎదురుకాల్పులలో గాయపడ్డాడు. ఎన్నో గెరిల్లా దాడుల్లో వీరోచితంగా పోరాడుతూ శత్రు దాడుల్ని తిప్పికొట్టాడు. తుదకు పారేవాలో టోటల్ కమాండర్‌గా వ్యవహరిస్తూ చివరి వరకూ నాయకత్వాన్ని కాపాడడానికి కమాండోలను ప్రతిఘటిస్తూ వారి కాల్పులలో గాయపడి అసువులు బాసాడు. కామ్రేడ్ లోకేష్ అమర్ రహే.

5. కామ్రేడ్ ధర్ము (కల్ము మంగు) సీవైపీసీఎమ్, కంపెనీ–4. బీజాపూర్ జిల్లా, గంగలూర్ ఏరియా, అండ్రి ఆర్‌పీసీ, మదుమ్ గ్రామంలో జన్మించాడు. తల్లి పాయికి, తండ్రి లక్కు. 8 మంది సంతానంలో ధర్ము మూడవవాడు. కామ్రేడ్ ధర్ము 16 ఏళ్ల వయసులోనే పీఎల్‌జీఏలో భర్తీ అయ్యాడు. 2007లో పార్టీ సభ్యుడయ్యాడు. ఒక సంవత్సరం విద్యార్థి రంగంలో పని చేశాడు. తరువాత పశ్చిం బస్తర్ డివిజన్ స్టాఫ్‌లోకి బదిలీ అయ్యాడు. 2008లో గార్డు బాధ్యతలు స్వీకరించాడు. 2009లో గడ్చిరోలీలో జరిగిన ముగ్నేర్, గొడల్‌వాహీ, మర్కనార్, హథీగోటా, మదన్‌వేడా, కొర్‌కోటీ, లాహెరీ వంటి అన్ని సఫల సైనిక దాడులలో పాల్గొన్నాడు. 2010లో 10వ కంపెనీకి బదిలీ అయ్యాడు. 2011లో పీపీసీ సభ్యుడయ్యాడు. 2011 వరకు ఎస్‌జెడ్‌సీఎమ్‌కు గార్డుగా వుండి తరువాత 2012లో 4వ కంపెనీకి బదిలీ అయ్యాడు. డేరా మీద జరిగిన పోలీస దాడుల్ని ధైర్యంగా ప్రతిఘటించేవాడు. నాయకత్వ ప్రొటెక్షన్ బాధ్యతలు సహా ఎక్కడ ఏ పని వున్నా, ప్రతిఘటన క్యాంపెయిన్స్‌లో నైనా కామ్రేడ్ ధర్మూ చాలా నమ్మకంగా ఉండేవాడు. ప్రజలతో ముఖ్యంగా యువతతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. కోర్చి నుండి గట్ట వరకు ఏరియా పైనా మంచి పట్టు ఉండేది. 2021 సెప్టెంబర్‌లో జరిగిన కంపెనీ ప్లీనంలో సీవైపీసీఎంగా ఎన్నుక అయ్యాడు.. కామ్రేడ్ ధర్ము అమర్ రహే. కామ్రేడ్ ధర్మూ తమ్ముడు పీఎల్‌జీఏలో చేరి ఏఓబీకి వెళ్లే క్రమంలో జరిగిన ఎదురు కాల్పులలో అమరుడు అయ్యాడు.

6. కామ్రేడ్ ఉర్సా రమ్లా (అరుణ్)కు 26 ఏళ్లు. ఉత్తర్ గఢ్‌చిరోలి ప్రత్యామ్నాయ డివిజన్ కమిటీ సభ్యుడు. బీజాపూర్ జిల్లా, భైరంగఢ్ ఏరియా, జప్పూర్ ఆర్‌పీసీ, పమ్రా గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. తల్లి పాండే, తండ్రి సుక్కు. కామ్రేడ్


కామ్రేడ్ సుఖ్‌లాల్


కామ్రేడ్ మహేష్


కామ్రేడ్ లోకేష్


కామ్రేడ్ ధర్ము


కామ్రేడ్ దిలీప్


కామ్రేడ్ అరుణ్


కామ్రేడ్ సన్ను


కామ్రేడ్ చేతన్


కామ్రేడ్ కిసన్


కామ్రేడ్ హిడ్మే


కామ్రేడ్ రిమన్


కామ్రేడ్ బండు


కామ్రేడ్ ప్రకాష్


కామ్రేడ్ సావన్


కామ్రేడ్ యోగిత


కామ్రేడ్ సంజు


కామ్రేడ్ శాంతి


కామ్రేడ్ సంతిల


కామ్రేడ్ సాయినాథ్


కామ్రేడ్ రంజు


కామ్రేడ్ లచ్చు


కామ్రేడ్ సూరజ్

కామ్రేడ్ భగత్, కామ్రేడ్ మూయే, కామ్రేడ్ మోటు, కామ్రేడ్ శ్రీను ల ఫోటోలు అందుబాటులో లేకపోవడంతో ఇక్కడప్రచురించలేక పోతున్నాం.

-సం॥మం॥.

రమ్లూకు ఒక అన్న, ఒక తమ్ముడు, చెల్లీ వున్నారు. 3వ తరగతి వరకు చదివాడు. మొదట బాలల సీఎన్ఎమ్‌లో, తరువాత ఏరియా సీఎన్ఎమ్‌లో సాంస్కృతిక కార్యకర్తగా పని చేశాడు. గ్రామ మిలీషియాలో వుంటూ 2011లో పీఎల్‌జీఏలోకి భర్తీ అయ్యాడు. 2012లో ఎస్‌జెడ్‌సీఎమ్‌కు గార్డుగా బదిలీ అయ్యాడు. గార్డుగా తన బాధ్యతల్ని ఎంతో శ్రద్ధగా చేసాడు. 2015లో బీసీటీఎస్‌లో విద్యార్థిగా పాల్గొన్నాడు. జోన్‌లో జరిగిన స్నైపర్ ట్రైనింగ్‌లో కూడ పాల్గొన్నాడు. 2017లో పిపిసి సభ్యుడుగా ఎదిగాడు. 2019 ఆఖరిలో గడ్‌చిరోలీకి బదిలీ అయ్యాడు. 2020 మధ్య నుండి కసంసూర్-సాత్‌గాం సంయుక్త ఏసీలో డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ప్రారంభం నుండి బాధ్యులకు రక్షణ బాధ్యతలు నెరవేరుస్తూ వచ్చిన కామ్రేడ్ రమ్లూ అనతి కాలంలోనే ఆర్గనైజేషన్ పనులు చేస్తూ చొరవతో నేర్చుకున్నాడు. తొందరగా స్థానిక భాష నేర్చుకున్నాడు. ప్రజలతో మమేకమవడంలో ఆయన ఆదర్శవంతుడు. గడ్‌చిరోలీకి వెళ్లిన తక్కువ సమయంలోనే అక్కడ సోదర కామ్రేడ్స్ విశ్వాసాన్ని పొందాడు. 2021మార్చ్‌లో జరిగిన ఖోబ్రమెండా ఫైరింగ్‌లో గాయపడ్డాడు. పైడి ఫైరింగ్‌లో అరుణ్ సహచరి కామ్రేడ్ రజనీ అమరురాలయ్యింది. ఇవేవీ ఆయన విప్లవ దృఢత్వాన్ని నీరుకార్చలేదు. 2021 సెప్టెంబర్‌లో జరిగిన డివిజన్ ప్లీనంలో కామ్రేడ్ రమ్లూ ఆల్టరనేట్ డీవీసీఎమ్‌గా ఎన్నికయ్యాడు. గడ్‌చిరోలీలో కార్పెట్ సెక్యూరిటీ మధ్య నిత్యం పోలీసు గాలింపుల మధ్య ధైర్యంగా నిలబడి పని చేయడమే కాకుండా ఏ చిన్న అవకాశం దొరికినా అపర్చునిటీ ఆంబుష్‌లకు ఎంగేజ్ అయ్యే టీంలలో నమ్మకమైన సభ్యుడిగా ఉండేవాడు. కామ్రేడ్ అరుణ్ అమర్ రహే.

7. కామ్రేడ్ సన్ను (కోవాసి జోగాల్) ఉత్తర గడ్‌చిరోలీ ఆల్టర్‌నేట్ డివిజన్ కమిటీ సభ్యుడు. బీజాపూర్ జిల్లా, మోరోడ్‌బాక పంచాయితీ, పామేడ్ ఏరియా, గుండీడ్‌గూడెం గ్రామంలోని పేద రైతు కుటుంబంలో జన్మించాడు. ఆయన తల్లి భీమే, తండ్రి ఉంగాల్ కాగా ఆయనకు ముగ్గురు అక్కలు, ఒక అన్న, ఒక తమ్ముడు ఉన్నారు. గ్రామ, పంచాయితీ సీఎన్ఎమ్‌లలో పని చేసాడు. 2006లో పీఎల్‌జీఏలో భర్తీ అయ్యాడు. 2007లో గడ్‌చిరోలీకి బదిలీ అయ్యి 4వ కంపెనీలో పని చేసాడు. 4వ కంపెనీ చేసిన అన్ని సైనిక చర్యల్లో పాల్గొన్నాడు. చాలా నేర్పుగా స్కౌట్ పని చేసాడు. 2010లో పీపీసీ సభ్యుడు అయ్యాడు. 3 సంవత్సరాలు ఇన్‌స్ట్రక్టర్ టీం బాధ్యునిగా పని చేసాడు. 2013లో కసంసూర్ ఏసీలోకి బదిలీ అయ్యి ఏరియా జనతన సర్కార్ రక్షణ విభాగాన్ని చూసాడు. తరువాత కసంసూర్-సాత్‌గాం సంయుక్త ఏసీకి కమాండర్‌గా వుండి నడిపించాడు. కసంసూర్ ఏరియా ప్రజలతో తాదాత్మ్యం చెందాడు. కామ్రేడ్ సన్నూ విశ్వసనీయమైన మంచి ఫైటర్. 2021మార్చ్‌లో జరిగిన ఖోబ్రమెండా దాడిలో గాయపడ్డాడు. మూడుసార్లు చుట్టుముట్టి మట్టుబెట్టే దాడుల్లో ప్రతిఘటించాడు. కానీ, తుదకు పారేవాలో పోలీసు వలయాల నుండి బయటపడలేక పోయి వీరమరణం పొందాడు. కామ్రేడ్ సన్ను అమర్ రహే.

8. కామ్రేడ్ దిలీప్. (నవులూరాం తులావి)కు 33 ఏళ్లు. సీవైపీసీఎమ్, కంపెనీ-4. గఢ్‌చిరోలి జిల్లా, ధనోరా తాలూకా, గజమెండీ గ్రామంలో పేద రైతు కుటుంబం జన్మించాడు. తండ్రి హీరూరాం. 2006లో పీఎల్‌జీఏలోభర్తీ అయ్యాడు. టిప్రాగడ్, చాత్‌గాం ఏరియాలలో పని చేసాడు. 2007-09 వరకు టీడీలో పని చేసాడు. 2009 ఆఖరిలో 4వ కంపెనీలోకి బదిలీ అయ్యాడు. 2011లో పీపీసీ సభ్యునిగా, సెక్షన్ కమాండర్‌గా ఎదిగాడు. 2013లో విస్ఫోటక పదార్థం పేలుడులో ఒళ్లు చాలా వరకు కాలింది. 4వ కంపెనీ చేసిన అన్ని పెద్ద దాడుల్లో వున్నాడు. ఏరియా పై, ప్రజల పై మంచి పట్టు వుంది. 2021లో జరిగిన 4వ కంపెనీ ప్లీనంలో సీవైపీసీ సభ్యునిగా ఎన్నికయ్యాడు. మంచి డాక్టర్, గ్రినేడియర్, ఎల్ఎమ్‌జి మేన్, స్నైపర్, మోర్టార్‌ని ఉపయోగించే వాడు. 2018లో దిలీప్ సహచరి కామ్రేడ్ బబిత పోలీసు కాల్పులలో అమరురాలైంది. 2021లో మురుచుల్ దాడిలో తన మలి సహచరి కామ్రేడ్ రణిత కూడా అమరురాలైంది. ఎన్ని సమస్యలు వచ్చినా చివరి వరకు ప్రజలని అంటిపెట్టుకుని వున్నాడు. పార్టీకి అత్యంత విశ్వసనీయమైన కామ్రేడ:లలో ఇకరు. కామ్రేడ్ దిలీప్ అమర్ రహే.

9. కామ్రేడ్ పద్దా కల్లూ (చేతన్) ఏసీఎమ్, టిప్రాగఢ్ ఎల్‌జీఎస్ దళం కమాండర్. బీజాపూర్ జిల్లా, గంగలూర్ ఏరియా, పరాల్‌నార్ గ్రామంలో జన్మించాడు. తండ్రి అయితూ. ఒక అన్న, ఒక చెల్లి వున్నారు. మధ్య తరగతి కుటుంబం. చేతన్ మేనత్త కామ్రేడ్ శాంతి కసనూర్ ఫైరింగ్‌లో అమరురాలైంది. తండ్రి పార్టీ పని చేస్తూ అరెస్టు అయ్యి జైలుకి వెళ్లి వచ్చాడు. చెల్లి జైలులో వుంది. విప్లవకర కుటుంబం నుండి వచ్చాడు. సల్వాజుడుం సమయంలో కుటుంబం చాలా బాధలు పడి, కొంత కాలం ఆంధ్రా కి వెళ్లి కూలి పనులు చేసి వచ్చారు. చేతన్ గుండాధూర్ స్కూల్‌లో 5వ తరగతి వరకు చదివాడు. 2013లో బిసిటిఎస్ విద్యార్థి. తరువాత 2014లో పార్టీలో భర్తీ అయ్యాడు. సిసి కామ్రేడ్ టీంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసాడు. ఆ పనిలో మంచి అనుభవం సంపాదించాడు. 2019లో గఢ్‌చిరోలికి బదిలీ అయ్యాడు. ఉత్తర గఢ్‌చిరోలిలో విద్యార్థి ఆర్గనైజర్‌గా పని చేసాడు. 2020లో ఏసిఎమ్ అయ్యి, 2021 జూలైలో ఎల్‌జిఎస్ కమాండర్ అయ్యాడు. తక్కువ సమయంలోనే అక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని, తీవ్ర నిర్బంధంలో సైతం ప్రజలని కలిసి, అప్పగించిన పనులను నెరవేర్చేవాడు. కామ్రేడ్ చేతన్ అమర్ రహే.

10. కామ్రేడ్ సోను కొర్రాం (జైమన్, కిసాన్) 30 ఏళ్లు. ఏసీఎమ్, కోర్చి ఎల్‌జీఎస్ కమాండర్. కొండగాం జిల్లా, మర్దపాల్ తాసిల్, కిల్లెం రాజుపారలో జన్మించాడు. తండ్రి రాజు కొర్రం. అక్క, తమ్ముడు, చెల్లి వున్నారు. మధ్యతరగతి కుటుంబం. 2007లో భర్తీ అయ్యాడు. పూర్వబస్తర్ జిల్లాలో డివిజన్ యాక్షన్ టీం సభ్యుడిగా, తరువాత కమాండర్‌గా పని చేసాడు. 2009లో ఏసి సభ్యుడిగా ఎదిగాడు. 2015లో బదిలీ అయ్యి ఉత్తర గఢ్‌చిరోలిలోని కోర్చి ఏరియాలో ఎల్‌జిఎస్ డిప్యూటీగా పనిచేసాడు. 2019లో ఎల్‌జిఎస్ కమాండర్ అయ్యాడు. నిదానంగా, బ్యాలన్స్‌గా వుండేవాడు. శత్రు దాడి చూసి ఎప్పుడూ వెనక్కి తగ్గింది లేదు. మొత్తంగా చిన్నవి, పెద్దవి కలిపి 29 ఘటనలలో వుండి శత్రు దాడిని తిప్పికొట్టాడు. కామ్రేడ్ కిసాన్

అమర్ రహే.

11. కామ్రేడ్ పొడియాం హిడ్మే (ఏసీఎమ్). సుక్మా జిల్లా, కేర్లపాల్ ఏరియా, గొంగే గ్రామంలో జన్మించింది. ఇంట్లో బలవంతపు పెళ్లి చేస్తే అక్కడి నుండి పారిపోయి వచ్చింది. గ్రామంలో కెఎఎమ్ఎస్ అధ్యక్షురాలిగా పని చేసింది. 2010లో ఏరియా కెఎఎమ్ఎస్ అధ్యక్షురాలయ్యింది. గ్రామంలోనే పార్టీ సభ్యురాలు. గ్రామంలో వుండి పని చేసే క్రమంలో ఫైరింగ్స్‌లో, బిల్డింగ్‌లు పడగొట్టడంలో పాల్గొంది. 2013లో పార్టీలోకి భర్తీ అయ్యింది. 2021 మార్చిలో ఉత్తర గఢ్‌చిరోలి జిల్లాకి బదిలీ అయ్యింది. అక్కడి పరిస్థితులను అర్థం చేసుకుంటూ అన్ని పనులలో ముందుండేది. కామ్రేడ్ హిడ్మే అమర్ రహే.

12. కామ్రేడ్ ముచాకి కోసా (రిమన్) 25 ఏళ్లు. పిపిసిఎమ్, కంపెనీ-4 ఎల్ఎమ్‌జీ పర్సన్. బీజాపూర్ జిల్లా, పామేడ్ ఏరియా, కోమట్ పంచాయితీ, మల్లెం గ్రామంలో జన్మించాడు. తల్లి బుధ్రి, తండ్రి సుక్డా. 8 మంది సంతానంలో ఆఖరి వాడు. గ్రామ సిఎన్ఎమ్‌లో వున్నాడు. 2012 డిసెంబర్‌లో భర్తీ అయ్యాడు. 2015లో గఢ్‌చిరోలికి బదిలీ అయ్యాడు. 4వ కంపెనీలో ఎల్ఎమ్‌జీ పర్సన్‌గా వున్నాడు. మిలటరీపరంగా మంచి ఫైటర్. 3 చుట్టివేత దాడుల్లో వున్నాడు. ఒరిస్సాకి వెళ్లినప్పుడు ఆంబుష్‌లలో పాల్గొన్నాడు. టిడి పని కూడా నేర్చుకున్నాడు. 2021లో పిపిసి సభ్యుడయ్యాడు. కామ్రేడ్ రిమన్ అమర్ రహే.

13. కామ్రేడ్ ముచాకి మూయే (ఏసీఎమ్) 28 ఏళ్లు. సుక్మా జిల్లా, కొంట పోలీస్‌స్టేషన్, రేగడ్‌గట్ట గ్రామంలో జన్మించింది. మూయే గ్రామంలో కెఎఎమ్ఎస్‌లో పని చేసింది. 2006 సల్వాజుడుం సమయంలో మిలీషియా ప్లాటూన్‌లో పని చేసింది. 2005లో సంతలో పోలీసుల పై దాడి చేసి 2 ఎస్ఎల్ఆర్‌లు తెచ్చి, పోలీసుల్ని గాయపరిచిన ఘటనలో పాల్గొంది. 2008లో పార్టీలో భర్తీ అయ్యి ఏరియా కెఎఎమ్ఎస్‌లో పని చేసింది. 2014లో ఎల్‌జిఎస్‌లోకి బదిలీ అయ్యింది. 2020లో పిపిసి సభ్యురాలు అయ్యింది. 2021లో ఎమ్ఎమ్‌సికి బదిలీ అయ్యింది. ఎన్నో ఫైరింగ్‌లలో పాల్గొన్నది. బెజ్జి, బుర్కపాల్ దాడులల్లో పాల్గొన్నది. యుబిజిఎల్ వేయటంలో అనుభవం వున్నది. అందరితో మంచిగా కలిసి పోతూ, పార్టీ తనకి అప్పగించిన పనులను ఎంతో బాధ్యతగా నెరవేర్చేది. కామ్రేడ్ మూయే అమర్ రహే.

14. కామ్రేడ్ దల్సూ గోటా (బందు) 27 ఏళ్లు. పిపిసిఎమ్, యాక్షన్ టీం సభ్యుడు. గఢ్‌చిరోలీ జిల్లా, ఏటపల్లి తాహసీల్, గట్ట ఏరియా, గోర్‌గుట్టా గ్రామంలో జన్మించాడు. 2004లో భర్తీ అయ్యాడు. 2004లో యాక్షన్‌కి వెళ్లినప్పుడు అరెస్టు అయ్యి 3 సంవత్సరాలు జైలు జీవితం గడిపాడు. జైలు నుండి బయటికి వచ్చాక మళ్లీ పార్టీలోకి వచ్చాడు. సబ్ జోనల్ యాక్షన్ టీం సభ్యుడుగా వున్నాడు. ఏటపల్లిలో చేసిన పొలిటికల్ లీడర్ యాక్షన్‌లో, బాందే టౌన్‌లో ఎస్‌పిఒని చంపిన యాక్షన్‌లో వున్నాడు. 2019లో 15 మంది సి-60 కమాండోలని చంపిన దాడిలో స్కౌట్‌గా వున్నాడు. బందుకి స్కౌట్ పనిలో మంచి అనుభవం వుంది. 2019లో పిపిసి సభ్యుడయ్యాడు. సాదాసీదాగా వుంటూ, క్రమశిక్షణతో వుండేవాడు. కామ్రేడ్ బందు అమర్ రహే.

15. కామ్రేడ్ సాధు బోగా (ప్రకాష్) 30 ఏళ్లు. పిపిసిఎమ్, యాక్షన్ టీం సభ్యుడు. గఢ్‌చిరోలి జిల్లా, ధనోరా తాహసీల్, జాదా పంచాయితీ, సంబల్‌పూర్ గ్రామంలో జన్మించాడు. తండ్రి సోంచు. 2రు అన్నలు, 2రు చెల్లెళ్లు, తమ్ముడు. పేద కుటుంబం. వేరే వారి ఇంట జీతం వున్నాడు. 6వ తరగతి వరకు చదువుకున్నాడు. గ్రామంలో మిలీషియాలో వుంటూ 2011లో భర్తీ అయ్యాడు. 2012-14 దాకా గార్డ్ పని చేసాడు. 2016లో ప్రొటక్షన్ పని మీద ఒరిస్సాకి వెళ్లినప్పుడు జరిగిన ఫైరింగ్స్‌లో శత్రు దాడిని తిప్పికొట్టాడు. 2017లో బిసిటిఎస్ విద్యార్థిగా పాల్గొన్నాడు. 2021లో పిపిసి సభ్యుడయ్యాడు. స్కౌట్ పని బాగా చేసాడు. శత్రువుతో పోరాటంలో ముందుండేవాడు. చనిపోయే ముందు కూడా తోటి వారికి శత్రువుకి లొంగిపోవద్దు అంటూ ధైర్యం చెప్పాడు. కామ్రేడ్ ప్రకాష్ అమర్ రహే.

16. కామ్రేడ్ వినోద్ తలండి (సావన్) 22 ఏళ్లు. పిపిసిఎమ్, కంపెనీ-4. గఢ్‌చిరోలీ జిల్లా, అహేరీ తాహసీల్, కవుటారం గ్రామంలో జన్మించాడు. తల్లి వంజె, తండ్రి జోగాల్. అన్న, 2రు తమ్ముళ్లు, 2రు చెల్లెళ్లు. పేద రైతు కుటుంబం. 2011లో మిలీషియాలో చేరాడు. 2013లో పార్టీలో భర్తీ అయ్యాడు. 4 సంవత్సరాలు ఎస్‌జెడ్‌సీఎమ్‌కి గార్డుగా వున్నాడు. తర్వాత 2018లో 4వ కంపెనీకి బదిలీ అయ్యాడు. బిసిటిఎస్ విద్యార్థి. 2021లో పిపిసి సభ్యుడయ్యాడు. మంచి స్నైపర్. కుటుంబ సమస్యలు వున్నా గానీ అటూ ఇటూ కాలేదు. కామ్రేడ్ సావన్ అమర్ రహే.

17. కామ్రేడ్ తిలక్ జాళే (భగత్, ప్రదీప్) 270 ఏళ్లు. పిపిసిఎమ్, గార్డు దళం కమాండర్. గఢ్‌చిరోలి జిల్లా, కోర్చి తాహసీల్, డోల్‌డోంగ్రి గ్రామంలో జన్మించాడు. తల్లి, తండ్రులు లేరు. పేద కుటుంబం. అక్కడా యిక్కడా పని చేసి బతికాడు. 2010లో పార్టీలోకి భర్తీ అయ్యాడు. సిసిఎమ్ దీపక్‌దాదా గార్డ్‌గా వున్నాడు. 2014లో పిపిసి సభ్యుడుగా ఎదిగాడు. 2020లో గార్డ్ టీం కమాండర్ అయ్యాడు. 2019లో జరిగిన బఖోదా ఫైరింగ్‌లో గాయపడ్డాడు. కమాండర్‌గా మంచి పాత్ర నిర్వహించాడు. ఎన్నో ఫైరింగ్స్‌లో దాదాని కాపాడాడు. చివరి శ్వాస వరకు తన కర్తవ్య నిర్వహణలో నిమగ్నమయ్యాడు. కామ్రేడ్ భగత్ అమర్ రహే.1

18. కామ్రేడ్ అన్సో బోగా (యోగిత) పిపిసిఎమ్, ఎమ్ఎమ్‌సీ. గఢ్‌చిరోలీ జిల్లా, ధనోరా తాహసీల్, గజ్జామెండీ గ్రామంలో జన్మించింది. తల్లి మానోబాయి, తండ్రి సుక్కూరాం. 4రు అక్కలు, 2రు అన్నలు, ఒక తమ్ముడు. 4వ తరగతి చదివింది. చిన్నతనంలో పొలం పనులు చేసేది. కూలికి పోయేది. 2006లో పార్టీ పరిచయం. 2008లో భర్తీ అయ్యి గోందియా డివిజన్‌కు బదిలీ అయ్యింది. బోర్డర్ ప్లాటూన్‌లో డాక్టర్ బాధ్యతలు చూసేది. 2011లో కోర్చి ఏరియాకి బదిలీ అయ్యింది. 2012లో సిసి స్టాఫ్‌గా, గార్డుగా వుంది. 2014లో ఎమ్ఎమ్‌సిలోని బాలాఘాట్

డివిజన్‌లో ఏ ప్లాటూన్‌లో వుంది. 2014లోనే పిపిసి సభ్యురాలయ్యింది. మళ్లీ 2018లో సిసి స్టాఫ్‌లో డాక్టర్‌గా, కంప్యూటర్ ఆపరేటర్‌గా తన బాధ్యతలు నెరవేర్చింది. 3,4 భాషలు నేర్చింది. సేవాభావంతో పని చేసేది. కామ్రేడ్ యోగిత అమర్ రహే.

19. కామ్రేడ్ పొడియం అడ్మా (సంజు) 25 ఏళ్లు. పార్టీ సభ్యుడు, బీజాపూర్ జిల్లా, గంగలూర్ ఏరియా, గోర్నం గ్రామంలో జన్మించాడు. తల్లి సుక్లీ, తండ్రి జోగాల్. పేద రైతు కుటుంబం. ఒక్కడే కొడుకు. గ్రామంలో జిఆర్‌డిలో పని చేసాడు. 2014లో భర్తీ అయ్యి, 12వ ప్లాటూన్‌లో పని చేసాడు. 2015లో ఎస్‌జెడ్‌సిఎమ్ గార్డుగా బదిలీ అయ్యాడు. 5 సంవత్సరాలు గార్డుగా వుండి 2020లో ఉత్తర గఢ్‌చిరోలికి బదిలీ అయ్యి కసంసూర్ ఎల్‌జిఎస్‌లో వున్నాడు. కోబ్రామెంద, ముర్చుల్ చుట్టివేత దాడుల్లో వుండి ప్రతిఘటించాడు. 2 సార్లు గాయపడ్డాడు. మంచి ఫైటర్. కామ్రేడ్ సంజు అమర్ రహే.

21. కామ్రేడ్ పూనెం శాంతి. పీఎమ్, ఎమ్ఎమ్‌సి. బీజాపూర్ జిల్లా, గంగలూర్ ఏరియా, పుంబాడ్ గ్రామంలో జన్మించింది. ఎమ్ఎమ్‌సికి బదిలీ అయ్యింది. పారెవా ఘటనలో అమరురాలు అయ్యింది. కామ్రేడ్ శాంతి అమర్ రహే.

20. కామ్రేడ్ మడకం సోమిడి (సంతిల) 22 ఏళ్లు. పీఎమ్, ఎమ్ఎమ్‌సీ. బీజాపూర్ జిల్లా, గంగలూర్ ఏరియా, మన్‌కేల్ గ్రామంలో జన్మించింది. 2015లో ఎమ్ఎమ్‌సికి బదిలీ అయ్యింది. టైలర్ ట్రైనింగ్ అయ్యింది. కామ్రేడ్ సంతిల అమర్ రహే.

22. కామ్రేడ్ హేమ్లా భూమా (సాయినాథ్) 22 ఏళ్లు. పీఎమ్, టిప్రాగఢ్ దళం సభ్యుడు. బీజాపూర్ జిల్లా, గంగలూర్ ఏరియా, ఇర్మగొండ గ్రామంలో జన్మించాడు. తల్లి, తండ్రి లేరు. పేద కుటుంబం. 2రు అన్నలు, 2రు అక్కలు. 2013లో మిలీషియాలో పని చేసాడు. 2016లో భర్తీ అయ్యి, ఎస్‌జెడ్‌సిఎమ్ గార్డుగా బదిలీ అయ్యాడు. తర్వాత 2018లో టిడిలో పని చేసాడు. 2021లో ఉత్తర గఢ్‌చిరోలి డివిజన్‌కి బదిలీ అయ్యాడు. పనులలో ఎంతో బాధ్యతగా, మంచిగా వుండేవాడు. కామ్రేడ్ భూమా అమర్ రహే.

23. కామ్రేడ్ మాడవి మాసే (రంజు) 19 ఏళ్లు. ఎమ్ఎమ్‌సీ, దళ సభ్యురాలు. సుక్మా జిల్లా, బూదుం పంచాయితీ, గచ్చన్‌పల్లి గ్రామంలో జన్మించింది. 2020లో భర్తీ అయ్యింది. 2021లో ఎమ్ఎమ్‌సికి బదిలీ అయ్యింది. అన్ని పనులలో మంచిగా వుండేది. నిర్బంధానికి భయపడలేదు. కామ్రేడ్ రంజు అమర్ రహే.

24. కామ్రేడ్ ఉయికా సోమ్డా (మోటు) 21 ఏళ్లు. పీఎమ్, ఎమ్ఎమ్‌సి. జేగుర్‌గొండ ఏరియా, సిలింగేర్ పంచాయితి, గోందోడ్ గ్రామంలో జన్మించాడు. 2016 డిసెంబర్‌లో భర్తీ అయ్యాడు. 2017లో ఎమ్ఎమ్‌సికి బదిలీ అయ్యాడు. దీపక్‌దాదా టీంలో కమ్యూనికేషన్స్ చూసేవాడు. కామ్రేడ్ మోటు అమర్ రహే.

25. కామ్రేడ్ కోవాసి ఇడమా (లచ్చూ) 22 ఏళ్లు. పీఎమ్, కంపెనీ-4 సభ్యుడు. సుక్మా జిల్లా, ఎల్మగొండ పంచాయితీ, తొండమర్క గ్రామంలో జన్మించాడు. తల్లి జోగి, తండ్రి బండి. 3రు అన్నలు, 3రుఅక్కలు. మధ్య తరగతి కుటుంబం. 2014 జూలైలో భర్తీ అయ్యాడు. 2015లో గఢ్‌చిరోలికి బదిలీ అయ్యి, 4వ కంపెనీలో సివైపిసీఎమ్ గార్డుగా వున్నాడు. నిత్య నిర్బంధంలో ధైర్యంగా శత్రువుతో పోరాడాడు. కామ్రేడ్ లచ్చూ అమర్ రహే.

26. కామ్రేడ్ మాడవి శీను, 27 ఏళ్లు. దళ సభ్యుడు,ఎమ్ఎమ్‌సీ. సుక్మా జిల్లా, పాలచలమ పంచాయితీ, తుమిడ్ గ్రామంలో జన్మించాడు. కామ్రేడ్ శీను అమర్ రహే.

27. కామ్రేడ్ కల్మూ అడమా (సూరజ్) పీఎమ్, కోర్చి దళం సభ్యుడు. సుక్మా జిల్లా, టెటెం పంచాయితీ, వెర్రుం గ్రామంలో జన్మించాడు. మధ్య తరగతి కుటుంబం. 2021 మార్చిలో ఎమ్ఎమ్‌సికి బదిలీ అయ్యాడు. కామ్రేడ్ సూరజ్ అమర్ రహే.

★

---

### కుంజెరాస్ అమరుల వివరాలు

2021 నవంబర్ 1న దంతెవాడ జిల్లా, కుంజేరాస్ గ్రామ సమీప అడవిలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మహిళా కామ్రేడ్స్ అమరులైనారు. (1) కామ్రేడ్ జ్యోతి నుప్పో (కటేకళ్యాన్ ఏరియా కమిటీ సభ్యురాలు) దంతెవాడ జిల్లా, కువ్వకొండ పంచాయితీ, రేవాల్ గ్రామంలో జన్మించింది. (2) కామ్రేడ్ గీత (కటెకళ్యాన్ ఏరియా, పిఎమ్), (3) కామ్రేడ్ కోసి (కటెకళ్యాన్ ఏరియా, పిఎమ్) వీర యోధలకు విప్లవ ఆశయాలను కొనసాగిద్దం.

### వేంగూర్ అమరుడు

2021 నవంబర్ 5న నారాయణపూర్ జిల్లా, ఇంద్రావతి ఏరియా, వేంగూర్ గ్రామంలో కామ్రేడ్ రామ్సూ కొర్రం (పీపీసీఎమ్, ప్లటూన్-16)ను పోలీసులు పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసి, కాళ్లు, చేతులు నరికి చెట్టుకుకట్టేసి కాల్చిచంపారు. కొండగావ్ జిల్లా, కుదురు పంచాయితీ, కోటమెట్ట గ్రామంలో జన్మించాడు. కామ్రేడ్ రామ్సూకు విప్లవ జోహార్లు.

### తెలంగాణా, ఛత్తీస్‌ఘఢ్ బోర్డర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్

అక్టోబర్ 25, 2021 న తెలంగాణా, ఛత్తీస్‌ఘఢ్ బోర్డర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు కామ్రేడ్స్ అమరులైనారు.

1. కామ్రేడ్ దామా పిపిసిఎమ్, సిఆర్‌సి-2 కంపెనీ. గఢ్‌చిరోలి జిల్లా, భామ్రాగఢ్ తాసిల్, దాగున్ గ్రామంలో జన్మించాడు.
2. కామ్రేడ్ బద్రు పిపిసిఎమ్, సిఆర్‌సి-2 కంపెనీ. బీజాపూర్ జిల్లా, గంగలూరు ఏరియా, పెద్దకోర్మ గ్రామంలో జన్మించాడు. 3.కామ్రేడ్ సోమా పిఎమ్, సిఆర్‌సి-2 కంపెనీ. దక్షిణ్ బస్తర్ డివిజన్. వీర యోధులకు విప్లవ జోహార్లు.

# కామ్రేడ్ సన్నూ నురోటీ (సాకేత్)కు జోహార్లు

కామ్రేడ్ సన్నూ నురోటీ (సాకేత్) పూర్వ బస్తర్‌లోని 6వ కంపెనీ కమాండర్. 2021 నవంబర్ 15వ తేదీన నారాయణపూర్ జిల్లా ఛోటేడోంగుర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆముదాయ్ ఖదాన్ మొదలు పెట్టిన సమాచారం తెలిసి రెక్కీ కోసం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో శత్రువుతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడు అయ్యాడు. కామ్రేడ్ సాకేత్ కాంకేర్ జిల్లా, కిస్‌కోడ ఏరియా, మాత్‌లా పంచాయితి, బుడాకుర్సే గ్రామంలో పేద రైతు కుటుంబంలో జన్మించాడు. తల్లి, తండ్రి లేరు. పెద్దనాన్న ఇంట్లో పెరిగాడు. 5వ తరగతి చదివాడు. కా॥సాకేత్ చిన్న వయసు నుండే విప్లవోద్యమంలో భాగమై, విద్యార్థి సంఘంలో పనిచేసాడు. 2001 డిసెంబర్‌లో పార్టీలో భర్తీ అయ్యి పూర్తికాలం కార్యకర్త అయ్యాడు. 2002లో పార్టీ సభ్యుడయ్యాడు. విద్యార్థి సంఘ బాధ్యతలు చూస్తూనే 2007లో ఏసీ మెంబర్ అయ్యాడు. 2008లో రీజనల్ రెక్కీ, యాక్షన్ టీంలోకి బదిలీ చేసారు. అక్కడ వుండగా ఎన్నో రెక్కీలలో, దాడులలో అతని పాత్ర వుంది. 2010లో 6వ కంపెనీకి బదిలీ అయ్యి 1వ ప్లాటూన్ ఏ సెక్షన్ డిప్యూటీగా వున్నాడు. 2014లో 1 పిఎల్ సెక్షన్ కమాండర్ అయ్యాడు. మూడుసార్లు మిలటరీ ట్రైనింగ్‌కి వెళ్లాడు. ఆ అనుభవానికి తోడు స్వయంకృషితో కొత్త కొత్త టెక్నిక్‌లు నేర్చుకున్నాడు. మంచి స్నైపర్. మిలీషియాకి ట్రైనింగ్‌లు యిచ్చి, దాడులలో పాల్గొనేలా చేసాడు. 2016లో కంపెనీ ప్లీనంలో సిపైపిసీ మెంబర్‌గా ఎన్నికయ్యాడు. 2021 ప్లీనంలో కంపెనీ కమాండర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పూర్వ బస్తర్‌లో 6వ కంపెని సిపైపిసి మెంబర్‌గా, కంపెనీ కమాండర్‌గా 2021 ఆఖరి వరకు తన బాధ్యతలు నిర్వహించాడు. ఎన్నో ఘటనల్లో శత్రువును పెద్దసంఖ్యలో నష్టపరిచి, తుపాకులు, తుటాలు తెచ్చిన సాహసిక యోధుడు కామ్రేడ్ సాకేత్. పూర్వ బస్తర్ డివిజన్‌లో జరిగిన దాడుల్లో, ఆంబుష్‌లలో స్వయంగా ముందుండి వాటిని సఫలం చేయటంలో కమాండర్‌గా కామ్రేడ్ సాకేత్ ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు. కా॥సాకేత్ తన 19 ఏళ్ల పార్టీ జీవితంలో పార్టీ తనకి అప్పగించిన పనులను రాజకీయపరంగా, ఆర్గనైజేషంపరంగా, సైనికపరంగా కర్తవ్యాలను నిర్వహిస్తూ ఆఖరి శ్వాస వరకు ప్రజల కోసం పనిచేస్తూ ప్రాణాలు అర్పించాడు. ఆ కామ్రేడ్ ఆశయాలను కొనసాగిద్దాం.



★

(3౨ పేజీ తరువాయి)

ఈ ప్రకటనలు, సందేశాలు ఒకే సమయంలో వెలువడ్డాయి. వీటి వెనుక దురుద్దేశాలున్నాయి.మన దేశంలో ప్రజాస్వామ్యం, పౌరహక్కులు మొత్తంగా పౌరసమాజమే ప్రమాదంలో పడింది. 'పాలకులు చేసిందే చట్టం- సైనికులు అమలు చేస్తున్నదే రాజ్యాంగం' గా నేటి పరిస్థితులున్నాయి.

చైనా సరిహద్దులో భారత ప్రభుత్వ ప్రతినిధిగా గడచిన ఏడాదిన్నరగా పదే పదే వెళ్లి వస్తున్న సైనిక చీఫ్ ఎం.ఎం.నరవని కూడా భారత సైనిక పాటవాన్ని ఎత్తిపడుతూ ప్రకటనలు చేయడం గమనార్హం.

పౌర సమాజంపై దాడులు చేయమనడం ఒక నూతన రకమైన యుద్ధం. ఇది ఫాసిస్టు యుద్ధం. పాలక వర్గ రాజకీయ పరిభాషలో దీనిని 'ఫోర్త్ ఫ్రాంటియర్ వార్' (నాలుగో క్షేత్ర యుద్ధం)గా పేర్కొంటున్నారు. 'ఫోర్త్ జెనరేషన్ వార్‌ఫేర్' (ఎఫ్‌జీడబ్ల్యు) (నాలుగో తరం యుద్ధతంత్రం) అంటే ఉగ్రవాద గ్రూపుల వంటి వాటికి వ్యతిరేకంగా రాజ్యం యుద్ధం చేయడంగా చెప్పుకుంటున్నారు. సైనిక పరిభాషలో ఎఫ్‌జీడబ్ల్యు అంటే యుద్ధతంత్ర పరిణామంలో నాలుగో దశ. మొదటి తరం యుద్ధతంత్రం లాంఛనప్రాయమైన యుద్ధ క్షేత్రం. రెండో తరం ఆర్టిలరీ ఫైర్, మూడో తరం వేగం, ఆశ్చర్యం, శత్రు సైన్యంలోకి చొరబాటు.

పోలీసు, న్యాయ, హోం వ్యవస్థలన్నీ ప్రభుత్వ కనుసన్నలలోనే మరింత ఫాసిస్టు వైఖరిని అవలంబిస్తున్నాయన్నది కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవం. ఇదంతా కూడా బ్రాహ్మణీయ హిందుత్వ ఎజెండా అమలు కోసమేనన్నది సుస్పష్టం. అందువల్ల నేటి సమాజంలో ప్రభుత్వం ఏ వర్గంపై ఏ రకమైన అణచివేత చర్యలు చేపట్టినా అవన్నీ ఈ క్రమంలో భాగమేనని అర్థం చేసుకోవాలి. ప్రభుత్వ ఏ విధానాన్నైనా, వ్యాఖ్యనైనా ఈ మౌలిక అంశం నుంచే చూడాలి. అప్పుడే విశాల ప్రజానీకాన్ని ఐక్యం, సంఘటితం చేస్తూ ప్రజా ఉద్యమాల వెల్లువను సృష్టించగలుగుతాం. దోపిడీ రాజ్యాన్ని కూల్చి పీడిత ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పగలం.

★

**దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని, ప్రజల విప్లవాన్ని కోరుతున్నారు.**

**విప్లవాల యుగం మనది విప్లవిస్తే జయం మనది.**

# జోస్ మారియా సిసాన్‌తో విలేకరి ఆల్ఫ్ చేసిన ఇంటర్వ్యూ

**ప్రశ్న** – ప్రస్తుతం ఏ దేశంలోనైనా సోషలిస్టు నిర్మాణం అయిందా, లేదా అయ్యే క్రమంలో ఉన్నదా అని మార్క్సిస్టులలో ఒక చర్చ ఉన్నది. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏంటి?

**సిసాన్** – ఇరవయ్యో శతాబ్దంలో ఎగిసిన వరుస సోషలిస్టు దేశాల ప్రముఖ అవశేషాలు ఇప్పటికింకా ఉన్నాయి. మొత్తంగా చూసుకున్నప్పుడు డీపీఆర్‌కే ఒక సోషలిస్టు దేశం. క్యూబాలో కొన్ని ముఖ్యమైన సోషలిస్టు లక్షణాలు ఉన్నాయి. అనేక దశాబ్దాల క్రితమే పెట్టుబడిదారీ పంథా చేపట్టిన మునుపటి సోషలిస్టు దేశాల మాదిరి కాకుండా ఈ మేరకు మిగులుచ్చుకున్న ఈ అవశేషాలు అభినందించదగ్గవి.

**ప్ర** – అలాగే చారిత్రకంగా సోషలిజం ఏయే దేశాలలో వెంపొందిందంటారు?

**సిసాన్** – సోవియట్ యూనియన్, ది పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ మంగోలియా, చైనా, వియత్నాం, డీపీఆర్‌కే, జర్మన్ డెమొక్రటిక్ రిపబ్లిక్, జెకస్లొవేకియా, పోలండ్, రుమేనియా, హంగరీ, బల్గేరియా, క్యూబా, కాంబొడియా, లావోస్‌లను చెప్పుకోవచ్చు. నేను మరిచిపోయినవి మీరు చెప్పండి.

**ప్ర** – పెట్టుబడిదారీ విధాన అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాదాన్ని చేరుకున్న దేశాలుగా వేటిని నిర్వచిస్తారు?

**సిసాన్** – ఏనాటి నుంచో ఉన్న బ్రిటన్, అమెరికా, కెనడా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, నెదర్‌లాండ్స్, బెల్జియం మొదలయిన దేశాలు కాక నూతనంగా మారినవి రష్యా, చైనాలు.

**ప్ర** – ఇటీవలి కాలంలో వామపక్షంలో ముందుకు వస్తున్న ఒక హానికరమైన, రివిజనిస్టు ధోరణి ఎన్నికలవాదానికి దారి తీసే 'లెస్సర్ ఈవిలిజం' (తక్కువ చెడ్డది). ఉదాహరణకు గత సంవత్సరం అనేక మంది తమ్ము తాము వామపక్షంగా చెప్పుకున్న వాళ్లు జో బైడెన్‌కు వోటు వేయాలని ప్రచారం చేసారు. వారి దృష్టిలో డొనాల్డ్ ట్రంప్ కంటే ఇతను నయం. వీరు బైడెన్‌కు ఉన్న హీనమైన సామ్రాజ్యవాద చరిత్రను చూడలేదు. దీని వల్ల వోట్లతో సోషలిజం గెలుచుకోవచ్చునని అనేక మంది మాట్లాడేందుకు ఇది అవకాశం ఇచ్చింది. దీనిని, మరింత స్థూలంగా చెప్పాలంటే నేటి ఆధునిక రివిజనిజాన్ని ఎదుర్కోవడానికి మీ సలహా ఏంటి?

**సిసాన్** – బైడెన్ గురించి, అతని సామ్రాజ్యవాద ఘోర చరిత్రను మరుగుపరచిన వారిపై మీ విమర్శ సరైనదే. బూర్జువా సంస్కరణవాదానికి, ఎన్నికలవాదానికీ వ్యతిరేకంగానూ, అలాగే ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగానూ మార్క్సిస్టు–లెనినిస్టు–మావోయిస్టు సైద్ధాంతిక వైఖరి కలిగి ఉండడం ముఖ్యమైనది, అవసరమైనది. అయితే గతంలో సోవియట్ ఆధునిక రివిజనిజంతో సహకరించి, జాతీయ స్వాతంత్ర్యం కోరుకునే, సోషలిస్టు ఆకాంక్షలు కలిగి ఉండే దేశాలతో సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘీభావాన్ని అంగీకరించడంలో రాజకీయ వెసులుబాటు కలిగి ఉండవచ్చు. ఆధునిక రివిజనిజం పట్ల మార్క్సిస్టు–లెనినిస్టు విమర్శ కచ్చితత్వం సోవియట్ యూనియన్ కుంగుబాటును, డెంగ్ విప్లవ ప్రతీఘాతుకతను, చైనాలో పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణనూ స్పష్టంగా వ్యక్తం చేసింది.

1956కు ముందు ఉచ్ఛ స్థితికి చేరుకున్న ప్రపంచ కార్మికవర్గ విప్లవం, లేదా సోషలిస్టు ఆశయం భారీ వెనుకంజ వేసిందని, 1991 నుంచి అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా ఉన్నదని, కమ్యూనిజం వ్యతిరేక, నయావలసవాద, నయాఉదారవాద, రాజ్య ఉగ్రవాద, నయాసంకుచితవాద (అంతులేని దురాక్రమణ యుద్ధాలు) విధానాలను అమలు చేసిందనీ మనం గుర్తించాలి. ముఖ్యంగా ఈ విధానాలన్నీ దివాళా తీసాయని, నిజానికి 21వ శతాబ్దంలో అమెరికా వ్యూహాత్మక క్షీణతను, కార్మికవర్గ విప్లవ పార్టీల ఆవిర్భావానికి, ప్రపంచ కార్మికవర్గ విప్లవ పునరుత్థానానికీ పరిస్థితులను సృష్టిస్తున్న ప్రపంచవ్యాప్త సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక ప్రజా పోరాటాల ప్రస్తుత వెల్లువను వేగవంతం చేసాయనీ మనం గుర్తించాలి.

**ప్ర** – అనేక కమ్యూనిస్టు పార్టీలు ఆధునిక రివిజనిజంలో కూరుకుపోయాయి. రివిజనిజంలో కూరుకుపోయిన కమ్యూనిస్టు పార్టీలను మనం ఎలా పునర్నిర్మించగలం?

**సిసాన్** – ఆధునిక రివిజనిజంలో కూరుకుపోయిన కమ్యూనిస్టు పార్టీలు కమ్యూనిస్టు ముఖాన్ని పూర్తిగా విడనాడేందుకు రకరకాల పద్ధతులు అవలంబించాయి. రివిజనిస్టు పాలనలో ఉన్న దేశాల బయట కొన్ని కమ్యూనిస్టు పార్టీలు సోవియట్ యూనియన్ కూలిపోయిన తరువాత పూర్తిగా క్షీణించిపోయాయి. ఇతర పార్టీలలో ఒక భాగం సోషల్ డెమొక్రటిక్‌గా ఉంటే మరొకటి వృద్ధుల క్లబ్బులా తయారయింది. గతంలో రివిజనిస్టు పాలనలో ఉన్న దేశాలలో గత పాలక కమ్యూనిస్టు పార్టీలు సాధారణంగా అస్తిత్వం కోల్పోయాయి, లేదా బూర్జువా పార్టీలు వాటిని పక్కకు నెట్టివేసాయి. సీపీఎస్‌యులో ఉన్న కొన్ని మంచి లక్షణాలు రష్యాలో అధికారంలోకి వచ్చిన పక్షానికి లొంగిపోయాయి. రష్యా కమ్యూనిస్టు పార్టీ పతనం చెందుతున్న వక్ర రివిజనిస్టు పార్టీగా మిగిలిపోయింది. చైనాలో డెంగ్ విప్లవ ప్రతీఘాతుకత తరువాత బూర్జువా వర్గం కమ్యూనిస్టు పార్టీని చేతుల్లోకి తీసుకుంది. యావత్తు నిజమైన కమ్యూనిస్టులనూ బహిష్కరించింది. పెట్టుబడిదారీ పునరుద్ధారకులను నియమించింది. రాజకీయ అధికార కేంద్రంగా, రాజ్య అధికారిక ప్రతినిధిగా కొనసాగుతున్నది. గుత్తాధిపత్య నిరంకుశ పెట్టుబడిదారుల, ప్రైవేటు గుత్తాధిపత్య పెట్టుబడిదారుల భాగస్వామ్య ఆర్థిక వ్యవస్థ ఆధిపత్యం కలిగి ఉన్నది.

అనేక దశాబ్దాల విచ్ఛిన్నం, క్షీణతల తరువాత పాత రివిజనిస్టు పార్టీలను నిజమైన కమ్యూనిస్టు పార్టీలుగా పునర్నిర్మించడం

అసాధ్యం. పాత రివిజనిస్టులు చనిపోయారు, లేదా వృద్ధులయ్యారు. అంతకంటే మార్క్సిజం–లెనినిజం–మావోయిజం మార్గదర్శకత్వంలో ఉన్న గ్రూపులు, వ్యక్తులను సమీకరించి కమ్యూనిస్టు పార్టీలను నిర్మించడం, ప్రస్తుత సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక ప్రజా సంఘాలు, ఉద్యమాలలో పురోగామి కార్యకర్తల నుంచి పార్టీ సభ్యులను భర్తీ చేసుకోవడం, అభివృద్ధి చేసుకోవడం మరింత ప్రభావవంతంగా ఉంటుంది. ఒక దేశంలో అప్పటికే మార్క్సిస్టు–లెనినిస్టు–మావోయిస్టు పార్టీ ఉంటే ఎవరైనా అందులో చేరవచ్చు. పార్టీ అంటూ లేకపోతే నిర్మించాలి. నూతన మార్క్సిస్టు–లెనినిస్టు–మావోయిస్టు పార్టీని నిర్మించాలని కోరుకునే ప్రస్తుత ప్రజా ఉద్యమ పురోగామి శక్తులతో ప్రారంభించవచ్చు.

**ప్ర** – ఒకటి అడగాలనుకుంటున్నాను. ప్రస్తుతం నేను పని చేస్తున్న విషయం మహమ్మద్ గఢాఫీ గురించి. ఆయనకు విధేయంగా ఉన్న, నాటో సామ్రాజ్యవాదానికి, వలసవాదానికీ వ్యతిరేకంగా పోరాడిన వారు నడుపుతున్న ప్రస్తుత గ్రీన్ రెసిస్టెన్స్ ఉద్యమం గురించి మీ అభిప్రాయం ఏంటి?

**సిసాన్** – మహమ్మద్ గఢాఫీ ఒక గొప్ప సామ్రాజ్యవాద వ్యతిరేక నాయకుడు. నాటో సామ్రాజ్యవాదానికి, వలసవాదానికీ వ్యతిరేకంగా దశాబ్దాల పాటు గట్టిగా పోరాడాడు. దాంతో అతని ప్రభుత్వంపై దాడి చేసి కూలదోయడానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, నాటో సామ్రాజ్యవాదం చేయవలసినదంతా చేసింది. గఢాఫీ ప్రజాస్వామిక సంస్కరణలను తీసుకువచ్చాడు. లిబియా చమురు ఆదాయంతో ప్రజలకు తగినంత సామాజిక లబ్ధి చేకూర్చాడు. గ్రీన్ రెసిస్టెన్స్ ఉద్యమం గఢాఫీ వారసత్వాన్ని నిలబెట్టాలి, ముందుకు తీసుకుపోవాలి, పెంపొందించాలి.

**ప్ర** – ఇందాకటి ప్రశ్నను మరింత విశాలమైన ప్రశ్నతో జోడించి చెప్పాలంటే, కమ్యూనిస్టులు కమ్యూనిస్టేతర, అయితే ప్రగతిశీల, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను, ప్రభుత్వాలను సమర్థించాలా? ఉదాహరణకు సహారాలో పోలిసారియో ఫ్రంట్, యెమెన్‌లో సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రతిఘటనలు. దీని గురించి మీ వైఖరి ఏంటి?

**సిసాన్** – పోలిసారియో ఫ్రంట్, యెమెన్‌లో సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రతిఘటన వంటి కమ్యూనిస్టేతర, ప్రగతిశీల, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు, ప్రభుత్వాలతో కమ్యూనిస్టులు తప్పనిసరిగా సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘీభావం, మైత్రి, పరస్పర సహాయ, సహకారాలు పెంపొందించుకోవాలి. రాజకీయ రంగంలో అన్ని రకాల సంబంధాలు, విధానాలపై కమ్యూనిస్టులు సైద్ధాంతిక సూత్రాలను రుద్దడం పిడివాదం అవుతుంది.

**ప్ర** – ప్రపంచవ్యాప్తంగా అనేక విప్లవ పోరాటాలు, ప్రజా యుద్ధాలు, జాతి విముక్తి యుద్ధాలూ ఉన్న మాట నిజమే. నేడు బలమైన విప్లవ శక్తి ఉన్న దేశాలు ఏంటి? సమీప భవిష్యత్తులో ఏ దేశంలోనైనా ప్రజాయుద్ధాలు విజయవంతం అవుతాయా?

**సిసాన్** – అద్వితీయ ప్రజాయుద్ధాలు, జాతి విముక్తి యుద్ధాలలో భారతదేశం, ఫిలిప్పీన్స్, నేపాల్, వెస్ట్ పాపువా, మయన్మార్, టర్కీ కుర్దిస్తాన్, డోన్‌బాస్ ప్రాంతం, పాలస్తీనా, కొలంబియా, పెరూలను చెప్పుకోవచ్చు. వీటన్నింటికీ బలమైన విప్లవ శక్తి ఉన్నది. కార్మికవర్గానికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాద విధానాల అధికోత్పత్తి సంక్షోభం తీవ్రతరం కావడంతో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎన్నడూ ఎరుగనంతటి సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న వివిధ రకాల సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక పోరాటాలన్నీ అన్ని రూపాల విప్లవ పోరాటానికి, ప్రపంచ కార్మికవర్గ సోషలిస్టు విప్లవ వెల్లువకూ అనుకూలంగా ఉన్నాయి.

**ప్ర** – కొందరిలో, ముఖ్యంగా మావోయిస్టులలో ముందుకు వస్తున్న మరో ధోరణి ఏమంటే, 'మూడో ప్రపంచవాదం'. మొదటి ప్రపంచంలో ఎంత మాత్రం విప్లవ శక్తి లేదన్నది ఈ వాదం అభిప్రాయం. మొదటి ప్రపంచ దేశాలలో కార్మికవర్గమే లేదని, మొదటి ప్రపంచ యావత్తు జనాభా కార్మికవర్గ కులీనులన్నంత వరకు వెళతారు మూడో ప్రపంచవాదులు. ఈ ఆలోచనా ధోరణిపై మీ అభిప్రాయం ఏంటి?

**సిసాన్** – ఈ 'మూడో ప్రపంచవాదం' అనే ధోరణిని నేను అంగీకరించను. పారిశ్రామిక పెట్టుబడిదారీ దేశాల కార్మికవర్గ విప్లవ శక్తిని ఇది నిరాకరిస్తుంది. మొదటి ప్రపంచ దేశాలలో విప్లవ శక్తి లేదు, కార్మికవర్గం లేదు, ఈ దేశాల యావత్తు జనాభా కార్మికవర్గ కులీన వర్గమేనన్న అభిప్రాయాలతో నేను ఏకీభవించను. ఈ అభిప్రాయాలు ఉత్త చెత్త. నయాఉదారవాద విధాన అంతులేని దురాశ కారణంగా తీవ్రతరమయిన పెట్టుబడిదారీ దేశాల సంక్షోభం నేడు కార్మికవర్గ తీవ్రమైన దోపిడీ పీడనలలో, మధ్య తరగతి వర్గ క్షీణతలో, పెటీ బూర్జువా వర్గ తీవ్ర అభద్రతలో వ్యక్తం అవుతున్నది. పారిశ్రామిక పెట్టుబడిదారీ దేశాలలో ఇప్పుడు కార్మికవర్గాన్ని జాగరూకులను చేసి, గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం కోసం, సోషలిజం కోసం సమీకరించే క్యాంపెయిన్‌లను సృష్టించి, తీవ్రతరం చేసే కార్మికవర్గ విప్లవ పార్టీల నిర్మాణం అవసరం.

**ప్ర** – మీ దృష్టిలో ఐరోపాలో, మరింత స్థూలంగా చెప్పాలంటే మొదటి ప్రపంచంలో విప్లవకారులు ఎటువంటి విప్లవ వ్యూహాన్ని అవలంబించాలి?

**సిసాన్** – ఐరోపాలో, మొదటి ప్రపంచంలో ముందుగా నిజమైన కమ్యూనిస్టు పార్టీని, ప్రజా ఉద్యమాన్ని నిర్మించి, రాజ్య నిర్బంధ యంత్రాంగం, కమ్యూనిజం వ్యతిరేక, సంకుచితవాద, ఉదారవాద, సోషల్ డెమొక్రసీ, నయాఉదారవాద, ఫాసిస్టు భావాలతో సహా గుత్తాధిపత్య బూర్జువా వర్గం కార్మికవర్గంపై విధించే సమస్తానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం కోసం యుద్ధం గెలిచేందుకు కృషి చేయాలి. ప్రజా పోరాటాల ద్వారానే కమ్యూనిస్టు పార్టీని, ప్రజా సంఘాలను, ప్రజా సంఘాలు, సమూహాలలో ఆత్మ రక్షణా

సంస్థలను పటిష్టం చేయగలం. ఆత్మరక్షణ కోసం సంస్థలు ఏర్పరచాలి. ప్రతీఘాతుక సైన్యంలోకి కేడర్‌లను పంపించేందుకు బోల్షివిక్కు శైలిలో కృషి చేయాలి.

బలమైన, విశాలమైన ప్రజా పునాది గాని, ఏ రకమైన ఆత్మ రక్షణా సంస్థలు గానీ లేకుండా, పాలక వ్యవస్థ క్రమబద్ధ సంక్షోభాలతో, సామ్రాజ్యవాద యుద్ధంతో తగినంతగా బలహీనపడకుండా సాయుధ విప్లవం ప్రారంభించేందుకు ప్రయత్నించిన కమ్యూనిస్టు పార్టీ కొద్ది రోజులకో, గంటలకో నాశనం అయిపోతుంది. శైశవ దశలో ఉన్న మావోయిస్టులు, ఏజెంట్‌లు మాత్రమే, గ్రామీణ జనాభా 5 శాతం కంటే తక్కువగా ఉన్న, వ్యవసాయ పెట్టుబడిదారులు నియమించుకున్న ధనిక రైతాంగం, వ్యవసాయ కార్మికులతో కూడుకున్న పారిశ్రామిక పెట్టుబడిదారీ దేశాలలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధం చేయాలని సూచిస్తారు. ఇప్పటికి దాదాపు 20 సంవత్సరాలలో ఏ సామ్రాజ్యవాద దేశమూ నగరాలలో గానీ గ్రామీణ ప్రాంతంలో గానీ శైశవ దశలో ఉన్న మావోయిస్టులు సాయుధ విప్లవం ప్రారంభించలేదు.

గతంలో మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల వంటి సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధాలు ఐరోపాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో బలమైన యుద్ధానికి అనుకూల పరిస్థితులను అందించాయి. అణ్వాయుధ, ఇతర మారణాయుధాల వినియోగం పరస్పర వినాశనానికి దారి తీస్తుందని భయపడి సామ్రాజ్యవాద శక్తులు ప్రత్యక్ష అంతర్ సామ్రాజ్యవాద యుద్ధాలను నివారించుకున్నాయి. గడచిన 70 సంవత్సరాలకు పైగా అంతర్ సామ్రాజ్యవాద విధానం పెట్టుబడిదారీ సంక్షోభ భారాన్ని మూడో ప్రపంచ దేశాలపై రుద్దింది, ఆ దేశాలలో తీవ్రంగా ప్రతిఘటిస్తున్న వాటిపై దురాక్రమణ యుద్ధాలు చేసింది. అభివృద్ధి చెందిన, చెందని ప్రపంచ దేశాలలో వివిధ రూపాల విప్లవ ప్రజా పోరాటాల పరస్పర అభివృద్ధిని అనుసంధానించడం, ప్రోత్సహించడం చాలా ముఖ్యమైన విషయం.

**ప్ర** – మితవాద కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం, ఫాసిజం పెరగడం ముఖ్యంగా కలత చెందిస్తున్న ధోరణి. వీటిని ఎలా వ్యతిరేకించాలి?

**సిసాన్** – మితవాద కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం, ఫాసిస్టు గ్రూపులు పెరగడం గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధాన తీవ్ర సంక్షోభానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక, సోషలిస్టు ఉద్యమాల పెరుగుదలను నిలువరించి, అణచివేయడం కోసం గుత్తాధిపత్య బూర్జువా వర్గం అతి ప్రతీఘాతుక ధోరణిని, గ్రూపులను పోషిస్తున్నది, ప్రోత్సహిస్తున్నదనడానికి స్పష్టమైన సూచిక. కమ్యూనిస్టు వ్యతిరేక, ఫాసిస్టు ధోరణిని, గ్రూపులనూ వ్యతిరేకించడానికి మార్గం కార్మికవర్గ విప్లవ పార్టీని నిర్మించడం, పెట్టుబడిదారీ సంక్షోభం గురించి, తక్షణ సంస్కరణల అవసరం గురించి, అలాగే సోషలిస్టు విప్లవ అవసరం గురించి కార్మికవర్గ, యావత్తు ప్రజల విప్లవ చైతన్యాన్ని పెంపొందించడం, వివిధ రకాల ప్రజా సంఘాలను, ప్రజా సంఘాలలో సామూహిక ఆత్మ రక్షణా, ఆత్మ రక్షణా గ్రూపులను సంఘటితం చేయడం, మరింత మంది ప్రజలను పెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం కోసం, సోషలిజం కోసం క్యాంపెయిన్‌లలో సమీకరించడం.

**ప్ర** – అరాచకవాదంతో సహా పెట్టుబడిదారీ వ్యతిరేక ఉద్యమంలో విభిన్న ధోరణులు వామపక్షంలో ఉన్నాయన్నది మీకు తెలిసిన విషయమే. వామపక్షంలో అనేకమంది ఇటీవలి కాలంలో 'వామపక్ష ఐక్యత' అన్న భావనను ముందుకు తీసుకువస్తున్నారు. అంటే, వామపక్షంలో యావత్తు సెక్షన్‌ల, అంటే మార్క్సిస్టు–లెనినిస్టు–మావోయిస్టుల నుంచి అరాచకవాదుల వరకు అందరి ఐక్యత. ఈ భావన గురించి మీరు ఎలా అభిప్రాయపడుతున్నారు?

**సిసాన్** – వామపక్ష ఐక్యతగా చెప్పుకునే ఏ కూటమినయినా ఉమ్మడి శత్రువు, అంటే నయా ఉదారవాదం, ఫాసిజం, రాజ్య ఉగ్రవాదం, దురాక్రమణ యుద్ధాల వంటి భీభత్సాలతో సహా సామ్రాజ్యవాదాన్ని సూత్రబద్ధంగా వ్యతిరేకించవచ్చు. అయితే కమ్యూనిస్టులు, కమ్యూనిస్టేతరుల ఐక్యతను సుగమం చేయడం కోసం రాజకీయంగా వెసులుబాటు కలిగి ఉండాలి. వారి పార్టీలు, సంఘాలకు స్వతంత్రత, చొరవ ఉంటాయి. ఏకాభిప్రాయం, విశాల రాజకీయ సూత్రాలు, విధానాలూ పునాదిగా ఉంటాయి. సమావేశాలను, ప్రజా చర్యలనూ సమన్వయించుకునేందుకు ఈ కూటమి సంప్రతింపుల, ఏకాభిప్రాయ కమిటీ, లేదా కార్యదర్శివర్గం పెట్టుకోవచ్చు. కూటమిని విచ్ఛిన్నం చేయడం, లేదా నివారించడం ఏకైక, లేదా ప్రధాన లక్ష్యంగా పెట్టుకునే ఏ సంస్థను కూడా ఈ కూటమి కలుపుకోరాదు.

**(27వ పేజీ తరువాయి)**

దశాబ్దాల అతి భయానక పీడనను మించి గత 2 ఏళ్ల హిందుత్వ శక్తుల హయాంలో మరింత దుర్భరమైంది. ప్రస్తుతం దేశ పాలకులు విభజన రాజకీయాలను పెంచి పోషించడానికి భారత రాజ్యాంగాన్ని సైతం పక్కనపెట్టి శ్యామా ప్రసాద్ ముఖర్జీ విధానాలను, తమ హిందుత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోతున్నారు. ఉగ్రవాదంపై పోరు పేరుతో ఆజాదీ కశ్మీర్ ఆకాంక్షలను చిదిమివేస్తున్నది. కశ్మీరీలకు వ్యతిరేకంగా అమలవుతున్న భారత సైనిక దాడులు తమ జాతి ఆకాంక్షల సాధన కోసం సహజంగానే అక్కడి ప్రజల్ని మరింత సమైక్యం చేస్తున్నవి. ఆ ఐక్యతను హిందుత్వ శక్తుల దుష్ట విధానాలు మరింత గట్టిపర్చడం ఖాయం. వారి సమైక్యత, వారి ఆకాంక్షల సాధనకు, ఆ సాధనలో ఇప్పటికీ భారత సైనికుల తుపాకులకు బలైన లక్ష మంది కశ్మీరీ అమరుల త్యాగాల సాక్షిగా ఆ ప్రజ ఇంకెంతటి త్యాగాలకైనా వారిని సంసిద్ధం చేస్తుంది. ✭

# అధ్యక్షులెవరైతేనేం!
# అమెరికా అంటేనే ఆయుధాలు, యుద్ధం, ఆధిపత్యం

2020లో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరిగి రిపబ్లికన్ పార్టీకి చెందిన ట్రంప్ ఓటమి పాలై డెమాక్రటిక్ పార్టీకి చెందిన జోబైడెన్ నూతన అధ్యక్షుడిగా, భారత సంతతికి చెందిన కమలా హారిస్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికై 2021 జనవరిలో బాధ్యతలు స్వీకరించారు. జోబైడెన్ రాజకీయంగా అనుభవం కలిగి ఉండి రెండు విడతలు ఉపాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు నిర్వహించినవాడు. ట్రంప్ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాల వలన ఆయన గత ఏ అధ్యక్షుడికన్నా అత్యధిక మెజార్టీతో గెలుపొందాడు. ఆయన యుద్ధ వ్యూహాలు రచించడంలో మహా చతురుడు. గత ఏడాదిగా బైడెన్ పాలనలో అమెరికా రాజకీయాలలో చోటుచేసుకున్న పరిణామాలను చూద్దాం. గతంలో ప్రచురించిన క్రాంతి వ్యాసంలో అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ఎవరు గెలిచినా అమెరికా సామ్రాజ్యవాద విధానాలలో మౌలిక మార్పులేమీ ఉండవు అని స్పష్టంగా పేర్కొన్న నేపథ్యంలో ఏడాది పరిణామాలు ఆ వైఖరిని సరైనదిగానే నిరూపిస్తున్నవి.

ఎన్నికలకి ముందు ఓ శతృవునో, కృత్రిమ శత్రువును సృష్టించడం అమెరికా పాలకులకి అలవాటే! అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు పశ్చిమాసియాలో తమ ఆధిపత్యానికి పరమ ఆటంకంగా తయారైనాడని భావించి ఖుద్స్‌ఫోర్స్ అధినేత అమెరికా వ్యతిరేకిగా ఇరాన్, ఇరాక్, యెమన్ తదితర దేశాల ప్రజల అభిమానాన్ని చూరగొన్నవాడు, పతాక శీర్షికలలో నిత్యం నిలిచేవాడు ఖాసీం సులేమానీని హత్య చేయించాడు. ఆ హత్య అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయానికి తోడ్పడలేదు కానీ ట్రంప్ తన పదవీ కాలంలో మూటకట్టుకున్న దుష్ట చర్యల జాబితాలో చేరి ఆయన ఓటమిని మాత్రం ఖాయం చేయడానికి తోడ్పడింది. 2016లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రసంగాలలో ట్రంప్ తన పదవీకాలంలో యుద్ధాలు జరుపబోనని పదే పదే ప్రకటించాడు. కానీ, అది ప్రజల ఓట్లు దండుకోవడానికే తప్ప అది ఏ అధ్యక్షుడి చేతిలో లేదని ఆయన పాలనలో చోటుచేసుకున్న అనేక పరిణామాలు స్పష్టం చేశాయి. మరోవైపు 2020 అధ్యక్ష ఎన్నికలలో అధ్యక్ష పదవికి పోటీ చేసిన జోబైడెన్ ఎన్నికల సమయంలో అమెరికా ప్రపంచాధిపత్యాన్ని పునరుద్ధరిస్తాననీ హామీ ఇచ్చాడు. ట్రంప్ యుద్ధాలు జరుపబోననడం, బైడెన్ ప్రపంచాధిపత్యాన్ని పునరుద్ధరిస్తా ననడం నాణేనికి రెండు వైపుల లాంటివే తప్ప పెద్ద తేడా ఏమీ లేదు. అందుకే 'సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం' అని లెనిన్ మాహాశయుడు వందేళ్లకు ముందే

తేల్చివేశాడు. కాబట్టి దోపిడీ కోసం యుద్ధాలు లేకుండా, (ఆయుధాల) వ్యాపారం లేకుండా, ప్రపంచ ఆధిపత్యం కోసం పెనుగులాట లేకుండా సామ్రాజ్యవాదానికి మనుగడే ఉండదు.

47వ అమెరికా అధ్యక్షుడిగా అతి పెద్ద వయస్కుడు జోబైడెన్ ఎన్నికయ్యాక వర్తమాన అమెరికాలోని పరిస్థితులను, సామ్రాజ్యవాద అమెరికా అనుసరిస్తున్న ప్రపంచ ఆధిపత్య విధానాలను చూద్దాం.

చైనా జనాభా 140 కోట్లుకాగా, అమెరికా ప్రజలు ఒకవైపు ఆర్థిక సంక్షోభ భారంతో సతమతమవుతుండగా మరోవైపు సామ్రాజ్యవాదులు అనుసరిస్తున్న వినాశకర విధానాలతో పర్యావరణం ధ్వంసమవుతూ నూతనంగా విజృంభిస్తున్న కొరోనా మహమ్మారీతో లక్షలాది మంది ప్రజల జీవితాలు కడతేరుతున్నవి. కోట్లాది మంది ప్రజలు అనారోగ్యాల బారీన పడుతున్నారు. 2020లో ప్రపంచ వ్యాప్తంగా విజృంభించిన కొరోనా వివిధ అవతారాలు ఎత్తుతూ పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నది. మరోవైపు కొరోనా కాలంలో కుబేరులు మరింత కుబేరులవుతున్నారు. వాల్ స్ట్రీట్ బేంకులు 2021లో ఆర్జించిన లాభాలు గత రికార్డులను బద్దలుకొట్టాయి.

సెప్టెంబర్ 1983 తర్వాతి గత నాలుగు దశాబ్దాలలో ఎన్నడూ లేని విధంగా అమెరికాలోని వినియోగదారుల ధరల సూచీ 5.7%కి పెరిగిపోయింది. పెరుగుతున్న ఆర్థిక మాంద్యం ఫలితంగా సెలవు దినాలలో గతంలా షాపింగ్ చేసుకోలేని దుస్థితికి అక్కడి ప్రజలు చేరుకుంటున్నారు. పెరుగుతున్న ధరలతో సమానంగా అమెరికన్ల ఆదాయాలు పెరుగడం లేదనీ, జోబైడెన్ ఆర్థిక విధానాలు విఫలమయ్యాయనీ రిపబ్లికన్‌లు విమర్శిస్తున్నారు. అమెరికా అలబామాలోని ఐక్య గని కార్మికులు (యూనైటెడ్ మైన్ వర్కర్స్ ఆఫ్ అమెరికా-యూఎండబ్ల్యూఏ) రోజుకు 16 గంటలు సెలవులు లేకుండా, అదనపు వేతనాలు చెల్లించనప్పటికీ పనులు చేయాల్సివస్తున్నదని వారు ఆగ్రహంగా ఉన్నారు. వారు వారానికి ఏడు రోజులు పని చేస్తున్నారు. దానితో ఆ గనులలో పనిచేస్తున్న 1,100 మంది కార్మికులు గత ఎప్రిల్ నుండి సమ్మెకు తలపడ్డారు. శనివారం పని చేస్తే రెట్టింపు, ఆదివారం పని చేస్తే మూడు రెట్ల వేతనం ఇవ్వాలి కానీ అవేవీ దొరుకడం లేదు. ఆరోగ్య బీమా కింద ఇవ్వాల్సిన 1,500 డాలర్ల బదులు కేవలం 250 డాలర్లు మాత్రమే పొందుతున్నారు. వీళ్లు 1,000 మందితో న్యూయార్క్‌లో తలపెట్టిన ర్యాలీలో అనేక సెక్షన్ల ప్రజలు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. జార్జియా, కెంటకీ, టెన్నీస్సీ, దక్షిణ కెరోలోనాల నుండి కార్మిక నాయకులు హాజరయ్యారు. అనేక రాష్ట్రాల నుండి వచ్చిన వారు వేదికెక్కి 500 డాలర్ల చొప్పున సమ్మె నిధిని అందచేశారు. రేవు కార్మికులు గని కార్మికులకు సంఘీభావం అంటూ టీ-షర్టులతో వారు వచ్చారు. ఈనాడు అమెరికాలో కేవలం అలబామా గని కార్మికులే కాదు అమెజాన్, స్టార్‌బక్స్, యూబర్, లిఫ్ట్, జాన్ డీరే, కెల్లోగ్, హంటింగ్‌టన్‌లోని ప్రత్యేక మెటల్ యూనిట్ కార్మికులు, బెర్క్ షహర్ హథవే, పశ్చిమ వర్జీనియా, వాయవ్య వడ్రంగుల సంఘం, వర్సెస్టర్‌లోని వందలాది మంది నర్సులు, మసచుసెట్స్, రంగస్థల ఉద్యోగుల అంతర్జాతీయ కూటమి మున్నగు అమెరికా వ్యాప్తంగా అనేక పరిశ్రమల, సంస్థల సంఘటిత

కార్మికులు, ఉద్యోగులు సమ్మెలకు తలపడ్డారు. దాదాపు నాలుగు మిలియన్‌లకు పైగా కార్మికులు అంటే అమెరికా శ్రామిక శక్తిలో 3% కార్మికులు వారంతా వసతి, ఆహార సేవలు, ఆరోగ్య రక్షణ, సామాజిక సేవలు, రవాణా, గృహ సేవలలో ఉన్నవారు కడుహీనమైన వేతనాలు, యాతనలు, ప్రమాదభరిత పరిస్థితులకు తిలోదకాలిచ్చి ఉద్యోగాలకు స్వస్తి చెప్పారు. 33 కోట్లకు చేరిన అమెరికా జనాభాలోని దాదాపు 77% యువత 18 నుండి 34 యేళ్ల లోపువారంతా సంఘటితమవుతున్నారు. అక్కడ కేవలం 9% శ్రమశక్తి మాత్రమే సంఘటితంగా ఉంది. జాతి వివక్ష అత్యంత నిర్దాక్షిణ్యంగా కొనసాగుతున్నది. మహిళల విషయంలోనూ నిర్లక్ష్యం తీవ్రతరమవుతోంది. ఏ ఇతర పారిశ్రామిక దేశంలో లేని విధంగా గర్భస్రావ హక్కులను నిరాకరించడం, ప్రసూతి సెలవులకు వేతనాలు చెల్లించడాన్ని తిరస్కరించడం అలవాటుగా మారిపోయింది.

సామ్రాజ్యవాద అమెరికా ఆర్థిక వ్యవస్థ సంక్షోభ సుడిగుండం నుండి బయటపడడం లేదు. దాని ప్రభావం అక్కడి రాజకీయ, సైనిక రంగాలపై కూడా బలంగా ఉన్నది. చైనాతో వాణిజ్య యుద్ధంలోనూ, రష్యాతో ఎగుడు దిగుడు సంబంధాల్లో కూడా ఆ లక్షణాలు వ్యక్తమౌతున్నాయి. ఇదంతా ఒక ఎత్తు! ఏడెనిమిది దేశాల్లో గత రెండు, మూడేళ్లలో అమెరికా అనుసరించిన దౌత్య ఎత్తుగడలు, అనుచిత జోక్యాలు ఘోరంగా విఫలం కావడం మరో ఎత్తు!

బైడెన్ అధికారానికి వచ్చిన వెంటనే ఫిబ్రవరిలో జరిపిన తొలి దాడి ఇరాక్ సరిహద్దులలోని సిరియాలో గల ఇరాన్‌ను సమర్థించే మిలీషియా సమూహాల కేంద్రాలపైనే. ఆ తరువాతి దాడి అంటే తిరిగి జూన్ చివరివారంలో అవే ప్రాంతాలలోని ఇరాన్ సమర్థిత మిలీషియా కేంద్రాలపైనే (సిరియాలో రెండు చోట్ల, ఇరాక్‌లో ఒక చోట) దాడులు జరిపినట్లు పెంటాగన్ అధికార ప్రతినిధి జాన్ కిర్బీ స్పష్టం చేశాడు. ఆయన ఆ దాడులను ఆత్మరక్షణ కోసం జరుపక తప్పలేదని సమర్థించుకున్నాడు. సిరియా మానవ హక్కుల పరిశీలకులు మాత్రం ఈ రెండు దాడులలో మిలీషియా మరణాలను పేర్కొన్నారు. ఈ దాడులు పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలను ఎగదోయడం తప్ప మరేం కాదు. ఈ విధంగా తన యుద్ధ పిపాసతను చాటుకున్న జో బైడెన్ మిగితా చోట్ల ఎలా వ్యవహరిస్తున్నాడో చూద్దాం.

**1. అఫ్ఘానిస్తాన్‌ను తమ చేతినుండి జారవిడుచుకోకూడదనే బైడెన్ ఎత్తుగడతో బయటపడిన అమెరికా** రెండు దశాబ్దాలకు పైగా దక్షిణ వియత్నాంలో అమెరికా ఒక ఎడ తెగని యుద్ధం చేసింది. ఉత్తర వియత్నాంను నియంత్రిస్తున్న కమ్యూనిస్టులు దక్షిణ ప్రాంతాలకు విస్తరించకుండా అడ్డుకోవడానికి, 'ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి' తామూ యుద్ధం చేస్తున్నామని అమెరికా చెబుతూ వస్తోంది. సంవత్సరాల తరబడి యుద్ధం కొనసాగడంతో అసలు వియత్నాంలో తాము ఎందుకు యుద్ధం చేయాలన్న ప్రశ్న అమెరికా ప్రజలలో ముఖ్యంగా యువజనులలో తలెత్తింది. వియత్నాంలో తమ యుద్ధాన్ని శ్వేత సౌధ అధినేతలు గట్టిగా సమర్థించుకున్నారు. అధ్యక్ష పదవిలో జాన్ ఎఫ్. కెనడీ, లిండన్ బి. జాన్సన్, రిచర్డ్ నిక్సన్ ఎవరున్నా సరే ఒకటే మాట. విజయం మనదే. అదిగో, ఇంక ఒకే ఒక్క పోరాటం చాలు. మన సైనికులు గృహోన్ముఖులవ్వచ్చు అనేదే వారి పల్లవి. అయితే, అమెరికా ఒక నిరాశాజనక, గెలవడం అసాధ్యమైన యుద్ధం చేస్తోందని గుర్తించడం నిక్సన్ హయాం నాటికి అనివార్యమయింది. తత్ఫలితంగా 1970 దశకపు తొలి సంవత్సరాలలో అమెరికాను వియత్నాం యుద్ధం నుంచి నిక్సన్ బయటపడవేశాడు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే నికార్సైన రణోన్మాది, కరడుగట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకి అయిన నిక్సన్ ఈ శాంతిపర్వానికి కారకుడు కావడమే.

ఏ తాలిబన్ ప్రభుత్వ కూల్చివేత తన ఏకైక లక్ష్యంగా 2001లో ఆఫ్ఘనిస్థాన్‌లో దురాక్రమణకు దిగిందో, శాంతికోసం యుద్ధం అన్న నయా సిద్ధాంతాన్ని సహస్రాబ్ది తొలినాళ్లలోనే ప్రపంచ దేశాలపై రుద్ది అఫ్ఘానిస్థాన్‌లో 'ఆపరేషన్ ఎండ్యూరింగ్ ఫ్రీడమ్'ను 2001లో అమెరికా ప్రారంభించింది. 'నిర్దిష్ట యుద్ధ రంగాలేవీ లేని పోరుతో ప్రచ్ఛన్న శత్రువుతో సాగించాల్సిన వినూత్న సంఘర్షణ' అంటూ నాటి అధ్యక్షుడు బుష్ ప్రారంభించిన యుద్ధం జూనియర్ బుష్, ఒబామా, ట్రంప్‌లను అనేక పరీక్షలకు నెట్టింది. 'గల్ఫ్ యుద్ధానికిది భిన్నమైనది... కనీసం మన జీవితకాలంలో ఇది పూర్తి కాదు' అని అఫ్ఘాన్ సమరంపై నాటి ఉపాధ్యక్షుడు డిక్ చెనీ భవిష్యద్దర్శనం చేసిన విషయం తెలిసి కూడా ట్రంప్ ఒక దశలో 'అఫ్ఘాన్‌లో యుద్ధాన్ని పదిరోజుల్లో ముగించేయగలను... కోటిమంది ప్రజలు మృత్యువాత పడి భూమండలం మీద ఆ దేశం నామరూపాల్లేకుండా పోతుందనే వెనకాడుతున్నా'నని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరుడు జులైలో బీరాలు పలికాడు. ఈ యుద్ధం అమెరికాకు ఏం ఒరగబెట్టిందనే విషయాన్ని జమాఖర్చుల లెక్కల్లో వీక్షిస్తే – లక్ష కోట్ల డాలర్ల వ్యయమైనప్పటికీ, 2,400 మంది అమెరికన్ సైనికులను బలి తీసుకున్నప్పటికీ చైనా పలుకుబడి పెరుగుతుండడాన్ని, మారుతున్న భూభౌగోళిక సమీకరణలను తీవ్రంగా పరిగణించక తప్పని ట్రంప్– ఇక ఆ ఖాతాను మూసేయాలనే నిర్ణయించారు. అందుకే ట్రంప్ పరువు కాపాడుకోవడంలో భాగంగా తాలిబన్ శక్తులతో యుద్ధ విరమణ ఒప్పందం చేసుకోగా, దానిని నిర్ణీత సమయానికి ముందే బైడెన్ అమలు చేసి రెండు దశాబ్దాలుగా యుద్ధ భారాన్ని భరిస్తున్న పీడిత అఫ్ఘాన్ ప్రజలను మరింత దోచుకుంటూ బైడెన్ 9.4 బిలియన్ డాలర్ల విదేశీ అఫ్ఘాన్ కరెన్సీ నిధులను స్వాధీనం చేసుకున్నాడు. అక్కడి నుండి బయటపడింది. దీనితో, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా చేసిన ప్రతి యుద్ధంలోనూ, ప్రతి చిన్న దేశం చేతిలోనూ అది ఓటమి పాలవుతూ వస్తుందనే చారిత్రిక వాస్తవం మరో విడుత అఫ్ఘాన్‌లో నిరూపితమైంది.

గత ఇరువై ఏళ్ల యుద్ధ క్రీడలో భాగమైన వారినెవరినీ సంప్రదించకుండానే బైడెన్ అఫ్ఘానిస్తాన్ నుండి అమెరికా సైన్యాలను బేషరతుగా వెనక్కి తీసుకోవడంపై అమెరికాలోని కార్పొరేట్ మిలిటరీ

కాంప్లెక్స్ గుర్తుగా ఉంది. అమెరికా తన ప్రపంచ ఆధిపత్య శక్తిని కోల్పోతుందనడానికి అది అఫ్ఘానిస్తాన్ నుండి బలగాలను వెనక్కి తీసుకోవడాన్ని ఒక తాజా ఉదాహరణగా చూస్తున్నారు.

2. **రష్యా-అమెరికా సంబంధాలు, బైడెన్ వైఖరి:** ఉక్రెయిన్ గతంలో మాస్కోకు బలమైన అండగా నిలిచిన దేశం. ఉక్రెయిన్ అన్ని రకాలుగా సైనికంగా, పారిశ్రామికంగా, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులపరంగా శక్తిమంతమైన దేశం. ఉక్రెయిన్ తన పక్షాన లేకుండా రష్యా ఒక శక్తిమంతమైన దేశంగా మారలేదు. రష్యాను ప్రతిఘటించడానికి ఉక్రెయిన్‌ను వినియోగించడానికి అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. 2014లో ఉక్రెయిన్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని హింస ద్వారా గద్దె దింపడంలో కీలక పాత్ర పోషించిన అమెరికా, ఉక్రెయిన్ సరిహద్దులలో గత ఏడేళ్లుగా ఉద్రిక్తతలను తీవ్రతరం చేయడంలో నిమగ్నమైంది. ఫలితంగా, ఉక్రెయిన్ సరిహద్దులలో 90 వేల రష్యా సైన్యాలుండగా దాదాపు 1 లక్షా 75 వేల సైన్యాలున్నట్టు సీఐఏ ఆరోపిస్తున్నది. రష్యా సరిహద్దులలో నాటో సైనిక కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో రక్షణ వ్యవస్థను పటిష్టం చేసుకోక తప్పదనీ నవంబర్‌లో దక్షిణ రష్యాలోని సోచీలో జరిగిన మిలిటరీ అధికారుల, ఆయుధ ఉత్పత్తిదారుల సమావేశంలో పుతిన్ పేర్కొన్నాడు. అమెరికా నాయకత్వంలోని నాటో మిస్సైల్ వ్యవస్థ తూర్పు యూరప్‌లో పటిష్టమవుతోందనీ, బాల్టిక్, నల్ల సముద్ర రష్యా తీరంలో నాటో ఓడలు (యూఎస్ 6వ ఫ్లీట్) ప్రవేశించాయనీ తెలిపాడు.

గత మూడు దశాబ్దాలుగా అమెరికా తూర్పు యూరప్ దేశాలలో రష్యా సరిహద్దుల వరకు నాటోను విస్తరించే ఎత్తుగడలను అనుసరించడంలో నిమగ్నమైంది. అందులో భాగంగానే అది ఉక్రెయిన్ బలగాలను సాయుధం చేసి శిక్షణ గరిపింది. అమెరికా చర్యలను రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తోంది. రష్యా ఆ ప్రాంతంలో అనుసరిస్తున్న రక్షణ విధానాలను తుంగలో తొక్కుతున్న అమెరికానే వర్తమాన ఉద్రిక్తతలకు ప్రధాన కారణం. అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన బైడెన్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను హంతకుడు అంటూ తొలుత 2021మార్చ్‌లో ఆరోపించడంతో ఆగ్రహించిన రష్యా తన రాయబారి అనటోలీ అంటనోవ్‌ను వాషింగ్టన్ నుండి వెంటనే వెనక్కి తీసుకుంది. ఆ తరువాత 2021 జూన్ 16నాడు రెండు దేశాల అధ్యక్షులు బైడెన్ పుతిన్‌ల మధ్య జెనీవాలో గంటకుపైగా ప్రత్యక్ష తొలి సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ఇద్దరు నాయకులు తమ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించుకోవడంలో భాగంగా తిరిగి రాయబారులను పంపుకుంటామని పుతిన్ ప్రకటించాడు.

ఉద్రిక్తతలను చల్లార్చే ప్రయత్నాలు ఒక వైపు జరుగుతుండగా, రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల గురించి ఫ్రాన్స్, అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, ఇటలీ ప్రతినిధులు డిసెంబర్ 6నాడు సమావేశమయ్యారు. ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రత పరిరక్షణకు తమ దేశాల మద్దతును వారు పునరుద్ఘాటించారు. వారు ఒక ఐక్య సంఘటన ఏర్పడాల్సిన అవసరం ఉందని భావించారు. ఆ మరుసటి రోజు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ల మధ్య వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన పక్షంలో తాము, నాటో మిత్రులు మాస్కోకు వ్యతిరేకంగా బలమైన ఆర్థిక ఆంక్షలు, ఇతర చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించాడు.

అమెరికా అధ్యక్షుడిగా గద్దెనెక్కి యేడాది పూర్తవుతున్న వేళ 2021 చివరిరోజు డిసెంబర్ 31నాడు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో బైడెన్ జరిపిన ఫోన్ సంభాషణలో ఉక్రెయిన్ విషయంలో రష్యా ఎలాంటి సైనిక చర్యలు చేపట్టినా అమెరికా రష్యాపై బలమైన నూతన ఆంక్షలతో పాటు ఇతరత్ర చర్యలకు దిగాల్సి ఉంటుందనీ మరోసారి హెచ్చరించాడు. కానీ, అదే జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయనీ పుతిన్ జవాబిచ్చాడు. ఉక్రెయిన్ సహా ఏ మాజీ సోవియట్ దేశం నాటో కూటమిలో చేరదనీ, నాటో సైనిక వ్యవస్థను నెలకొల్పడం అంటే అది తమ ఒప్పందాలకే భిన్నమని పుతిన్ మరోసారి స్పష్టం చేశాడు. రెండు భారీ అణ్వాయుధాలున్న దేశాల మధ్య ఉద్రిక్తతలు అమెరికా ప్రపంచ ఆధిపత్యం కోసమేనన్నది అసలు విషయం.

3. **చైనాతో పోటీ, ప్రపంచాధిపత్యం మా లక్ష్యం:** ఇరువై ఒకటవ శతాబ్ది విజయాన్ని స్వంతం చేసుకునేందుకు చైనాతో పోటీ పడుతున్నామని జోబైడెన్ పార్లమెంటు తొలి ప్రసంగంలో చెప్పాడు. 2011లోనే 'ఆసియా పివోట్' ('ఆసియా ఇరుసు') అనే పాలసీని ఓబామా ప్రభుత్వం 2011లోనే ఆస్ట్రేలియాలో ప్రకటించింది. 'ఆసియా పివోట్' విధానంతో ఆసియాలో కేంద్రీకరణ, చైనా సైనిక శక్తి బూచీతో ట్రంప్ అమెరికా సైనిక బడ్జెట్‌ను పెంచుతూ రెండు అణ్వాయుధ శక్తుల మధ్య యుద్ధ వాతావరణాన్ని తీవ్రం చేశాడు. చైనాతో ప్రచ్ఛన్న యుద్ధ ఉద్రిక్తతలను పెంచుతూ ప్రమాదకరమైన ఆయుధ పోటీని అమెరికా తీవ్రం చేస్తోంది. అమెరికా సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్య పథకంలో భాగంగా 'ఆసియా పివోట్' ('ఆసియా ఇరుసు') పాలసీతో దాని యుద్ధ విధానాలకు ఇపుడు ఆసియా కేంద్రం అయింది. దానిని అనుసరించి అమెరికాలోని ఇండో-పసిఫిక్ వ్యవహారాల అధిపతి కర్ట్ కాంప్‌బెల్ తమ వ్యూహాత్మక ఆర్థిక ప్రయోజనాల కోసం మిలిటరీ కేంద్రీకరణను ఇండో-పసిఫిక్ ప్రాంతానికి మళ్లిస్తున్నామని గతంలోనే వెల్లడించాడు.

నూతన యుద్ధ కూటములకు నాంది పలకడంలో ఆరితేరిన అమెరికా చైనాను ఎదుర్కో వడంలో భాగంగా మూడు దేశాలతో ఆస్ట్రేలియా, యూనైటెడ్ కింగ్డం, యునైటెడ్ స్టేట్స్‌లతో అకుస్‌ను ఏర్పర్చింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో 'భద్రత, శ్రేయస్సు' కోసమే ఈ కొత్త త్రిభుజ కూటమి ఏర్పాటనీ ఎప్పటిలాగే అమెరికా మరో అబద్ధాన్ని ప్రకటించింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తాను సెలవిచ్చిన 'భద్రత, శ్రేయస్సు' కోసం డిగోగార్సియా, బహరైన్, డ్జిబౌటీ, గువాము, తైవాన్, జపాన్, ఫిలిప్పైన్స్, దక్షిణ కొరియాలలో అమెరికా సైన్యాన్ని, క్షిపణులను మోహరించింది. అకుస్

ఏర్పాటుతో నాటో యుద్ధ కూటమిలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. ఆస్ట్రేలియాతో ఫ్రాన్సు లోగడ 2016లో 36,400 డాలర్లతో డిజిల్‌తో నడిచే 12 జలాంతర్గాము లను ఎగుమతి చేయడానికి ఒప్పందం చేసుకుంది. కానీ, ఈ కొత్త కూటమి ఏర్పాటుతో ఆ ఒప్పందం చిత్తు కాగితంగా మారిపోయింది. అకుస్ ఏర్పడడంతో ఈయూలో ప్రబలిన విభేదాల మూలంగా ఈయూ 'గ్లోబల్ గేట్‌వేస్' పేరుతో నూతన సంబంధాల విధానం (న్యూ కనెక్టివిటీ పాలసీ)కి ప్రాణం పోసింది. ఇది ఇండో-పసిఫిక్ ప్రాంత వ్యూహంలో అందరిని కలుపుకొని పని చేస్తుందన్నారు. కాగా ఈ నిర్మాణం పట్ల చైనా 'అమెరికా యుద్ధ పరిశ్రమల కార్పొరేట్లకు లాభాలను ఆర్జించడానికే అకుస్ ఏర్పాటు అంటూ వ్యాఖ్యానించింది. అమెరికా చేతిలో ఆస్ట్రేలియా ఒక పావుగా మారిందని కూడ విమర్శించింది. ఇటీవలిదాక ప్రాచుర్యంలోకి వచ్చిన క్వాడ్, ఇపుడు కొత్తగా ఏర్పడిన అకుస్ అమెరికా యుద్ధతంత్రంలో బైడెన్ అనుసరిస్తున్న సరికొత్త వ్యూహాలే.

అమెరికా ప్రస్తుత సైన్యం 51 లక్షల 37 వేల 860 మంది కాగా అందులో క్రియాశీల సైన్యం 13 లక్షల 74 వేల 699 మంది, రిజర్వులు 8 లక్షల 45 వేలు, పారా మిలిటరీ 29 లక్షల 28 వేల 261 మంది. ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాలలో 750 సైనిక స్థావరాలను అమెరికా ఏర్పాటు చేసింది. ఇవి కాకుండా అమెరికా ఖండంలో మరో 440 సైనిక స్థావరాలున్నాయి. వాటిలో భాగంగా ప్రస్తుతం చైనా చుట్టు వందలాది అమెరికా సైనిక స్థావరాలు ఉన్నాయి. మూడింట రెండు వంతుల నౌక, వైమానిక దళాలను ఆసియా-పసిఫిక్ ప్రాంతానికి అమెరికా తరలిచింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఇదే అతి పెద్ద సైనిక కేంద్రీకరణ. అమెరికా తన మిలిటరీ ఖర్చును విపరీతంగా పెంచేస్తున్నది. దక్షిణ, తూర్పు చైనా సముద్రాలలో అమెరికా యుద్ధ నౌకలు పదే పదే సంచరిస్తున్నాయి. అమెరికా సామ్రాజ్యవాదాన్ని సదా అంటకాగే బ్రిటన్ 'మేం కూడ ఆ ప్రాంతంలో మా రెండునౌకలను ఉంచుతామనీ' జపానుతో కలిసి ప్రకటించింది. తైవాన్ సమీపంలోని ఒకినావా ఇతర జపాన్ దీవులలో అమెరికా 50వేల మంది సైనికులతో స్థావరాలను నిర్వహిస్తున్నది. ఒబామా 12సార్లు యుద్ధ నావలను తైవాన్ జలసంధివైపు నడిపిస్తే ట్రంప్ 13సార్లతో ఒబామాను మించిపోయాడు. జోబైడెన్ ఆరు నెలలలోనే ఏడుసార్లు నడిపించి ఆ ఇద్దరినీ మించి ఒక కొత్త రికార్డును నెలకొల్పాడు.

దక్షిణ చైనా సముద్రంపై ఇతర దేశాల జోక్యాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. దక్షిణ చైనాలో స్ప్రేట్లీ ద్వీపులపై తమ హక్కుల గురించి మాట్లాడుతున్న బ్రూనీ, మలేషియా, పిలిప్పీన్స్, తైవాన్, వియత్నాంల వాదనలను కొట్టిపారేస్తోంది. అమెరికా నుండి ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంతో దక్షిణ చైనా సముద్రంలో చైనా ఏకంగా ఒక కృత్రిమమైన ద్వీపాన్నే నిర్మించింది. అనేక రన్‌వేలను, నౌకాశ్రమాలను నిర్మించింది. అక్కడ మిస్పైల్ సిస్టాన్ని నెలకొల్పింది. ఇవన్నీ అమెరికా, చైనాల మధ్య ఆ ప్రాంతంపై ఆధిపత్యానికై జరుగుతున్న పోరు ఫలితం. అమెరికా చైనాను నియంత్రించడానికి అనేక నూతన యుద్ధ కూటములను కూడ ఏర్పరుస్తున్నది. జోబైడెన్ తనకున్న అపార అనుభవంతో అతి దూకుడుగా వ్యవహరిస్తున్నాడు.

4. **ఇరాన్‌తో మరిన్ని ప్రయోజనాల దిశలో బైడెన్:** 2015లో ఓబామా ప్రభుత్వం ఇరాన్‌తో న్యూక్లియర్ ఒప్పందాన్ని (జేసీపీఓఏ) కుదుర్చుకుంది. కానీ దాని నుండి ట్రంప్ ప్రభుత్వం 2018లో ఏకపక్షంగా వైదొలగింది. ఖండాంతర క్షిపణులు, మధ్యశ్రేణి అణ్వాయుధాల పరిమితి ఒప్పందం, గగనతలాన్ని స్వేచ్ఛగా ఉంచాలనే ఒప్పందాల నుంచి అమెరికా ఏకపక్షంగా వైదొలగింది. వాటిని అపుడు బైడెన్ సహా డెమాక్రట్లందరూ ఖండించారు. తిరిగి ఇరాన్‌తో ఆ ఒప్పందాన్ని పునరుద్ధరిస్తామని బైడెన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ప్రకటించాడు. కానీ గడచిన ఏడాది కాలంగా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాడు. ఇరాన్ నుండి గొంతెమ్మ కోర్కెలు కోరుతూ అనేక ప్రయోజనాలు పొందడానికి బైడెన్ కాలయాపన చేస్తున్నాడు. అందుకుగానూ షటిల్ డిప్లొమసీ (నామమాత్రపు దౌత్యం)ని అనుసరిస్తున్నాడు. ఇరాన్‌తో 8 విడుతలుగా వియన్నా మధ్యవర్తిత్వంతో చర్చించినప్పటికీ చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. మరో మధ్య ప్రాచ్య యుద్ధ ప్రమాదాన్ని ఏకరువు పెడుతున్నాడు.

5. **బైడెన్ ఎన్నికకు తోడ్పడిన కొరోనా మరణాలు, ట్రంప్ విధానాలు:** ప్రపంచంలో చోటుచేసుకున్న కొరోనా మహమ్మారీ మరణాలలో అమెరికా అగ్రశ్రేణిలో నిల్చింది. కొరోనాను అరికట్టడంలో, మరణాలను నియంత్రించడంలో ట్రంప్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. పైగా కొరోనా సమయంలో ట్రంప్ అనుసరించిన పద్ధతులు, చేసిన వ్యాఖ్యానాలు ప్రజలలో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ప్రజలలో చోటుచేసుకున్న నిరసన, ఆగ్రహాన్ని బైడెన్ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో దండిగా వినియోగించుకున్నాడు. బైడెన్ ఎన్నికయ్యేసరికి వ్యాక్సిన్ మందు తయారైంది. అధ్యక్షుడిగా ఎన్నికైన బైడెన్ టీకాలకు అనుమతించడంతో అమెరికాలో, ప్రపంచ వ్యాప్తంగా టీకాకరణ కార్యక్రమం మొదలైంది. దానితో వెన్వెంటనే వ్యాక్సిన్ సరఫరాలలో ధనిక, పేద దేశాల మధ్య; అనుంగు దేశాలకు, శతృ దేశాలకు మధ్య తారతమ్యతలు చోటుచేసుకొని వ్యాక్సిన్ దౌత్యం ముందుకు వచ్చింది. నిజానికి ప్రజలకు ఉచితంగా వ్యాక్సిన్ అందజేసి కొరోనా నుండి ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాలను ఫణంగా పెడుతూ లాభాల వేటలో సొమ్ముచేసుకోసాగాయి. ఇందుకు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఎంత మాత్రం మినహాయింపు కాదని తన యేడాది పాలనలో చాటుకున్నాడు. ప్రజలకు వ్యాక్సిన్ అందించడంలో భారీ ఫార్మాకు అండగా నిలవడం, జాతి వివక్షతో కూడిన దౌత్యానికి పూనుకోవడం జోబైడెన్ ఖాతాలో చేరాయి.

6. **పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టని బైడెన్ విధానాలు:** నాలుగేళ్ల పాలనలో ట్రంప్ పర్యావరణ వినాశనాన్ని లెక్కచేయకపోవడంతో, అనేక మంది పర్యావరణవేత్తలు బైడెన్ అధికారంలోకి రావాలని కోరుకున్నారు. అమెరికా తిరిగి 195 దేశాల అంగీకారంతో కుదిరిన

పారిస్ వాతావరణ ఒప్పందంలో (2015) చేరాలనీ కీస్టోన్ ఎక్స్ఎల్ పైప్‌లైన్ రద్దు చేయాలని వారంతా బైడెన్‌ను కోరారు. కానీ, బైడెన్ దీనికి పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తున్నాడు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన సమావేశంలో క్లీన్ ఎనర్జీ పర్ఫామెన్స్ ప్రోగ్రాంను కాదంటూ బైడెన్ సహజ వాయువు పరిశ్రమ సాక్-పప్పెట్ జో మన్చిన్ ఆదేశాలపై తన బ్యాక్ బెటర్ బిల్‌కు ప్రాణం పోసి 2030నాటికి కర్బన ఉద్గారాలను 50%కి తగ్గించే హామీని తుంగలో తొక్కాడు. ఒక పక్క కాప్ 26 ( కాన్ఫరెన్స్ ఆఫ్ ది పార్టీస్) (పర్యావరణ సమస్యలపై భాగస్వామ్య పక్షాల 26వ సదస్సు) సమావేశం జరుగుతుంటే మరోపక్క బైడెన్ ప్రభుత్వం పశ్చిం అమెరికాలోని 7 లక్షల 30 వేల ఎకరాలను, మెక్సికో గల్ఫ్ (పశ్చిమ అట్లాంటిక్ సముద్ర ప్రాంతం)లోని 80 లక్షల ఎకరాలను ఇంధనం మరియు వాయువు ( ఆయిల్ అండ్ గాస్)కు వేలం పెట్టాడు. ఇవన్నీ కర్బన ఉద్గారాలను పెంచేవే తప్ప తగ్గించేవి కావు. పర్యావరణ వినాశనానికి మరింతగా దారి తీసేవే తప్ప సంరక్షించేవి కానే కావు. గ్లాస్గో సమావేశానికి ఒక రోజు ముందు రోమ్‌లో జరిగిన అత్యున్నత పారిశ్రామిక దేశాలతో కూడిన జీ-20 సమావేశంలో నిత్యం పెరుగుతున్న పారిశ్రామిక సంస్థల నేపథ్యంలో కర్బన ఉ ద్గారాలను (గ్రీన్ హౌస్ గ్యాసెస్)ను తగ్గించడం పై కూడ చర్చించడం గమనార్హం.

7. **బైడెన్ కక్ష సాధింపు చర్యల పర్వం కొనసాగింపు:** జూలియన్ అసాంజె, డెనియల్ హెల్, గౌటనామో చిత్రహింసల బాధితులపై రాజకీయ విచారణకు పూనుకోవడం బైడెన్ సామ్రాజ్యవాద నీతిని చాటుతుంది. అమెరికా జరిపిన డ్రోన్ దాడులలో పౌరులను హతమార్చడంపై అనేక వాస్తవాలను ప్రపంచానికి వెల్లడిచేసిన మాజీ డ్రోన్ పైలట్ డెనియల్ హెల్‌కు జూలై 2021న 45 నెలల కారావాస శిక్ష విధించారు. అమెరికా యుద్ధ నేరాలను బహిర్గతపర్చినందుకు వికీలీక్స్ ప్రకాశకుడు జూలియన్ అసాంజె గత 11 సంవత్సరాలుగా ఇంగ్లండ్‌లోని బెల్‌మార్ష్ జైలులో మగ్గుతున్నాడు. మధ్య అమెరికాలోని గౌతనామాబేలో నిర్మించిన కాన్సంట్రేషన్ క్యాంపులో ప్రపంచ వ్యాప్తంగా అమెరికా సైనిక బలగాలచే అపహరించబడి శిక్ష అనుభవిస్తున్న నిర్దోషులైన 779 మందిలో ఇప్పటికీ రెండు దశాబ్దాల తర్వాత అక్కడ 39 మంది చట్ట రహితంగా బందీలుగా ఉన్నారు. నిజానికి అమెరికా రక్తసిక్త చరిత్రకు సాక్షంగా నిలిచిన గౌతనామాబే లోని కాన్సంట్రేషన్ క్యాంపును మూసేస్తానని హామీ ఇచ్చిన బైడెన్ ఇపుడు పెంటాగన్‌కు అక్కడే కోర్టురూం నిర్మించడానికి అనుమతినిచ్చి *గులగ్* పద్ధతిలో (లేబర్ క్యాంపుల విధానం. రష్యాలో ప్రధానంగా రెండవ ప్రపంచయుద్ధ కాలంలో చేపట్టిన వివిధ నిర్మాణాలు ఫాసిస్టులకు అర్థం కాకుండా ఉండడానికి ఈ పద్ధతిని అమలుచేశారు) ప్రజల కంట పడకుండా చకా చకా పనులు కానిస్తున్నారు.

8. **అమెరికా తన మాట వినని వారిపై ప్రయోగించే ఆంక్షల విధానం:** అమెరికా తన మాట వినని వారిని దారికి తెచ్చుకోవడానికి అనుసరించే చేతులు మెలిపెట్టే విధానాలలో భాగంగా ఆయా దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించడం, ఆర్థిక దిగ్బంధనానికి గురిచేయడం. ఓబామా కాలంలో క్యూబాలో కామ్రేడ్ ఫైడెల్ కాస్ట్రో పాలన నుండి అమలవుతున్న ప్రజా అనుకూల విధానాలను ఓర్వలేకపోయిన అమెరికా సామ్రాజ్యవాదులు అక్కడ రాహుల్ కాస్ట్రో గద్దెనెక్కిన అనంతరం నుండి చతురోపాయా లతో అమలులోకి తెచ్చిన అమెరికా తరహా సంస్కరణలను ట్రంప్ ఏకపక్షంగా నిలిపివేశాడు. అక్కడ ఎన్నికైన అధ్యక్షుడిని అనేక కుట్రలు కుహకాలతో గద్దె దింపి అక్కడి మెజార్టీ ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా తమ తొత్తు జువాన్ గైడోను అధ్యక్షుడిగా వారిపై రుద్దాడు. అమెరికా తన మాట వినని దేశాల పట్ల చిరకాలంగా అనుసరిస్తున్న విఫల ఆంక్షల విధానాన్ని బైడెన్ కొనసాగిస్తున్నాడు. దుర్మార్గమైన ఈ విధానాలను ప్రభుత్వాల మార్పిడిలో అమెరికా విస్తృతంగా వినియోగిస్తూ అనేక దేశాల ప్రజల క్రోధాన్ని మూటగట్టుకుంది. మానవ హక్కుల పట్ల, అమెరికా వల్లించే ప్రజాస్వామ్యం పట్ల దాని నిజమైన మానవ మృగ అవతారాన్ని తెలుపుతుంది. దక్షిణ అమెరికాలోని బొలీవియా, పెరూ, చిలీ, హొండూరాస్‌లలో ఇప్పటికీ వివిధ రూపాలలో ఆంక్షలు అమలులో ఉన్నవి. ఇప్పటికే వందలాది తమ పాశవిక బలగాలను మోహరించిన బ్రెజిల్‌లో అమెరికా ఏ క్షణానైనా అక్కడ ప్రభుత్వ మార్పిడికి పూనుకొని ఆ చర్యలను చేపట్టవచ్చు. రష్యా నుండి ఎస్. 400 కొనుగోలు చేస్తే, టర్కీపై ఆంక్షలకి పూనుకుంది. ఇపుడు ఉక్రెయిన్ విషయంలో బైడెన్ ఆంక్షలకు తెర లేపడానికి ఉబలాటపడుతున్నాడు.

9. **పశ్చిమాసియాలో ఆయుధాల వ్యాపారాన్ని తీవ్రం చేస్తున్న బైడెన్:** సౌదీ అరేబియా అండతో యెమెన్‌లో మారణకాండను కొనసాగిస్తున్న అక్కడి పాలకులను సమర్థిస్తూ అమెరికా ప్రజల ఊచకోతకు సూత్రదారిగా ఉంది. ట్రంప్ పాలనలోనే డెమాక్రట్లుతో పాటు రిపబ్లికన్‌లు సౌదీ నాయకత్వంలోని కూటమి యెమెన్‌లో దాడులకు పాల్పడకూడదనీ అక్కడి నుండి ఉపసంహరించుకోవాలనీ అమెరికా సౌదీకి ఆయుధాలు సరఫరా చేయకూడదనీ అమెరికా కాంగ్రెస్‌లో ఓటు చేశారు. కానీ, దానిని అపుడు ట్రంప్ వీటో చేశాడు. 2020 ఎన్నికలలో గెలిచిన బైడెన్ డెమాక్రట్ల అభిప్రాయాలను తుంగలో తొక్కుతూ ఎలాంటి వివరణ లేకుండా 'ఆఫెన్సివ్' ఆయుధాల సరఫరానే నిలిపివేయాలనీ ఆదేశిస్తూనే సౌదీతో 650 మిలియన్ డాలర్ల ఆయుధాల అమ్మకానికి పచ్చజెండా ఊపాడు. అంటే దొడ్డి దారిన ఆయన సౌదీ యుద్ధాన్ని సమర్థిస్తున్నాడు. తమ దేశ పాత్రికేయుడు కషోగీని హతమార్చిన వారిని అంతర్జాతీయంగా వెలివేస్తామని ప్రగల్భాలు పలికిన బైడెన్ గద్దెనెక్కి అమెరికా వ్యాపార నీతినే కొనసాగిస్తున్నాడు. అమెరికాలో తయారైన ఆయుధాల వ్యాపారంతో యెమెన్‌లో పసికూనలతో సహా వేలాది పిల్లల మరణాలకు, ఊచకోతలకు తోడ్పడుతూ మిలిటరీ ఉత్పత్తిదారుల ఆకలి తీరుస్తున్నాడు.

10. **పెంపుడు దేశం ఇజ్రాయిల్ పట్ల మారని బైడెన్ ధోరణి:** ఇజ్రాయిల్

గత అనేక దశాబ్దాలుగా కొనసాగిస్తున్న యుద్ధ నేరాలను, నివాస కాలనీలను నిర్మించడం, వివిధ దేశాల భూభాగాల దురాక్రమణలను అమెరికా అండతోనేనన్నది జగమెరిగిన సత్యం. పాలస్తీనా దురాక్రణ, గాజా పట్టీలో యుద్ధ నేరాలతో పాటు అక్రమ కాలనీల నిర్మాణం అమెరికా చలవతోనే సాగాయన్నది చారిత్రిక వాస్తవం. ప్రపంచంలోనే అతి పెద్ద ఆయుధ గ్రహీత ఇజ్రాయిల్ అంటే దానికి అత్యంత భారీ ఆయుధ సరఫరాదారు అమెరికానే. అమెరికా యేటా హీనపక్షంలో నాలుగు బిలియన్ డాలర్ల ఆయుధాలను ఇజ్రాయిల్‌కు అమ్ముతోంది. నిజానికి ఇది అమెరికాలోని లీహీ చట్టాలను, ఆయుధాల ఎగుమతి నియంత్రణ చట్టాలను అపహాస్యం చేయడమే. ట్రంప్ ప్రపంచమంతా ఖండించినా లెక్కచేయకుండా టెలీఅవీవ్ నుండి జెరుసలెంకు మార్చిన అమెరికా దౌత్య కార్యాలయాన్ని బైడెన్ యధాతథంగానే కొనసాగిస్తున్నాడు. ఇటీవల మే 2021లో గాజాపై ఇజ్రాయిల్ జరిపిన దాడిని బైడెన్ తన ముందు వారి తరహాలోనే సంపూర్ణంగా సమర్థించాడు.

**భారత్ పట్ల బైడెన్ వైఖరి:**

అమెరికాలోని 40 లక్షల భారతీయులను మచ్చిక చేసుకోవడానికి ట్రంప్ ఎన్నికలకు ముందు భారత ప్రధాని మోదీతో చెట్టాపట్లాలేసుకొని రెండు దేశాలలో వేదికలెక్కడం చూశాం. కానీ, ఆ సామ్రాజ్యవాద వ్యాపారి తమ దేశ ప్రయోజనాల విషయానికి వచ్చేసరికి మాత్రం మోదీ ముందు లక్ష్మణరేఖలు గీచాడు. ట్రంప్ భారతీయులకు హెచ్*1బీ* వీసా (ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించినది), హెచ్*4* (అమెరికాలో ఉంటున్నవారి సంబంధీకులకు ఉద్దేశించినది)ను నిలిపివేయగా బైడెన్ మాత్రం వాటిని పునరుద్దరించాడు. గ్రీన్‌కార్డు నిబంధనలను సడలించాడు. కశ్మీర్ విషయంలో భారత్ నిర్ణయాలను స్వాగతిస్తామంటూ అమెరికా విదేశాంగ ప్రతినిధి నెడ్‌ప్రైస్ వెల్లడించాడు. సాధారణంగా భారతీయులలో అత్యధికులు డెమాక్రట్ల పక్షం ఉంటుండడంతో జోబైడెన్ తనకు ఉపాధ్యక్షురాలుగా భారత సంతతికి చెందిన హారిస్‌ను ఎన్నుకున్నాడు. (వారి సంబంధాలలో తలెత్తిన ప్రస్తుత సంక్షోభం విడి అంశం). సెప్టెంబర్‌లో ఇరు దేశాల నాయకులు శ్వేతసౌధంలో సమావేశమైనపుడు రెండు దేశాల మధ్య వ్యాపారమే కీలకమంటూ, ఒకరికొకరు కితాబులిచ్చుకున్నారు. 2020 నాటికి ప్రపంచంలో అమెరికా భారత్‌లు అత్యంత సన్నిహిత దేశాలుగా ఉంటాయనీ తాను 2006లోనే చెప్పానని గుర్తు చేశాడు. భారత్ అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాలు ఈడేర్చినంత కాలం ఏ అధ్యక్షుడు అయినా భారత మార్కెట్‌ను వదలుకోరు. వారంతా భారతదేశాన్ని, భారత దళారీ పాలకవర్గాలను వ్యూహాత్మకంగా చైనాకు వ్యతిరేకంగా, వ్యాపార పరంగా దోపిడీకి యథేచ్ఛగా వాడుకుంటారు.

ఇటీవలే ముగిసిన జీ–7 దేశాల సమావేశానికి (అమెరికా, ఇంగ్లండ్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్) యూరోపియన్ యూరోపియన్ ప్రతినిధులు ఎప్పటిలాగే ఆహ్వానితులు కాగా ఈసారి భారత్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికాలను సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన ఇంగ్లండ్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఆహ్వానించాడు. 1997–2014 వరకు అందులో సభ్యత్వం కలిగి ఉన్న రష్యాను ఆ తరువాత ఎప్పుడూ పిలవలేదు. కాగా చైనాను వారెన్నడూ ఆహ్వానించరు, ఆ దేశానికి సంబంధించిన విషయాలను కూడ పెద్దగా చర్చలోకి తీసుకోరు. కానీ, ఈసారి మాత్రం యావత్తు చర్చలు దాని పైనే కేంద్రీకరించారు. మూడు 'సీ'ల చుట్టే (కొరోనా, క్లైమెట్, చైనా)వారి చర్చలు సాగాయనీ పరిశీలకులు విశ్లేషించారు. చైనా గత కొన్ని సంవత్సరాలుగా బిల్డ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ) పై వంద దేశాలను కలుపుకొని పని చేస్తున్న విషయం తెలిసిందే. వాటిలో వర్తమాన జీ–7 సమూహంలోని ఇటలీ, ప్రత్యేక ఆహ్వానితులలో నుండి దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియాలు మాత్రమే ఉన్నవి. చైనా చేపట్టిన బీఆర్ఐకి ప్రతిగా జీ–7 సమావేశం 'బీ 3 డబ్ల్యూ'ని ముందుకు తెచ్చింది. దీనిని అమెరికా రాష్ట్రపతి జోబైడెన్ ప్రోత్సహిస్తున్న విషయం గమనార్హం. అమెరికా, భారత్ రెండు దేశాలు చైనా చేపట్టిన బీఆర్ఐని వ్యతిరేకిస్తున్నవి. ప్రస్తుతం ముందుకు తెచ్చిన నూతన ప్రాజెక్ట్ బీ 3 డబ్ల్యూ ఏ మేరకు బీఆర్ఐకి ప్రతిబంధకంగా మారనుందో చూడాల్సిందే.

అమెరికా అధ్యక్షుడిగా జోబైడెన్ ఎన్నికైన యేడాది పాలనలో ఇంటా బయటా ఆయన ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలన్నీ పాత విధానాలను మరింత దూకుడుగా, చైనాను ఎదుర్కొనే లక్ష్యంతో కొనసాగించడం మాత్రమేనని ఎన్నికల సమయంలో బైడెన్ అక్కడి ప్రజలకు 'అమెరికా ప్రపంచాధిపత్యాన్ని పునరుద్ధరిస్తాననీ' ఇచ్చిన హామీలో భాగంగా అమలవుతున్నాయనీ మారుతున్న పరిస్థితులను (రాజకీయ సమీకరణలను) దృష్టిలో పెట్టుకొని మరింత వేగంగా దూకుడుగా చోటుచేసుకుంటున్నాయనీ బైడెన్ పాలన తేటతెల్లం చేస్తోంది. ఇప్పటివరకు అమెరికా తన బడ్జెట్‌లో 3.5%సైనిక రంగానికి కెటాయిస్తు వస్తున్నది. 2020 ఆర్థిక సంవత్సరానికి గానూ రక్షణ బడ్జెట్ 703.7 బిలియన్ డాలర్లు. దానిని 4 శాతానికి పెంచినా సరిపోదనీ 6 శాతానికి పెంచాలని సైనిక విశ్లేషకులు ప్రతిపాదిస్తున్నారు. 2022 సంవత్సరానికి గాను పెంటాగన్ 715 బిలియను డాలర్ల బడ్జెట్‌ను కోరింది. నిజానికి అమెరికా తన సైనిక బడ్జెటును ఎంత కెటాయించాలనేది చైనా నిర్ణయిస్తుందనే వాదన వాస్తవాన్ని ఎత్తిపడుతుంది. అమెరికా, చైనా సామ్రాజ్యవాదాలు తమ తమ పలుకుబడి క్షేత్రాలను కాపాడుకోవడానికి, పెంచుకోవడానికి తీవ్రంగా పోటీ పడుతున్నాయి. విశ్వ రాజకీయాలకు అధికారానికి పది ప్రాంతాలు ఆస్ట్రేలియా, సహేల్, గ్రీస్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డం, ఇరాన్, ఈథియోపియా, సౌదీ అరేబియా, స్పెయిన్‌లతో పాటు చివరగా అంతరిక్షం కూడా కేంద్రాలు కానున్నవి. రానున్న ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాలను ఈ పది ప్రాంతాలు వివిధ రకాలుగా ప్రభావితం చేయనున్నవని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా ప్రపంచ మౌలిక వైరుధ్యాలు గతం కన్నా పదనెక్కుతూ తీవ్రమవుతున్నాయి.

★

## విడిపోయే హక్కుతో సహ జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని ఎత్తిపడుదాం

# ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీరీ జాతి ప్రజల ఆకాంక్షలను అణచలేరు

2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసింది. జమ్మూ కశ్మీర్, లద్దాఖ్‌లు రెండు విడి విడి కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఉనికిలోకి వచ్చాయి. 72 యేళ్ల క్రితం కశ్మీర్ రాజు హరిసింగ్‌తో భారత ప్రభుత్వం (ప్రధాని నెహ్రూ) చేసుకున్న ఒప్పందంలో భాగంగా జమ్మూ కశ్మీర్‌లో ప్రజాభిప్రాయాన్ని సేకరించడానికి ఇన్నాళ్లుగా వెరచిన భారత పాలక వర్గాలు ఆ ఆర్టికల్‌కే సవరణల పేరుతో తూట్లు పొడుస్తూ వచ్చాయి. ఇక 2019లో ఏకంగా హిందుత్వ శక్తులు తమ ఏజండాలో భాగంగా కశ్మీర్‌కు ప్రత్యేక అధికారాలను (స్వ పరిపాలన) గుర్తించే ఆర్టికల్ 370తో పాటు 35 ఏను రద్దు చేశారు. గత ప్రభుత్వాలేవీ అంతటి సాహసానికి పూనుకోలేదనీ తమ ప్రభుత్వమే ఆ పని చేయగలిగిందనీ మోదీ భజనపరులు జబ్బలు చరచు కున్నారు. ఇక మోదీ అయితే చరిత్రను పూర్తిగా వక్రీకరిస్తూ భారత తొలి ప్రధాని నెహ్రూను దుయ్యబడుతూ ఆర్టికల్ 370 ఉనికిలోకి వచ్చిన నేపథ్యాన్నే మసి పూసి మారెడుకాయ చేశాడు. వాస్తవంగా రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ 370, కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరిగేంతవరకూ ఉనికిలో ఉండి తీరాలి. దానికి భారత పార్లమెంటు సవరణలు కూడ చేయకూడదు. ఆ అర్థంలోనే ఆనాటి పరిస్థితులలో రెండు ప్రభుత్వాల మధ్య (హరిసింగ్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం) తాత్కాలికంగా అంటే ప్రజాభిప్రాయ సేకరణ వరకు అనే అర్థంలోనే ఆర్టికల్ 370 ఉనికిలో ఉంటుందని ఒప్పందం జరిగింది. ఈ వాస్తవాన్ని ప్రజలకు చెప్పే సాహసం మోదీకి గానీ, ఆయన భజనపరులకు కానీ, ఇతర ఏ హిందుత్వ శక్తికి గానీ లేదు. పార్లమెంటు ప్రతిపక్షాలు సైతం గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు పుణుక్కున్నట్లు ఈ వాస్తవాన్ని ధైర్యంగా చెప్పలేకపోతున్నాయి. మన దేశంలోని రివిజనిస్టు పార్టీలు సహ పార్లమెంటరీ పార్టీలన్నీ కశ్మీర్‌ను భారతదేశంలో భాగంగానే, ఒక రాష్ట్రంగానే, చూస్తున్న ఫలితంగా అవన్నీ ఒకే తాను ముక్కలు కావడంతో ఆ ప్రజలకు ఇప్పటి వరకూ జరుగుతున్న అన్యాయంపై నోరు మెదుపడం లేదు. అక్కడి ప్రధాన మంత్రిని ముఖ్యమంత్రి స్థాయికి కుదించారు. అక్కడి శాసనసభపై రెపరెపలాడే వారి జెండాను దించేసి మువ్వన్నెల జెండానెక్కించారు. వారి రాజ్యాంగాన్ని రద్దు చేసి భారత రాజ్యాంగమే వారి రాజ్యాంగమన్నారు. వారికి భారత సుప్రీం కోర్టే సర్వోపరి చేశారు. నిజంగా ఇవన్నీ నిజమైన ఫెడరల్ విధానాలకు గొడ్డలిపెట్టు లాంటివి. వారికి జాతీయ గీతంగా 'జనగనమన' వారితో పాడిస్తున్నారు. గత 72 యేళ్లుగా భారత పాలక వర్గాలు అనుసరిస్తున్న ఈ జాతి వ్యతిరేక విధానాలను ఫెడరల్ భారతాన్ని, జాతుల రిపబ్లిక్‌ను కోరుకునే వారంతా ముక్తకంఠంతో ఖండించాలి. విడిపోయే హక్కుతో సహ జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని ఎత్తిపట్టే వైఖరి తీసుకునేవారు తప్ప ఈ భూమ్మీద ఏ శక్తీ కశ్మీరీ జాతి ప్రజలకు అండగా నిలువదు. 'ఆజాదీ కశ్మీర్' అని నినదించదు. ఆజాదీ కశ్మీర్ సాధించుకునే వరకు ఆ వీర కశ్మీరీ ప్రజలు పోరాడితీరుతారు. మోదీ, అమిత్‌షా, భాగవత్‌లు ఎవరైనా కానీ లేదా ఇంకే రియాక్షనరీ శక్తి కానీ ఎంతటి నిర్బంధానికి పాల్పడినా, ఎన్ని లక్షల సైన్యాన్ని మోహరించినా, ఎన్ని అభాండాలు ఆ ఉద్యమకారులపై వేసినా, ఎంతటి ఊచకోతకు పాల్పడినా కశ్మీరీ జాతి ప్రజలు పోరాడి తీరుతారనీ గత రెండేళ్ల పరిణామాలు ప్రపంచానికి చాటుతున్నాయి.

కశ్మీర్‌ను భూతల స్వర్గం చేస్తామనీ, ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 ఏ దాని అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయనీ మోదీ తన హిపోక్రసీతో ప్రపంచాన్ని వంచించాలనుకున్నాడు. కానీ గత రెండేళ్ల చరిత్ర కశ్మీరీ జాతి ప్రజల న్యాయమైన డిమాండ్‌కు మరేదీ ప్రత్యామ్నాయం కాదనీ నిరూపించింది. అక్కడ యేళ్ల తరబడిగా అంతర్జాలం పని చేయడం లేదు. దానిపై నిషేధాన్ని ఎత్తివేసే సాహసమే భారత ప్రభుత్వానికి లేదు. అక్కడి మాజీ ముఖ్య మంత్రులతో సహ అనేక మంది బూర్జువా నాయకులను నెలల తరబడి గృహ నిర్బంధంలో ఉంచారు. వారిని ప్రజల వద్దకు స్వేచ్ఛగా వెళ్లనిచ్చే ధైర్యం భారత హోం శాఖకే లేదు. అక్కడికి కనీసం పార్లమెంటరీ ప్రతిపక్షాలనైనా స్వేచ్ఛగా వెళ్లనివ్వని పిరికితనం వర్తమాన హిందుత్వ పాలకులది. మీడియాను అనుమతించని డోభాల్ విధానాలు అక్కడ 'వర్ధిల్లుతున్నాయి'. అక్కడ ప్రజలు వ్యక్తం చేస్తున్న తీవ్ర నిరసనలు భారీ భారత సైనిక బలగాల మోహరింపులో బయటి ప్రపంచానికి పాలక వర్గాలు చేసే ఉగ్రవాద హోరులో వినిపించడం లేదు. కేంద్ర పాలిత ప్రాంతం కావడంతో నామమాత్ర పౌరహక్కులు సైతం కాలరాచివేస్తున్నారు.

ఆర్టికల్ 370 రద్దయ్యాక దాదాపు యేణ్ణర్థం దాటాక దేశ ప్రధాని, గృహ మంత్రి కశ్మీర్‌లో మాజీ ముఖ్యమంత్రులు నలుగురు సహ అక్కడి రాజకీయ నాయకులతో సమావేశం జరిపారు. అక్కడి నియోజికవర్గాలను పునర్వవస్థీకరించి ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఎందుకీ పునర్వవస్థీకరణ? ఎన్నికలలో ప్రయోజనాలను పొందడానికి తమకు అనుకూలంగా ఈ పునర్వవస్థీకరణ తప్ప మరేం కాదే. కశ్మీర్ సమస్యకు మూల కారకుడు నెహ్రూ అని నిందించే మోదీ శక్తులు జమ్మూ కన్నా కశ్మీర్‌లో జనాభా తక్కువ ఉన్నప్పటికీ దానికి అధికంగా అసెంబ్లీ సీట్లు సమకూర్చారనీ అవాస్తవాలను ఉల్లేఖిస్తున్నారు. వాస్తవాంగా 2011 జనగణనాల ప్రకారం కశ్మీర్ జనాభా 68.88 లక్షలు ఉండగా, జమ్మూ జనాభా 53.79 లక్షలు మాత్రమే. జమ్మూ-కశ్మీర్‌కు చెందిన పలు రాజకీయ పార్టీలు నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, సీపీఐ(ఎం), పీపుల్స్ మూవ్‌మెంట్,

అవామీ నేషనల్ కాన్ఫరెన్స్‌లతో కూడిన ఐక్య వేదిక 'గుప్కార్ డిక్లరేషన్' కోసం ఏర్పడిన ప్రజా సమ్మేళనం (పిఎజిడి) పిలుపు మేరకు జమ్మూ కశ్మీర్ డీ లిమిటేషన్ కమిషన్‌కి వ్యతిరేకంగా 2022 జనవరి 1న నూతన సంవత్సరంలో నిరసన ప్రదర్శనలకు సిద్ధపడగా ముందుగానే పిఎజిడి నాయకులను అరెస్టు చేసారు.

మోదీ, షాలు నిర్వహించిన జూన్ 24 సమావేశానికి హాజరైన నాయకులు జమ్మూ కశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలనీ చేసిన డిమాండ్‌పై వారు మౌనం వహించారు. మాజీ ముఖ్యమంత్రులలో ఒకరు మహబూబా ముఫ్తీ తిరిగి ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలనీ, పాకిస్తాన్‌తో చర్చలు చేయాలనీ కోరింది. ఆ మీటింగ్ తదుపరి మాజీ ముఖ్యమంత్రి ఫారూఖ్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ భారత రాజ్యాంగం పరిధిలో కశ్మీర్‌లో నెహ్రూ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతామంటే, ఆ తరువాతి ప్రధాని నరసింహరావు అందుకు అవకాశమే లేదని తనదైన శైలిలో (స్కై ఈజ్ ద లిమిట్) అన్నాడు. ఆ తరువాత ప్రధానమంత్రి పదవిని అలంకరించిన బీజేపీ నాయకుడు అటల్ బీహారీ వాజ్‌పాయి 'మానవత, ప్రజాతంత్ర, కశ్మీరియత' (ఇన్సానియత్, డెమాక్రసీ, కశ్మీరియత్) సూత్రాలను పాటిస్తాం అన్నారు. ఎవరూ దేన్నీ అమలు చేయలేదు. ఇవన్నీ కాలయాపన ఎత్తుగడలు, ప్రజల హృదయాలలో నుండి వారి జాతి ఆకాంక్షలను చెరిపివేయాలనే కుట్రలు తప్ప మరేం కావు. ఈ కుట్రలకు ఆజ్యం పోస్తున్నది సామ్రాజ్యవాదులు ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదులన్నది దాగని సత్యం. 'హిందూ హృదయ సామ్రాట్' మోదీ 'మనసుల మధ్య అగాధం' (దిల్ కి దూరీ) గురించి గొప్పగా మాట్లాడుతున్నాడు. కానీ ఏడేళ్ల ఆయన పాలనలో కానీ, ఇన్సానియత్, కశ్మీరియత్, ప్రజాస్వామ్యం గురించి వల్లించిన వాజ్‌పాయి కాలంలో కానీ మొత్తంగా 13 ఏండ్లలో కశ్మీరీ పండితుల సమస్యను మరింత తీవ్రం చేశారే తప్ప ఉద్దేశపూర్వకంగానే చల్లార్చలేదు.

దేశ జనాభాలో ఒక శాతంగా ఉన్న కశ్మీర్‌లో నేషనల్ బ్యూరో ఆఫ్ క్రైం రికార్డ్స్ 2020 నివేదిక ప్రకారం యూఏపీఏ కేసులు 1/3 వ వంతు (287/796) నమోదయ్యాయి. ఈ కేసుల గురించి గోదీ మీడియా ఎలాగూ రాయదు. మిగితా మీడియాలో రాకుండా కేంద్రం నిరంకుశంగా అడ్డుకుంటున్నది. ఆర్టికల్ 370 కశ్మీర్ అభివృద్ధికి ఆటంకం అంటూ హిందుత్వ శక్తులు చేస్తున్న ప్రచారం శుద్ధ అబద్ధం అని కశ్మీర్ ఛేంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ వారు ఇటీవల వెల్లడించిన గణాంకాల ప్రకారం రుజువయ్యింది. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కశ్మీర్‌లో రు. 40,000 కోట్ల విలువగల ఉత్పత్తి కార్యకలాపాలు నిలిచిపోయాయనీ, 4 లక్షల 97వేల ఉద్యోగాలు నష్టపోవడం జరిగిందనీ వారి అధ్యయనంలో వెల్లడైంది. వారి అంచనా ప్రకారం పండ్ల వ్యాపారం, వస్త్రాలు, తివాచీలు, ఐటి కమ్యూనికేషన్, రవాణా రంగాలు తీవ్రంగా నష్టపోయాయి. సైనిక బలగాలు సాగించిన పాశవిక చర్యలే కాకుండా నిరంకుశమైన చట్టాల ద్వారా ప్రజలకు జీవనాధారం లేకుండా చేస్తున్నారు. 2019 తర్వాత ప్రభుత్వం చేపట్టిన కొత్త చట్టాలలో వందలాది సంచార జాతులను నిర్వాసితులను చేసిన, వారి తరతరాల నివాసలైన అడవుల నుండి, పశుగ్రాస ప్రాంతాల నుండి వెళ్లగొట్టిన భూమి చట్టాలు ఉన్నాయి. పాస్ పోర్టులు నిరాకరణ, ఉద్యోగాల నుండి తొలగించడం, కుటుంబ సభ్యులపై, బంధువులపై, సన్నిహితులపై చేసిన నేరారోపణలతో కూడా కొత్త ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఈ అణచివేత చర్యలేవీ చర్చకు రావడం లేదు.

2020 జూన్ నుండి ప్రచార మాధ్యమాల విధానం అనేది అమలులో ఉన్న సెన్సార్‌షిప్‌కు జతకలిసింది. ఈ విధానాల ప్రధాన లక్ష్యం ప్రభుత్వం గురించి సానుకూల దృక్పథం కల్పించడం అనే పేరుతో భయం గొలిపే నిశబ్దాన్ని సృష్టిస్తున్నారు. ప్రచార మాధ్యమాలు మౌనంలోకి జారిపోవడం అంటే ప్రజానీకం గొంతు కోల్పోయినట్లే. చిత్రహింసలు, హత్యలు, అత్యాచారాలు, బలవంతపు అదృశ్యాలు వంటి దారుణమైన మానవ హక్కుల ఉల్లంఘనలు గతం కన్నా తీవ్రమయ్యాయి. పుండు మీద కారం చల్లినట్లు ప్రభుత్వం, భద్రతా బలగాలు సాధించిన విజయాలంటూ అధికరణం 370 రద్దు వలన కలిగిన ప్రయోజనాలంటూ మోదీ ప్రభుత్వం పదేపదే చెబుతూ అనేక కథనాలు ప్రచారం చేస్తోంది.

కశ్మీర్ ప్రజల సమస్య అంటే ఆజాదీ కోసం వారు భారత పాలకులచే, వారి భద్రతా బలగాలచే, సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టంచే అనుభవిస్తున్న దోపిడీ–దౌర్జన్యాలు; హత్యలు–అత్యా చారాలు; హక్కుల హననం–అణచివేతలు; అసత్య ప్రచారం –అవమానాలను భరిస్తూ పోరాడుతున్న చరిత్ర. రోజూ ఎక్కడో ఒక చోట ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్ పేరుతో కథనాలతో ప్రాణాలు హరించే సమస్య, కశ్మీర్ మహిళలపై అత్యాచారాల సమస్య. వాటికి తోడు కశ్మీర్ ప్రజల భూములు, సంపదలు కొల్లగొట్టే సమస్య, నిత్య నిర్బంధంలో ఉపాధి సమస్య, ఉద్యోగ భద్రత సమస్య, విద్య, వైద్యం కరువైన సమస్య, ఆకలి చావులు, అనారోగ్య మరణాలు పెరుగుతున్న సమస్య. వీటికి పరిష్కారం భారత దోపిడీ పాలక వర్గాల వద్ద వారిని డిక్టేట్ చేస్తున్న సామ్రాజ్యవాదుల వద్ద లేదు. ఆజాదీ కశ్మీర్ సాధన తప్ప మరేదీ పరిష్కారం కానే కాదు.

భారత సైన్యం ప్రజల్ని మిలిటెంట్ల పేరుతో లష్కరే తొయిబా మిలిటెంట్లనీ, అన్ గ్రౌండ్ వర్కర్స్ అంటూ రోజూ యువతను కాల్చి చంపుతోంది. వలస కూలీలను, సామాన్య ప్రజలను గుర్తు తెలియని వ్యక్తుల పేరుతో చంపేస్తున్నది. మరో పక్క ప్రజల పై వందల, వేల కేసులు పెట్టి జైళ్లకు తరలిస్తున్నారు. ఇందులో టీచర్లు, ఉద్యోగులు, విలేకరులు, చిన్న వ్యాపారులూ వున్నారు. కశ్మీర్‌లో 80 లక్షల మంది కశ్మీరీ ప్రజలకి వ్యతిరేకంగా 9 లక్షల సైన్యాన్ని మోహరించింది.

**(తరువాయి 27వ పేజిలో)**

# బూటకపు ఆజాదీకా అమృత్ మహోత్సవాలని బహిష్కరించండి!

**"భారతదేశంలో ప్రజలు ఆకలితో రోడ్ల మీద తిరుగుతున్నారు. సామూహిక వంట శాలలు నిర్వహించి వారి ఆకలి తీర్చండి."**

**(భారత ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ)**

## స్వాతంత్రం ఎవరికి వచ్చింది? అమృతం ఎవరికి అందింది?

భారతదేశానికి బూటకపు స్వాతంత్రం వచ్చి 2022వ సంవత్సరానికి 75 ఏళ్లు అయ్యే సందర్భంగా 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' వేడుకలు జరపాలని మోదీ ప్రభుత్వం ప్రకటించి, ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది. ఒకవైపు స్వాతంత్రం కోసం పోరాడుతూ నిండు ప్రాణాలు అర్పించిన యోధులను కీర్తిస్తూ, మరోవైపు వారి ఆశయాలకి, ఆంకాంక్షలకి తూట్లు పొడుస్తూ దేశాన్ని సామ్రాజ్యవాదులకి అప్పనంగా అమ్మేస్తున్నది. మోదీ ప్రభుత్వం తన చేతిలో ఉన్న అధికారాన్ని, మీడియాని ఉపయోగించుకుంటూ దేశభక్తి అంటూ ప్రచార ఆర్భాటం చేస్తూ ప్రజల్ని పక్కదారి పట్టిస్తోంది. నిజానికి స్వాతంత్రం వచ్చింది ఎవరికి? అమృతం అందింది ఎవరికి? అనేది చూడాలి.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని సుమారు 200 ఏళ్లు ప్రత్యక్షంగా పరిపాలించి ఇక్కడి ప్రాకృతిక సంపదనీ, ప్రజల శ్రమశక్తినీ పాశవికంగా దోచుకున్నారు. బ్రిటిష్‌వారి దోపిడీ అణచివేతల్ని వ్యతిరేకిస్తూ ఆదివాసులు, రైతాంగం, కార్మికులు, పీడిత ప్రజలు అందరూ ప్రాణాలకి తెగించి పోరాడారు. ఎన్నో అవమానాలు పొందారు, జైళ్ల పాలయ్యారు, ప్రాణాలు అర్పించారు. రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతం అయిన తర్వాత పోరాడే ప్రజలకు అది మార్గాన్ని చూపింది. సామ్రాజ్యవాదులకి మునుపటిలా తమ వలసలు నిలుపుకోవటం సాధ్యం కాదని అర్థం అయింది. వలస దేశాలలో సైనిక, రాజకీయ అధికారాన్ని తమ దళారీలకి అప్పగించాలని, దళారీలని రూపుదిద్దే పని ప్రారంభించారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత దేశవ్యాప్తంగా ప్రజలు చైతన్యవంతులై పెద్దయెత్తున ఎక్కడికక్కడ తిరుగుబాట్లు చేయటంతో సామ్రాజ్య వాదుల దళారీగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా 'క్విట్ ఇండియా' అని నినాదం ఇవ్వక తప్పలేదు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత దేశంలో అనేక చోట్ల కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగి మూడు ప్రాంతాల్లో రైతాంగ సాయుధ పోరాటాలు మొదలైనాయి. బ్రిటిష్ సైన్యంలో కూడా తిరుగుబాటు మొదలైంది. ఈ స్థితిలో సువిశాల దేశాన్ని పాలించటం కష్టం అని బ్రిటిష్ పాలకవర్గాలు భావించాయి. మరో దారిలేక బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దేశంలోని దళారీ వర్గాలకీ, నమ్మిన బంట్లుగా పనిచేసిన గాంధీ, నెహ్రూ వంటి కాంగ్రెస్ నాయకులకి అధికారాన్ని అప్పగించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల లాభాలకి ఎలాంటి నష్టం రాకుండా దళారీ బూర్జువావర్గంతో, భూస్వాములతో అన్ని రకాల ఒప్పందాలు చేసుకొని దేశాన్ని విడిచివెళ్లారు.

1947 ఆగస్టు 15 తర్వాత బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష పాలన పోయి అనేక సామ్రాజ్యవాద దేశాల పరోక్ష నియంత్రణ మొదలైంది. భారతదేశం వలస నుండి అర్ధవలసగా మారింది. దేశంలోని భూస్వామ్యవర్గం, దళారీ నిరంకుశ బూర్జువావర్గం అధికారాన్ని చేతబట్టి స్వాతంత్ర ఫలాలని కాజేశాయి, కాజేస్తున్నాయి. స్వాతంత్రం కోసం అనన్య త్యాగాలు చేసిన ప్రజలకి మాత్రం ఆకలి, పేదరికమే మిగిలాయి. 1947 తర్వాత కూడా పీడిత ప్రజలు అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య దోపిడీ అణచివేతకి గురౌతున్నారు. బూటకపు స్వాతంత్ర్య తర్వాత ధనికులు మరింత ధనికులు, పేదలు మరింత పేదలయ్యారు. అందుకనే దీన్ని బూటకపు స్వాతంత్ర్యం అంటున్నాం. బ్రిటీష్‌వాళ్లు దేశాన్ని విడిచి వెళ్లినంత మాత్రాన ప్రజలకి స్వాతంత్రం రాదు. ప్రజలు దోపిడీవర్గాల దోపిడీ, అణచివేతలకి గురికాని సోషలిస్టు సమాజం వస్తేనే అసలైన స్వాతంత్ర్యం వస్తుందని భగత్‌సింగ్ అన్న మాట ముమ్మాటికి నిజం.

అధికారంలో ఏ పార్టీ ఉన్నా గానీ కాంగ్రెస్ అయినా, బీజేపి అయినా, ప్రాంతీయ పార్టీలైనా అన్నీ కూడా భూస్వాముల, దళారీ నిరంకుశ బూర్జువాల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు నెరవేర్చేవే. పేదప్రజల్ని మరింత పేదరికంలోకి నెట్టి, వారి రక్తమాంసాలు పీల్చుకుతినేవే.

గాంధీ నాయకత్వంలో అహింసా పోరాటం చేసి బ్రిటీషువాళ్లని తరిమేసి, స్వాతంత్రం తెచ్చామని దోపిడీవర్గాలు గొప్పలు చెపుతున్నాయి. నిజంగానే సామ్రాజ్యవాదుల నుండి దేశం విముక్తి అయిందా? 1947 ఆగస్టు 15కి ముందు బ్రిటీషువాళ్లు ప్రత్యక్షంగా ఉండి దోపిడీ, అణచివేతలు సాగించారు. ఆ తరువాత కూడా పరోక్షంగా బ్రిటన్ తన పట్టుని కొనసాగిస్తున్నది. 1947 తర్వాత భారత్ బ్రిటీష్ కామన్‌వెల్తులో భాగమైంది. బ్రిటన్‌తో పాటు అమెరికా, ఆ తరువాత 1950 తొలిరోజుల్లో సోవియట్ యూనియన్ ఆ తర్వాత మళ్లీ అమెరికా దేశాలకి లొంగిపోతూ భారత పాలకవర్గాలు వారికి అనుకూలంగా రాజకీయ, ఆర్థిక విధానాలు అమలుచేస్తున్నాయి. ఇతర సామ్రాజ్యవాద దేశాలు కూడా భారతదేశంలోని ప్రాకృతిక సంపదను కొల్లగొడుతున్నాయి. ఇందిరాగాంధీ పాలనలో రెండు అగ్రరాజ్యాలకు సమాన దూరం అంటూ దళారీ పాలకులుగా పాలించారు. బూటకపు స్వాతంత్ర్యం తరువాత నయా వలస తరహా దోపిడీ రూపాలను అమలు చేస్తూ సామ్రాజ్యవాద దేశాలు అప్పులు, సహకారం పేరుతో ప్రపంచ బ్యాంకు, ఐఎమ్ఎఫ్ ద్వారా అప్పులు ఇచ్చి దేశంలో ముడిసరుకులను, ఉత్పత్తులని దోచుకుపోతున్నారు. 1985లో రాజీవ్‌గాంధీ ప్రారంభించిన దిగుమతుల సరళీకరణ, 1991లో పి.వి. నరసింహారావు ప్రారంభించిన ప్రపంచీకరణ విధానాల తర్వాత భారత పాలకులు ఏ నిర్ణయం స్వతంత్రంగా తీసుకోలేని

స్థితి ఉంది. సామ్రాజ్యవాదులకి దాసోహం అంటూ కాంగ్రెస్ పార్టీని మించి భాజపా సర్కారు 7 ఏళ్ల పాలనలో సామ్రాజ్యవాదులకి, దళారీ నిరంకుశ బూర్జువాలకి అనుకూలంగా ఎన్నో విధానాలను తీసుకొని వచ్చింది. మోదీ ప్రభుత్వం జనధన్ యోజనా, నోట్‌బందీ వంటివి అమలుచేసి ప్రజలు కష్టపడి కూడబెట్టుకున్న డబ్బులను కొల్లగొట్టి కార్పోరేట్ శక్తులకు పెట్టుబడిగా అప్పగించింది. జీఎస్‌టీని అమలుచేయటం ద్వారా చిన్న, మధ్య వ్యాపారస్తుల నోట్లో మట్టికొట్టి కార్పోరేట్ వర్గాలకి లాభాలు చేకూర్చింది. ప్రజలకి మేలు చేస్తాం అని ప్రచార ఆర్భాటం చేస్తూ, వాస్తవానికి ప్రజల్ని కట్టుబానిసలుగా నడిబజారులో నిలుపుతోంది.

75 ఏళ్ల "స్వాతంత్ర్యం" పీడిత ప్రజలకి ఏమి ఇచ్చింది? పేదరికం, అప్పులు, ఆత్మహత్యలు, ఆకలిచావులు, నిరుద్యోగం, నిరక్షరాస్యత, వైద్యం అందక చావులు ఇలా పేదల బతుకులు దినదినగండంగా తయారైనాయి. భారతదేశ జనాభాలో సగం మంది పేదరికంతో అలమటిస్తున్నారు. కోట్లాది మంది వలస కూలీలుగా బతుకుతున్నారు. ప్రపంచాన్ని కరోనా మహమ్మారి కుదిపేసినప్పుడు దేశంలో హఠాత్తుగా లాక్‌డౌన్ మోదీ సర్కార్ ప్రకటించినపుడు కోట్లాది మంది వలస కూలీలు వీధిన పడ్డారు. వీళ్లంతా పనులులేక ఆకలితో వందల, వేల మైళ్ల దూరం కాలినడకన స్వగ్రామాలు చేరుకున్నారు. కొందరు దారిలోనే చనిపోయారు. ఇదీ 'స్వాతంత్రం' పేద ప్రజలకిచ్చిన వరం.

దేశాన్ని అభివృద్ధి చేస్తాం అంటూ ప్రపంచబ్యాంకు, ఐఎమ్ఎఫ్ నుండి 3 కోట్ల 65 లక్షల కోట్లు అప్పుచేసి బడాపెట్టుబడిదారులు, రాజకీయ నేతలు స్వాహాచేస్తూ ప్రజలకి మొండిచేయి చూపారు. కాంగ్రెస్ పాలనలో, బీజేపీ పాలనలో వెలుగుచూసిన కుంభకోణాలే ఇందుకు నిదర్శనం. ఆ అప్పులకి నెలకి 50 కోట్లు వడ్డీ కడుతున్నారు. వడ్డీ కట్టడానికి 10 వేల కోట్లు వరల్డ్ బ్యాంకు నుండి మళ్లీ అప్పు తెచ్చారు. ఈ రుణభారం అంతా ప్రజల నెత్తిన రుద్దుతున్నారు.

వ్యవసాయ ప్రధానమైన భారతదేశంలో రైతుల ఆత్మహత్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. కాంగ్రెస్ పాలనలో భూసంస్కరణలు పేరుతో భూములు పంచినట్లు నాటకం ఆడినాగానీ ఇప్పటికీ భూములు ప్రధానంగా భూస్వాముల చేతుల్లోనే కేంద్రీకృతం అయినాయి. ప్రపంచీకరణ విధానాలు అమలు కావటం మొదలైనప్పటి నుండి రైతులను పంట భూముల నుండి గెంటివేసి పరిశ్రమలు, రకరకాల ప్రాజెక్టులు కట్టడం పెరిగిపోయింది. విస్తాపన సమస్య చాలా తీవ్రంగా ముందుకు వచ్చింది. వ్యవసాయంలో పెట్టుబడుల కోసం అప్పుచేసి పంటసరిగా రాక, గిట్టుబాటు ధర రాక అప్పులు తీర్చలేక బతుకుదెరువు లేక ఆత్మహత్యలు పెరిగిపోయాయి. ఉదారీకరణ విధానాల కారణంగా 30 ఏళ్ల కాలంలో 4 లక్షల కంటే ఎక్కువ మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మోదీ పాలనలోని 7 ఏళ్ల కాలంలో లక్షమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. బడా, బడా పెట్టుబడిదారులకి లక్షల కోట్ల రూపాయల మాఫీ చేసే మోదీ ప్రభుత్వం రైతాంగానికి 4 లక్షల కోట్ల రూపాయల మాఫీ చేయలేదు.

ఇవి చాలనట్లు మోడీ ప్రభుత్వం కార్పోరేట్ సంస్థల ప్రయోజనాల కోసం మూడు వ్యవసాయ చట్టాలని తీసుకొని వచ్చింది. ఇవి అమలైతే రైతాంగం భూములకి దూరమై కూలీలుగా బతకవలసిందే. కానీ, అదానీ, అంబానీ వంటి దళారీ బూర్జువాలు లక్షలాది కోట్ల రూపాయలు ఆర్జించి వాళ్ల ఆస్తులు పెంచుకుంటున్నారు. మూడు వ్యవసాయచట్టాల అమలుతో వీళ్ల ఆస్తులు మరింతగా పెంచుకోవాలని చూస్తున్నారు.

అటవీ సంపదనీ, ఖనిజ సంపదనీ కొల్లగొట్టి సామ్రాజ్యవాదులకి, కార్పోరేట్ సంస్థలకి లాభాలు చేకూర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల్ని అడవి నుండి తరుముతున్నాయి. బ్రిటీష్‌కాలంనాటి అటవీ చట్టాలనే మరింత కౄరంగా అమలుచేస్తున్నారు. మోదీ సర్కార్ వలసకాలంనాటి భారత అటవీచట్టాన్ని సవరించి మరింత దౌర్జన్యంగా ఆదివాసులను అడవి నుండి దూరం చేస్తోంది. నేటికీ దేశంలో భూమి సమస్యే ప్రధాన సమస్య.

ఎల్‌పీజీ విధానాల అమలులో భాగంగా భారత పాలకవర్గాలు ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పోరేట్ సంస్థలకు అమ్మేస్తున్నాయి. సామ్రాజ్యవాదుల, దళారీ బూర్జువాల పోటికి తట్టుకోలేక 6 లక్షల చిన్న, మధ్య రకం కార్ఖానాలు బంద్ అయినాయి. రోజురోజుకూ నిరుద్యోగ సమస్య పెరుగుతోంది. మోదీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' అంటూ రోడ్లు, రైళ్లు, రైల్వేస్టేషన్లు, స్టేడియంలు, విద్యుత్తు, పెట్రోలియం, విమానాలు, విమానాశ్రయాలు, ఆనకట్టలు, నౌకాశ్రయాలు, బొగ్గుగనులు, ఇనుపగనులు, నీరు, భూమి అన్నీ అమ్మేస్తున్నది. రక్షణశాఖలో అమెరికా 100% ఎఫ్‌డిఐ పెట్టింది. భారతదేశంలో ఉండే ఎమ్ఎన్‌సీలు సంవత్సరానికి 47 లక్షల కోట్ల రూపాయలు దోపిడీ చేస్తున్నాయి.

దేశంలో కరోనా మహమ్మారి తాండవిస్తున్న కాలంలో 44 కార్మిక చట్టాలను మార్పుచేసి 4 కార్మిక కోడులుగా తయారుచేశారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు తమ చెమటను, రక్తాన్ని ధారపోసి సాధించుకున్న హక్కులని హరించివేసింది. కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు, సమ్మెచేసే హక్కు వంటి హక్కులను తీసేసింది. 8 గంటల పనిని 12 గంటల పనిగా పెంచింది. ప్రైవేటైజేషన్ కారణంగా లక్షలాది కార్మికులు నిరుద్యోగులు అయ్యారు. అంబానీ, అదానీ, టాటా, బిర్లా వంటి దళారీ బూర్జువాలు అన్ని రంగాలలో తమ పరిశ్రమలు విస్తరిస్తూ లక్షల కోట్ల రూపాయల సంపదకి హక్కుదారులు అవుతున్నారు. దేశంలోని రైతుల, కార్మికుల, వలసకూలీల పరిస్థితి చూస్తే ప్రభుత్వం ఏ వర్గాలకి సేవచేస్తుందో, ఎవరికి స్వాతంత్ర్య ఫలాలు అందుతున్నాయో స్పష్టంగా అర్థమౌతోంది.

అధికారమార్పిడి తర్వాత ప్రభుత్వరంగ స్కూళ్లు, కళాశాలలు, హాస్టళ్లు తగ్గిపోయి ప్రైవేట్ కాన్వెంటులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, రెసిడెన్షియల్స్ పెరిగిపోయి విద్య పేదలకి

అందరాని పండైయింది. నిరక్షరాస్యత పెరిగిపోతోంది. కరోనా కాలంలో మోదీ ప్రభుత్వం తెచ్చిన 'నూతన విద్యా విధానం' కార్పోరేట్ శక్తులకి లాభాలు పండిస్తోంది. విద్యలో కషాయికరణని పెంచుతూ మనుస్మృతిని మరోరూపంలో అమలుచేస్తోంది. దళితులను, ఆదివాసులను విద్యకి దూరం చేస్తూ వారిని శ్రమజీవులుగా, కూలీలుగానే మిగుల్చుతోంది.

ప్రభుత్వ ఆస్పత్రులు తగ్గిపోయి ప్రైవేట్ ఆస్పత్రులు, కార్పొరేట్ ఆస్పత్రులు పెరిగిపోయి పేదవారికి వైద్యం ఖర్చు భరించరానిదిగా అయింది. ప్రపంచలోకెల్లా శిశుమరణాల సంఖ్య ఎక్కువగా ఉన్న దేశాల్లో భారతదేశం ఒకటి. భారత ప్రభుత్వం ఆరోగ్యం మీద పెట్టే ఖర్చు జాతీయాదాయంలో 1% కన్నా తక్కువ ఉంది. ఆదివాసులు, దళితుల, స్త్రీల ఆరోగ్య ప్రమాణాలు అత్యంత దారుణంగా ఉన్నాయి. కరోనా కాలంలో సరిగ్గా వైద్యం అందక లక్షల సంఖ్యలో ప్రజలు మరణించారు. కరోనా మందులు, టీకాలు అధిక ధరలకు అమ్ముతూ కార్పొరేట్ శక్తులు లాభాలు పిండు కుంటుంటే, పేద ప్రజలు కుప్పలు, కుప్పలుగా చనిపోతూ స్మశానాల్లో చోటు కూడా దొరకని స్థితి.

"స్వతంత్ర" భారతంలో స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం వంటి మాటలకి తావు లేదు. ప్రజల్ని ఇష్టానుసారం దోచుకోవడానికి దోపిడీవర్గాలకి స్వేచ్ఛా. వాటిని వ్యతిరేకిస్తూ పోరాడిన వారికి తప్పుడు కేసులు, అరెస్టులు, జైలు నిర్బంధాలు, యావజ్జీవ శిక్షలు, ఉరిశిక్షలు.

దేశంలో ఆర్థిక, కుల, మత, ప్రాంతీయ, భాషా అసమానతలు నానాటికీ పెరిగిపోతున్నాయి. కులం పేరుతో, మతం పేరుతో దళితులపై, మత మైనారిటీలైన ముస్లింలపై దాడులు, హత్యాకాండలు పెరిగిపోతున్నాయి. పాలకవర్గాలు, ప్రభుత్వాలు, అధికార యంత్రాంగమే హింసని ప్రేరేపిస్తున్నాయి. హిందూ-ముస్లింల మధ్య ద్వేషాగ్నులు రగిలిస్తూ మతపరమైన ధృవీకరణను ముందుకు తెస్తూ ఎన్ఆర్సీ, ఎన్పీఆర్, సీఏఏ వంటి చట్టాలు తెచ్చి ముస్లింలను దేశం నుండి తరిమి 'నయా భారత్' పేరుతో హిందూరాజ్యాన్ని నెలకొల్పాలని భాజపా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. గోహత్య నిషేధ చట్టాన్ని చేసి ప్రజల సంప్రదాయక ఆహార అలవాట్లపై దాడులుచేస్తూ మూకుమ్మడి హత్యలు చేస్తోంది.

ఆర్టికల్ 370 చట్టాన్ని రద్దుచేసి స్వయంపాలిత ప్రాంతంగా ఉన్న కశ్మీర్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించి అక్కడి ప్రజల హక్కులను హరించివేస్తూ, అణచివేస్తూ, ఉగ్రవాదుల పేరుతో హత్యలు చేస్తోంది. కశ్మీరు, లద్దాఖ్ ప్రాంతాలని యిష్టానుసారం దోచుకోవడానికి బహుళజాతి కార్పొరేషన్లకు ద్వారాలు తెరిచింది. ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రజలు స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతుంటే భారత సైన్యానికి ప్రత్యేక హక్కులు ఇచ్చి ప్రజల ఆకాంక్షలను అణచివేస్తోంది.

ప్రపంచంలోనే అత్యంత ప్రజాస్వామిక దేశం అంటూ గొప్పలు చెప్పుకుంటూ ప్రజల ప్రజాస్వామిక హక్కుల్ని కాల రాస్తోంది. పార్లమెంటులో మెజారిటీ ఉందనే పేరుతో ప్రతిపక్షాల అభిప్రాయాలనైనా వినకుండా బీజేపీ ప్రభుత్వం చట్టాలు చేస్తున్నది. పార్లమెంట్ ప్రజాస్వామ్యం పేరుతో నియంతృత్వ పాలన కొనసాగిస్తోంది. సామ్రాజ్యవాదుల సేవలో తరిస్తున్నది.

**ఇంకెక్కడి ఆజాదీ?**

# అమరుడు కామ్రేడ్ రాజ్ కిషోర్కు అరుణారుణ జోహార్లు

కామ్రేడ్ రాజ్కిషోర్ బీహార్ రాష్ట్రానికి చెందిన విప్లవ సాహిత్య, సాంస్కృతికోద్యమ ప్రధాన నాయకులలో ఒకరు. ఆయన తన 89వ యేట, డిసెంబర్ 23న తీవ్ర అనురోగ్యంతో మరణించారు. 1983లో ఏఐఎల్ఆర్సి ప్రథమ జాతీయ మహాసభలు ఢిల్లీలో జరిగాయి. కామ్రేడ్ రాజ్ కిషోర్ ఏఐఎల్ఆర్సి కార్యవర్గంలో సభ్యులుగా ఎన్నికయ్యారు.. 2002 జనవరి 13, 14 తేదీలలో హైదరాబాదులో ఏఐఎల్ఆర్సి 8వ మహాసభలు జరిగాయి. అందులో కామ్రేడ్ రాజ్ కిషోర్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

ఏఐఎల్ఆర్సిలో చేరడానికి పూర్వం ఆయన బీహార్లో క్రాంతికారీ నవజనవాదీ సంస్కృతిక సంఘ్ బాధ్యతలు నిర్వహించారు. బీహారీ జనజీవితంతో పెనవేసుకుపోయిన వ్యక్తిత్వం ఆయనది. ఆజానుబాహు విగ్రహం. నిత్యం నవ్వు తొణికిసలాడే ముఖం. గొప్ప వక్త. కంచుకంఠంతో ఆయన నినాదాలు యిచ్చే ప్రత్యేకమైన తీరు ప్రజల్ని ఎంతగానో ప్రభావితం చేసేది. వీటన్నింటికీ మించి గొప్ప కార్యదక్షత. మార్క్సిజం, లెనినిజం, మావోయిజంతో చివరి కంటా కొనసాగారు. ఆ రాష్ట్రంలోని అగ్రకుల పెత్తందారీ భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా అణగారిన ప్రజలు నిరంతరం చేసిన పోరాటాలతో మమేకం అయ్యారు. ఆ క్రమంలో ఆయన కుల, వర్గ పోరాటాలు జమిలిగా కొనసాగాల్సిన ఆవశ్యకతను అర్థం చేసుకున్నారు. తన కుల చిహ్నమైన 'సింగ్' పదాన్ని తన పేరు నుండి వదులుకున్నానని, ఇక నుండి రాజ్ కిషోర్గా కొనసాగుతానని బహిరంగ సభలో ప్రకటించారు.

ఒకవైపు ఏఐఎల్ఆర్సిలో కొనసాగుతూనే మరో వైపు అఖిల భారత ప్రజాప్రతిఘటనా వేదిక, రివల్యూషనరీ డెమోక్రాటిక్ ఫ్రంట్ సంస్థల తరపున కూడా దేశమంతటా పర్యటించి ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసారు.. ప్రజా ఉద్యమాలలో నిరంతరం ఆచరణలో మునిగితేలినవాడు రాజ్ కిషోర్. ఎన్నడూ ఎలాంటి రాజ్యనిర్బంధానికి వెరవలేదు. పోలీసులు ప్రయోగించిన చిత్రహింసల ఫలితంగా ఒక కాలు విరిగినా కూడా ఆయన తన కార్యకలాపాల నుండి వెనుకంజ వేయలేదు. ఆయనకు క్రాంతి పత్రిక వినమ్రపూర్వకంగా జోహార్లు అర్పిస్తుంది.

# 'నాలుగో యుద్ధతంత్రం' – 'పౌర సమాజ అణచివేత'

## 'ఫోర్త్ జెనరేషన్ వార్‌ఫేర్' (ఎఫ్‌జీడబ్ల్యు) (నాలుగో తరం యుద్ధతంత్రం) అంటే ఉగ్రవాద గ్రూపుల వంటి వాటికి వ్యతిరేకంగా రాజ్యం యుద్ధం చేయడం

దేశంలో నామమాత్రమే అయిన 'ప్రజాస్వామ్యం' స్థానంలో వేళ్లూనుకుంటున్న ఫాసిజం వ్యక్తీకరణలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటి గురించి ఒక అవగాహనకు రావడం అవసరం. 2021 సెప్టెంబర్ 26వ తేదీన కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో జరిగిన పది మావోయిస్టు ఉద్యమ రాష్ట్రాల ముఖ్య మంత్రుల, పోలీసు ఉన్నతాధికారుల సమావేశం, ఆ తరువాత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, జాతీయ భద్రతా సలహాదారు, జాతీయ మానవ హక్కుల కమీష్నర్ మొదలయిన వారి ప్రకటనల పరంపర అనేక విషయాలను వెల్లడిస్తున్నాయి.

ప్రజా ఉద్యమాలపై నిర్బంధానికి సంబంధించి ఫాసిజం చేపడుతున్న వివిధ అణచివేత రూపాల నుంచి మొత్తంగా సమాజం మీద పెరుగుతున్న ఫాసిస్టు అణచివేతను అర్థం చేసుకోవచ్చు. కేంద్రం, వివిధ రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం నిర్దిష్ట కాలావధి మేరకు జరిపే సమావేశాలలో భాగంగా జరిగిన ఈ సమావేశానికి ఒక ప్రత్యేకత ఉన్నది. ఈ సమావేశానికి తెలంగాణ, ఒడిశా, బిహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రులు, ఇతర రాష్ట్రాల పోలీసు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ఈ సమావేశం నాలుగేళ్ల సమాధాన్ దాడులలో అనుసరించిన 'వామపక్ష తీవ్రవాద' అణచివేత చర్యలను సమీక్షించి రానున్న యేడాది కాలం కోసం నిర్దిష్టంగా మరో నూతన కేంపెయిన్‌ను రూపొందించింది. 2017 మే నెలలో గత సంవత్సరాలలో అనుసరించిన అణచివేత పథకాలన్నింటినీ సమీక్షించి నూతనంగా ఐదేళ్ల కాలవ్యవధితో రూపొందించిన విప్లవ ప్రతిఘాతుక వ్యూహాత్మక 'సమాధాన్' పథకానికి పెట్టుకున్న గడువు పూర్తి కానున్న నేపథ్యంలో దిల్లీ సమావేశం జరిగింది. ఈ గడువులోగానే మావోయిస్టు రహిత బ్రాహ్మణీయ హిందుత్వ ఎజెండా అయిన 'న్యూ ఇండియా'ను స్థాపించాలన్న లక్ష్యం కూడా మొదట ప్రకటించుకున్నారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలంటే దేశంలో ప్రజలను అణచివేయాలి. ప్రజలను అణచివేయాలంటే వారికి నాయకత్వం వహిస్తూ నూతన ప్రజాస్వామిక భారతాన్ని నిర్మించే లక్ష్యంతో పని చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ని తుదముట్టించాలి.

ఉద్యమ అణచివేత కోసం ప్రజా 'అభివృద్ధి' కార్యక్రమాలు నిర్వహించాలనీ, మావోయిస్టుల ఏరివేత కార్యక్రమాలను ముమ్మరం చేయాలనీ, మావోయిస్టుల ఆర్థిక వనరులను దెబ్బ తీయాలనీ దిల్లీ సమావేశం నిర్ణయించింది. మావోయిస్టులు చేసే ఘటనలు మోదీ పాలనలో 23 శాతానికి, పౌరుల మరణాలు 21 శాతానికి తగ్గాయంటూనే మావోయిస్టు ఉద్యమ సమూల నిర్మూలనకు నూతన పథకాన్ని రూపొందించారు. ఉద్యమ అణచివేత కోసం 'అభివృద్ధి' కార్యక్రమాలు నిర్వహించడం అనే హెూరు దోపిడీ పాలక వర్గాల స్వభావాన్ని మరింత తేటతెల్లం చేస్తున్నది. స్వయంగా కేంద్ర హెూం మంత్రి ఈ సమావేశానికి నాయకత్వం వహించడం అణచివేత విధానాల పట్ల పాలక వర్గాల తీవ్రతను తెలియజేస్తున్నది.

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద విధానంలో ఏర్పడ్డ సంక్షోభంతో సామ్రాజ్యవాద దేశాల మధ్య నూతన కుమ్మక్కులు, నూతన సమీకరణలూ జరుగుతూ వివిధ దేశాల భౌగోళిక పునరేకీకరణలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో ప్రపంచ మార్కెట్‌లో అతి పెద్ద దేశంగా ఉన్న భారతదేశం, దేశంలో పాలన కొనసాగిస్తున్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు భాజపా మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాదానికి దాసోహం అయింది. దేశాన్ని విచక్షణా రహితంగా వేలం వేస్తున్నది. దేశ పాలక వర్గాలలో కూడా సమీకరణలు జరుగుతున్నాయి. మోదీ పాలన సంక్షోభంలో పడింది. మరోవైపు సాధారణంగానే ఫాసిస్టులు ఆరాధించే సైనికీకరణను మన దేశ రియాక్షనరీ ఫాసిస్టు పాలకులు అనుసరిస్తున్నారు. యేటేటా రక్షణ రంగాన్ని పటిష్టం చేస్తూ తప్పుడు దేశభక్తితో సైనికులను రెచ్చగొడుతూ, సీడీఎస్ లాంటి పదవులను సృష్టిస్తూ దేశాన్ని సైనికీకరిస్తున్నారు. ఇవన్నీ రానున్న ఎన్నికలలో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి రకరకాల కుట్రలు, కుహకాలకు పాల్పడుతున్నది.

చైనా సరిహద్దులో 'ఉద్రిక్తతలు' పేరిట భారత సైన్యాన్ని పటిష్టం చేయాలని మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వం నిజానికి యావత్తు పోలీసు వ్యవస్థను పటిష్టం చేస్తున్నది. ఈ విషయాలను బహిరంగంగా ప్రకటిస్తున్నది.

2021 నవంబర్ 11న చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జెనరల్ బిపిన్ రావత్ జమ్మూ కశ్మీర్ పోలీసు బలగాలకు 'పోరాటకారులను అంతమొందించేందుకు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోమ'ని చెప్పాడు. నవంబరు 11న శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ 'చట్టాన్ని పరిరక్షించేందుకు యుద్ధం చేసి పౌర సమాజాన్ని అణచివేయండ'న్నాడు. యుద్ధపు కొత్త సరిహద్దు పౌరసమాజం అని, ఈ యుద్ధం నాలుగో యుద్ధతంత్రంతో సమానమని తేల్చాడు.

నవంబర్ 9న జాతీయ మానవ హక్కుల కమీషనర్ అరుణ్ మిశ్రా 'తీవ్రవాదం, నక్సలిజం వంటి చెడుల మీద పోరాటంలో మానవ హక్కులు అవరోధంగా నిలుస్తాయా' అనే చర్చనీయ విషయానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వాళ్లు ప్రవచించే హక్కులన్నీ ఎంత బూటకమైనవో చెప్పకనే చెప్పాడు.

**(తరువాయి 24వ పేజీలో)**

సంస్మరణ

**కేంద్ర కమిటీ ప్రకటన**

## కామ్రేడ్ ఆలూరి లలిత (అమ్మ) కు జోహార్లు

21 నవంబర్ ఆదివారం నాడు కామ్రేడ్ ఆలూరి లలిత గారు తన 76వ యేట గుండెపోటు తో తుదిశ్వాస విడిచారు. ఆమె మరణం పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ విప్లవ జోహార్లర్పిస్తోంది. వారి బంధు మిత్రులకు ప్రగాఢ సంతాపం తెలియచేస్తూంది.

కామ్రేడ్ లలిత, భుజంగారావులకు ముగ్గురు కూతుళ్లు ఒక కుమారుడు కాగా వారు తమ ముగ్గురు కూతుళ్లను విప్లవోద్యమంలోకి నడిపించగలిగిన ఆ తల్లి తండ్రులు తమ ఏకైక కొడుకును వదలి దశాబ్ద కాలం రహస్య జీవితంలో ఉంటూ పార్టీ అప్పగించిన విప్లవ బాధ్యతలన్నీ పట్టుదలతో నెరవేర్చారు. వారిద్దరూ వామపక్ష భావాలతో విప్లవోద్యమం పక్షమే నిలుస్తూ దృఢంగా నిలిచారు. 1985-86 నుండి దాదాపు దశాబ్ద కాలం వరకూ దండకారణ్య ఉద్యమ నాయకత్వానికి కామ్రేడ్స్ భుజంగారావుగారు పెద్దన్నగా, లలితగారు అమ్మగా ఉంటూ గురుతరమైన విప్లవ బాధ్యతలు నిర్వహించారు.



పార్టీ ఏర్పరిచిన రహస్య డెన్‌లలో ఉంటూ శతృవు కళ్లు కప్పి అద్భుతంగా తమ విప్లవ సేవలు కొనసాగించారు. రహస్య జీవితంలో పెద్దన్నతో పాటు తానూ ప్రభాత్ పత్రికా నిర్వహణలో ఉంటూ పోలీసుల కళ్లు కప్పి పెద్ద పెద్ద బండిల్స్ నగరం నుండి అడవికి చాకచక్యంగా చేరవేయడంలో ఆమె పోషించిన పాత్ర విప్లవోద్యమంలో ప్రతిభావంతమైన మహిళల సేవలకు ఒక నమూనాగా ఉండిపోతాయి. కామ్రేడ్ పెద్దన్నకు కళ్లు కనపడని స్థితిలో మహా నగరాలలో ఆయనకు కళ్లూ, కాళ్లుగా జతగా నిలిచిన దశాబ్దకాల అమ్మ విప్లవసేవలు ప్రభాత్ అక్షరాలలో నిక్షిప్తమై ఉన్నాయి.

దండకారణ్యంలోని గెరిల్లా దళాల వెంట కలిసి ఉండాల్సిన అవకాశం వచ్చిన రెండు పర్యాయాలు పెద్దన్నతో అమ్మ అడవిలో లేనప్పటికీ ఆయన గెరిల్లాలతో పంచుకున్న చెదిరిపోని అనభవాలు ఆ తర్వాత ఆయన ఆమెతో పంచుకున్న ప్రజాయుద్ధ స్మృతులు తుదివరకూ ఆమెకు ఎంతో ప్రేరణగా నిలిచాయనడానికి ఆమె చివరి దశలో (2017లో) గెరిల్లాలకు అందచేసిన సందేశమే చాటిచెపుతుంది. 'మన పార్టీ నాయకత్వంలో భారత విప్లవోద్యమ విజయం తథ్యం' అంటూ ప్రగాఢ విశ్వాసంతో, పూర్తి భరోసాతో చేర్చిన సందేశం గెరిల్లాలకు ఎంతో స్ఫూర్తిని ఇస్తుంది. వారిద్దరూ తుదివరకూ భారత నూతన ప్రజాతంత్ర విప్లవ విజయానికై ఎంతగానో ఆకాంక్షించారు.

కామ్రేడ్ భుజంగారావుగారు విప్లవోద్యమంలో రాష్ట్ర స్థాయి కేడర్‌గా గుర్తింపు పొంది విప్లవ బాధ్యతలు నిర్వహించగా అమ్మ రాజకీయ స్థాయి జిల్లా స్థాయిగా పార్టీ గుర్తించడంపై తాను స్పందిస్తూ తనకు ఏ స్థాయీ అవసరంలేదనీ, తుదివరకూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సభ్యురాలుగానే గుర్తింపు కలిగి ఉండడమే తనకు సర్వోన్నతమనీ, సగర్వంగా, సంతోషంగా ఉంటుందనీ కాదనలేని జవాబిచ్చిన లలితగారు చివరివరకూ గొప్ప అంకిత భావంతో, విశ్వసనీయమైన ఒక పార్టీ సభ్యురాలుగానే ఉంటూ క్షణ క్షణం విప్లవాన్ని కాంక్షిస్తూ తుదిశ్వాస విడిచింది. చివరి రోజులలో గుల్బర్గాలోని తన కుమారుడి నివాసంలో గుండెపోటుతో కన్నుమూసిన ఆలూరి లలిత గారి విప్లవ సేవలు చిరస్మరణీయం. ఆమెకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లర్పిస్తోంది.

---

## కామ్రేడ్ పురందర్‌కు జోహార్లు

పురందర్ నెల్లూరు వాసి. మార్చి 11న అనారోగ్యంతో చనిపోయేదాకా కూడా మనుషుల కోసం తపనపడినవాడు. నక్సల్బరీ తొలి గర్జనకు భారతదేశపు యువతరం ఎంతగా స్పందించిందో చరిత్రే దానికి తార్కాణం. ఆ ఉద్వేగ, ఉద్రిక్త యువ రక్తం వర్గ శత్రువుతో పోరాటమే మార్గమనుకున్నారు. యువకుడైన పురందర్ కూడా దానికి ఆకర్షితుడయ్యాడు. ఫలితంగా కొడవలూరు కుట్ర కేసు ఎదుర్కొన్నాడు. జైలు జీవితం గడిపాడు. ఆ జైలులోనే కలిసిన కామ్రేడ్ మహదేవన్ స్నేహం ఆయనను మరింత దీక్షాపరుడిని చేసింది. మొదటిసారిగా నెల్లూరు జిల్లాలో గద్దర్ ఆధ్వర్యంలో నెల రోజులు ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. పాటలు, ఒగ్గుకథ, భూమి భాగోతం వంటివి నేర్పి, ఈ కళా బృందాలతో పాటు విద్యార్థులను కలిపి 'గ్రామాలకు తరలండి' ప్రోగ్రాంలు నిర్వహించాలి. అదీ ఆనాటి పార్టీ ఆలోచన. ఆ ఆలోచన అందుకున్న పురందర్ 'భూమి భాగోతం'లో స్వయంగా భూస్వామి వేషం వేశాడు. భార్య పద్మతో స్త్రీ పాత్రను వేయించాడు. 1978లో గుంటూరులో జరిగిన ఆర్‌వైయల్ రాష్ట్ర మహాసభలు,అదే సంవత్సరం రాడికల్ విద్యార్థుల మహాసభల దగ్గర నుండి 1981లో నెల్లూరులోనే జరిగిన రైతుకూలీ మహాసభలు, '82లో కరీంనగర్ రెండవ రైతుకూలీ మహాసభల దాకా ఎన్నో రాష్ట్రస్థాయి మీటింగులు ఆయన లేకుండా జరగలేదు.ఒకటికి రెండుసార్లు గుండెకు బైపాస్ సర్జరీ జరగడం, కుటుంబ పరిస్థితులకు తోడు, రాజ్యం వైపు నుండి వత్తిడి రావడంతో ఆయన విప్లవాభిమానిగా వుండిపోయాడు.. కమ్యూనిస్టు భావజాలాన్ని వ్యతిరేకించలేదు. అంతేగాదు, ఆ ఆశయాలకు విరుద్ధంగా ఎక్కడా ప్రవర్తించలేదు. ఆయన సేవలకు క్రాంతి పత్రిక జోహార్లు చెపుతోంది.

★

### కేంద్ర కమిటీ ప్రకటన

# కోబాడ్ ఘాండీని సీపీఐ(మావోయిస్టు) నుంచి బహిష్కరిస్తున్నాం

2019లో కోబాడ్ ఘాండీ జైలు నుండి బెయిల్‌పై విడుదలై తన కుటుంబంతో వుంటూ 'ఫ్రాక్చర్డ్ ఫ్రీడమ్ ఎ ప్రిజన్ మెమొయిర్' అనే పేరుతో ఒక పుస్తకాన్ని రాసి 2021లో ప్రచురించి విడుదల చేసాడు. ఈ పుస్తకం ద్వారా కోబాడ్ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతం నుండి పూర్తిగా తెగతెంపులు చేసుకున్నాడనే విషయం స్పష్టమయింది. ఆయన జైలులో వుండగానే 2010లో ఈ పుస్తకంలోని ప్రధాన ప్రతిపాదనలను "క్వశ్చన్ ఆఫ్ ఫ్రీడమ్ పీపుల్స్ ఇమాన్సిపేషన్" శీర్షికన 6 వ్యాసాలు మేయిన్‌స్ట్రీమ్ పత్రికలో రాసాడు. అవి మానవతవాద, ఆధ్యాత్మిక మార్గాన్ని ఎత్తివడుతూ భావజాలపరంగా బూర్జువా సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాయి. ప్రస్తుతం ఆయన రాసిన ఫ్రాక్చర్డ్ ఫ్రీడమ్ పుస్తకం ద్వారా ఘనీభవించిన ఆ భావాలు మరింత స్పష్టంగా వెల్లడైనాయి. తీహార్ జైలులో చెట్ల కింద కూర్చోని దీర్ఘాలోచన చేసిన కోబాడ్‌కు తన 40 ఏళ్ల విప్లవ జీవిత ప్రతిఫలంలో ప్రపంచాన్ని మార్చే సాధనలో అన్నింటికంటే ముందు స్వేచ్ఛా, మంచి విలువలు, సంతోషం సమాజంలో అవసరమని, సంతోషాన్ని సాధించే గోల్ పోస్టుగా మన ఆచరణ కొనసాగాలని చెబుతున్నాడు. నీతి కథల నుండి సారాంశాన్ని గ్రహించాలని కూడా చెబుతున్నాడు. ఇలా ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్న కోబాడ్‌కు మార్క్సిస్టు ఆచరణలో అవి లేవని, తత్ఫలితంగా మార్క్సిజం తన లక్ష్యాన్ని సాధించలేకపోయిందని అంటున్నాడు. కాని ఆయన మార్క్సిజం-లెనినిజం-మావోయిజానికి తప్పుడు భాష్యం చెబుతున్నాడు. వర్గపోరాటం, ఉత్పత్తి, శాస్త్రీయ పరిశోధనల ద్వారానే సమాజంలో సరియైన భావాలు ఉత్పన్నమవుతాయని మార్క్సిజం చెబుతోంది. "బాహ్య ప్రపంచంపై ప్రతిచర్య జరుపుతూ, దాన్ని మార్చడం ద్వారా అతడు అదే సమయంలో తన స్వంత స్వభావాన్నే మార్చుకుంటాడు. అతడు తనలో నిద్రాణమైవున్న శక్తి సామర్థ్యాలను అభివృద్ధి చేసుకుని, ఈ అంతర శక్తులను తన ఆధీనంలోకి తెచ్చుకుంటాడు" అని మార్క్స్ తన పెట్టుబడి గ్రంథంలో రాసాడు. ప్రపంచంలో మార్పుకు విప్లవ ప్రతిచర్య జరపకుండా మనిషిలో కూడ మార్పును ఆశించలేం. కోబాడ్ ఆధ్యాత్మిక ఆలోచనలు, భూస్వామ్య, బూర్జువా భావవాద భావజాలానికి సంబంధించినవే తప్ప వాటికి అత్యంత శాస్త్రీయ, తాత్విక చింతనతో కూడిన మార్క్సిజంతో ఎలాంటి పొత్తులేదు. కోబాడ్ గతితార్కిక చారిత్రక భౌతికవాదాన్ని, మార్క్సిస్టు మూల సూత్రాలను, వర్గపోరాటాన్ని విడిచిపెట్టి భావవాద ఆలోచనలతో సమాజంలో సంతోషాన్ని సాధించే ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్నాడు.

ఆయన 50 యేళ్లకు పైగా నక్సల్బరీ రాజకీయాలను అనుసరిస్తూ మునుపటి సీపీఐ(ఎమ్ఎల్)(పీపుల్స్‌వార్)లో కేంద్రకమిటీ సభ్యుడుగా, మహారాష్ట్ర రాష్ట్రకమిటీ నాయకుడిగానూ, పిమ్మట ఐక్యతా పార్టీ సీపీఐ(మావోయిస్టు)పార్టీలో కేంద్రకమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా అరెస్టు అయ్యేంతవరకు కొనసాగాడు. ఆయన 2009లో అరెస్టై జైలుకు వెళ్లడం, పదేళ్ల తర్వాత జైలు నుండి విడుదలైన తర్వాత కూడ ఈ కాలమంతా తాను మావోయిస్టు పార్టీలో సభ్యుడిని కాదని పదేపదే నిరాకరిస్తూ వచ్చాడు. పోలీసులే ఈ ఆరోపణ నాపై చేస్తున్నారనీ, అలా తనను అనేక మావోయిస్టు కేసుల్లో ఇరికించారనీ, తన పుస్తకంలో రాయడమే గాక గతంలో ప్రెస్‌మీట్లలో కూడ ఈ విషయం చెబుతూ వచ్చాడు. ఒక విప్లవ పార్టీలో అత్యున్నత స్థాయిలో పనిచేసి అరెస్టు కాగానే ఆయన వాస్తవాలను మరుగుపర్చి పాలకవర్గాల మెప్పుకోసం పాకులాడడం ఆయన నిజాయితీ కూడ కోల్పోయాడని తెలుస్తూనే వున్నది. నిజాయితీ కోల్పోయిన వ్యక్తి సమాజానికి ఏమి సందేశం ఇవ్వగలుగుతాడు? దానికి ఏమి విలువ వుంటుంది?

కోబాడ్ జైలు నుండి బయటకు వచ్చిన పిదప పార్టీని కాంటాక్టు చేయకపోవడమే గాక పార్టీతో చర్చించకుండా పార్టీ సైద్ధాంతిక రాజకీయాలకు వ్యతిరేకంగా పార్టీ నిబంధనావళిని, పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామిక క్రమశిక్షణను ఉల్లంఘించి, ఈ పుస్తకాన్ని రాసి ప్రచురించి, విడుదల చేయడం మంచి విలువల గురించి మాట్లాడుతున్న కోబాడ్‌లో గల అనార్కిస్టు ధోరణులను బయటపెడుతున్నది. మోదీ నాయకత్వంలోని బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం మావోయిస్టు పార్టీని 'సమాధాన్-ప్రహార్'ల క్రూర దాడి ద్వారా 2022 జూన్ లోగా నిర్మూలిస్తామని తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్న సమయంలో కోబాడ్ ఈ పుస్తకం ద్వారా విప్లవ శిబిరంలో, ప్రజల్లో నిరాశవాదాన్ని పెంచే లక్ష్యంతో తనను కాపాడుకోవడానికి కూడ

పాలకవర్గాల సేవకు అంకితమై ఆ పుస్తకంలో మావోయిస్టు పార్టీ పైన అనేక అసత్య ఆరోపణలు చేశాడు. జైలులో వున్నంతకాలం నేరజగత్తుతో, జైలు అధికారులతో చట్టాపట్టాలేసుకుని సౌకర్యవంతమైన జీవితాన్ని అనుభవించి వారంతా మంచివారని పొగుడుతూ నిర్లజ్జగా తన పుస్తకంలో రాసాడు. జైలులో మావోయిస్టు ఖైదీలు మాఫియాలతో కలిసిపోవడమే గాక, కొన్నిసార్లు వారికి నాయకత్వం కూడ వహిస్తారని నిరాధారణమైన ఆరోపనకు ఒడిగట్టాడు. నక్సల్బరీ కాలం నుండి జైళ్ళలో విప్లవకారులు నెలకొల్పిన పోరాట సాంప్రదాయాలను, త్యాగాలను తూలనాడి పార్టీపై నిందలకు పాల్పడ్డాడు. కోబాడ్ జైలులో నిస్వార్ధంగా, సాధారణ ఖైదీల హక్కుల కోసం ఏరోజు జైలు అధికారులకు వ్యతిరేకంగా పోరాడింది లేదు. పైగా వారి నుండి అనేక వ్యక్తిగత స్వార్ధ రాయితీలు పొందాడు. అలాంటి వ్యక్తికి మావోయిస్టు ఖైదీల పట్ల మాట్లాడే హక్కు వుంటుందా? అంతేగాక మావోయిస్టు పార్టీకి ప్రజల మద్దతు లేదని, పార్టీ తిరుగుబోతు దళాలు(రోవింగ్ రెబల్స్)గా పని చేస్తున్నదని నిందిస్తున్నాడు. ఇది పాలకవర్గాల గొంతులో గొంతు కలపడమే తప్ప మరేమి లేదు.

కోబాడ్ ఘాండీ తన పుస్తకంలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంత, రాజకీయ ఆచరణపై విమర్శలను ఎక్కుపెట్టాడు. మార్క్స్, లెనిన్, స్టాలిన్, మావోల నాయకత్వంలో సోషలిజం కోసం జరిగిన పోరాటం ఎందుకు ఓడిపోయింది? చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవం మావో మరణించిన అనంతరం విఫలమవడానికి కారణాలేమిటి? మార్క్స్ మొదట రాసిన సిద్ధాంతంలో మానవతా విలువలు వెలుగు చూడగా ఆ తర్వాత కాలంలో ఆచరణాత్మక ఉద్యమాలు ముందుకు వచ్చి అవి మరుగున పడిపోయాయని. తర్వాత లెనిన్, స్టాలిన్, మావో నేతృత్వంలో ఏర్పడిన సోషలిస్టు రాజ్యాల్లో ఈ మానవతా విలువలకు ప్రాధాన్యతనివ్వలేదని, ఆర్థిక నిర్ణయాక సిద్ధాంతాలే అధిపత్యం వహించాయనీ, కమ్యూనిస్టు పార్టీలో కూడ కేంద్రీకృత ప్రజాస్వామ్యం ద్వారా నియంతృత్వమే రాజ్యమేలిందని అందుకే సోషలిజం వెనకడుగు వేసిందని ఆయన పుస్తకంలో రాసాడు. ప్రపంచ యుద్ధం జరిగిన కాలాల్లోనే విప్లవాలు విజయవంతమయినాయని, శాంతి కాలాల్లో విప్లవాలు విజయవంతం కాలేదని చరిత్రను తప్పుడుగా వక్రీకరిస్తున్నాడు. అధికారం, డబ్బును వదిలించుకోవడానికి కమ్యూనిస్టు సమాజంలోనే సాధ్యమని, అందుకు ఏ మార్గం చేపట్టాలో మార్క్సిజం చెప్పింది. అయినప్పటికీ సమాజంలో అధికారం, డబ్బు అనేవే ప్రధాన సమస్యలని వాటి మూలంగానే అనర్ధాలకు దారి తీస్తున్నాయని చెప్పడం ద్వారా ప్రజలను అధికార పోరాటం నుండి విముఖులను చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. యీ రకంగా ఆయన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మూల సూత్రాలనే వ్యతిరేకిస్తున్నాడు. సుమారు 175 సంవత్సరాలుగా మార్క్సిజం-లెనినిజం-మావోయిజం బూర్జువా సిద్ధాంతం పై చేసిన సైద్ధాంతిక-రాజకీయ దాడి, అది ఆచరణలో సాధించిన విజయాలను నిరాకరిస్తూ కార్మికవర్గానికి, యావత్తు పీడిత ప్రజలకు ద్రోహం చేయ తలపెట్టాడు.

భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నుండి అది సాధించింది ఏమిటనీ, దేశంలో విప్లవోద్యమం వెనుకపట్టు ఎందుకు పట్టిందనీ, విప్లవ పార్టీలు పరిశోధన చేయకుండా నిశ్చయవాదంతో దేశంలో విప్లవం తప్పక వస్తుందని చెప్తూనే ఉంటాయని విమర్శిసున్నాడు. కార్మికవర్గంలో ఈ కాలమంతా జరిగిన మార్పులను దృష్టిలోకి తీసుకోరనీ, కుల సమస్యను వర్గ విభజనలోకి కుదించి పారిశ్రామికీకరణ ద్వారా, విప్లవం ద్వారా కులాంతరాలు వాటికవే అంతరించిపోతాయని కమ్యూనిస్టులు చెబుతున్నారని పాత చింతకాయ పచ్చడిలా విమర్శిస్తున్నాడు. దేశంలో రివిజనిజానికి వ్యతిరేకంగా బలంగా జరిగిన పోరాటం ద్వారా నిజమైన విప్లవ పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) ఉద్భవించింది. దేశంలో నిర్ధిష్ట సమస్యలపై నిర్ధిష్ట విశ్లేషణ జరిపి శాస్త్రీయంగా ఎప్పటికప్పుడు పార్టీ అవగాహనను మెరుగుపర్చుకుంటూ డాక్యుమెంట్లను రూపొందించుకుంటున్నది. కోబాడ్ లేవనెత్తిన అంశాలన్నింటికి పార్టీ డాక్యుమెంట్లలో జవాబులు వున్నాయి. మావోయిస్టు పార్టీలో దీర్ఘకాలం ఒక నాయకుడిగా వుండి, యీ డాక్యుమెంట్లు రూపొందించే చర్చల్లో పాల్గొని కూడ వాస్తవాలను మరుగుపరచడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం.

కోబాడ్ ఈరోజు విప్లవ రాజకీయాలకు తిలోదకాలిచ్చి బూర్జువా రొచ్చుగుంటలోకి ఎందుకు దిగజారాడనేది మనం చూడాలి. కోబాడ్ సంపన్న మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. ఆయన వర్గ రీత్యా జాతీయ బూర్జువా వర్గం నుండి పార్టీలోకి వచ్చాడు. కార్పోరేట్ ప్రపంచంలో పెరిగాడు. డూన్ స్కూల్లో చదివాడు. కొంతకాలం లండన్‌లో విద్యాభ్యాసం చేశాడు. ఆయన లండన్‌లో చదువుతున్న కాలంలోనే భారతదేశంలో నక్సల్బరీ వసంతమేఘగర్జనతో ప్రభావితమై విప్లవోద్యమంలో చేరాడు. మహరాష్ట్ర విప్లవ పార్టీ నిర్మాతల్లో ఒకరుగా

ముందుకొచ్చాడు. ఆయన లండన్‌లో మార్క్స్ అధ్యయనం చేసిన లైబ్రరిలో మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతం అధ్యయనం చేశాడు. కాని ఆయన మార్క్సిజంలో ప్రాణప్రదమైన మూల సూత్రాల్లో భాగమైన నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్ట అధ్యయనం చేయడంలో, గతితార్కిక చారిత్రక భౌతికవాదానికి, పద్ధతికి భిన్నంగా ఆయనలో తాత్వికంగా పిడివాద ఆలోచనలు కొనసాగాయి. ఇవి మాటల్లో అతివాద రూపంలో, ఆచరణలో మితవాద రూపంలో రాజకీయంగా తరచూ వ్యక్తమయ్యేవి. పార్టీలో ముఠాలు కట్టడానికి దారి తీసేవి. కోబాడ్‌ను పార్టీ అంతర్గత పోరాటం ద్వారా సరిదిద్దడానికి తీవ్ర ప్రయత్నాలు చేసింది. కాని ఆయన సైద్ధాంతిక, రాజకీయ పెడధోరణుల నుండి స్వచ్ఛందంగా బయటపడలేకపోవడమే గాక, దేశంలో మావోయిస్టు పార్టీ ఆవిర్భావంతో పాలకవర్గాలు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించడం, అందులో ఆయన అరెస్టు కావడంతో ఆయనలో గూడుకట్టుకొని వున్న తప్పుడు భావాలు ఆయన రచనల ద్వారా వ్యక్తమయ్యాయి. ఏ వ్యక్తి అయిన తనను తాను సరిదిద్దుకోవడానికి నేరుగా వర్గపోరాటంలో, ప్రజాయుద్ధంలో పాల్గొనడం, నిర్దిష్ట పరిస్థితులను అధ్యయనం చేయడం, తద్వారా స్వీయాత్మకత ఆలోచనలలో గల పిడివాద తప్పుడు భావాలను సరిదిద్దుకోవడం అవసరమవుతుంది. ఆయన తన 40 ఏళ్ల విప్లవ జీవితంలో దీని కోసం తక్కువ ప్రాధాన్యతనిచ్చాడు. ఆయన చెప్పుకున్నట్లే అంతర్ముఖి స్వభావం కల్గినవాడు. దీనితో ఆయన ఏ విషయాన్నైనా విస్తృతంగా తోటి కామ్రేడ్స్‌తో చర్చించడం, భావాలను ఇచ్చిపుచ్చుకోవడంలో ఆసక్తి చూపలేకపోయాడు. ఆయన సుదీర్ఘ విప్లవ జీవితం కార్మికవర్గ భావాలకనుగుణంగా మార్చుకోలేకపోయాడు. తద్వారా విప్లవోద్యమాల్లో సహజంగా వచ్చే ఆటుపోట్లను మార్క్సిస్టు పద్ధతి ద్వారా విశ్లేషించుకోలేకపోయాడు. తరచు అలాంటి సందర్భాల్లో నిరాశవాదానికి నెట్టబడడం, పార్టీ తప్పులను ఏకపక్షంగా అధికంగా అంచనా వేసి ద్వేషంగా మార్చుకోవడం ఆయనలో గల పెటీబూర్జువా అహంభావానికి నిదర్శనంగా అనేకమార్లు పొడచూపాయి. చివరకు ఆయన వాటికే బలైపోయి మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతాన్ని వ్యతిరేకించడం వరకు దారితీసింది. ఆయన మళ్లీ జైలు జీవితం తదుపరి కార్పోరేట్ ప్రపంచంలోకి వెళ్లాడు. అందుకే ఆయన 40 సంవత్సరాల తర్వాత కుళ్లిపోయిన సామ్రాజ్యవాద ,అర్ధవలస-అర్ధ భూస్వామ్య వ్యవస్థలోకి తిరిగిరావడాన్ని గొప్పగా చెప్పుకుంటున్నాడు. విప్లవోద్యమంలో సృజనాత్మకత దెబ్బతిన్నదని వాపోయాడు. కార్పోరేట్ ప్రపంచమే నా ఆలోచనలకు చలనశీలతనిస్తుందని గర్వంగా చెప్పుకుంటున్నాడు. కొండమీది నుండి రాలిన రాయి పాతాళానికి వెళ్లే వరకూ ప్రయాణిస్తుందనేది నిజమే కదా!

కోబాడ్ తీసుకొచ్చిన అభిప్రాయాలు చరిత్రలో కొత్తవేమి కావు. మార్క్సిజాన్ని అంగీకరిస్తూనే మార్క్సిజంలోని మూల సూత్రాలను తిరస్కరించిన బెర్న్‌స్టీన్, మానవతా మార్క్సిస్టుల, డాంగే సరసన్నే కోబాడ్ చేరాడు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మూల సూత్రాలను తిరగదోడడం, పాలకవర్గాల పంచన చేరి పార్టీపై బురద చల్లడం, వర్గపోరాటం బదులు వర్గ సామరస్య భావనలను ప్రత్యామ్నాయంగా ఎంచుకొని భావవాద ఆధ్యాత్మిక గురువుగా మారడం, ఘోరంగా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడంతో కోబాడ్ ఘాండీని పార్టీ నిబంధనావళిననుసరించి కేంద్రకమిటీ ఆయన పార్టీ సభ్యత్వాన్ని తొలగించి పార్టీ నుండి బహిష్కరిస్తున్నది.

ప్రియమైన ప్రజలారా,


కోబాడ్ ఘాండీ ముందుకు తెచ్చిన విప్లవ వ్యతిరేక, పచ్చి అవకాశవాద రాజకీయాలను, భావాలను, ప్రతిపాదనలను తిరస్కరించాలని మా పార్టీ ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, మేధావులకు, విప్లవ సానుభూతిపరులకు విజ్ఞప్తి చేస్తున్నది. నిరాశవాదంతో విప్లవ చేవ చచ్చి పాలకవర్గాల భావజాలం పంచన చేరిన కోబాడ్ అవకాశవాద రాజకీయాలను తిరస్కరించి, ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు తెలియజేస్తున్నది. పరమ స్వార్థంతో ఉద్యమం నుండి తప్పుకొని కుళ్లు సమాజంలో భాగమవుతున్న వ్యక్తులలో కోబాడ్ మొదటివాడు కాదు. ఇలాంటి వారిని చరిత్ర పెంటకుప్పపైకి విసిరి కొట్టి విప్లవోద్యమం పురోగమించింది. కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించే లక్ష్యంతో కార్మికవర్గ నాయకత్వంలో పీడిత ప్రజలను సమీకరిస్తూ మా పార్టీ విజయం వైపు మెట్టు మెట్టుగా ముందుకు సాగుతూనే వుంటుంది.

నోట్: కోబాడ్ ఘాండీ రాసిన "ఫ్రాక్చర్డ్ ఫ్రీడం ఎ జైల్ మెమోయిర్"కు వివరంగా మా జవాబు త్వరలో ప్రచురిస్తాం.

**(నవంబర్ 27, 2021న అభయ్ పేరుతో ఇచ్చిన ప్రకటన పూర్తి పాఠాన్ని క్రాంతి పాఠకుల కోసం అందిస్తున్నాం-సం॥మం॥)**

# మోదీ ప్రభుత్వ మెడలు వంచి సాగు చట్టాలను రద్దు చేయించిన భారత రైతాంగానికి విప్లవ జేజేలు

సామ్రాజ్యవాద, బహుళజాతి కార్పొరేషన్‌ల, భారత దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల ప్రయోజనాలను నేరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సాగు చట్టాల రద్దుకై యేడాది కాలంగా లక్షలాది రైతాంగం దిల్లీలో ధర్నా కొనసాగించి తుదకు విజయం సాధించారు. తమకు ఎదురు లేదని విర్రవీగుతూ, పార్లమెంటులో తమకు గల మెజారిటీతో తాము ఏమైనా చేయగలమనే అహంతో అత్యంత నిరంకుశంగా 2020 సెప్టెంబర్‌లో రూపొందించిన మూడు సాగు చట్టాలను నవంబర్ 2021 చివరలో జరుగనున్న శీతాకాల సమావేశాలలో ఉపసంహరించుకుంటామనీ దేశ ప్రధాని నరేంద్ర మోదీ 19 నవంబర్ నాడు ఒక ప్రత్యేక ప్రకటన ద్వార తెలియజేశాడు. ఇది భారత రైతుల పోరాట విజయం. యేడాదికాలంగా దిల్లీలో అనేక కష్టనష్టాలకు ఓర్చుకుంటూ తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై ఉద్యమాన్ని కొనసాగించిన అన్నదాతలకు దేశం మొత్తం అండగా నిల్చింది. విదేశాలలోని అనేక మంది భారతీయులు, సంస్థలు భారత రైతాంగానికి తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. ఆ రకంగా ఈ విజయం దేశ ప్రజలది. నిరంకుశ సాగుచట్టాల రద్దుకై యేడాది కాలంగా పోరాడుతూ దాదాపు 700కు పైగా రైతులు అసువులు బాసారు. వారందరికి ముందుగా క్రాంతి పత్రిక విప్లవ జోహార్లర్పిస్తోంది.



రైతాంగ పోరాట విజయం

మన దేశ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా వందలాది రైతు సంఘాలు సమైక్యమై 'సంయుక్త కిసాన్ మోర్చా'ను ఏర్పర్చుకొని దాని నాయకత్వంలో రాజీలేని ఉజ్వల పోరాటాన్ని కొనసాగించారు. వారి పోరాటాన్ని నిర్వీర్యం చేయడానికి హిందుత్వ శక్తులు అనేక కుట్రలకు పాల్పడినాయి. వారి మీద అనేక దాడులకు పూనుకున్నాయి. అయినప్పటికీ, వారు వాటిని లెక్క చేయకుండా పోరాట మార్గంలో దృఢంగా నిలిచి మోదీ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పారు. కేంద్రంలోని బ్రాహ్మణీయ హిందుత్వ భాజపా ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలన్నింటినీ మన దేశ ప్రజలు గట్టిగా వ్యతిరేకిస్తున్నారనడానికి ప్రస్తుత రైతాంగ పోరాట విజయం మరో పెద్ద ఉదాహరణ. పోరాటాల ద్వారానే బ్రాహ్మణీయ హిందుత్వ శక్తుల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగల విశ్వాసాన్నిచ్చింది.

2015లో కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన భూసేకరణ బిల్లును భారత రైతాంగం దృఢంగా వ్యతిరేకించడంతో మోదీ తొక ముడవక తప్పలేదు. అదే విధంగా 2018 మార్చ్‌లో సుప్రీంకోర్టు దళిత ఆదివాసీ అత్యాచార నిరోధక చట్టానికి సవరణ చేయాలనే ఆదేశాన్ని వెలువరించినపుడు దేశ ప్రజలు వీధుల్లోకి వచ్చి హిందుత్వ కుట్రకు వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని తెలిపారు. ఆ సందర్భంగా పోలీసుల కాల్పులలో 7గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రజల ఆగ్రహ జ్వాలల రుచి చూసిన కేంద్రం వెంటనే అలాంటిదేమీ జరుగదని ప్రజలకు హామీ ఇవ్వక తప్పలేదు. మరుసటి సంవత్సరం 2020 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు దేశ అడవుల నుండి భూముల పట్టాలు లేని ఆదివాసీలను, గైరాదివాసులను బేదఖల్ చేయించాలని ఆదేశాలు వెలువరించినపుడు దేశం మొత్తం సుప్రీంకోర్టు ఆదేశాన్ని వ్యతిరేకించి ఆదివాసీ ప్రజలతో భుజం భుజం కలిపి పోరాటంలోకి దిగింది. దానితో వెంటనే మళ్లీ కేంద్ర ప్రభుత్వం ఆ ఆదేశాన్ని అమలుకాకుండా నిలపక తప్పలేదు. ఇవన్నీ పోరాటాల ద్వారానే ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోగలుగుతారనే తిరుగులేని తీర్పును ఇస్తున్నాయి. ఆ దారినే దేశ వ్యాప్తంగా మూలవాసులు విస్థాపనకు వ్యతిరేకంగా అడవులను కాపాడుకుందామనే విశాల దృష్టితో 'ఖదాన్ నహీ, అనాజ్' అంటూ జల్, జంగల్, జమీన్ కోసం ఉద్యమిస్తుంటే ప్రభుత్వాలు అడవులను ఖాకీమయం చేస్తున్నాయి. అది అక్కడి ప్రజల అస్తిత్వ సమస్యగా మారుతుండడంతో దండకారణ్యం, ఝార్ఖండ్, ఒడిశా, తెలంగాణ సహ అనేక రాష్ట్రాలలోని ఉద్యమ ప్రాంతాల ప్రజలు ప్రధానంగా మూలవాసులు నూతన పోలీసు క్యాంపుల వ్యతిరేక పోరాటాలను చేపట్టి తీవ్రతరం చేస్తున్నారు. ఈ రోజు ప్రభుత్వ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ఆ మూలవాసుల జీవన్మరణ పోరాటాలకు అండగా నిలువాల్సిన ఆవశ్యకత దేశ ప్రజల ముందుంది. వ్యవసాయ ప్రధానమైన మన దేశ ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి వ్యవసాయ విప్లవం జయప్రదం చేయడం మినహా మరో మార్గం లేదు.

# ప్రధాన మంత్రికి సంయుక్త కిసాన్ మోర్చా లేఖ

## విషయం: దేశానికి మీ సందేశం మరియు రైతుల సందేశం మీకు

ప్రియమైన ప్రధాన మంత్రి గారికి,

దేశంలోని కోట్లాది మంది రైతులు నవంబర్ 19, 2021 ఉదయం జాతినుద్దేశించి మీరు చేసిన ప్రసంగాన్ని విన్నారు. 11 దఫాలుగా జరిగిన చర్చల తర్వాత, మీరు ద్వైపాక్షిక పరిష్కారం కాకుండా ఏకపక్ష ప్రకటన మార్గాన్ని ఎంచుకున్నారని మేము గుర్తించాము. అయినప్పటికీ, మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకునే నిర్ణయాన్ని మీరు ప్రకటించినందుకు మేము సంతోషిస్తున్నాము. మేము ఈ ప్రకటనను స్వాగతిస్తున్నాము మరియు మీ ప్రభుత్వం యీ వాగ్దానాన్ని వీలైనంత త్వరితంగానూ మరియు పూర్తిస్థాయిలో నెరవేరుస్తుందని ఆశిస్తున్నాము.

ప్రధానమంత్రి, యీ ఉద్యమం యొక్క ఏకైక డిమాండ్ మూడు నల్ల చట్టాలను రద్దు చేయడమే కాదని మీకు బాగా తెలుసు. ప్రభుత్వంతో చర్చల ప్రారంభం నుండి, సంయుక్త కిసాన్ మోర్చా మూడు అదనపు డిమాండ్లను మీ ముందుంచింది:

1, సమగ్ర ఉత్పత్తి వ్యయం (సి2+50%) ఆధారంగా అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర రైతులందరికీ చట్టబద్ధమైన హక్కును కల్పించాలి. తద్వారా దేశంలోని ప్రతి రైతుకు వారి మొత్తం పంటకు ప్రభుత్వం ప్రకటించిన ఎమ్ఎస్పికి కనీసం హామీ ఇవ్వబడుతుంది. (మీ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ 2011లో అప్పటి ప్రధానమంత్రికి యీ సిఫార్సు చేసింది మరియు దీని గురించి మీ ప్రభుత్వం పార్లమెంటులో కూడా ప్రకటించింది)

2,ప్రభుత్వం ప్రతిపాదించిన "విద్యుత్ సవకణల బిల్లు" 2020-2021" ముసాయిదాను ఉపసంహరించుకోవాలి. (చర్చల సమయంలో, విద్యుత్ సవకణ బిల్లు, 2020-2021ని ఉలసంహరించుకుంటామని ప్రభుత్వం హామీ యిచ్చింది. అయితే వాగ్దానాన్ని ఉల్లంఘించి, దానిని పార్లమెంటు అజెండాలో చేర్చారు)

3,"కమీషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ ఇన్ నేషనల్ క్యాపిటల్ రీజియన్ అండ్ అర్జయినింగ్ ఏరియా యాక్ట్ 2021"లో రైతుల పై విధించిన జరిమానా నిబంధనలను తొలగించండి (ఈ సంవత్సరం, ప్రభుత్వం కొన్ని రైతు వ్యతిరేక నిబంధనలను తొలగించింది కానీ మళ్లీ సెక్షన్ 15 ద్వారా రైతులపై శిక్షార్హమైన చర్యలు తీసుకునే అవకాశం వుండేలా దీనిని తిరిగి తీసుకొచ్చారు.) మీ ప్రసంగంలో యీ ముఖ్యమైన డిమాండ్ల పై ఖచ్చితమైన ప్రకటన లేకపోవటంతో రైతులు నిరాశకు గురయ్యారు. ఈ చారిత్రక ఉద్యమం ద్వారా, మూడు చట్టాలను నివారించడమే కాకుండా, తమ కష్టానికి తగిన ప్రతిఫలమైన %మీక్రా%కి చట్టబద్ధమైన హామీని కూడా పొందవచ్చని రైతులు ఆశించారు.

ప్రధానమంత్రి, గత ఏడాదిలో జరిగిన యీ చారిత్రక ఉర్యమంలో తక్షణమే పరిష్కరించాల్సిన మరికొన్ని సమస్యలు కూడా వున్నాయి.

4. ఈ ఉద్యమంలో (జూన్ 2020 నుండి ఇప్పటి వరకు) ఢిల్లీ, హర్యానా, చండీగఢ్, ఉత్తరప్రదేశ్ మరియు అనేక యితర రాష్ట్రాలలో వేలాది మంది రైతులు వందలాది కేసుల్లో చిక్కుకున్నారు. ఈ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి.

5. లఖింపూర్ ఖేరీ హత్య కేసులో ప్రధాన సూత్రధారి మరియు సెక్షన్ 120బి నిందితుడైన అజయ్ మిశ్రా తేనీ ఇప్పటకీ స్వేచ్ఛగా తిరుగుతున్నాడు మరియు మీ మంత్రివర్గంలో మంత్రిగా కొనసాగుతున్నాడు. మీతో పాటు యితర సీనియర్ మంత్రులతో కూడా వేదిక పంచుకుంటున్నారు. అతడిని బర్తరఫ్ చేసి, అరెస్ట్ చేయాలి.

6. ఈ ఉర్యమ సమయంలో, ఇప్పటి వరకు సుమారు 700 మంది రైతులు తమ జీవితాలను తమ అత్యున్నత త్యాగంగా త్యాగం చేసారు. వారి కుటుంబాలకు పరిహారం, పునరావాసం కల్పించాలి. అమరవీరుల రైతుల స్మారకార్ధం అమరవీరుల స్మారకం నిర్మించేందుకు సింఘు సరిహద్దులో భూమి యివ్వాలి.

ప్రధానమంత్రి, మీరు యిప్పుడు మేము యింటికి తిరిగి వెళ్లాలని రైతులకు విజజప్తి చేసారు. వీధుల్లో కూర్చోవడం మాకు యిష్టంలేదని మేము మీకు హామీ యిస్తున్నాము. ఈ యితర సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించిన తర్వాత, మేము మా యిళ్లకు, కుటుంబాలకు మరియు వ్యవసాయానికి తిరిగి రావాలని మేము కోరుకుంటున్నాము. మీరు అదే కావాలంటే, పైన పేర్కొన్న ఆరు అంశాల పై ప్రభుత్వం వెంటనే సంయుక్త కిసాన్ మోర్చాతో చర్చలు ప్రారంభించాలి. అప్పటి వరకు సంయుక్త కిసాన్ మోర్చా యీ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని తెలియజేస్తున్నాము.

21 నవంబర్ 2021

భవదీయులు

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కెఎం)

ప్రజా ఉద్యమాల నివేదిక

# అభివృద్ధి పేరుతో అణచి వేతకు మరో ప్రహార్‌కు సిద్ధం

భారత ప్రభుత్వ జాతీయ సలహాదార్ విజయకుమార్ నాయకత్వంలో 2020 నుండి 2021 జూన్ వరకు రెండు ప్రహార్ కేంపెయిన్‌లు కొనసాగాయి. కానీ ఆ రెండింటినీ పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా నిర్మాణాలు, జనతన సర్కార్లు, ప్రజలు దేశ విదేశాలలోని విప్లవాభిమానులు, వామపక్ష ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులు, సంస్థలు, హక్కుల కార్యకర్తలు, విదేశాలలోని భారత ప్రజాయుద్ధ సంఘీభావ సంస్థలు సమైక్యంగా తిప్పికొట్టారు. ఆ రెండు ప్రహార్ సైనిక కేంపెయిన్‌లలో అనేక త్యాగాలు చేశారు. అనేక మంది తప్పుడు కేసులలో ఇరికించబడి జైళ్ల పాలైనారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ విప్లవ దృఢ సంకల్పంతో దోపిడీ పాలక వర్గాల వారి భద్రతా బలగాల ప్రహార్ సైనిక అభియాన్‌లను తిప్పికొట్టిన వారందరికి విప్లవాభివందనాలు.

గత రెండు సైనిక కేంపెయిన్‌లలో తాము అనుకున్న ప్రగతి సాధించకపోవడంతో మరో ప్రహార్ దాడికి నేరుగా కేంద్ర హోం మంత్రి ఆధ్వర్యంలో పథకం రూపొందింది. 26 సెప్టెంబర్ నాడు 10 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఢిల్లీలో సమీక్ష సమావేశం జరిపాడు. ఇందులో కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్, కార్యదర్శి అజయ్ కుమార్ బల్లా, ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ అరవింద్ కుమార్‌లతో పాటు కేంద్ర మంత్రులు గిరిరాజ్ సింగ్, అర్జున్ ముండా, అశ్వినీ వైష్ణవ్, జనరల్ వీకే సింగ్ పాల్గొన్నారు. వచ్చే ఏడాదిపాటు వామపక్ష తీవ్రవాదం సమస్యకు ముఖ్యమంత్రులందరూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తద్వారా సమస్య పరిష్కారం లభిస్తుందనీ ఆయన తెలిపారు. దీనికి కేంద్రం, రాష్ట్రాల మధ్య మెరుగైన సమన్వయం, కార్యక్రమాల అమలులో వేగవంతం అవసరమని షా స్పష్టం చేశాడు. అంతేగాక, వామపక్ష తీవ్రవాదాన్ని దీటుగా ఎదుర్కొనేందుకు బాధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీ కనీసం మూన్నెళ్లకోసారి అయినా కేంద్ర సంస్థల అధికారులతో సమావేశం అవ్వాలనీ అప్పుడే ఈ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లగలమనీ తెలిపాడు. తెలంగాణ, బిహార్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, ఛత్తీస్‌గఢ్, పశ్చిం బంగాల్, కేరళల నుండి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**ఏరివేత చర్యలు:** ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి సమావేశం తదుపరి దేశవ్యాప్తంగా మావోయిస్టుల అణచివేత చర్యలు వేగవంత మయ్యాయి. ఒడిశాలో **దమన్ వాహిని** పేరుతో ఒక కొత్త బలగాన్ని నిర్మించ తలపెట్టారు. ఇందులో ఆధునిక ఆయుధాలతో 2 వేల మంది ఉంటారనీ, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం, తూర్పు గోదావరి జిల్లాలతో పాటుగా తెలంగాణకు చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి ఎంపిక చేస్తారనీ, మల్కన్‌గిరిలో ఉన్న బలగాలు వీరికి తోడవుతారనీ ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలు నిర్ణయించాయి. దమన్ వాహినికి మావోయిస్టుల కదలికల గురించి ఇంటలిజెన్స్ సమాచారం అందివ్వడానికి మల్కన్‌గిరి జిల్లాలోని చిత్రకొండ పోలీసులు సహకరిస్తారనీ వివరించారు. వీరు అవసరమైనపుడు భారత వాయుసేన హెలీకాప్టర్లు కూడ వినియోగిస్తారనీ అన్నారు. శాటలైట్లు అందించే సమాచారం, కెమరాల ద్వార వచ్చే ఫోటోలు, ఆధునిక ఆయుధాలతో బలగాలను సమన్వయించడానికి ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఈ బలగానికి ఒడిశాలోని కట్ ఆఫ్ ఏరియా/విచ్ఛిన్నాంచల్ ('స్వాభిమానాంచల్')తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని రెండు పంచాయతీలను తమ ఆపరేషనల్ ఏరియాగా ఉంటుంది.

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌లో గల 7 జిల్లాలలో (సుక్మా, బీజాపుర్, దంతెవాడ, నారాయణ్‌పుర్, కొండగాం, బస్తర్, కాంకేర్) జిల్లాకు 400 మంది చొప్పున 2,800 మంది స్థానికులతో **బస్తర్ ఫైటర్స్** పేరుతో ఒక కొత్త బలగాన్ని ఏర్పాటుచేస్తున్నారు.

దేశంలోని మావోయిస్టు ప్రాంతాల అణచివేతలో భాగంగా కేంద్ర రిజర్వు పోలీసు ఫోర్స్ మరో **59 ఫార్వర్డ్ ఆపరేషనల్ బేస్**లను ఏర్పాటు చేయనుందని అధికారులు పేర్కొన్నారు. వీటిలో ఈ యేడు 34 ఏర్పాటు చేయనుండగా 2022లో 25 ఏర్పాటు చేస్తారని తెలిపారు. వీటిలో 10 ఛత్తీస్‌గఢ్‌లో, 6 ఝార్ఖండ్‌లో, ఒడిశా, తెలంగాణలలో ఒక్కొక్కటి, మహారాష్ట్రలో 7 ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈ బేస్‌లలో ఉండే బలగాలకు ఆధునిక ఆయుధాలతో పాటు మందు పాతర నిరోధక వాహనాలను, మెరుగైన వైద్య సౌకర్యాలను సమకూరుస్తామని చెప్పారు.

బలగాల వద్ద 250 గ్రాముల బరువు కల నానో డ్రోన్లు, 2 కిలోల నుంచి 25 కిలోల బరువు కలిగిన స్మాల్ డ్రోన్లు, 150 కిలోల లోపు బరువు ఉండే మీడియం డ్రోన్లు, 150 కిలోలకు పైగా బరువు కలిగిన లార్జ్ డ్రోన్లున్నాయి. వీటిని డైరెక్టర్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ మార్గదర్శకాల మేరకు వాడుతున్నారు. వీటిలో పోలీసులు నానో, మైక్రో డ్రోన్లను వాడుతున్నారు. ఇవి 250 మీటర్ల నుండి 400 మీటర్ల ఎత్తుతో పాటు దూరం వెళ్లగలుగుతాయి. పక్షులు ఎగురుతున్నట్టుగానే శబ్దం రాకుండా పనిచేసే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ డ్రోన్లను వాడుతున్నారు. ఇవి పూర్తి స్థాయి నియంత్రణలో ఉండడంతో పాటు ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ బేస్‌క్యాంపుల నుంచి అనుసంధానం చేసి ఉన్నాయి.

నూతన ప్రహార్ దాడికి సన్నాహాలు పూర్తయ్యాక ఇక సైనిక దాడి ప్రారంభం కానున్నదంటూ ఛత్తీస్‌గఢ్ డీజీపీ అశోక్ జునేజా తమ రాష్ట్రంలోని తయారీల వివరాలు విడుదల చేశాడు.

మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో 75 ఫోర్టిఫైడ్ పోలీసు స్టేషన్‌ల నిర్మాణం పూర్తయిందన్నాడు. అలాగే లోతట్టు ప్రాంతాలలో మరో 63 క్యాంపుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నాడు. నక్సల్ వ్యతిరేక గాలింపు చర్యలను ముమమరం చేయడానికి రాత్రి దిగడానికి అనుకూలంగా 32 హెలీపాడ్‌ల నిర్మాణం జరిగిందనీ వాటిలో 14 హెలీపాడ్‌ల వినియోగం ప్రారంభమైందనీ వీటి ద్వార బలగాలకు ఆయుధాలు మందుగుండు చేర్చుతున్నామనీ తెలిపాడు. నక్సలైట్లకు కీలకమైన ప్రాంతాలలో బీజాపుర్‌లో తర్రెం, నారాయణ్‌పుర్‌లో భారండా, బస్తర్‌లో మాలెవాహి, కొండగాంలో అనంతపుర్‌లు సహా మిగితా చోట్ల కలిపి 16 కొత్త పోలీసు క్యాంపులు, 4 కొత్త పోలీసు స్టేషన్‌ల నిర్మాణం జరిగిందన్నాడు. మూడు దశాబ్దాల తరువాత ఈ క్యాంపుల సహాయంతో పల్లీ బార్సూర్, అరన్‌పుర్ జగర్‌గుండా మార్గాలు తెరుచుకున్నాయనీ చెప్పాడు. 525 కొత్త మొబైల్ టవర్లను నెలకొల్పామన్నాడు. 4జీతో కూడిన మరో 971 టవర్లను నెలకొల్పే ప్రక్రియ సాగుతోందన్నాడు.

26/11 ముంబాయి దాడుల తరువాత రూ. 3,400 కోట్ల ప్రాజెక్టుతో సిద్ధమైన **ఇంటలిజెన్స్ గ్రిడ్** త్వరలో ప్రధాని జాతికి అంకితం చేస్తాడని అమిత్ షా చెప్పిన 15 రోజులకు ఈ మీటింగ్ జరిగింది. ఆపరేషన్ సమాధాన్‌లో దీనికి అధిక ప్రాధాన్యతనిస్తూ దాడులను సమన్వయంతో కొనసాగించడం తెలిసిందే.

తక్కువ ఎత్తులో తిరిగే డ్రోన్లను కూల్చండి అంటూ కేంద్ర భద్రత బలగాలకు ఆదేశాలు: కొత్త సాంకేతికతను కనుగొనేవరకు తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్ల భరతం పట్టడానికి **పంప్ యాక్షన్ గన్స్ (పీఏజీ)**ను వాడాలని కేంద్ర భద్రతా బలగాలకు ఆదేశాలు అందాయి. కీలక స్థావరాలు, విమానా శ్రయాలకు రక్షణగా ఉండే సిబ్బంది అంతా....ఈ తుపాకులను అందుబాటులో ఉంచుకోవాలనీ ఆదేశాల్లో పేర్కొన్నారు. "60 నుంచి 100 మీటర్ల ఎత్తులో ఎగురుతూ బాంబులు వేసేందుకు ప్రయత్నించే డ్రోన్లను పీఏజీ రబ్బర్ తూటాలతో సమర్థంగా కూల్చవచ్చని తేలింది" అని ఓ అధికారి తెలిపారు.

నక్సలైట్ల ఏరివేత చర్యలు ముమ్మరం చేయాలనీ, మావోయిస్టు లకు అందుతున్న నిధులను నిలువరించేలా వారి ఆర్థిక మూలాలపై ఉక్కు పాదం మోపాలనీ నిర్ధేశించాడు. మావోయిస్టుల కట్టడిలో ఈడీ, ఎన్ఐఏ సేవలను వినియోగించాలనీ, రాష్ట్ర పోలీసులను మరింత బలోపేతం చేయాలనీ సూచించాడు. మావోయిస్టుల ఏరివేత చర్యలు ఉధృతం చేయడంతో పాటు వారి ఆర్థిక మూలాలనూ దెబ్బ తీయాలని సూచించాడు. అనుబంధ ప్రజా సంఘాల విషయంలో ఉదాసీనత పనికిరాదనీ, వారిపై కఠినంగా వ్యవ హరించాలనీ అన్నాడు. పోరులో కీలకదశ చేరామని, రాష్ట్రాల కు ఉదారంగా నిధులిస్తామనీ, అభివృద్ధితోనే సమస్యకు పరిష్కార మనీ, సమన్వయంతోనే సత్ఫలితాలనీ, ఏడాది కాలానికి లక్ష్య నిర్దేశం చేశాడు.

**'అభివృద్ధి' కార్యక్రమాలు:** రానున్న మూడేళ్లు చాలా ముఖ్యం అంటూ రూ. 50 వేల కోట్ల ఖర్చుకు ప్లానింగ్ చేశారు. విద్యుత్తు, రోడ్లు, రైలు కారిడార్- కమ్యూనికేషన్‌పై ఖర్చు చేస్తారట. రూ.25 వేల కోట్లు, 146 పులియాలు, 6,000 కిలో.మీ. రోడ్డు కోసం వెచ్చిస్తారట! నక్సల్ జిల్లాలలో ఇప్పటికే 17,600 కి.మీ. రోడ్ల నిర్మాణం ప్రతిపాదనలలో ఉండగా 9,300 కి.మీ పూర్తయిందని, 2,343 టవర్ల నిర్మాణం జరిగిందనీ నక్సల్ ఏరివేత చర్యలలో సమాచార సేకరణ కీలకమని ప్రభావిత జిల్లాలలో మరో 2,542 టవర్లను వచ్చే 18 నెలలలో ఏర్పాటు చేస్తామన్నాడు. ఇప్పటికే ఉన్న 1,789 పోస్టాఫీసులకు తోడుగా త్వరలో 3,114 పోస్టాఫీసులను తెరుస్తామని పేర్కొన్నాడు. 1,236 బ్యాంకులు, 1,077 ఏటీఎంలు, 14,230 మంది బ్యాంకింగ్ కరస్పాండెంట్లు వినియోగంలో ఉన్నాయి. ఇవీ దిల్లీ సమావేశంలో నేతలంతా తలపెట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు!

**25 కు తగ్గిన ప్రభావిత జిల్లాలు:** 2010లో నక్సల్ ప్రభావిత జిల్లాలు 96 ఉండగా ఇపుడు వాటి సంఖ్య 53కు దిగిందన్నాడు. గత మూడేళ్లలో రెండుసార్లు సమీక్ష నిర్వహించి భద్రతా సంబంధిత వ్యయం పథకంలోని 126 జిల్లాలను 2018లో 90కి, ఈ ఏడాది జులైలో వాటిని 70కి తగ్గించినట్లు షా చెప్పాడు. నక్సల్ హింసాయుత జిల్లాలను 2018లో 35 నుంచి 30కి, 2019లో 61 జిల్లాలకు, 2020లో 45 జిల్లాలకు, 2021..ఈ ఏడాది జులైలో 25కి తగ్గించగలిగామని ఆయన చెప్పాడు. కానీ, కొన్నిచోట్ల మళ్లీ పుంజుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో 8ని ఆందోళన జిల్లాలుగా వర్గీకరించామన్నారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాల నియామకానికి అయ్యే ఖర్చును స్థిరంగా ఉంచాలని ప్రధాని నిర్ణయించారని, దీంతో బలగాల నియామకానికి అయ్యే ఖర్చు 2018-19తో పోలిస్తే 2019-20లో రూ. 2,900 కోట్లు తగ్గిందనీ తెలిపాడు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలలో రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రుల నిర్మాణం వంట అభివృద్ధి కార్యక్రమాల కోసం కేంద్ర ప్రభుత్వం వంద శాతం నిధులు భరించాలని ముఖ్యమంత్రులు కోరారు. పోలీసుల ఆధునికీకరణకు మరిన్ని నిధులు అదనపు బలగాల గురించి కూడ ప్రస్తావించారు.

ఒకప్పుడు మావోయిస్టుల సమస్య దాని వెన్నంటి శాంతి భద్రతల సమస్య రాష్ట్రాల పరిధిలో ఉండేదని 2015నుండి కేంద్రం జాతీయ విధానాన్ని రూపొందించినందున సత్ఫలితాలు వస్తున్నాయని తమ ప్రభుత్వ గొప్పతనాన్ని షా పేర్కొన్నాడు. అవసరమైన నిధులు, అదనపు బలగాలను కేంద్రమే సమకూరుస్తున్నదని పూర్తి స్థాయి ఫలితాలు రాబట్టడంపైనే రాష్ట్రాలు దృష్టి పెట్టాలని అన్నాడు. ఒక్క ఏడాదిలోనే 2,900కోట్ల మేర రాష్ట్రాలకు ఉపశమనం లభించిందని షా అన్నాడు.

మావోయిస్టుల అణచివేతలో రాజ్యం 2008-2021 మధ్య రూ. 1,354 కోట్లు ఖర్చు చేసిందనీ అధికారికంగా లెక్కలు చూపు తున్నారు. వాస్తవంగా కేంద్రం, రాష్ట్రాలు సంయుక్తంగా చేసిన ఖర్చులు ఇంతకు అనేక రెట్లు ఎక్కువగా ఉంటాయనీ నిస్సందేహంగా

చెప్పవచ్చు. వాటిపై శ్వేత పత్రం జారీ చేసే ధైర్యం ఏ ప్రభుత్వం ఇప్పటివరకు చేయలేదు.

### తెలంగాణ:

తెలంగాణ లోని దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లోనూ పలు చోట్ల సీఆర్‌పీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ బేస్ క్యాంపుల నుండి పోలీసులు దండకారణ్యంపై డ్రోన్ కెమరాలు ఉపయోగిస్తున్నారు. ప్రగతిశీల చర్యలు, విధానాలతో రాష్ట్రంలో నక్సలిజం కట్టడి చేశామంటూ కేసీఆర్ సరిహద్దుల వద్ద పటిష్టమైన చర్యలు చేపట్టామని కేసీఆర్ అన్నాడు. సరెండర్ పాలసీని అమలు చేస్తూ అందులో చేరకుండా చూస్తున్నామని ఆయన అన్నాడు. గాలింపు ఆపరేషన్లు చేస్తున్నారని అంటూ పలు సూచనలు, సలహాలు ఇచ్చాడు. ఢిల్లీ సమావేశం తర్వాత తెలంగాణ సరిహద్దులలో కొత్త పోలీసు క్యాంపులు నెలకొల్పే ప్రక్రియ వేగవంతమైంది. డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలోని చెన్న పురంలో రెండు కొత్త క్యాంపులు వేశారు.

### ఆంధ్రప్రదేశ్:

రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 5 నుండి 2కు తూర్పు గోదావరి, విశాఖకు పరిమితమైందని రాష్ట్ర హెూం మంత్రి సుచరిత అంది. మావోయిస్టుల సంఖ్య కూడ 50కి తగ్గినట్లు ఆమె చెప్పింది. తమ ప్రభుత్వం చేపట్టిన గ్రామ సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ ద్వార మారుమూల ప్రాంతాలకు అభివృద్ధి కార్యక్రమాలను తీసుకెళ్లగలిగామని దాని వల్ల సుదీర్ఘ సమస్య క్రమంగా తగ్గుతుందని అంది. మహిళలకు సహాయం, ఏకలవ్య విద్యాలయాలు, రహదారుల నిర్మాణం, అదనపు బటాలియన్‌లు కావాలని విజ్ఞప్తి చేసింది. ఏపీ–ఒడిశా సరిహద్దుల్లో ఏర్పాటు చేసే గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికి సాయం కోరింది. మూడు కిలోమీటర్లకు ఒక పోస్టాఫీసు కావాలని కోరింది. రాష్ట్రంలో బాక్సైట్ తవ్వకాలు చేపట్టనందున ఖనిజం ఒడిశా నుండి ఇవ్వాలని కోరింది. వీటితో మావోయిస్టుల ప్రభావం మరింత తగ్గుతుందని చెప్పింది. అయితే సమస్య పూర్తిగా సమసిపోలేదని, అప్రమత్తంగా ఉండాలని అంది.

వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తలపెట్టిన మూడు రాజధానుల పథకంలో విశాఖపట్టణం వ్యాపార రాజధానిగా ఏర్పడనుండడం, ఆ జిల్లాలోని అడవులలో మావోయిస్టు ఉద్యమం ఉండడం పోతే మన్యంలో వేలాది ఎకరాల ప్రభుత్వ కాఫీ ప్లాంటేషన్‌లు రైతులు పోరాడి స్వాధీనం చేసుకోవడంతో పాటు బాక్సైట్ గనుల తవ్వకం నిలిచిపోవడంతో రాష్ట్రంలో మావోయిస్టుల ఏరివేతకు ప్రభుత్వం వెంపర్లాడుతోంది.

### ఒడిశా:

ముఖ్యమంత్రి పట్నాయక్ నాల్గు లేన్ల నేషనల్ హైవే 326 జైపుర్ నుండి మోటు వయా మల్కాన్‌గిరి రోడ్డును పరిశీలించాలని మీటింగ్‌లో కోరాడు. అలాగే నక్సల్ ప్రభావిత జిల్లాలు రైల్వే నెట్‌వర్క్‌కు దూరంగా ఉన్నాయని అన్నాడు. మా రాష్ట్రంలో చురుకైన భద్రతా వ్యూహాన్ని ఆదివాసీ ప్రాంతాలలో నిలకడ కలిగిన అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తామన్నాడు.

ప్రస్తుతం మన దేశంలోని మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలన్నీ ముఖ్యంగా ప్రాకృతిక సంపదలకు నిలయాలుగా ఉన్న అడవులు భారత భద్రతా బలగాలు, రాష్ట్రాల ప్రత్యేక పోలీసు బలగాలు, కమాండోల ముమ్మర గాలింపు చర్యలతో అట్టుడికిపోతున్నాయి. డ్రోన్‌ల రొద ఆగడం లేదు. ఆకాశంలో హెలికాప్టర్లు నిత్యం అనేక చక్కర్లు కొడుతున్నాయి. పోలీసు వాహనాలు పరుగులు తీస్తున్నాయి. నూతన పోలీసు క్యాంపులు ముఖ్యంగా ఫార్వర్డ్ ఆపరేషనల్ బేస్‌ల నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నది. బూటకపు ఎన్‌కౌంటర్ల పరంపర పెరుగుతోంది. నవంబర్ చివర్లో సుక్మా జిల్లా తాడిమేండ్రి లో ప్రజా మిలీషియా కార్యకర్త మాడ్వి భీమాల్‌ను పోలీసులు కాల్చి చంపారు. ఇక బూటకపు సరెండర్ల సంఖ్య పదులలోనే చూపుతున్నారు. కొత్త కొత్త పేర్లతో లొంగుబాటు పథకాలను చేపడుతున్నారు. విప్లవకారుల తలలకు వెలలు పెంచుతూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ అనల్‌పై కోటి రూపాయల రివార్డు అంటూ ఝార్ఖండ్‌లో పెద్ద ఎత్తున పోస్టర్లు వేశారు. పోలీసులు చేస్తున్న విష ప్రచారానికి నీతి–నియమం, హద్దూ–అదుపు ఊహించలేం.

ఢిల్లీ సమావేశం కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిగిన ఫలితంగా దానికి రాజకీయ రంగునిచ్చారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి జపించారు. కానీ, నిజానికి వారు చేపట్టిన చర్యలేవీ వాస్తవంగా ప్రజలు కోరుకుంటున్నవి కానే కావు. ప్రజల దైనందిన జీవితాలలో కానీ వారి మౌలిక సమస్యలను కానీ పరిష్కారించేవి ఎంతమాత్రం కావు. ఆ సమావేశం లక్ష్యమే వారే ప్రకటించినట్టు మావోయిస్టుల ఏరివేత. సంవత్సరకాలం సమన్వయంతో ఆ లక్ష్యానికి లోబడి పనిచేయాలని కేంద్రం ఆదేశం. దేశ, సామ్రాజ్యవాదులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక, ద్రవ్య సంక్షోభం ఫలితంగా వారు తమ దోపిడీని తీవ్రతరం చేయడానికి దేశంలో మావోయిస్టులు సహ ప్రభుత్వ అవినీతి–అక్రమాలను; దోపిడీ–దౌర్జన్యాలను; ప్రజా వ్యతిరేక చట్టాల రూపకల్పనను, ప్రజా అనుకూల చట్టాల అమలును, హత్యలను–అత్యాచారాలను ప్రశ్నించే ప్రతి ఒక్కరి అడ్డు తొలగించుకోవడంలో భాగంగా ముందు దేశాన్ని మావోయిస్టు రహిత నవ భారతాన్ని నిర్మించాలని కలలు కంటున్నారు. మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో పని చేస్తున్న కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన 155 మందిని 2021 ఆగస్టు 15నాడు శౌర్య పథకాలతో సన్మానించారు. వీరిలో ఐటీబీపీకి చెందిన వారు ముగ్గురున్నారనీ చాలా గొప్పగా చెప్పుకుంటున్నారు. నిజానికి వీరి శౌర్య ప్రతాపాలన్నీ ప్రజలను ఊచకోత కోయడంలోనే ప్రదర్శిస్తున్నారన్నది మర్చిపోకూడదు. విదేశీ శతృసైన్యాలతో పోరాడితే శౌర్యం తప్ప దేశంలోని ఆదివాసులను అంతమొందించ డమే శౌర్యంగా ప్రశంసించడం వారిని మరింత హింసోన్మాదం వైపు నెట్టడమే అవుతుంది. సైన్యానికి, భద్రతా బలగాలకు పెద్ద

పీఠ వేస్తూ శక్తి పూజలతో హింసను ప్రేరేపించే దుష్ట హిందుత్వ శక్తులు తమ కలల సాకారానికే సమాధాన్‌లు, అందులో భాగంగా ప్రహార్‌లు. కానీ, వారు తమ లక్ష్య సాధనలో విఫలం కాక తప్పదు.

## ప్రహార్‌లు కాదు ప్రజా సమస్యలు పరిష్కరించండి! ఇది ప్రజల రణ నినాదం

దేశంలోని మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలు సహ దేశ వ్యాప్తంగా పీడిత ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్నారు. అందులో భాగంగా మన దేశంలోని లక్షలాది రైతాంగం దాదాపు యేదాది కాలం మోదీ రూపొందించిన సాగు చట్టాలకు వ్యతిరేకంగా నిరవధికంగా ధర్నా, రాస్తారోఖో, ర్యాలీలు తదితర అనేక రూపాలలో పోరాడారు. ఆ పోరాటంలో వేలాది రైలు మహిళలు పాల్గొన్నారు. ఆ పోరాటానికి యావద్దేశ ప్రజలు అండగా నిలిచారు. దానితో, తన అభివృద్ధి మంత్రం ఎదురుతిరిగిందనీ గ్రహించిన మోదీ చివరకు పోరాట రైతులకు క్షమాపణలు చెప్పి నిరంకుశంగా రూపొందించిన చట్టాలను ఉపసంహరించుకుంటామని ప్రకటించక తప్పలేదు.

ఢిల్లీ రైతుల పోరాట బాటలో దేశంలోని ఇంకా అనేక ప్రాంతాల లోని వివిధ సెక్షన్ల ప్రజలు తమ న్యాయమైన సమస్యలపై ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అందులో భాగంగా దేశంలోని మావోయిస్టు ప్రాంతాల ప్రజలు పోరాడుతున్నారు. ఈ ప్రాంతాల ఆదివాసీ ప్రజలు జల్, జంగల్, జమీన్‌పై అధికారం కోసం పోరాడుతున్నారు. వారు ప్రభుత్వాన్ని కొత్తగా ఏమీ కోరడం లేదు. ప్రభుత్వం పాతికేళ్ల కింద ఆదివాసీ ప్రజల కోసం రూపొందించిన పెసా చట్టాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. ఇన్నేళ్లయినా ఆ చట్టాన్ని ప్రభుత్వాలు ఎందుకు అమలు చేయడం లేదని అడుగుతున్నారు. చట్టం పేరుతో ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు భూబకాసురుల్లా, గనుల మాఫియాల్లా అనేక అక్రమాలకు పాల్పడుతున్నారనీ నిలదీస్తున్నారు. ఆ చట్టం ప్రకారం తమ అడవులలో తమ అనుమతి లేకుండా ఏ చర్యా చేపట్టకూడదనీ, అలా చేస్తే అది చట్ట విరుద్ధమనీ, ఆ చర్యను భారత రాజ్యాంగం ఆమోదించదనీ ప్రజలే స్పష్టం చేస్తూ పెసా అమలుకు పోరాడుతున్నారు. చట్టాన్ని అమలు చేయడంలో బాధ్యతా రహితంగా ఉన్న ప్రభుత్వాన్ని చట్టాన్ని అమలు చేయండని బాధ్యతాయుతంగా ప్రజలు పోరాడడం ఈనాటి వైచిత్రి! ఆ పని ప్రభుత్వాలు చేయడం లేదంటే అసలు ఆ చట్టాలను ఎందుకు రూపొందించాయనే మౌలిక ప్రశ్న తలెత్తుతుంది. ఆ చట్టాలు కేవలం ప్రజలను మోసపుచ్చడానికే తప్ప వారి మేలు కోరి కాదనేది వారి చర్యల ద్వార వారే నిరూపించుకుంటున్నారు.

దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ (సుక్మా జిల్లా) సిలింగేర్‌లో 2021 మే 12న ఏర్పడిన కొత్త పోలీసు క్యాంపును (ఫార్వర్డ్ ఆపరేషనల్ బేస్) మే 12 నుండే ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గత ఏడు మాసాలకు పైగా వారు తమ పోరాటాన్ని నిరవధికంగా కొనసాగిస్తున్నారు. వారు ఇప్పటికి రెండు సార్లు రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చలు జరిపారు. గత ఏడున్నర మాసాలుగా వివిధ సందర్భాలలో వేల సంఖ్యలో సిలింగేర్‌లో ప్రజలు సమీకృతులవుతున్నారు. ప్రజలపై తుపాకీ కాల్పులు జరిపి ప్రజలను హత్య చేస్తే పోరాటం ఆగుతుందనీ పోలీసులు మే 17-18 తేదీలలో పది వేల మంది పోరాట కారులపై కాల్పులు జరిపి ఐదుగురు ఆదివాసీ రైతులను (ఒకరు మహిళ) హత్య చేశారు. కానీ, ప్రజా పోరాటం ఆగలేదు. వారు ఆ అమరులను స్మరించుకోవడానికి 50 వేల మంది ప్రజలు సిలింగేర్‌లో జమయ్యారు. ఆ తరువాత సిలింగేర్ పొరుగున ఉన్న సార్కెన్‌గూడలో తొమ్మిదేళ్ల క్రితం 17 మంది గ్రామస్తులను నిర్దాక్షిణ్యంగా హత్య చేసిన పోలీసులు నేరస్థులంటూ రెండేళ్ల క్రితమే అంగర్వాల్ విచారణ కమీషన్ తన నివేదికలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ నేరస్థులను ఇంకా అరెస్టు చేయలేదనీ, ప్రజలకు న్యాయం చేయలేదనీ నిరసిస్తూ వేలాది ప్రజలు జూన్ 28నాడు భారీ సభ జరిపి తమ డిమాండ్‌ను ప్రపంచం ముందుకు తెచ్చారు.

సిలింగేర్‌లో వేలాది ఆదివాసీ ప్రజలు సంఘటితమై పోరాడడంతో అది ఆ ప్రాంత ప్రజలందరికీ ఒక పోరాట సందేశాన్నిస్తోంది. ఆ ప్రజా పోరాటం ఒక పెద్ద ప్రేరణగా, మార్గదర్శకంగా ఉంది. సిలింగేర్‌లో ప్రజలు నూతన పోలీస్ క్యాంపు తమకు అవసరం లేదని నెలల తరబడిగా పోరాడుతుంటే సిలింగేర్‌తో పాటు నాహెూడ్‌లో ప్రజలు తమ దగ్గర ఏర్పర్చిన కొత్త పోలీసు క్యాంపుకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించారు. మరోవైపు సిలింగేర్ పొరుగున ఉన్న ఏంపురంలో ప్రభుత్వం ఒక కొత్త పోలీసు స్టేషన్‌ను ఏర్పర్చ తలపెట్టింది. దానితో వెంటనే ఏంపురం చుట్టు పక్కల గ్రామాల ప్రజలంతా సంఘటితమై ప్రతిపాదిత పోలీసు క్యాంపుకు వ్యతిరేకంగా జులై 25 నుండి ధర్నా ప్రారంభించారు. పూస్‌నార్, ఎడ్స్‌మెట్ట, గొంపాడ్, సింగారం, పూస్‌గుప్ప, నమీదార్, వెచ్చపాల్ లలో ప్రజలంతా ముక్తకంఠంతో ప్రజా హంతక పోలీసులు వెనక్కి వెళ్లాలి అని నినదిస్తున్నారు. కొల్లాయిగూడెం, పొట్టెం, కడియుం ఈ వరుసనే తెలంగాణ సరిహద్దులలో ఫార్వర్డ్ బేస్ క్యాంపు నిర్మాణ లక్ష్యంతో తెలంగాణలోని చెన్నపురంలో రెండు రాష్ట్రాల సంయుక్త బలగాలతో పాటు గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలతో భారీ క్యాంపును ఏర్పర్చారు.

దక్షిణ బస్తర్, పశ్చిం బస్తర్, తెలంగాణలోని ఖమ్మం జిల్లాల ప్రజలు నూతన పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా పోరాడుతుండగా డిసెంబర్ 8 నుండి ఉత్తర బస్తర్‌లోని వెచ్చఘాట్‌లో వేలాది మంది ప్రజలు అక్కడికి రానున్న పోలీసు క్యాంపును వ్యతిరేకిస్తూ, వనరుల తరలింపుకు నిర్మిస్తున్న వంతెన మాకు అక్కరలేదనీ, మీరు నిర్మించతలపెట్టిన పర్యాటక కేంద్రం మా వినాశనానికే అంటూ వేలాది ప్రజలు నిరసిస్తూ ఈ వార్త రాస్తున్నంతవరకు (22 రోజులుగా) నిరవధిక ధర్నా కొనసాగిస్తున్నారు. ఈ ధర్నాలో సరిహద్దులలోని మహారాష్ట్ర గ్రామాల ప్రజలు కూడ పాల్గొంటున్నారు.

సరిహద్దులలో ఉండే పోలీసు క్యాంపులలోని పోలీసులు ఏ హద్దులను పాటించరనీ, వారు హద్దులు దాటి గ్రామలలోని ప్రజలను వేధిస్తారనీ, అరెస్టు చేస్తారనీ, వారి ఉత్పాతాలకు అడ్డుండదనీ ఆ ప్రజలు అనుభవ పూర్వకంగా తెలుపుతున్నారు. 'పోలీస్ గో బ్యాక్' ఇది నేటి రణనినాదంగా మారింది. సుక్మా జిల్లా గొంపాడులో వందలాది మంది ప్రజలు సమీకృతులై తమ గ్రామంలో గ్రీన్‌హంట్ ఉత్పాతాలకు సాక్షంగా సామూహిక హత్యలకు పాల్పడ్డారనీ, వాటిపై యేండ్లు గడుస్తున్నా తమకు న్యాయం దక్కడం లేదనీ ప్రజలు డిసెంబర్ 10, అంతర్జాతీయ మానవ హక్కుల దినం రోజు సభ జరిపి తమ డిమాండ్‌ను తెలిపారు.

24 డిసెంబర్‌ను దేశ మూలవాసీ ప్రజలు పెసా దినంగా పాటించడం ఒక కొత్త సంప్రదాయంగా ముందుకు వచ్చింది. వారు తమ పోరాటానికి ప్రతీకగా ఆ రోజును పాటించడమే కాకుండా పాతికేళ్లు దాటుతున్నప్పటికీ ఆ చట్టాన్ని అధిక శాతం గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయనందున దాని అమలుకు పోరాడుదాం అనే స్ఫూర్తితో పెసా దినం పాటిస్తున్నారు. 2016లో గడ్‌చిరోలీలో రెండు రోజులు కార్యశాల జరుపుకున్నారు. అక్కడికి దేశ వ్యాప్త మూలవాసీ ప్రజా నాయకులు హాజరయ్యారు. వారంతా పెసా అమలుకు అన్ని ప్రాంతాలలో దృఢంగా పోరాడుదాం అని ప్రతిజ్ఞ పూనారు. ఆ తర్వాతి నుండి ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, ఒడిశా మున్నగు రాష్ట్రాలలో పత్థల్‌గఢీ ప్రజా పోరాటం బద్దలై ఉధృతమైంది. తాము పోరాడి సాధించుకున్న చట్టాన్ని అమలు చేయించడానికై సుక్మా జిల్లాలో సీపీఐ సహ పలు ఆదివాసీ ప్రజా సంఘాల నాయకత్వంతో పెసా దినం జరుపుకోవాలనీ ఆదివాసులు నిర్ణయించుకోగా పోలీసులు రెడ్‌జోన్ పేరుతో అనుమతి నిరాకరించారు. దానితో వేలాది మంది పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ ఖాకీలు ఈ ప్రాంతాన్ని వదలకుండా ఇక్కడ పెసా అమలు కాదని, ముందు వారినందరినీ ఈ ప్రాంతాల నుండి వెనక్కి పంపడానికి పోరాడుదాం అని ప్రజలు నిర్ణయించుకున్నారు.

నిజానికి పెసాను అంత ప్రమాదకరంగా ప్రభుత్వాలు ఎందుకు భావిస్తున్నాయి? వర్తమాన ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలకు పెసా గొడ్డలి పెట్టులా ఉందని భావిస్తున్నందున, ఆ ప్రభుత్వం దాని రద్దును కోరుకుంటున్నది తప్ప అమలును కాదనేది దాపరికం లేని నిజం. ఇది ఇలా ఉండగా మరోవైపు ఛత్తీస్‌గఢ్ గవర్నర్ స్వయాన ఆదివాసీ అయినటువంటి అనసూయా ఉయికే దౌడాయిలో వేలాది ఆదివాసులు ధర్నా ప్రారంభించిన తరువాత 11వ రోజు జోక్యం చేసుకుంటు వారు కోరుతున్న ఆందాయి గనులను నిక్కో కంపెనీకి ఇవ్వడంపై, పోరాటకారులను అరెస్టు చేయడంపై, బోధ్‌ఘాట్ ప్రాజెక్టును నిలిపివేయడంపై తనకు సవివరమైన నివేదిక అందజేయాలనీ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. కానీ, ఇప్పటికీ వాటిపై ప్రభుత్వం నుండి ఎలాంటి కదలిక లేదు. ఇదీ, ఆ ఆదివాసీ గవర్నర్ ఆదేశాల దుస్థితి! ఆ తరువాత ఆమెనే తిరిగి అక్టోబర్ చివరన ఆదివాసులు తమ హక్కుల విషయంలో జాగరూకులు కావాలనీ, సంఘటితం కావాలనీ పిలుపు ఇచ్చింది. ఆమె ఆదివాసుల స్వాభిమానాన్ని ప్రశంసిస్తూ ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాలలో పెసా చట్టాన్ని అమలు చేసి తీరాలని చెప్పింది. 1996లో తయారైన చట్టాన్ని ఏ రాష్ట్రం కూడ సక్రమంగా అమలు చేయడం లేదనీ, 2022 వరకు రాష్ట్రంలో పెసా సమగ్రంగా అమలు కాని పక్షంలో తాను మహారాష్ట్రలోని అప్పటి గవర్నర్ విద్యాసాగర్ రావ్‌లాగా తాను ఇక్కడ ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ ప్రాంతాలలోని గనులు, భూములు సహా అన్నింటిపై పెసా ప్రకారం ఆదివాసులకు సర్వాధికారాలున్నాయని ఆమె తెలిపింది. ఆమెతో పాటు ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ 'తమ ఆదివాసుల దగ్గర బస్తాల నిండా కాసులు లేవు. వారి దగ్గర జల్, జంగల్, జమీన్ మాత్రమే ఉన్నాయనీ అన్నాడు.

ఆదివాసీ గవర్నర్లు, ముఖ్యమంత్రులు ఏం చెప్పినప్పటికీ, కలెక్టర్లు, ఖాకీ బలగాలు తమకు నచ్చని ప్రతిదానికి మావోయిస్టులను, రెడ్‌జోన్‌ను అడ్డం పెట్టుకొని ప్రజల ఆకాంక్షలను, పోరాటాలను అణచివేయడం పరిపాటిగా మారింది. ఈ విషయంలో ఆదివాసీ ఉయికే ఇండియాలో గవర్నర్లంటే రబ్బర్ స్టాంప్ అనడాన్ని సార్థకం చేసుకుంటుందా, జాగరూకులు అవుతున్న ఆదివాసుల పక్షం నిలిచి అధికారులపై చర్యలు తీసుకుంటుందా అనేది ప్రజలు ఆమెకే వదిలారు.

దండకారణ్యం, తెలంగాణ, ఒడిశా, ఏఓబీలలో ఆదివాసీ ప్రజలు విస్థాపనకు వ్యతిరేకంగా దశాబ్దాలుగా పోరాడుతున్న విషయం తెలిసిందే. ఆ పోరాటాల ఫలితంగానే నేటికీ విశాల దండకారణ్య ప్రజలు 1980 నుండి విస్థాపితులు కాలేదు. కానీ, కేంద్రంలో హిందుత్వ శక్తులు అధికారాన్ని చేపట్టాక పరమ దూకుడుగా నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు తగినట్టు 'మేక్ ఇన్ ఇండియా' నినాదంతో దళారీ పెట్టుబడిదారుల, బహుళ జాతి కార్పొరేషన్‌ల విదేశీ పెట్టుబడులకు ఎర్ర తివాచీలు పరిచి ఆహ్వానిస్తూ 'నయా భారత్' అంటూ ప్రజలను వంచిస్తూ దేశాన్ని అమ్మకానికి పెట్టారు. ఆ పెట్టుబడుల కోసం అడవులను ఖాకీమయం చేస్తున్నారు. అడవులలోని అత్యంత విలువైన గనులను తరలించడానికి విశాలమైన రోడ్లు, రైలు మార్గాలు పరుస్తున్నారు. కానీ ప్రజలు మాత్రం వాటిని అడ్డుకోవడానికి సమరశీలంగా పోరాడుతున్నారు. నారాయణ్‌పూర్ జిల్లా ఆమ్‌దాయి ప్రాంతంలో నికో కంపెనీ తులాడ్ కొండలను తవ్వేది లేదని ప్రజలు తీర్మానించారు. అదే ప్రాంతంలో బోధ్‌ఘాట్ విద్యుత్ ప్రాజెక్టును అనుమతించమనీ ముప్పై ఏళ్లకు పైగా ప్రజలు పోరాడుతున్నారు. ఆ ప్రజలను సమర్థించిన కీ. శే. బీడీ శర్మగారిని హిందుత్వ గూండాలు జగ్దల్‌పూర్ వీధుల్లో అర్ధనగ్నం చేసి మెడలో చెప్పుల మాల వేసి ఊరేగించారు. అయినా ఆయన తన తుది శ్వాస వదిలే వరకు ఆ ప్రాజెక్టును వ్యతిరేకించాడు. కాంకేర్ జిల్లాలోని కువ్వేలో బాక్సైట్ గనుల తవ్వకాలను మేం వ్యతిరేకిస్తున్నామని అక్కడి ప్రజలు తెలుపు

తున్నారు. నారాయణ్‌పూర్ జిల్లా రావ్‌ఘాట్ ప్రాంతంలోని రావ్‌ఘాట్ కొండలను తవ్వేది లేదనీ, కొండల తరలింపుకు రైలు మార్గం మాకు అక్కర లేదనీ, ఈ ప్రాంత పర్యావరణ సమతుల్యానికి ఆ కొండలు ఆయువుపట్టులాంటివనీ వాటిని మేం కాపాడు కుంటామని ప్రజలు పోరాడుతున్నారు. దంతెవాడ జిల్లా కిరందూల్‌లో నూతన తవ్వకాలకు అదానీని సహ ఎవరినీ అనుమతించమనీ, వందలాది మంది ప్రజలు ధర్నాలు, ప్రదర్శనల తో దారులు మూసేస్తూ రోడ్లను తవ్వుతున్నారు. గత రెండేళ్లుగా మధ్య రీజియన్‌లోని అన్ని ప్రాంతాలలోని మూలవాసీ ప్రజలు తమ అడవుల కోసం, గనులను కాపాడుకోవడానికి, పర్యావరణాన్ని రక్షించుకోవడానికి అంకితభావంతో పోరాడు తున్నారు.

మహారాష్ట్రలోని గడ్‌చిరోలీ జిల్లాలో సుర్జాగఢ్ సహ 25 చోట్ల గనుల తవ్వకాలకు ప్రభుత్వం రోడ్ మ్యాప్ తయారు చేసింది. సుర్జాగఢ్‌లో గనుల తవ్వకాలను మూడు దశాబ్దాలుగా ప్రజలు అడ్డుకుంటున్నారు. కానీ, రాష్ట్రంలో తొలిసారి హిందుత్వ శక్తులు బీజేపీ, శివసైనికుల కూటమి అధికారాన్ని చేపట్టి భారీ ఎత్తున జిల్లాలో పోలీసు బలగాలను మోహరించి తవ్వకం పనులను ప్రారంభించి శరవేగంగా కొనసాగిస్తున్నారు. కానీ, ప్రజలు మాత్రం ఆ పనులను వివిధ రూపాలలో అడ్డుకుంటూనే ఉన్నారు. జిల్లాలో అన్ని చోట్ల తవ్వకం పనులు ప్రారంభిస్తే దాదాపు 40 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు, అడవులు నాశనమవుతాయనీ, పర్యావరణానికి విఘాతం కలుగుతుందనీ అడ్డుకుంటున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం లాయడ్ మెటల్ కంపెనీ, త్రివేణి ఎర్త్ మువర్స్‌కు 50 సుర్జాగఢ్ ఏండ్లు కొండలను లీజుకు ఇవ్వడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అందులో భాగంగా అక్టోబర్ 25 నుండి జిల్లాలోని అనేక రాజకీయ పార్టీలు, ఆదివాసీ సంస్థలు, గ్రామసభలు కలిసి అఖిల పక్ష కమిటీని ఏర్పర్చుకొని 'ఖదాన్ నహీం, అనాజ్ పాహిజే' అంటూ పోరాటం ప్రారంభించారు. వారి పోరాటానికి 'సలాం సుర్జాగఢ్' అంటూ అనేక సంఘాలు తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. కానీ మూడు రోజుల అనంతరం అధికార పక్షానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పోరాటం నుండి వైదొలగి ద్రోహానికి పాల్పడ్డారు. పోలీసులు ధర్నా చేస్తున్న ప్రజలను అరెస్టు చేసి ధర్నా విచ్ఛిన్నం చేశారు.

ఒడిశాలోని దేవమాలీ ఆదివాసీ ప్రజలు బాక్సైట్ గనుల తవ్వకాలను వ్యతిరేకిస్తూ పని ప్రాంతంలోకి వచ్చిన రెవెన్యూ, పోలీసు అధికారులను తన్ని తరిమారు.

ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడ పెసాను అమలు చేయడం లేదు. చట్టబద్ధంగా ఎక్కడా గ్రామసభలు ఏర్పడలేదు. కానీ, రెవెన్యూ అధికారులు, పోలీసులు, పెట్టుబడి దారులతో కుమ్మక్కై దొంగ గ్రామసభలను సృష్టిస్తూ వాటి ఆమోదపత్రాలను తయారు చేస్తున్నారు. వారు ప్రజలతో ప్రమేయం లేకుండా ఎన్ని పత్రాలు సృష్టిస్తున్నా, దరహం మీద ప్రజలు మాత్రం వారి ఆటలు చెల్లనివ్వడం లేదు. వారికి అండగా భద్రతా బలగాలు వచ్చినా అడ్డుకుంటున్నారు. వారు సమైక్యంగా పోరాడడానికి అడవులను కాపాడుకోవడానికి, విస్తాపనకు వ్యతిరేకంగా నిలబడ దానికి కృతనిశ్చయులై ఉన్నారు. ★

---

'4 జూన్ నాడు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో టాటాకు ఒప్పందం కుదిరింది (యంఓయూ). 5 జూన్ 2005 నాడు సల్వాజుడుం ప్రారంభ మైంది. సల్వాజుడుం అంటే ఏంటి? నక్సలైట్లు రాజ్యాంగాన్ని అంగీకరించరు కాబట్టి వారిని చంపుతాం అంటుంది ప్రభుత్వం. అయితే, మేం ప్రభుత్వాన్ని అడుగుతున్నాం మీరు రాజ్యాంగాన్ని అంగీకరిస్తున్నారా అని! రాజ్యాంగం ప్రకారం ఆదివాసీ ప్రాంతాలలో ఐదవ షెడ్యూల్ అమలులో ఉంది. ఆ ప్రాంతాలలో ప్రభుత్వం తన నిధులతో ఏమీ చేయలేదు. ఒకవేళ ప్రభుత్వం అక్కడ ఏమైనా చేయతలపెడితే పరిశ్రమ నెలకొల్పాలన్నా, గనులు తవ్వాలన్నా, ఇంకేం చేయాలన్నా అది గ్రామసభకు విజ్ఞాపన ఇవ్వాలి. ఒకవేళ గ్రామసభ మాకు అది అవసరం లేదనీ దానిని తిరస్కరిస్తే ప్రభుత్వం ఏమీ చేయలేదు. అది బలవంతంగా ఎంతమాత్రం చేయలేదు'.

హిమాంశు కుమార్, గాంధేయవాది

సామాజిక కార్యకర్త, పాత్రికేయులు, హక్కుల కార్యకర్త.

(26, ఫిబ్రవరి 2019. హిందుత్వ వ్యతిరేక వేదిక, కొత్త ఢిల్లీ నుండి)

---

**విజ్ఞప్తి**

భీమా కోరేగాం కేసులో తప్పుడుగా ఇరికించబడి ముంబాయి లోని తలోజా తదితర జైళ్లలో మూడేళ్లకు పైగా మగ్గుతున్నవారితో పాటుగా దేశంలోని వివిధ జైళ్లలో అనేక తప్పుడు కేసులను ఎదుర్కొంటూ శిక్షలనుభవిస్తున్నవారు, విచారణలో ఉన్న వారి విడుదల కోసం ప్రపంచ వ్యాప్తంగా యేడాది కాలం కేంపెయిన్ చేపట్టిన భారత ప్రజాయుద్ధ సంఘీభావ అంతర్జాతీయ కమిటీకి విప్లవాభివందనాలు. దేశంలోని వివిధ జైళ్లలో ఉన్న వారి వివరాలు వారికి లేదా క్రాంతి పత్రికకు తక్షణమే అందచేయాల్సిందిగా విజ్ఞప్తి.

(54వ పేజీ తరువాయి)

ఆఫ్రికాలోని ట్యునీసియాలో ప్రజాయుద్ధానికి మద్దతుగా ఎర్రజెండా ఎగిసింది. ఈ ఖండంలో ప్రజాయుద్ధానికి మద్దతుగా మార్గం తెరుచుకుంది. ఆసియాలో అఫ్గానిస్తాన్, నేపాల్‌లలో అంతర్జాతీయ సంఘీభావ పవనం వీచింది. ఇతర అనేక దేశాలకు వివిధ రూపాలలో చేరుకుంది. మోదీని బలంగా సమర్థించే అమెరికా సామ్రాజ్యవాద గర్భంలోని వివిధ రాష్ట్రాలలో భారతదేశం, ఇతర దేశాలలో ప్రజాయుద్ధాలకు సంఘీభావం ప్రకటించారు.

ఇది ఒక ముఖ్యమైన దినం. భాకపా(మావోయిస్టు) కేంద్ర కమిటీ 'నవంబర్ 24వ తేదీన అంతర్జాతీయ దినాన్ని గొప్పగా విజయవంతం చేద్దాం' అంటూ ఇచ్చిన ప్రకటన ఈ కార్యక్రమాన్ని మరింత బలంగా, స్పష్టంగా ప్రేరేపించింది. అంతర్జాతీయ కమిటీ గడచిన పది సంవత్సరాలలో అందించిన మద్దతును, నవంబర్ 24ను సజీవం చేసిన ఈ పిలుపునూ ఎత్తిపట్టింది. విప్లవ సానుభూతిపరులకు, వామపక్ష, ప్రజాస్వామిక, దేశభక్త సంస్థలకు, హిందుత్వ వ్యతిరేక లౌకిక శక్తులకు, కార్మికవర్గం, రైతాంగం, విద్యార్థులు, మేధావులు, మహిళలు, దళితులు, ఆదివాసులకూ భాకపా (మావోయిస్టు) ఈ పిలుపును తిరిగి అందించింది.

ఇది భారత ప్రజాయుద్ధ ప్రయోజనం కోసమే కాకుండా, ప్రపంచ అంతర్జాతీయ పరిస్థితితో కూడా సన్నిహితంగా ముడిపడి వున్నది. జరుగుతున్న వర్గ పోరాటంలో భారత ప్రజలు చారిత్రక అధ్యాయాన్ని లిఖిస్తున్నారు. సామ్రాజ్యవాద పీడనలో వున్న యావత్తు దేశాలలోనూ ఈ మార్గం సాధ్యమని భారతదేశంలో ప్రజాయుద్ధ అభివృద్ధి నిర్ధారిస్తున్నది. భారతదేశంలోనూ, వివిధ దశలలో పెంపొందుతున్న యితర దేశాలలోనూ ప్రజాయుద్ధ పురోగమనం దక్షిణాసియా ప్రాంతంలోనే కాకుండా యావత్తు ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థలో బలాబలాలను మారుస్తుందని ప్రపంచ కార్మికవర్గం అర్థం చేసుకుంటుంది.

ఈ నమ్మకంతోనే, పరిస్థితిని జాగ్రత్తగా విశ్లేషించి, ఈ క్యాంపెయిన్‌లో పాలు పంచుకున్న దేశాలలోని ప్రతినిధులను సాధ్యమయినంతగా కూడగట్టి, 2022 జనవరి చివరిలో ఒక అంతర్జాతీయ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశం నూతన పోరాట దినాలను., నూతన సంఘీభావ రూపాలను నిర్ణయిస్తుంది. వివిధ దేశాలలో ఏర్పడే కమిటీలకు, మావోయిస్టుల నాయకత్వంలో ప్రజాయుద్ధానికీ మధ్య సంబంధాలనూ పటిష్టం చేస్తుంది.

ఫాసిస్టు, హంతక ప్రహార్-3 సైనిక క్యాంపెయిన్‌ను నిలిపివేయండి.

భారతదేశంలో పోరాట ప్రజలకు, సాయుధ పోరాట ప్రజలకూ మద్దతు అందించండి.భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి.

భారత కామ్రేడ్స్‌తో కలిసి 'చివరి వరకు పోరాడుతాం, అంతిమ విజయం సాధిస్తాం

ప్రజాయుద్ధం వర్ధిల్లాలి.

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి. .

కార్మికవర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి.

ఇంటర్నేషనల్ కమిటీ ఇన్ సపోర్ట్ టు ది పీపుల్స్‌వార్ ఇన్ ఇండియా

## వివిధ దేశాల నుండి అందిన సందేశాలు.

## కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ది ఫిలిప్పీన్స్ (సీపీపీ)

నరేంద్ర మోదీ ఫాసిస్టు ప్రభుత్వ ప్రహార్ సైనిక క్యాంపెయిన్‌కు వ్యతిరేకంగా ఇంటర్నేషనల్ ఆక్షన్ డేకు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ది ఫిలిప్పీన్స్ (సీపీపీ), న్యూ పీపుల్స్ ఆర్మీ (ఎన్‌పిఏ) తమ సంఘీభావాన్ని ప్రకటించాయి.. భారతదేశ పీడిత, తాడిత ప్రజలకు, భాకపా (మావోయిస్టు) నాయకత్వంలో విప్లవ శక్తులకు ఫిలిపినో ప్రజలు మద్దతునందిస్తారు అని సీపీపీ ప్రకటించింది.

గతంలో సల్వాజుడుం (2004-2009), ఆపరేషన్ గ్రీన్‌హంట్ (2009-2016), సమాధాన్ (2017) వంటి విప్లవ వ్యతిరేక క్రూర క్యాంపెయిన్‌ల మాదిరిగానే ఆపరేషన్ ప్రహార్ ఒకటి. భాకపా (మావోయిస్టు) నాయకత్వంలో సాగుతున్న విప్లవోద్యమాన్ని తుడిచి పెట్టేందుకు చేస్తున్న విఫలయత్నాలివి. రాజ్యం చేసే దాడులు తీవ్రతరం అవుతున్నప్పటికీ భారత పీడిత, తాడిత ప్రజానీకం నిలబడుతున్నారు, రాజ్య ఉగ్రవాదాన్ని ధిక్కరిస్తున్నారు.

భారత ప్రతీఘాతుక రాజ్య క్రూరత్వం, దాడులూ ఫిలిప్పీన్స్ దేశంలో రోడ్రిగో డుటర్టె ప్రభుత్వ ప్రతీఘాతుక ఫాసిస్టు రాజ్యం అమలు చేస్తున్న ఉగ్రవాద కార్యక్రమం వంటిదే. ఇరు దేశాల ప్రజల పై దోపిడీని తీవ్రంతరం చేసి, అపారమైన వనరులను లూటీ చేయడం కోసం సామ్రాజ్యవాద బడా కార్పొరేషన్‌లకు అనుకూలంగా వుండే విధంగా మోదీ, డుటర్టెలు ప్రజల సాయుధ ప్రతిఘటనను 2022 నాటికి తుడిచిపెట్టేయాలని ప్రయత్నిస్తున్నారు. భారత ప్రజల మాదిరిగానే ఫిలిప్పీన్స్ దేశంలో దోపిడీ పీడనలకు గురవుతున్న వర్గాలు, రంగాలు జాతీయ, సామాజిక విముక్తిని కాంక్షిస్తున్నారు.

భారత ప్రజల పోరాటాల నుంచి ఫిలిపినో ప్రజలు ప్రేరేపితులవుతున్నారు.. డుటర్టె ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి ఫాసిస్టు దాడిని ఎదుర్కొంటున్నారు భారత ప్రజలు, విప్లవ శక్తులు తమ హక్కులను, ప్రయోజనాలనూ కాపాడుకోగలుగుతారని, ఫాసిస్టు మోదీ ప్రభుత్వ క్రూరమైన ఆపరేషన్ ప్రహార్‌ను ఓడించగలుగుతారని వేం విశ్వసిస్తున్నాం అని 2021 నవంబర్ 23న సీపీపీ ప్రకటించింది.

## కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ టర్కీ మార్క్సిస్టు-లెనినిస్టు (టీకేపీ-ఎంఎల్)

మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో అమలు చేసేందుకు

బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు ప్రహార్–3 పేరు మీద ఒక క్రూరమైన మారణ పథకాన్ని రూపొందించారు. 2021సెప్టెంబర్ 26వ తేదీన 10 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సీనియర్ అధికారులు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వంలో మావోయిస్టు ఉద్యమానికి వ్యతిరేకంగా విప్లవ ప్రతీఘాతుక పథకాన్ని ప్రకటించారు. దీనిని అభివృద్ధి పథకంగా వర్ణించారు. మధ్య భారతంలో నిర్బంధ క్యాంపెయిన్లు తీవ్రతరం అవుతాయని ప్రకటించారు. నవంబర్ 3వ తేదీకి బలగాలు సిద్ధంగా వున్నాయని, ఒడిశా, ఛత్తీస్గఢ్‌లో 24 పోలీసు క్యాంపులు రానున్నాయనీ ప్రకటించారు. టీకేపీ–ఎంఎల్ ఈ విప్లవ ప్రతీఘాతుక దాడిని ఖండిస్తున్నది. భాకపా (మావోయిస్టు)కు సంఘీభావం వ్యక్తం చేస్తున్నది.

ప్రహార్–3 క్యాంపెయిన్‌లో హిందుత్వ పాలక శక్తులు భాకపా (మావోయిస్టు)పై దాడులు పెంచారు. 2021 నవంబర్ 13వ తేదీ మహారాష్ట్ర గఢ్‌చిరోలి జిల్లా విప్లవోద్యమ చరిత్రలో అత్యంత విషాదకరమైన రోజు. ఆ రోజు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ధనోరా తాలూకాలో ఒక ఘోరమైన ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ దీపక్, మరో 26 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. భాకపా (మావోయిస్టు)కు, అమరులయిన కామ్రేడ్స్ కుటుంబాలకూ టీకేపీ–ఎంఎల్ సంతాపం తెలియజేస్తున్నది.

టర్కీలో జరుగుతున్న ప్రజాస్వామిక హక్కుల పోరాటంలో, అంతర్జాతీయ కార్మిక వర్గం, ప్రపంచ పీడిత ప్రజల ప్రజాస్వామిక ప్రజా విప్లవం, సోషలిజం కొరకై జరిగే పోరాటంలో అమరులయిన కామ్రేడ్స్ విప్లవ జా&జపకాలను సజీవంగా వుంచుతాం.

నవంబర్ 11వ తేదీన భాకపా (మావోయిస్టు) కేంద్ర కమిటీ (సీసీ) సభ్యుడు కామ్రేడ్ కిషన్‌దా (ప్రశాంత్ బోస్), మరో సీసీ సభ్యురాలు షీలా మరాండీలను జార్ఖండ్ రాష్ట్రం సరైకెలా పట్టణంలో అరెస్టు చేసారు. ఈ కామ్రేడ్స్ అరెస్టును టీకేపీ–ఎంఎల్ తీవ్రంగా ఖండిస్తున్నది. మన కామ్రేడ్స్‌ను తక్షణమే విడుదల చేసి, చికిత్స అందించాలి.

గడచిన 50 సంవత్సరాలలో బ్రాహ్మణీయ హిందుత్వ శక్తుల క్రూరమైన ఊచకోతలను ప్రతిఘటిస్తూనే భారత విప్లవం పురోగమించింది. ఇది అంతర్జాతీయ కార్మిక వర్గానికి, ప్రపంచ పీడిత వర్గానికి, ముఖ్యంగా భారత ప్రజలకు బలాన్ని, ఆశను అందించింది. భాకపా (మవోయిస్టు) నాయకత్వంలో విప్లవ శక్తులు ఈ విప్లవ ప్రతీఘాతుక దాడులను తిప్పి కొడతాయని మేం సంపూర్ణంగా విశ్వసిస్తున్నాం.

ఇటలీ దేశంలో రోమ్ నగరంలో నవంబర్ 27వ తేదీన మహిళలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ సందర్భంగా యిచ్చిన నినాదాలు –

కిషన్‌జీ అమర్ రహే. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి. ప్రజాయుద్ధం వర్ధిల్లాలి. ఐసీఎస్‌పీడబ్ల్యూఐ వర్ధిల్లాలి. మోదీ నశించాలి. సామ్రాజ్యవాదం నశించాలి.

గెలీసియాలో నవంబర్ 24వ తేదీ కార్యక్రమాన్ని అనుసరించి విస్తృతమైన ప్రచారం నిర్వహించారు. వీగో, ఏ కొరునా, ఔరెన్స్, కంపోస్టెల్లా, లుగో పట్టణాలలో పోస్టర్లు అతికించారు. సీఐజీ సర్వీసెన్ కాంగ్రెస్‌లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. 'ఈస్ట్రెలెరా ప్రాజెక్ట్'లో లూగోలో ఈ క్యాంపెయిన్ నవంబర్ 24వ తేదీన ముగిసింది. వీగోలో మోదీ దిష్టిబొమ్మని ఒక వంతెనకి వేలాడగట్టారు. గెలీసియాలో చేసిన ఈ క్యాంపెయిన్‌తో భారత ప్రజాయుద్ధానికి మద్దతును యితర రంగాలకు విస్తరించగలిగారు. మరింత మద్దతును కూడగట్టగలిగారు. వివిధ సామాజిక కేంద్రాలలో మహాసభలు నిర్వహించగలిగారు. భారత ప్రజాయుద్ధ విజయమో ఓటమో మన విజయం, మన ఓటమి అవుతుందన్న విషయం మనం మరువరాదు అని భారత ప్రజాయుద్ధ మద్దతుగా గెలీసియన్ కమిటీ అన్నది.


ఆస్ట్రియాలోని లిన్జ్‌లో సంఘీభావంగా నవంబర్ 24వ తేదీన కార్యక్రమాలు జరిగాయి. నవంబర్ 25వ తేదీన మహిళల పై హింస వ్యతిరేక అంతర్జాతీయ దినాన మోదీ ప్రభుత్వ రక్తసిక్త క్యాంపెయిన్ గురించి ప్రచారం జరిగింది. –'ముఖ్యంగా యిటువంటి దినాన ప్రపంచవ్యాప్తంగా మహిళలకు, పీడితులకూ సంఘీభావం ప్రకటిస్తున్నాం. మహిళల పై మూకుమ్మడి హింస జరిగే, అత్యధిక సంఖ్యలో మహిళలు, బాలికలూ హత్యకు గురి అయ్యే దేశాలలో భారతదేశం ఒకటి. అందువల్లనే మేం మోదీ ప్రభుత్వ అత్యాచారాల గురించి తెలియజేసేందుకు, మా సంఘీభావాన్ని వ్యక్తం చేసేందుకు, ప్రహార్ సైనిక క్యాంపెయిన్‌కు వ్యతిరేకంగా నిశ్చయమైన వైఖరిని అవలంబించేందుకూ ఇది సరైన సందర్భం అని భావిస్తున్నాం' అని ఒక కార్యకర్త రాసారు.

ప్రియమైన కామ్రేడ్

అంతర్జాతీయ మావోయిస్టు ఉద్యమానికి నేను ఒక చైనా సానుభూతిపరుడిని. భారత ప్రజాయుద్ధం గురించి ఆసక్తిగా ఉన్న చైనీయులకు మరింత సమాచారాన్ని అందించడానికి నేను సీపీఐ (మావోయిస్టు) కామ్రేడ్ చింతన్‌దాను స్మరించుకుంటూ విడుదల చేసిన ప్రకటనను అనువదించాను. సారాంశంలో నా అనువాదం సరిగానే ఉంటుందనుకుంటున్నాను.......

రెడ్‌సెల్యూట్స్‌తో,

(చైనా మిత్రుడు)


印度共产党(毛主义)
中央委员会
新闻稿
2021年12月18日|2021年

☆

## భారత విప్లవోద్యమం పై రాజ్య నిర్బంధానికి నిరసనగా భారత ప్రజాయుద్ధానికి మద్దతుగా అంతర్జాతీయ కమిటీ (ఐసీఎస్‌పీడబ్ల్యుఐ) నవంబర్ 24వ తేదీన నిర్వహించిన

# ప్రపంచ దేశాల ఆక్షన్ డే కార్యక్రమాల రిపోర్ట్

భారత విప్లవోద్యమం పై భారత రాజ్యం కొనసాగిస్తున్న వరుస విప్లవ ప్రతీఘాతుక కేంపెయిన్‌లలో భాగంగా ఇటీవలే ప్రారంభించిన నూతన 'నిర్ణయాత్మక దాడి సమాధాన్-ప్రహార్-3'ను నిరసిస్తూ 'ఇంటర్నేషనల్ కమిటీ టు సపోర్ట్ పీపుల్స్‌వార్ ఇన్ ఇండియా' (ఐసీఎస్‌పీడబ్ల్యూఐ-భారత ప్రజాయుద్ధానికి మద్దతుగా అంతర్జాతీయ కమిటీ) మన ప్రియతమ నాయకుడు, అమరుడు కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు 10వ అమరత్వ సంవత్సరం, నీలంబారులో అమరులైన కామ్రేడ్స్ కుప్పు దేవరాజు, అజితల 5వ అమరత్వ సంవత్సర సందర్భంగా నవంబర్ 24వ తేదీన ప్రపంచవ్యాప్తంగా 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఆక్షన్' (అంతర్జాతీయ కార్యాచరణ దినం) పాటించాలనే పిలుపునిచ్చింది. ఆ పిలుపు పై అనేక దేశాలు కార్మికవర్గ అంతర్జాతీయతత్వంతో ముందుకు వచ్చి తమ తమ దేశాలలో చాల క్రియాశీలంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ప్రపంచంలోని ఇటలీ నుండి టునీషియా వరకు, ఈక్వడార్ నుండి కెనడా వరకు, అమెరికా నుండి జర్మనీ వరకు, బ్రెజిల్ నుండి డెన్మార్క్ వరకు, కొలంబియా నుండి నార్వే వరకు, స్పెయిన్ నుండి స్విట్జర్‌లాండ్ వరకు, ఐర్లాండ్ నుండి మెక్సికో వరకు, ఫిలిప్పీన్స్ నుండి అఫ్గానిస్తాన్ వరకు, టర్కీ నుండి ఫ్రాన్స్, ఆస్ట్రియాల వరకు మన భారత ప్రజా యుద్ధానికి సమర్ధనగా నిలిచాయి. ఈ సందర్భంగా ఐరోపా దేశాల మావోయిస్టు పార్టీలు, సంస్థలు భారత ప్రజాయుద్ధాన్ని ఎత్తిపడుతూ తమ తమ భాషలలో ప్రచార సామగ్రిని ప్రచురించారు. భారత ప్రజాయుద్ధానికి తాము అండగా నిలుస్తున్నామనీ అనేక దేశాలు ప్రకటించాయి. వివిధ దేశాలలో అమలైన ఆక్షన్ డే వివరాలను డిసెంబర్ 15వ తేదీన ఐసీఎస్‌పీడబ్ల్యుఐ అందించింది. దానిని క్రాంతి పత్రిక పాఠకుల కోసం సంక్షిప్తంగా దిగువ పేరొంటున్నాం.

ఐసీఎస్‌పీడబ్ల్యుఐ 2021 డిసెంబర్ 15వ తేదీన యిచ్చిన రిపోర్ట్:

నూతన హంతక ఆపరేషన్ 'ప్రహార్-3'కు వ్యతిరేకంగా భారత ప్రజాయుద్ధానికి, భాకపా(మావోయిస్టు)కు మద్దతుగా విశ్వ వ్యాపితంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఆక్షన్ విజయవంతం అయ్యింది. గెలీసియా, ఇటలీలలోని ఐసీఎస్‌పీడబ్ల్యుఐ కమిటీలు ఉమ్మడిగా విడుదల చేసిన ఆక్షన్ డే అపీల్‌ను స్వాగతించిన అనేక దేశాలలోని విప్లవ సంస్థలు ఎక్కడిక్కడే వివిధ రూపాలలో సంఘీభావ కార్యక్రమాలు చేపట్టాయి.. ప్రపంచ వ్యాపితంగా కొన్ని చోట్ల నవంబర్ 24వ తేదీ తరువాత కూడా భారత ప్రజాయుద్ధ సంఘీభావ కార్యక్రమాలు నడిచాయి.

ఇటలీ రాజధాని రోమ్ నగరంలో వున్న భారత దేశ దౌత్య కార్యాలయం ఎదుట, మిలన్‌లో వున్న భారత కన్సులేట్ ఎదుట ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీకి అనేక మంది ప్రవాస భారతీయులు హాజరయ్యారు. కార్మికవర్గ యూనియన్ సభ్యులుగా సంఘటితం అయ్యి వున్న భారతీయ కార్మికుల ప్రతినిధులు ఒక సమావేశం నిర్వహించి భారత దేశంలోని పరిస్థితిని గురించి చర్చించారు భారతదేశంలో యేదాదికాలంగా పోరాడుతున్న రైతాంగ ప్రజలకు, భాకపా(మావోయిస్టు) నాయకత్వంలో సాయుధ పోరాటం చేస్తున్న విప్లవ ప్రజలకూ వారు తమ సంఘీభావం ప్రకటించారు.

ఒక సామ్రాజ్యవాద దేశంలో మొట్ట మొదటి సారిగా కార్మిక వర్గ యూనియన్‌లో 'స్లాయ్ కోబాస్' కార్మికులు నవంబర్ 24వ తేదీన జరుపుకున్న అనేక సమావేశాలలో భారత ప్రజా యుద్ధానికి సంఘీభావంగా ప్రకటనలు చేసారు. ఇటలీలో ముందే ఈ క్యాంపెయిన్ జీ 20 శిఖరాగ్ర సమావేశానికి వ్యతిరేక నిరసనలతో ప్రారంభమయింది. మోదీ రోమ్‌కు వచ్చినప్పుడు నవంబర్ 27వ తేదీన లక్ష మంది మహిళలతో ప్రహార్ దాడిని వ్యతిరేకిస్తూ భారీ ప్రదర్శన కూడా జరిగింది.

గెలీసియాలో కమిటీ చేపట్టిన ఆందోళనా కార్యక్రమంలో యావత్తు నగరాలూ పాల్గొన్నాయి. అలాగే స్పానిష్ స్టేట్‌లో మొట్టమొదటి సారిగా ఈ పిలుపును అనుసరించి వివిధ నగరాలలో యువ మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జర్మనీలో అనేక నగరాలలో సభలు, భారీ గోడ రాతలు, బ్యానర్ల ద్వారా ప్రచారం జరిగింది. ఐర్లాండ్, గ్రేట్ బ్రిటన్, డెన్మార్క్, ఫిన్‌లాండ్, స్వీడన్, నార్వే, ఆస్ట్రియా, ఫ్రాన్స్, కెనడాలో కూడా యిదే విధంగా జరిగింది. స్విట్జర్లాండ్‌లో ఒక ఫైటింగ్ ఆక్షన్ కూడా జరిగింది. దీన్ని కమిటీ ఉత్సాహంగా ఆహ్వానిస్తున్నది.

టర్కీ కామ్రేడ్స్ భారత ప్రజాయుద్ధానికి, ఫిలిపినో కామ్రేడ్స్‌కు ఒక బలమైన, గొప్ప సెల్యూట్ చేసారు. ఫిలిప్పీన్స్, భారతదేశాలలో ప్రజాయుద్ధాలు ఎల్లప్పుడూ కలిసే సాగుతున్నాయి. ప్రపంచ విప్లవ ఒకానొక ఎర్ర కేంద్రం అయిన బ్రెజిల్ నుంచి లాటిన్ అమెరికా సంఘీభావం వ్యక్తం అయింది. కొలంబియా, మెక్సికో, చిలీ, ఈక్వడార్‌లలో వివిధ రకాల సంఘీభావ కార్యక్రమాలు జరిగాయి.

(తరువాయి 52వ పేజీలో)